
అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
శుక్రవారం 12-07-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 193
Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar
14 పేజీలు వెల : 6.50

18న పేపర్ లీకేజీపై
విచారణ
జులై మూడో వారం నుంచి నాలుగు రౌండ్లలో నీట్-యూజీ కౌన్సెలింగ్
సుప్రీంకు తెలిపిన కేంద్రం
వివరాలు 13లో

24 నుంచి అసెంబ్లీ !



25 లేదా 26న పూర్తిస్థాయి బడ్జెట్

- కీలకాంశాలుగా రైతు భరోసా, రుణమాఫీ
- కొత్త ఆర్వోఆర్ చట్టం, తెలంగాణ చిహ్నం తదితరాంశాలపై చర్చ
- సభ ముందుకు పలు కీలక బిల్లులు
- మండలి చైర్మెన్, అసెంబ్లీ స్పీకర్‌తో సీఎస్, డీజీపీ భేటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం ఈనెల 23న పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ఆ వెంటనే రాష్ట్ర అసెంబ్లీని సమావేశపరచాలని ముఖ్యమంత్రి రేవంత్ నిర్ణయించారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయింపులు, ఆర్థిక సాయాలు, గ్రాంట్లను బేరీజు వేసుకుని, తద్వారా ఇక్కడ కూడా పూర్తి స్థాయి పద్దును ప్రవేశపెట్టాలని ఆయన భావిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఫిబ్రవరిలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎక్కువ



సమయం లేకపోవటంతో కేంద్రం మాదిరిగానే ఇక్కడ కూడా ఓటాన్ అకౌంట్‌కే మొగ్గు చూపారు. అందువల్ల ఇప్పుడు పూర్తి స్థాయి పద్దును ప్రవేశపెట్టాల్సి ఉంది. ఇందుకనుగుణంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సైతం ఆర్థిక శాఖకు ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో ఈనెల 24 నుంచి శాసనసభ, మండలి సమావేశాలను నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తులు ముమ్మరం చేసింది. వారం నుంచి పది రోజులపాటు కొనసాగే ఈ సమావేశాల్లో భాగంగా 25 లేదా 26న బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశముంది. రేవంత్ సర్కారుకు అత్యంత కీలకమైన రైతు భరోసా, రైతు రుణమాఫీపై చర్చించి పలు కీలక నిర్ణయాలు ...5లో



పన్ను ఎగవేత దారులపై
కఠిన చర్యలు

డీజిల్, పెట్రోల్‌పై వ్యాట్ ఆదాయం ఎందుకు తగ్గింది?

- లిక్కర్ అమ్మకాలు పెరిగినా, రెవెన్యూ ఎందుకు పెరగలేదు?
- రిజిస్ట్రేషన్లు, ఇసుక ద్వారా ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకోండి
- జీఎస్టీ చెల్లింపుల విషయంలో నిక్కచ్చిగా వ్యవహరించండి : అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి దిశా నిర్దేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"పన్ను ఎగవేతదారులపై కఠిన చర్యలు తీసుకోండి. ప్రభుత్వంలోని అన్ని విభాగాలు నెలవారి లక్ష్యాలను నిర్ణయించుకుని తదనుగుణంగా ఆదాయం పెరిగేందుకు చర్యలు చేపట్టాలి. ఆదాయం తెచ్చి పెట్టే వనరులపై సంబంధిత విభాగాలు సంస్థాగతంగా వీలైనన్ని సంస్కరణలు చేపట్టాలి" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, జూపల్లితో కలిసి ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, మైనింగ్, స్టాంపులు రిజిస్ట్రేషన్లు, రవాణా విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ...5లో

తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు
ఎప్పుడు..?

15 శాతం నిధులిస్తామంటూ కాంగ్రెస్ హామీ
ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో 7.75 శాతం కేటాయింపు
పూర్తిస్థాయి బడ్జెట్‌లోనైనా నిధులు పెరుగుతాయా

ఈ సారైనా విద్యారంగానికి ప్రాధాన్యత దక్కేనా...

ఇందిరమ్మ రాజ్యంలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తామంటూ ఆర్థికమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమీక్షలో అన్నారు. విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామంటూ ఎన్నికల మ్యానిఫెస్టోలోనూ కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కానీ ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో మాత్రం 7.75 శాతం నిధులనే విద్యారంగానికి కేటాయించడం గమనార్హం. దీంతో పూర్తిస్థాయి బడ్జెట్‌లోనైనా విద్యారంగానికి ప్రాధాన్యత దక్కుతుందా? లేదా? అన్న దానిపై చర్చ జరుగు తున్నది.

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విద్యారంగాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్న విమర్శలున్నాయి. 2023-24 బడ్జెట్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యారంగానికి 6.56 శాతం నిధులను మాత్రమే కేటాయించడం గమనార్హం. అయితే అందుకు భిన్నంగా విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తామని కాంగ్రెస్ చెప్పింది. 2024-25 పూర్తిస్థాయి బడ్జెట్‌లో కేటాయించే నిధులను బట్టి వీరి చిత్తశుద్ధి అర్థమవుతుంది. ఇంకోవైపు అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమల్లో భాగంగా ప్రతి మండలంలో అంతర్జాతీయ స్కూళ్లను ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ప్రతి మండలానికి అధునాతనమైన సౌకర్యాలతో, అంతర్జాతీయ



ప్రమాణాలతో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేస్తామని ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో హామీ ఇచ్చింది. పైలట్ ప్రాజెక్టు కింద వాటి కోసం రూ.500 కోట్లు ప్రతిపాదించింది. కానీ వాటిని ఇప్పటి వరకు ఎక్కడా ప్రారంభించలేదు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ప్రారంభం ఎప్పుడు? అన్న ప్రశ్న అందరిలోనూ తలెత్తుతున్నది. వాటికోసం విద్యార్థులు, తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు. ఇంకోవైపు ఇంటిగ్రేటెడ్ గురుకుల విద్యాసంస్థలను కాంగ్రెస్ ప్రభుత్వం నెలకొల్పుతున్నది. పైలట్ ప్రాజెక్టు కింద కొడంగల్, మధిరలో ఏర్పాటు చేస్తున్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల గురించి ఈ బడ్జెట్ సమావేశాల్లో స్పష్టత వచ్చే అవకాశమున్నది.

ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో స్వల్పంగా పెరిగిన నిధులు

రాష్ట్రంలో విద్యారంగానికి స్వల్పంగా ...6లో



అదానీకిస్తే ఊరుకోం

టీజీఎస్ పీడీసీఎల్ ముందు విద్యుత్ ఉద్యోగుల నిరసన

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

విద్యుత్ సంస్థలో భాగమైన సౌత్ సర్కిల్‌ని అదానీ గ్రూపుకిస్తే ఉద్యమం తప్పదని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్(యుఈఈయు) నేతలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం హైదరాబాద్‌లోని టీజీఎస్‌పీడీసీ ఎల్ కార్యాలయం ముందు నిరసన కార్యాక్రమాన్ని చేపట్టారు. 'అదానీ గోబ్యాక్, విద్యుత్ సంస్థలను రక్షించుకుందాం, ప్రయివేటీకరణను వ్యతిరేకిద్దాం. అంటూ కార్మికులు నినదించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు కె ఈశ్వర్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ఒక్క సర్కిల్, ఫీడర్, కంపెనీలను ప్రయివేట్ సంస్థలకు ఇవ్వొద్దని డిమాండ్ చేశారు. ఇప్పటికే సౌత్ సర్కిల్‌లో అదానీ గ్రూప్ సర్వేలు చేస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వం మాత్రం బహిరంగంగా ఆ సంస్థకు కట్టబెడుతున్నట్టు ప్రకటించకుండా చాపకింది నీరులాగా వారితో ఒప్పందం చేసుకుందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలో సర్కార్ అనుమతి లేకుండా అదానీ గ్రూప్ ఎలా సర్వేలు చేస్తుందని ప్రశ్నించారు. ప్రభుత్వానికి, అదానికి మధ్య జరిగిన చీకటి ఒప్పందాన్ని బైటపెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అలాంటి ఆలోచన చేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. సౌత్ సర్కిల్‌ను అదానీ గ్రూపునకు ఇవ్వాలనే ఆలోచనను విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. సౌత్ సర్కిల్ పరిధిలో కరెంట్ దొంగతనం జరుగుతుందనేది నిజమేననీ, బిల్లులు వసూలు చేయడానికి వెళ్ళిన సిబ్బందిపై దాడులు జరుగుతున్నదీ నిజమేనన్నారు. దీన్ని సాకుగా చూపి అదానీ గ్రూపునకో, మరొకరికో ఇవ్వడం సమంజసం కాదని చెప్పారు. యాజమాన్యమే ఈ సర్కిల్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఉద్యోగులపై దాడి చేసిన వారిపట్ల ఉపేక్ష ఎందుకని ప్రశ్నించారు. యాజమాన్యం రాజకీయ ఒత్తిళ్ళకు లొంగకుండా నికరంగా పనిచేయాలని సూచించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి వి గోవర్దన్ మాట్లాడుతూ సంస్థను రక్షించుకునేందుకు కార్మికులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. సౌత్ సర్కిల్‌ను అదానీకి ఇవ్వటంతోనే ఈ ప్రక్రియ ఆగిపోదని తెలిపారు. ప్రభుత్వ రంగాన్ని ప్రయివేటీకరించే కార్యక్రమంలో భాగంగా విద్యుత్‌ను కూడా కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని చెప్పారు. దీని వెనుక పెద్ద కుట్ర ఉందని ...13లో



ఆగస్టు 9న
'కార్పొరేట్స్ క్విట్ ఇండియా డే'

మూడ్రోజులపాటు ఎంపీలకు వినతులు : ఎస్కేఎం నేతల వెల్లడి

నవతెలంగాణ- న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో రైతులు, కార్మికులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) పోరాటానికి సిద్ధమైంది. ఎంఎస్‌పీ చట్టం, రుణమాఫీ, పంటల బీమా, రైతులు, కార్మికుల పెన్షన్, విద్యుత్ ప్రయివేటీకరణను వెనక్కి తీసుకోవడం వంటి పెండింగ్‌లో ఉన్న ఇతర డిమాండ్లపై ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించింది. కేంద్ర కార్మిక సంఘాలు, ఇతర టీయూాలు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు, విద్యార్థులు, యువత, మహిళలు, ఇతర బహుజన వర్గాల సంఘాలతో సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని తెలిపింది. బుధవారం సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) జనరల్ బాడీ సమావేశం ...13లో

ఉన్మాది ఘాతుకం

వరంగల్ జిల్లాలో ప్రేమించిన యువతి తల్లిదండ్రుల హత్య

యువతి, ఆమె తమ్ముడి పరిస్థితి విషమం

- అర్ధరాత్రి వేట కొడవలితో దాడి
- గ్రామంలో ఉద్రిక్తత





నవతెలంగాణ-చెన్నారావుపేట

వరంగల్ జిల్లాలో ఓ ఉన్మాది.. ప్రేమించిన యువతి తల్లిదండ్రులపై అర్ధరాత్రి వేటకొడవలితో దాడి చేశాడు. ఈ ఘటనలో వారు మృతి చెందారు. యువతి, ఆమె సోదరునికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన జిల్లాలోని చెన్నారావుపేట మండలం 16 చింతల్ తండా గ్రామంలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 16 చింతల్ తండాకు చెందిన బానోత్ సుగుణ (35), శ్రీనివాస్ (40) దంపతులకు కూతురు దీపిక, కుమారుడు మదన్‌లాల్ ఉన్నారు. కాగా వరంగల్ జిల్లా గీసుకొండ మండల కేంద్రానికి చెందిన మేకల నాగరాజు (బన్నీ) తన అమ్మమ్మ సొంత ఊరు గూడూరు మండలం గుండెంగ గ్రామంలో ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో మృతుడు శ్రీనివాస్ కూతురు దీపిక, మేకల నాగరాజు కొన్ని నెలలుగా ప్రేమించుకుని పెళ్లి చేసుకున్నారు. దీపిక తల్లిదండ్రులకు ప్రేమ పెండ్లి ఇష్టం లేకపోవడంతో పలుమార్లు పెద్దమనుషుల వద్ద పంచాయితీ పెట్టించారు. అప్పటి నుంచి దీపిక తల్లిదండ్రుల వద్దే ఉంటుంది. ఈ క్రమంలో ఆగ్రహించిన నాగరాజు.. బుధవారం అర్ధరాత్రి వేట ...13లో

గురుకులాల్లో ఎలుకలు

12 మంది విద్యార్థులకు గాయాలు

మెదక్ జిల్లా రామాయంపేటలో ఘటన



నవతెలంగాణ-రామాయంపేట

గురుకులాల్లో ఎలుకల బెడద కొంతకాలంగా విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. తాజాగా గురువారం మెదక్ జిల్లా రామాయంపేట తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో ఎలుకలు విద్యార్థులను కరిచి గాయపర్చడం తీవ్ర చర్చనీయాంశమైంది. 9వ తరగతి చదువుతున్న 12 మంది విద్యార్థులను ఎలుకలు కరిచి గాయపరిచాయి. కాగా విద్యార్థులకు గాయాలైనా యాజమాన్యం కనీసం ఆస్పత్రికి తరలించకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులే విద్యార్థులను ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందిస్తున్నారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంబంధిత యాజమాన్యం, అధికారులపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కాగా, ఆర్సీవో భీమయ్య.. గురుకుల పాఠశాలను పరిశీలించి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో శుభ్రత పాటించాలని, మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పాఠశాల సిబ్బందికి సూచించారు.

రాష్ట్రంలో నిలిచిన రిజిస్ట్రేషన్లు

ఆధార్ నెట్ వర్కింగ్‌లో సాంకేతిక సమస్యలు
పరిష్కరిస్తాం : కమిషనర్ బుద్ధ ప్రకాష్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశవ్యాప్తంగా ఆధార్ ఆన్‌లైన్ సేవలకు అంతరాయం కలగడంతో గురువారం రాష్ట్రంలో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. నెట్ వర్కింగ్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యలతో సేవలు ఎక్కడికక్కడే ఆగి పోయినట్టు సమాచారం. ఓటీపీ, రిజిస్ట్రేషన్లు తదితర సేవలకు అధార్ అన్‌లైన్ తప్పనిసరి కావడంతో ఈ సమస్య తలెత్తిందని భావిస్తున్నారు. రాష్ట్రంలో ప్రతి రోజూ దాదాపు ఏడు వేలకు పైగా వివిధ రకాల రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. అయితే సాంకేతిక సమస్యల వల్ల గురువారం కేవలం వెయ్యి ...6లో

ఉద్యోగాల కల్పనే కీలకం



మూలధన పెంపునకు చొరవ చూపాలి

బడ్జెట్‌పై మోర్గన్ స్టాన్లీ అంచనా

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో ప్రధానంగా ఉద్యోగాల కల్పన, మూలధన పెంపునపై దృష్టి సారించే అవకాశం ఉందని యుఎస్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ మోర్గన్ స్టాన్లీ అంచనా వేసింది. వికాసిత్ భారత్ లక్ష్యంలో భాగంగా మూలధన వ్యయం పెంపునతో పాటు ఉద్యోగ కల్పన లాంటి కీలక ప్రకటనలు ఉండొచ్చని మోర్గన్ స్టాన్లీ విశ్లేషించింది. అదే విధంగా పలు సంక్షేమ కార్యక్రమాలపై కేంద్రం దృష్టి సారించే అవకాశం ఉందని తెలిపింది. ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ జులై 23న పార్లమెంట్‌లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు.

వ్యక్తిగత ఆదాయ పన్ను రేట్లలో మాత్రం మార్పులు ఉండకపోవచ్చునని మోర్గన్ స్టాన్లీ అంచనా వేసింది. మధ్యతరగతి వర్గాలకు మాత్రం కొన్ని రకాల పన్ను ప్రోత్సాహకాలు ఇచ్చే అవకాశం ఉందని తెలిపింది. వ్యవసాయం, స్టార్టప్‌లు, రైల్వే, రక్షణ, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, విద్యుత్తు వాహనాలు, టెక్స్‌టైల్స్ వంటి రంగాలకు ...13లో

సాగునీటిరంగ పితామహుడు
నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్

తెలంగాణ ఇంజినీర్స్ డేలో మంత్రి కోమటిరెడ్డి నివాళులు



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలంగాణ సాగునీటిరంగ పితామహుడు నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ అని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కొమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో తెలంగాణ ఇంజినీర్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ క్రీస్తు పూర్వం 2550 సంవత్సరంలో ఈజిప్టులో స్టెప్ పిరమిడ్ కట్టిన ఇంజినీర్ ఇమ్ హెూటెప్ ప్రపంచంలో మొదటి ఇంజినీర్ కాగా, భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య భారతదేశపు మొదటి ఇంజినీర్‌గా ప్రఖ్యాతి గాంచారని చెప్పారు. ఆయన పుట్టినరోజు సెప్టెంబర్ 15ను "ఇంజినీర్స్ డే" గా జరుపుకుంటారని గుర్తు చేశారు. మోక్షగుండం హైదరాబాద్ నగరాన్ని వరదల నుంచి కాపాడారని చెప్పారు. ఆ తర్వాత గర్వంగా చెప్పుకోదగ్గ ఇంజినీర్ నవాబ్ అలీ నవాజ్ జంగ్ ...13లో

డేటా సైన్స్‌తో ప్రజా రవాణా వ్యవస్థ పటిష్టం

- ప్రజల అభిరుచులకు తగ్గట్టుగా రవాణా సేవలు : డేటా సైన్స్,మెషిన్ లెర్నింగ్ ప్రముఖ నిపుణులు శరత్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

డేటాసైన్స్‌ను ఉపయోగించుకుని ప్రజా రవాణా వ్యవస్థను మరింతగా పటిష్టం చేయవచ్చునని డేటా సైన్స్, మెషిన్ లర్నింగ్ ప్రముఖ నిపుణులు శరత్ కాటిపల్లి అన్నారు. ప్రజల అభిరుచులకు అనుగుణంగా మెరుగైన, నాణ్యమైన రవాణా సేవలను అందించడంతో పాటు టీజీఎస్ఆర్టీసీ నిర్వహణ సామర్థ్యాన్ని పెంచుకునేందుకు డేటా విశ్లేషణ దివ్య ఔషధంలాగా పనిచేస్తుందని చెప్పారు. హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో లీడర్‌షిప్ టాక్స్‌లో భాగంగా గురువారం నిర్వహించిన కార్యక్రమంలో 'ప్రజా రవాణా వ్యవస్థలో డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్ వినియోగం' అనే అంశంపై శరత్ కాటిపల్లి ప్రసగించారు. ప్రతి రోజు సగటున 55 లక్షల మందిని తమ బస్సుల్లో టీజీఎస్ఆర్టీసీ గమ్యస్థానాలకు చేర్చడం గొప్ప విషయమని కొనియాడారు. వారి ప్రయాణ డేటాకు అనుగుణంగా రియల్ టైంలో మెరుగైన రవాణా సేవలను అందించవచ్చని చెప్పారు. మెసేజ్, మెసేంజర్, మెకానిక్స్, మెషినరీ అనే 4ఎం కాన్సెప్ట్ తో సంస్థను ఉన్నతస్థాయికి ఎలా తీసుకెళ్లవచ్చు అనే దాని గురించి సమగ్రంగా వివరించారు. సాంకేతికతలో వస్తోన్న మార్పులను అందిపుచ్చుకుంటూ ప్రయాణికులకు సంతృప్తికర సేవలను అందించే తీరును తన అనుభవంతో ఉదాహరించారు. అనంతరం ఆర్టీసీ అధికారులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు. ఆర్టీసీ ఎమ్‌డీ వీసీ.సజ్జనార్ మాట్లాడుతూ..డేటా సైన్స్‌ను వినియోగించుకుని ప్రజలకు మరింత చేరువయ్యేందుకు కసరత్తు చేస్తామని చెప్పారు. కార్పొరేట్ సంస్థలకు అది జీవనాడిలాగా పనిచేస్తోందన్నారు. ప్రజల రవాణా అవసరాలకు అనుగుణంగా అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో వేగవంత సేవలందించేందుకు డేటా విశ్లేషణను వినియోగించుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో టీజీఎస్ఆర్టీసీ సీఓవో డాక్టర్ రవీందర్, జాయింట్ డైరెక్టర్ అపూర్వరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, కృష్ణకాంత్, ఫైనాన్స్ అడ్వైజర్ విజయపుష్ప, సీపీఎం ఉషారాణి, సీఎంఈ వెంకన్న, తదితరులతో పాటు వర్చువల్‌గా ఆర్ఎంలు, డిప్యూటీ ఆర్ఎంలు, డీఎంలు పాల్గొన్నారు.

సిరిసిల్లకు మెగాపవర్ లూమ్ క్లస్టర్‌ను తీసుకురండి

- కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కి కేటీఆర్ లేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రానున్న కేంద్ర బడ్జెట్‌లో సిరిసిల్లకు మెగా పవర్ లూమ్ క్లస్టర్ వచ్చేలా చూడాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు, ఎమ్మెల్యే కె.తారకరామారావు కోరారు. ఈ మేరకు బుధవారం కేంద్ర మంత్రికి కేటీఆర్ లేఖ రాశారు. పదేండ్లుగా ప్రతి బడ్జెట్‌లోనూ తెలంగాణకు కేంద్రం మొండిచేయి చూపుతున్న అంశాన్ని ప్రస్తావించారు. పవర్‌లూమ్ క్లస్టర్ ఏర్పాటు చేస్తే సిరిసిల్ల నేత కార్మికుల కష్టాలు తీరుతాయని కోరారు. కాంగ్రెస్ పాలకుల వైఫల్యంతో నేడు చేనేత రంగం సంక్షోభంలోకి కూరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సారి కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న బడ్జెట్‌లో సిరిసిల్ల ప్రాంతానికి మెగా పవర్ లూమ్ కస్టర్‌ను ప్రకటించేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఎక్కువ మంది ఎంపీలను గెలిపిస్తే అభివృద్ధి చేస్తామని బీజేపీ నేతలు చేసిన ప్రచారాన్ని నమ్మి ఎనిమిది మందిని గెలిపించారని తెలిపారు. గత ఐదేండ్లలో బండి సంజయ్ వల్ల తెలంగాణకు ఎలాంటి ప్రయోజమూ జరగలేదని విమర్శించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల ఎంపీలు మాత్రం తమ ప్రాంత ప్రయోజనాల కోసం కేంద్రంతో పోరాటం చేసి ఎక్కువ నిధులను, పరిశ్రమలను తరలించుకుపోతున్నారనీ, తెలంగాణ ఎంపీలు ఎందుకు అలా చేయకపోతున్నారని ప్రశ్నించారు.

చింతల్‌తండా ఘటన విచారకరం

- దోషులను కఠినంగా శిక్షిస్తాం : బాధిత కుటుంబానికి అండగా ఉంటాం :మంత్రి సీతక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం చింతల్‌తండాలో జరిగిన జంట హత్యలపై పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రేమ పేరుతో ఉన్మాదిలా మారి, యువతి తల్లిదండ్రులను అతి కిరాతకంగా చంపడం దారుణమని పేర్కొన్నారు. ఇప్పటికే నిందితుడిని అరెస్టు చేశారని తెలిపారు. ఈ ఘటనలో దోషులకు కఠిన శిక్ష పడేలా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీనిచ్చారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. దాడిలో గాయపడిన యువతికి, ఆమె సోదరుడికి మెరుగైన వైద్యం అందిస్తున్నామని తెలిపారు. ఇలాంటి దుర్మార్గాలపై తమ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తున్నదని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసు, మహిళా శిశు సంక్షేమ శాఖల మధ్య సమన్వయం పెంచే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

విద్యార్థులను రెచ్చగొట్టి పబ్బం గడుపుకుంటున్నారు

- బీఆర్ఎస్ నేతలపై ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్ ఫైర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

నిరుద్యోగ యువతను రెచ్చగొట్టి బీఆర్ఎస్ నేతలు పబ్బం గడుపుకుంటున్నారని ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్ ఫైరయ్యారు. ఉద్యమ సమయంలో విద్యార్థులను ఉసిగొల్పి కేసీఆర్ కుటుంబం అధికారాన్ని సంపాదించిందని విమర్శించారు. గురువారం హైదరాబాద్‌లోని అసెంబ్లీలో గల సీఎల్పీ కార్యాలయంలో ఎమ్మెల్యే మందుల సామెల్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. కల్వకుంట్ల కుటుంబం చేసిన అవినీతి ఎక్కడ బయటపడుతుందోనన్న భయంతో కేటీఆర్, కేసీఆర్ రాష్ట్రంలో అరాచకం సృష్టిస్తున్నారని విమర్శించారు. నిజమైన విద్యార్థులు లైబ్రరీల్లో చదువుతున్నా రని చెప్పారు. ఎమ్మెల్సీ కవితను జైలు నుంచి విడిపించుకోవడం కోసం బీజేపీ నాయకులు ఇచ్చిన స్క్రిప్ట్‌ను బీఆర్ఎస్ నేతలు రాష్ట్రంలో అమలు చేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ ఫామ్ హౌస్‌లో కూర్చొని విద్యార్థి ఉద్యమాల పేరుతో కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు.

గాదరి కిషోర్ చిల్లర దొంగ : ఎమ్మెల్యే మందుల సామెల్

మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ ఓ చిల్లర దొంగ అని కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామెల్ విమర్శించారు. తమ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై సంస్కార హీనమైన మాటలు మాట్లాడటాన్ని తప్పుపట్టారు. 'గాదరి కిషోర్ నిన్ను చెప్పుతో కొడతా... నీ స్థాయి ఎంత? నీ బతుకెంత? సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తావా' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలో మీ పదేండ్ల బాగోతాలు బయటకు తీస్తానన్నారు. తుంగతుర్తి లో భూకబ్జాలు, ఇసుక దందాలు, దోపిడీలు చూసే అక్కడి జనం బొంద పెట్టారని చెప్పారు.

అగ్ని వీరులకు అన్యాయం

ఏడాదిలో 20 మంది మృతి

- లైట్ తీసుకుంటున్న మోడీ సర్కార్
- వీరమరణం పొందినా పరిహారం చెల్లింపులో మీనమేషాలు
- ఆత్మహత్య చేసుకుంటే అదీ లేదు
- యువతరంతో కేంద్రం చెలగాటం..



ఆర్మీలో నాలుగు రోజులు పని చేసి చనిపోయినా పర్వాలేదు. తమ శవంపై జాతీయ జెండా కప్పితేచాలని వీర జవాన్‌లు కోరుకుంటారు. కానీ అగ్నిపథ్ అమలయ్యాక ఈ పరిస్థితి తారుమారైంది. వివిధ కారణాలతో ఏడాదిలో 20 మందికిపైగా అగ్నివీరులు ప్రాణాలు కోల్పోయారంటే.. వారిపట్ల మోడీ సర్కార్ ఏవిధంగా వ్యవహరించిందో అర్థం చేసుకోవచ్చు. ఇక వీరమరణం పొందిన వారికి పరిహారం చెల్లింపులోనూ మీనమేషాలే లెక్కిస్తోంది. దీంతో యువతరం పట్ల కేంద్రం చెలగాటమాడుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

న్యూఢిల్లీ : దేశ రక్షణ కోసం ప్రాణాలు సైతం అర్పించేందుకు సిద్ధపడి, త్రివిధ దళాలలో చేరేందుకు అనేక మంది యువకులు ఆసక్తి చూపుతుంటారు. రెట్టించిన ఉత్సాహంతో, దేశభక్తిని గుండెల నిండా నింపుకొని యుద్ధభూమికి ఉరకాలని తహతహలాడుతుంటారు. అయితే నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన అగ్నిపథ్ వారి ఉత్సాహంపై నీళ్ల చల్లుతోంది. ఈ పథకం కింద ఎంపికైన అభ్యర్థులు కేవలం నాలుగేండ్లు మాత్రమే సర్వీసులో ఉంటారు. ఆ తర్వాత వారి కొనసాగింపు అధికారుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉంటుంది. త్రివిధ దళాలలోకి శాశ్వత ప్రాతిపదికన నియామకాలు జరపాల్సింది పోయి కేవలం నాలుగు సంవత్సరాలకే పరిమితం చేయడం వివాదాస్పదమైంది. అదీకాక కాలపరిమితి ముగియక ముందే అశువులు బాసిన అగ్నివీరుల కుటుంబాలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

గతేడాది అగ్నిపథ్ కింద అగ్నివీరుల మొదటి బ్యాచ్ సైన్యంలో చేరింది. ఏడాది గడవక ముందే ఏకంగా ఇరవై మంది అగ్నివీరులు ప్రాణాలు కోల్పోయారన్న వార్తలు వచ్చాయి. సైన్యంలో చేరిన వారిలో 18 మంది చనిపోయారని, వైమానిక దళంలో చేరిన ఓ వ్యక్తి తాజాగా ఆత్మహత్యకు పాల్పడ్డాడని విశ్వసనీయ వర్గాలు ధృవీకరించాయి. ఆగ్రాలో సెంట్రీ డ్యూటీ నిర్వర్తిస్తున్న శ్రీకాంత్ కుమార్ చౌదరి (22) మంగళవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నట్టు భారత వైమానిక దళ వర్గాలు తెలిపాయి. ఉత్తర ప్రదేశ్‌లోని బల్లియా జిల్లాకు చెందిన చౌదరి 2022లో వైమానిక దళంలో అగ్నివీర్‌గా చేరాడు. అతని ఆత్మహత్యకు కారణాలు తెలుసుకునేందుకు విచారణ చేపట్టనున్నట్టు సమాచారం.

విధి నిర్వహణలో చనిపోయినా వివాదం..

ఇక జమ్మూకాశ్మీర్‌లోని రాజౌరి జిల్లాలో ఈ యేడు జనవరిలో జరిగిన మందుపాతర పేలుడు ఘటనలో అగ్నివీర్ అజయ్ సింగ్ ప్రాణాలు కోల్పోయాడు. అతని కుటుంబానికి ఎలాంటి నష్టపరిహారం కానీ, ప్రోత్సాహకాలు కానీ లభించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై రాహుల్ గాంధీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మధ్య పార్లమెంటులో వాగ్యుద్ధం జరిగింది. అజయ్ సింగ్ కుటుంబానికి నష్టపరిహారం చెల్లించలేదని రాహుల్ మండిపడ్డారు. అయితే ఈ ఆరోపణను రాజ్‌నాథ్ తోసిపుచ్చుతూ విధుల్లో ఉన్న అగ్నివీరులు చనిపోతే ప్రభుత్వం కోటి రూపాయల నష్టపరిహారం అందిస్తోందని చెప్పారు.

పరిహారానికే రెండు మూడు నెలలు

మరణించిన అగ్నివీర్ కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా అందజేయడానికి రెండు నుంచి మూడు నెలల సమయం పడుతుందని వైమానిక దళ మాజీ ప్రధానాధికారి ఆర్‌కేఎస్ భదౌరియా తెలిపారు. సమగ్ర మార్గదర్శకాలు అమలులో ఉన్నందున ఈ జాప్యం తప్పదని ఆయన చెప్పారు. నష్టపరిహారం అందించేందుకు ఓ ప్రక్రియను అనుసరించాల్సి ఉంటుందని వివరించారు. 'పోస్ట్‌మార్టం నివేదిక రావాలి. సంఘటనకు సంబంధించిన నివేదిక అందాలి. కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీ జరగాలి. పోలీసులు కూడా నివేదిక ఇవ్వాలి. ఈ నాలుగు ప్రక్రియలు పూర్తి కావాల్సి ఉంటుంది. అగ్నివీర్‌కి అయినా, సాధారణ సైనికుడికి అయినా ఒకటే నిబంధనలు' అని వివరించారు. నష్టపరిహారం ప్రక్రియ గురించి అగ్నివీరుల కుటుంబాలకు సమాచారం ఇవ్వడం లేదన్న ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. సైనికుడు చనిపోయినప్పుడు బీమాలో కొంత మొత్తాన్ని అతని వారసుడికి అందజేస్తామని చెప్పారు.

ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లో ఖాళీలు..

పార్లమెంట్‌లో అప్పటి రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్ భట్ మాట్లాడుతూ ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్‌లో 1.35 లక్షల ఖాళీలు ఉన్నాయని చెప్పారు. కానీ దరఖాస్తుదారుల సంఖ్య అనూహ్యంగా ఉన్నదని వివరించారు.

అర్హులైన యువత కోసమంటూ...

టైె రిక్రూట్‌మెంట్ స్కీమ్ పేరిట 2022 జూన్ నెలలో 'అగ్నిపథ్'ను మోడీ ప్రభుత్వం తెరపైకి తెచ్చింది. 17 ఏండ్ల నుంచి 21 ఏండ్ల మధ్య వయస్సు గల అర్హులైన యువత కోసం 'టూర్ ఆఫ్ డ్యూటీ'గా మార్చేసింది. నిరుద్యోగ యువత ఆగ్రహం వ్యక్తం చేయడంతో వారిని శాంతింపజేసేందుకు మోడీ సర్కార్ వయోపరిమితిని 23 ఏండ్లకి పెంచింది.

ఉద్యోగాల్లేక.. అగ్నిపథ్ కోసం క్యూ..

సెప్టెంబర్ 2022 నాటికి 96 అగ్నిపథ్ రిక్రూట్‌మెంట్ ర్యాలీలు నిర్వహించారు. 40,000 పోస్టుల కోసం 35 లక్షల మందికి పైగా అభ్యర్థులు పోటీ పడ్డారు. ఇంత టఫ్ పోటీలోనూ ఎంపికయ్యాక కూడా.. అగ్నివీరులు నిండు జీవితాలను పణంగా పెడుతుండటం గమనార్హం.

త్రివిధ దళాల్లో ఉద్యోగమంటే..

త్రివిధ దళాల్లో జీవితకాలం ఉద్యోగం ఉండేది. అన్ని విధాలా సౌకర్యాలుండేవి. సైన్యంలో చేరాక రెగ్యులర్ జవాన్లకు ఎలాంటి బెంగ ఉండేది కాదు. మోడీ ప్రభుత్వం రక్షణ రంగంలోకి కార్పొరేట్లను దించింది. నెమ్మదిగా అగ్నిపథ్ పేరిట జవాన్ల మనోభావాలను దెబ్బతీసేలా అడుగులేసింది. కేవలం నాలుగేండ్ల వరకే సేవలందించేలా సర్వీసును కుదించేసింది. 15 ఏండ్లపాటు భారత సైన్యంలో సేవలందించేందుకు 23 శాతం మంది అగ్నివీరులు లేదా రిక్రూట్‌లను మాత్రమే ఎంపిక చేసేలా మోడీ బృందం తెచ్చిన స్కీం యువత బతుకుల్ని ఛిద్రం చేస్తోందని.. అగ్నిపథ్‌లో ఎంపికై చనిపోయిన వారి బంధువులు ఆరోపిస్తున్నారు.

లక్షలాది భారతీయ యువతకు అగ్నిపథ్‌తో ద్రోహం చేస్తోందన్న భావన సర్వత్రా వ్యక్తమవుతోంది. రక్షణ విధాన సంస్కరణపై దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి.

నిరుద్యోగం పైపైకి..

సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ నివేదిక ప్రకారం, గ్రామీణ నిరుద్యోగిత రేటు సెప్టెంబర్‌లో నాలుగేండ్లలో కనిష్ట స్థాయి 6.4 శాతం నుంచి అక్టోబర్‌లో 7.8 శాతానికి పెరిగింది.ఆ తర్వాత మరింతగా పెరుగుతోంది. వాస్తవానికి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామంటూ మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉన్న ఉపాధిని ఊడగొడుతోంది.

నెలరోజుల్లోనే..

జులైలో రిక్రూట్‌మెంట్లు ప్రకటించిన నెల రోజుల్లోనే 3,000 అగ్నివీరుల పోస్టుల కోసం ఎయిర్‌ఫోర్స్‌కు దాదాపు 8 లక్షల దరఖాస్తులు వచ్చాయి. అదే సమయంలో, ఇండియన్ నేవీకి అదే సంఖ్యలో ఖాళీల కోసం 10 లక్షల దరఖాస్తులు వచ్చాయి.

ఏండ్ల పాటు భర్తీ చేయకపోవటం వల్లే..

."ఆర్మీలో సంవత్సరాలుగా రిక్రూట్ చేయలేదు అని మేజర్ జనరల్ (డా) యష్ మోర్ (రిటైర్డ్) దీనిని డెస్పరేషన్ అన్నారు. శాశ్వత ప్రాతిపదికన ర్యాలీలు ప్రారంభిస్తానంటూ.. చివర్లో అగ్నివీర్‌ను తెరపైకి తెచ్చారు. ఇది సరైన చర్య కాదు అని అభిప్రాయం వ్యక్తం చేశారు. అగ్నిపథ్ అమలు తీరుపై పలువురు మాజీ ఉన్నతాధికారులు కూడా మోడీ చర్యను ఆక్షేపిస్తున్నారు.

ఆత్మహత్య చేసుకుంటే...

గతేడాది అక్టోబర్ 11న అగ్నివీర్ అమృత్‌పాల్ సింగ్(19) జమ్మూలో చనిపోయాడు. అయితే అతనికి సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించకపోవడంపై విమర్శలు వచ్చాయి. అమృత్‌పాల్ తనకు తాను గాయం చేసుకోవడం వల్లే చనిపోయాడని సైన్యం ఆ తర్వాత వివరణ ఇచ్చింది. ఆత్మహత్య చేసుకున్న వారికి సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు జరగవని అధికారులు స్పష్టం చేశారు. ఆ తర్వాత అగ్నివీర్ (ఆపరేటర్) గవాతే అక్షయ్ లక్ష్మణ్ గతేడాది అక్టోబర్ 22న సియాచిన్‌లో విధులు నిర్వర్తిస్తూ చనిపోయాడు. లక్ష్మణ్ కుటుంబానికి గ్రాట్యుటీ, పెన్షన్, ఇతర ప్రయోజనాలేవీ రాలేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అగ్నిపథ్ పథకం సైనికులకు అవమానకరమని ఆయన వ్యాఖ్యానించారు.

జాతీయవాదం కాస్త విషాదంగా...

అగ్నివీర్ ఔత్సాహికుల ప్రతి అంశం వెనుక జాతీయవాదం, ఆశావాదం ఉంటే.. చివరికి వ్యక్తిగత విరక్తి, నిరాశకు గురవుతోంది. అంతిమంగా విషాదమే మిగులుతోంది.

యువతపై విపరీతమైన ఒత్తిడి..

"మంచి వేతనాలతో స్థిరమైన ఉపాధిని పొందేందుకు భారత యువత ఎదుర్కొంటున్న విపరీతమైన ఒత్తిడే ఈ ఆత్మహత్యలకు ప్రతిబింబం" అని హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ విక్రమ్ పటేల్ అన్నారు.

చేరుదామనే ఆశతో..

సివిల్ సర్వీసెస్ ప్రవేశ పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థుల మాదిరిగానే, సైన్యానికి శిక్షణ అనేది స్ప్రింట్ కాదు. మారథాన్ అని విక్రాంత్‌కు తెలుసు. మామయ్య మిలటరీలో చేస్తుండటంతో..మేనల్లుడికి జవానులు వేసుకునే దుస్తులు, టోపీలు ఇచ్చేవారు. అవి అతన్ని అగ్నివీర్‌లో చేరటానికి ప్రేరేపించాయి. విక్రాంత్ ఎస్ఎస్‌సీ పరీక్షలలో 65 శాతం స్కోర్ చేశాడు. 2018లో సహరన్‌పూర్‌లో తన మొదటి రిక్రూట్‌మెంట్ ర్యాలీ కోసం నమోదు చేసుకున్నాడు. "ఎవరో తన కాలు లాగడం వల్ల కింద పడ్డానని చెప్పాడు. అతను రేసును పూర్తి చేయలేకపోయాడు, "అని అతని తండ్రి గుర్తుచేసుకున్నాడు. ఈ బాధ తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

తెలుగు జాలర్ల

శాంతియుత నిరసనలపై ఉక్కుపాదం

లాఠీచార్జీకి సీపీఐ(ఎం) ఖండన

- అండమాన్ నికోబార్ ఎల్‌జికి రాష్ట్ర కార్యదర్శి లేఖ

పోర్ట్‌బ్లెయిర్ : తెలుగు జాలర్లు శాంతియుతంగా చేసున్న నిరసనపై చట్టవిరుద్ధంగా, వాటర్ కానన్, టియర్ గ్యాస్ షెల్స్ ఉపయోగిస్తూ దారుణంగా లాఠీఛార్జి చేయడాన్ని సీపీఐ(ఎం) తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు రాష్ట్ర సీపీఐ(ఎం) ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి డి అయ్యప్పన్ లెఫ్టినెంట్ గవర్నర్‌కు లేఖరాసారు. ఈ సంఘటన పూర్తి వివరాల ప్రకారం ఫోర్ట్ బెయ్లిర్‌లో తెలుగు జాలర్ల కుటుంబానికి చెందిన మహిళ, ఒక డైరీ కార్మికురాలైన 21 ఏండ్ల వి విమల కొన్ని అనారోగ్యంతో స్థానికంగా ఉన్న జిబి పంత్ ఆస్పత్రిలో చేరింది. అయితే అక్కడ వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంతో ఆకస్మికంగా మరణించింది. వైద్యులు చేసిన ఇంజక్షన్ వికటించినట్లుగానూ భావిస్తున్నారు. దీనికి వ్యతిరేకంగా, విమల కుటుంబానికి న్యాయం చేయాలని, తప్పు చేసిన వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌తో గోల్‌ఘడ్, ఇతర ప్రాంతాల్లో తెలుగు జాలర్లు గత కొన్ని రోజులుగా శాంతియుతంగా, ప్రజాస్వామ్య యుతంగా నిరసలు చేస్తున్నారు. అయితే ఈ నెల 10 రాత్రి వీరిపై పోలీసులు లాఠీఛార్జీకి దిగారు. నిరసనకారులు ఎలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడకపోయినా పోలీసులు ఏకపక్షంగా, వాటర్ కానన్, టియర్ గ్యాస్ షెల్స్ ఉపయోగిస్తూ దారుణంగా లాఠీచార్జీ చేయడాన్ని లేఖలో కార్యదర్శి ఖండించారు.

అండమాన్ నికోబార్ పరిపాలన, కేంద్ర ప్రభుత్వం నేరుగా జోక్యం చేసుకోవడంతోనే లాఠీచార్జీ జరిగిందని ఆరోపించారు. చర్చల ద్వారా సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. మృతురాలికి ఏడాదిన్నర చిన్నారి కూడా ఉందనే విషయాన్ని దృష్టిలో పెట్టుకుని బాధిత కుటుంబానికి కనీసం రూ. 20 లక్షల నష్ట పరిహారం అందచేయాలని డిమాండ్ చేశారు. ఈ లేఖ కాపీని కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శికి, అండమాన్ నికోబార్ ప్రధాన కార్యదర్శి, డీజీపీకి, ఆరోగ్య శాఖ కార్యదర్శికి కూడా అయ్యప్పన్ జత చేశారు.

నీట్ కేసులో కీలక నిందితుడు అరెస్టు

- 10 రోజులు సీబీఐ కస్టడీకి..
- ఇప్పటివరకు 28మంది అరెస్టు



పాట్నా : నీట్-యూజీ పేపర్ లీకేజీకి సంబంధించి కీలక నిందితుల్లో ఒకరైన రాకేష్ రంజన్ అలియాస్ రాకీని సీబిఐ గురువారం అరెస్టు చేసింది. ఈ కేసుకు సంబంధించి ఈ వారం ప్రారంభంలో బీహార్, జార్ఖండ్‌ల్లోని 15 ప్రాంతాల్లో సిబిఐ సోదాలు జరిపింది. లీకైన పరీక్షా ప్రశ్నా పత్రాల రాకెట్‌ను రంజన్ నడిపినట్లు తెలుస్తోంది. జార్ఖండ్‌లో అరెస్టు చేసి, గురువారం పాట్నా తీసుకువచ్చినట్లు సీబీఐ వర్గాలు తెలిపాయి. పాట్నాలో ప్రత్యేక సీబీఐ కోర్టు ముందు రంజన్‌ను హాజరుపరచగా, విచారణ నిమిత్తం 10 రోజుల పాటు సిబిఐ కస్టడీకి పంపారు.

నలంద జిల్లాలోని హిలాస్ బ్లాక్‌లో రంజన్ గ్రామమైన గగేంద్ర బాఘాలో ఇంటిని జూన్ 30న సిబిఐ బృందం సోదాచేసింది. ఆ వార్డు సభ్యులైన ఇద్దరు వ్యక్తుల సమక్షంలో ఇంటి తాళాలు పగలగొట్టి మరీ ఈ తనిఖీలు చేపట్టారు. దాదాపు గంట పాటు సోదాలు చేయగా, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ చెక్ బుక్, ఓటర్ సమాచారం, పాన్ కార్డుతో పాటూ కొన్ని పత్రాల జిరాక్స్ కాపీలను స్వాధీనం చేసుకున్నారు.

నీట్ పేపర్ లీక్ అయిన తర్వాత పాట్నా, రాంచిలకు చెందిన ఎంబిబిఎస్ విద్యార్థులను సమాధానాలు రాసేందుకు రాకీ ఏర్పాటు చేసేవాడని సిబిఐ వర్గాలు చెప్పాయి. ఈ కేసులో సూత్రధారిగా భావిస్తున్న సంజీవ్ ముఖియాకు నమ్మకస్తులైన ముఠా సభ్యుల్లో రాకీ కూడా ఒకడు. పైగా ముఖియాకు బంధువు కూడా.

రాకీ అరెస్టుతో ఇప్పటివరకు బీహార్ పోలీసులు, ఆర్థిక నేరాల విభాగం, సీబీఐ అధికారులు 28మందిని అరెస్టుచేశారు. బీహార్ నుండే సీబీఐ 10ని అరెస్టు చేసింది. రాకీ నేపాల్‌కు పారిపోయేందుకు పథకం రచించాడని సిబిఐ వర్గాలు చెప్పాయి

చార్జిషీట్ దాఖలు ?

మార్పులు చేర్పులు చేసి యూజీసీ-నెట్ ప్రశ్నా పత్రం స్క్రీన్ షాట్‌ను టెలిగ్రామ్‌లో అందరికీ పంపించిన వ్యక్తిపై సీబీఐ చార్జిషీట్ దాఖలు చేసే అవకాశం వుంది. నిబంధనల ఉల్లంఘన జరిగే అవకాశం వుందంటూ కేంద్ర హోం శాఖ ముందుగా అప్రమత్తం చేయడంతో నీట్ పరీక్ష రద్దుకు ఈ స్క్రీన్‌షాట్ దారి తీసింది.

అయితే మొత్తంగా ఈ అధ్యాయంలో పెద్ద ఎత్తున కుట్ర జరిగినట్లు సీబీఐ ఏదీ కనుగొనలేదు. అందువల్ల మోసం చేసేందుకు ప్రయత్నించిన నేరాలకే ఈ చార్జిషీట్‌ను పరిమితం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. స్క్రీన్ షాట్‌లో మార్పులు చేసింది స్కూలు విద్యార్థి అని అధికారులు చెప్పారు. ప్రభుత్వానికి తమ నిర్ధారణలను అనధికారికంగా సిబిఐ తెలియచేసింది. ఆ యువకుడిపై చార్జిషీట్ దాఖలు చేసే అవకాశం వుందని చెప్పారు.

జూన్ 18న జరగాల్సిన ఈ పరీక్షకు 11లక్షల మందికి పైగా అభ్యర్థులు నమోదు చేసుకున్నారు. అయితే కేంద్ర హోం శాఖ నుండి అలర్ట్ రావడంతో జూన్19న పరీక్ష రద్దు చేశారు. దర్యాప్తు బాధ్యతలను సీబీఐకి అప్పగించారు. యాప్‌ను ఉపయోగించి స్కూలు విద్యార్థి ఈ స్క్రీన్‌షాట్‌ను మార్చినట్లు సీబీఐ కనుగొంది. ప్రశ్నా పత్రం తనకు అందుబాటులోకి వచ్చిందనే అభిప్రాయం కలిగేలా ఆ వ్యక్తి స్క్రీన్‌షాట్ తేదీని జూన్ 17కి మార్చాడని, డబ్బుకోసమే ఇదంతా చేశాడని సీబీఐ అధికారులు తెలిపారు. సబ్జక్టుల వారీగా కూడా పేపర్లు ఇవ్వగలననే అభిప్రాయాన్ని కలిగించేందుకు ఆ వ్యక్తి ప్రయత్నించాడని తెలిపారు. దీనిపై ఫోరెన్సిక్ నిపుణుల సలహాను కూడా సీబీఐ తీసుకుంది.



రాయితీ ధరకి

రష్యా చమురు

సుమారు రూ.లక్ష కోట్లు ఆదా చేసిన దేశీయ రిఫైనరీలు

న్యూఢిల్లీ : రష్యా నుంచి రాయితీ ధరతో చమురును కొనుగోలు చేసిన భారత రిఫైనరీలు కనీసం 10.5 బిలియన్ డాలర్ల (సుమారు రూ. లక్ష కోట్లు)ను ఆదా చేశాయి. అటు రష్యా కూడా లాభపడింది. ఎలాగంటే ఒకప్పుడు మన దేశీయ చమురు వాణిజ్యంలో రష్యాకు అంతగా ప్రాధాన్యత ఉండేది కాదు. కానీ ఇప్పుడు మన దేశానికి వాణిజ్య భాగస్వాములుగా ఉన్న ప్రముఖ దేశాల జాబితాలో రష్యా కూడా చేరిపోయింది.

భారత్-రష్యా సంబంధాలలో చమురుకు పెద్దగా ప్రాధాన్యత లేదు. రెండు దేశాల వాణిజ్య సంబంధాల జాబితాలో చమురుది అట్టడుగు స్థానమే. కానీ ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభం కావడంతో పరిస్థితి మారిపోయింది. ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలలో చమురు అగ్ర స్థానానికి చేరుకుంది. అనేక దేశాలు ఇంధన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నప్పటికీ భారత జనాభాకు తగినంత ఇంధనాన్ని అందించడంలో రష్యా ఇస్తున్న మద్దతును అక్కడ పర్యటించిన ప్రధాని నరేంద్ర మోడీ కొనియాడారు. భారత్-రష్యా మధ్య చమురు వాణిజ్యం అంతర్జాతీయ ఇంధన మార్కెట్లలో స్థిరత్వాన్ని తీసుకొచ్చిందని ఆయన తెలిపారు.

ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యా నుండి రాయితీతో కూడిన ముడి చమురును కొనుగోలు చేయడం ద్వారా 2022 ఏప్రిల్-2024 మే మధ్య కాలంలో దేశీయ చమురు సంస్థలు 10.5 బిలియన్ డాలర్ల విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేశాయని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక విశ్లేషించింది. ఉక్రెయిన్‌తో రష్యా యుద్ధం తర్వాత పాశ్చాత్య దేశాలు ఆ దేశం నుండి చమురు దిగుమతులను తగ్గించాయి. దీంతో రష్యా ముడి చమురు అమ్మకాలపై రాయితీలు అందించడం మొదలు పెట్టింది. భారతీయ రిఫైనరీలు దీనిని ఉపయోగించుకొని లాభపడ్డాయి. అయితే దీనిపై పలు పాశ్చాత్య దేశాలు విమర్శలు కురిపిస్తున్నాయి. రష్యా నుండి చమురును కొనుగోలు చేయడం అంటే ఉక్రెయిన్‌పై దాడిని సమర్థించడమే అవుతుందని తెలిపాయి.

అయితే ప్రపంచంలో మూడవ అతిపెద్ద ముడి చమురు వినియోగదారుగా ఉన్నందున 85 శాతం దిగుమతులపై ఆధారపడక తప్పడం లేదని భారత్ వాదించింది. ఇంధన భద్రతకు తాను ప్రాధాన్యత ఇస్తానని స్పష్టం చేసింది. ఇటీవల మాస్కోలో మోడీ చేసిన వ్యాఖ్యలు భారత దీర్ఘకాల వైఖరిని పునరుద్ఘాటించాయి. గత ఆర్థిక సంవత్సరంలో భారత్ చమురు దిగుమతుల విలువ 139.86 బిలియన్ డాలర్లు. ఇతర సరఫరాదారుల నుండి కొనుగోలు చేసిన ముడి చమురు ధరనే రష్యాకు కూడా చెల్లిస్తే ఈ విలువ 145.29 బిలియన్ డాలర్లుగా ఉండేది.

భారత విదేశీ వాణిజ్యంలో 10.5 బిలియన్ డాలర్లు చెప్పుకోదగిన మొత్తం కానప్పటికీ ప్రభుత్వ రంగంలోని చమురు సంస్థలు ఆదా చేసిన ఈ సొమ్ము గణనీయమైనదేనని చెప్పవచ్చు. పైగా రష్యా రాయితీ అందిస్తున్న నేపథ్యంలో ఇరాన్ వంటి ఇతర చమురు సరఫరా దేశాలు కూడా రాయితీలు ఇవ్వజూపుతున్నాయి. ముడి చమురు కొనుగోళ్లలో చేస్తున్న ఆదా కారణంగా రిటైలర్లు పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం లేదు. వెరసి ఈ వాణిజ్యం దేశ సామాన్యులపై పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ సిలిండర్ల భారం తగ్గిస్తే చాలునని ప్రజలు కోరుకుంటున్నారు.

ఆర్థిక ఎదురు దెబ్బలు

ఒడిదుడుకులకు కారణమైన పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ, కోవిడ్

- ఉత్పత్తి రంగంలో 54 లక్షల ఉద్యోగాలు హాంఫట్
- పెరగని ఉత్పాదకత : ఆర్‌బీఐ క్లెమ్స్ డాటాబేస్ వెల్లడి



న్యూఢిల్లీ : దేశీయ ఉత్పత్తి రంగం ఉద్యోగ కల్పనలో బాగా వెనుకబడి పోయింది. చట్టబద్ధంగా ఏర్పడిన సంస్థల్లోనే కాకుండా అనధికారికంగా నడుస్తున్న సంస్థల్లోనూ ఇదే పరిస్థితి కన్పిస్తోంది. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ విధింపు, కోవిడ్ మహమ్మారి వంటి ఆర్థికపరమైన ఒడిదుడుకులే దీనికి కారణాలుగా చెప్పవచ్చు. ముఖ్యంగా అనధికారిక రంగంలో ఉద్యోగ కల్పన బాగా తక్కువగా ఉంటోంది. చట్టబద్ధంగా ఏర్పడిన సంస్థల్లో సైతం 2015-16, 2022-23 మధ్యకాలంలో కేవలం 86 లక్షల ఉద్యోగాలు మాత్రమే వచ్చాయి. అంటే ఈ మధ్యకాలంలో ఉద్యోగాల సంఖ్య కేవలం 7 శాతం మాత్రమే పెరిగింది. సగటున ఏటా పది లక్షల మందికి మాత్రమే ఉపాధి లభించింది. ఈ రంగంలో ఉద్యోగాల కల్పన తక్కువగా ఉండడంతో పాటు కొత్తగా వచ్చిన ఆ ఉద్యోగాలు సైతం ఉత్పాదకతను పెంచలేకపోయాయి.

ఇక్కడ ఓ ముఖ్యమైన విషయాన్ని కూడా గమనించాల్సి ఉంది. సోమవారం విడుదలైన రిజర్వ్‌బ్యాంక్ తాజా సమాచారం ప్రకారం 2015-16, 2022-23 మధ్యకాలంలో పెద్ద నోట్ల రద్దు, కోవిడ్ కారణంగా ఉత్పత్తి రంగంలో 54 లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయారు. గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ గత వారం విడుదల చేసిన వార్షిక సర్వే నివేదికను ఆధారంగా చేసుకొని ఇండియా రేటింగ్స్ అండ్ రిసెర్చ్ (ఇండ్-రా) సంస్థ అనధికారిక రంగంలో నెలకొన్న పరిస్థితులను విశ్లేషించింది.

ఇటీవలి సంవత్సరాల్లో సంభవించిన ఆర్థిక ఒడిదుడుకులు అనధికారిక రంగంపై తీవ్ర ప్రభావం చూపాయని ఇండ్-రా తెలిపింది. ఈ ఒడిదుడుకులు 2022-23 జీడీపీలో 4.3 శాతం మేర ప్రభావం చూపాయి. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ, కోవిడ్-19 వంటి పరిణామాలు అనధికారిక రంగంలో ఉద్యోగ కల్పన అవకాశాలను దారుణంగా దెబ్బతీశాయి.

ఉత్పత్తి రంగానిదే పెద్ద పీట

ఆర్‌బీఐకి చెందిన క్లెమ్స్ (క్యాపిటల్, లేబర్, ఎనర్జీ, మెటీరియల్, పర్చేజ్ సర్వీసెస్) డాటాబేస్ దేశ ఆర్థిక రంగంలోని 27 కీలక రంగాల సమాచారాన్ని విశ్లేషించింది. అందుకోసం వివిధ వనరుల నుంచి సేకరించిన ప్రభుత్వ సమాచారాన్ని వినియోగించింది. దీని ప్రకారం...2015-16, 2022-23 మధ్యకాలంలో దేశ ఆర్థిక వ్యవస్థలో కొత్తగా 12.5 కోట్ల ఉద్యోగాలు చేరాయి. వీటిలో 86 లక్షలు అంటే 6.9 శాతం ఉద్యోగాలు ఉత్పత్త రంగంలోనివే. సేవల రంగంలో 4.9 కోట్ల ఉద్యోగాలు వచ్చాయి. లెహమాన్ సంక్షోభం నుంచి అనేక ఆర్థిక వ్యవస్థలు తమ దేశీయ రంగాలను కాపాడుకోవడం మొదలు పెట్టాయని పీహెచ్‌డీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ప్రధాన ఆర్థికవేత్త, ఉప ప్రధాన కార్యదర్శి ఎస్‌పీ శర్మ తెలిపారు. 'అమెరికా, చైనా మధ్య వాణిజ్య యుద్ధం జరిగింది. ఆ తర్వాత కోవిడ్ మహమ్మారి వచ్చిపడింది. దీంతో ఉత్పత్తి రంగం అభివృద్ధి చెందలేదు. ఆ రంగం యువతకు ఉద్యోగాలు కల్పించలేకపోయింది' అని ఆయన చెప్పారు.

ఉత్పాదకత పెరగలేదు

2022-23 నాటికి వ్యవసాయేతర అనధికారిక రంగంలో సుమారు 10.96 కోట్ల మంది పనిచేస్తున్నారని ఇండ్-రా తెలిపింది. ఈ సంఖ్య 2015-16తో పోలిస్తే 11.13 కోట్లు తక్కువ. ఉత్పత్తి రంగం ఉద్యోగాలు కోల్పోవడమే దీనికి ప్రధాన కారణం. 2022-23లో ఉత్పత్తి రంగంలో 3.6 కోట్ల మంది పనిచేశారు. ఈ సంఖ్య 2015-16తో పోలిస్తే 54 లక్షలు తక్కువ. ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే 2015-16లో ఉత్పాదకత ఎలా ఉన్నదో 2022-23లో కూడా అలాగే ఉంది. అంటే కొద్దో గొప్పో ఉద్యోగ నియామకాలు జరిగినప్పటికీ ఉత్పాదకత మాత్రం పెరగలేదు.

ఉత్పత్తి రంగంలో ప్రతి కార్మికుడి ఉత్పాదకతను కొలిచే 'స్థూల వాల్యూ ఎడిషన్' 2022-23లో రూ.3.96 లక్షలుగా ఉంది. ఇది 2015-16లో కంటే (3.49 లక్షలు) స్వల్పంగా మాత్రమే పెరిగింది. కోవిడ్ కారణంగా సమస్యలు ఎదురైనప్పటికీ ఉత్పత్తి రంగం అనేక నూతన సాంకేతికతలను అందిపుచ్చుకుంది. అయితే ఉత్పాదకత విషయంలో చైనా వంటి దేశాలకు చాలా దూరంలో ఉండిపోయింది.

ప్రతికూల పరిణామాలు లేకపోతే...

వాణిజ్యం, ఇతర సేవలు సహా అనధికారిక రంగాన్ని ఇండ్-రా విశ్లేషణ పరిశీలించింది. 2015-16, 2022-23 మధ్యకాలంలో తగిలిన ఎదురు దెబ్బలు కేవలం ఉత్పత్తి రంగానికి మాత్రమే పరిమితం కాలేదని తేల్చింది. 2022-23లో దేశంలో 6.5 కోట్ల అనధికారిక సంస్థలు ఉన్నాయి. 2015-16తో పోలిస్తే ఇది కేవలం 20 లక్షలు మాత్రమే అధికం. దీనికి భిన్నంగా 2010-11, 2015-16 మధ్యకాలంలో 57 లక్షల అనధికారిక సంస్థలు ఆవిర్భవించాయి. ఎదురు దెబ్బలు తగకుండా ఉంటే 2022-23 నాటికి దేశంలో అనధికారిక సంస్థల సంఖ్య 71.4 మిలియన్లకు చేరి ఉండేదని అంచనా. అదే విధంగా ఉద్యోగుల సంఖ్య కూడా 125.3 మిలియన్లకు చేరి ఉండేది. మరో మాటలో చెప్పాలంటే 2015-16, 2022-23 మధ్యకాలంలో అనధికారిక రంగం 6.3 మిలియన్ సంస్థలను, 16 మిలియన్ల ఉద్యోగాలను కోల్పోయింది. 2022-23లో దేశంలో అనధికారిక సంస్థల ఆర్థిక పరిమాణం రూ.15.4 లక్షల కోట్లుగా ఉంది. అయితే 2010-11, 2015-16తో పోలిస్తే వృద్ధి చాలా తక్కువగా ఉంది.


నవతెలంగాణ

మన దేశం, మన ప్రజలు, మన జీవితాలు, మన భౌతిక సామాజిక పరిసరాలను పట్టించుకునే విద్యను బోధించాలి - మహాత్మాగాంధీ

శుక్రవారం 12 జులై 2024
www.navatelangana.com

సంపాదకీయం

రాష్ట్రానికి సుస్తీ



'ఆరోగ్యమే మహాభాగ్యం' అన్నారు పెద్దలు. కానీ ప్రజలకు ఆ భాగ్యం దూరమవుతోంది. వర్షాకాలం మొదలైంది చాలు ఆసుపత్రుల్లో క్యూ పెరిగింది. రాష్ట్రంలో విజృంభిస్తున్న విషజ్వరాలే దీనికి నిదర్శనం. దగ్గు, జలుబు, జ్వరాలతో బాధపడుతున్న రోగులతో దావాఖానాలు నిండిపోతున్నాయి. ఒకపక్క డెంగ్యూ పంజా విసురుతోంది. మరో పక్క చికున్ గున్యా వణికిస్తోంది. ఇక జికా వైరస్‌తో ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. కురుస్తున్న వర్షాలు, వాతావరణ మార్పులు, దోమలు, కలుషిత నీరు కారణంగానే విషజ్వరాలు చుట్టుముడుతున్నాయి. దీంతో అనేక మంది అనారోగ్యపాలై ఆసుపత్రుల్లో చేరుతున్నారు. హైదరాబాద్‌లోని ప్రభుత్వ, ప్రయివేట్ ఆసుపత్రులన్నీ రోగులతో నిండిపోతున్నాయి. ఇప్పటికే చాలామంది ఆరోగ్యంతో పాటు జేబులు కూడా గుల్ల చేసుకుంటున్నారు. ల్యాబ్‌ల వద్ద రక్త పరీక్షల కోసం రోగులు పడిగాపులు కాస్తున్నారు. ఇటీవల రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో పదకొండేండ్ల బాలుడు, హైదరాబాద్‌లో ఓ వైద్యుడు సైతం డెంగ్యూ బారినపడి మృతిచెందారు. ఈ ఘటనలు పరిస్థితి తీవ్రతను తెలుపుతున్నాయి.

> ప్రజా ఆరోగ్యాన్ని పక్కన పెట్టి తమ పాలనను సుస్థిరం చేసుకునే బిజీలో రాష్ట్ర పాలకులున్నారు. గులాబీ రేకుల్ని తెంపో, తుంపో చేతిలో చెయ్యేయించుకోవడమే కాదు, ఢిల్లీ నుండి తెగబడే ద్రవ్యాకర్షణకు లొంగిపోయే వారిని కట్టడి చేసుకోవడమే కాదు, ప్రజల్ని శత్రుసైనికుల నుండే కాదు, దోమలు, రోగాల నుండి కాపాడడం తక్షణ కర్తవ్యం కావాలి రేవంత్ సర్కార్‌కు. ప్రజారోగ్యంతో ఆటలాడటం ప్రభుత్వ ఆరోగ్యానికి ఏమాత్రం మంచిది కాదు.

రాష్ట్రంలో ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు 964 డెంగీ కేసులు నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ వెక్టర్-బోర్న్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీవీబీడీసీ)తాజాగా వెల్లడించింది. గతేడాది ఇదే సమయంలో 706కేసులు నమోద య్యాయి. మూడు నాలుగు జిల్లాల్లో డెంగ్యూ తీవ్రత ప్రమాదకరస్థాయిలో ఉన్నట్లు పేర్కొంది. హైదరాబాద్‌లో 327, ఖమ్మం జిల్లాలో 161, మేడ్చల్‌లో 103 కేసులు నమోదయ్యాయని తెలిపింది. గతేడాది తొలి ఆరుమాసాల్లో ఈ మూడు జిల్లాల్లో కేవలం 282 కేసులే నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. దీన్ని బట్టి ఈ ఏడాది డెంగీ తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. డెంగీతో పాటు మలేరియా, చికున్‌గున్యా కేసులు కూడా పెరుగుతున్నాయి. జూన్ చివరి నాటికి రాష్ట్రంలో 71 మలేరియా, 33 చికెన్‌గున్యా కేసులు నమోదైనట్టు తాజా లెక్కలు చెబుతున్నాయి.ఇవి గుర్తించినవి మాత్రమే.

ఇప్పటికే మహారాష్ట్రలో పలుచోట్ల జికా వైరస్ కేసులు కలకలం రేపుతున్నాయి.ఈ నేపథ్యంలో వైరస్ వ్యాప్తిపై నిఘా పెట్టాల్సిన అవసరాన్ని ప్రభుత్వం గుర్తించాలి. డెంగ్యూ, చికున్ గున్యా మాదిరిగానే జికా వైరస్ కూడా దోమల ద్వారానే వస్తుంది. ముఖ్యంగా గర్భిణులకు ఈ వైరస్ సోకితే పుట్టబోయే బిడ్డపై ఆ ప్రభావం పడే ప్రమాదం ఉంది. అందుకే సాధారణ జ్వరమైనా సరే డెంగ్యూ, జికావైరస్ భయంతో వెంటనే ఆసుపత్రి వద్దకు పరు గులు తీస్తున్నారు. జేబులు ఖాళీ చేసుకుం టున్నారు.

కొన్నేండ్ల నుండి పరిశీలిస్తే రెండేండ్లకోసారి రాష్ట్రంలో డెంగ్యూ విజృంభిస్తోంది. అధికారిక లెక్కల ప్రకారం 2022లో 8,500 డెంగీ కేసులు నమోదుకాక గతేడాది రెండు వేల కంటే తక్కువ కేసులు రికార్డ్ అయ్యాయి. అందుకే ఈ ఏడాది డెంగ్యూ తీవ్రత పెరగొచ్చని వైద్యులు ముందే అంచనా వేశారు. తగు జాగ్రత్తలు తీసుకోవల్సిందిగా హెచ్చరించారు. అంతేకాదు ఈ సీజన్‌లో తెలంగాణ కు డెంగ్యూ ప్రమాదం పొంచి ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) కూడా హెచ్చరిం చింది. దేశంలో డెంగ్యూ ఎక్కువగా ఉన్న రాష్ట్రాల జాబితాలో తెలంగాణ కూడా ఉందని పేర్కొంది. ఇటీవల ప్రపంచ వ్యాప్తంగా డెంగ్యూ తీవ్రత గురించి విడుదల చేసిన నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. డబ్ల్యూహెచ్‌వో చెప్పినట్టే దేశ వ్యాప్తంగా నమోదవుతున్న కేసుల్లో మన రాష్ట్రం ఏడో స్థానంలో వుంది. వాస్తవానికి సీజన్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా వేసవిలోనే తగు ప్రణాళిక రూపొందించుకోవాలి.

కానీ రాష్ట్ర ప్రభుత్వం దీనిపై సరైన దృష్టి పెట్టలేదని నమోదవుతున్న కేసులను పరిశీలిస్తే ఇట్టే తెలిసిపోతోంది. అలాగే సీజనల్ వ్యాధుల కట్టడిలో రాష్ట్ర ప్రజారోగ్య విభాగానిదే కీలక పాత్ర. కానీ దాని వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

ప్రజా ఆరోగ్యాన్ని పక్కన పెట్టి తమ పాలనను సుస్థిరం చేసుకునే బిజీలో రాష్ట్ర పాలకులున్నారు. గులాబీ రేకుల్ని తెంపో, తుంపో చేతిలో చెయ్యేయించుకోవడమే కాదు, ఢిల్లీ నుండి తెగబడే ద్రవ్యాకర్షణకు లొంగిపోయే వారిని కట్టడి చేసుకోవడమే కాదు, ప్రజల్ని శత్రుసైనికుల నుండే కాదు, దోమలు, రోగాల నుండి కాపాడడం తక్షణ కర్తవ్యం కావాలి రేవంత్ సర్కార్‌కు. ప్రజారోగ్యంతో ఆటలాడటం ప్రభుత్వ ఆరోగ్యానికి ఏమాత్రం మంచిది కాదు.

ఇప్పటికైనా ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలి. ప్రజారోగ్య విభాగాన్ని పటిష్టపరచాలి. కేసులు పెరిగిపోవడంతో ఇప్పుడు ఇంటింటి సర్వేలు చేపట్టాల్సిందిగా రాష్ట్ర ఆరోగ్య శాఖ హడావుడిగా ఆదేశాలు జారిచేసింది. ఇదొక్కటే సరిపోదు. ప్రత్యేకంగా ఫీవర్ ఓపీ కౌంటర్లు నిర్వహించాలి. పేషంట్ల వెయింటింగ్ పీరియడ్‌ను తగ్గించి, రోగాలు వ్యాపించకుండా జాగ్రత్తపడాలి. విష జ్వరాల బెడద ఉన్న జిల్లాలను ముందుగానే గుర్తించి ప్రజలకు అవగాహన కల్పించాలి. నీటి గుంతలు, కాలువల్లో దోమలు పేరుకుపోకుండా మందు చల్లించాలి. మురికి పేరుకుపోకుండా చూడాలి. డీఎంహెచ్‌వోలతో సమీక్షలు నిర్వహించి అప్రమత్తం చేయాలి.

మరోజన్మ, మరోఆత్మ, మరోయాత్ర నిజమేనా?



డాక్టర్ దేవరాజు మహారాజు

ప్రజల్లో నాటుకుపోయిన బలమైన అభిప్రాయాల్ని మార్చడం తేలికైన పని కాదు. అట్లని ప్రజల అభిప్రాయా లన్నీ సరైనవేనని శాస్త్రీయ వివరణలు ఇవ్వడం చాలా ప్రమాదాలకు దారితీస్తుంది. అలాంటి పనులు ఎవరైనా ఎప్పుడైనా చేయగూడదు. 'పునర్జన్మ' అనేది మత సంబంధమైన ఒక విశ్వాసం అని ఎన్‌సైక్లోపీడియా ఆఫ్ బ్రిటానికా చెప్తోంది. అలాగే మానవాతీత శక్తుల్ని ఎక్స్‌ట్రా సెన్సరీ పర్సెప్షన్ (ఇఎస్‌పి) అని అంటారు. ఈ నమ్మకాలు ప్రపంచ వ్యాప్తంగా ఉన్నాయి కానీ, ఆసియాలో మరీ ఎక్కువ. ముఖ్యంగా హిందూ, సిక్కు మతాలు జైన, బౌద్ధాలలో కొన్ని శాఖలు పునర్జన్మను, మానవాతీత శక్తుల్ని నమ్ముతున్నాయి. ఇటు భారతీయ సంస్కృతి అటు గ్రీకు సంస్కృతులలో ఈ నమ్మకాలు జీర్ణమైపోయాయి. కొన్ని క్రైస్తవ శాఖలలో కూడా ఈ నమ్మకాలు ఎక్కువ.

ఉపనిషత్తుల్లో ఈ విశ్వాసాల ప్రస్తావన ఉంది.అంతెందుకు మాంత్రికులు పరకాయ ప్రవేశం చేసి, తమా షాలు చేసిన సంఘటనలు మన తాతమ్మ, అమ్మమ్మలు చెప్పే కథల్లో కోకొల్లలుగా ఉంటాయి. అందుకే, ఇంత వరకున్న మన సాహిత్యంలో ప్రధానంగా అశాస్త్రీయ ధోరణులే ఉన్నాయి. అందులోంచి బయటపడి, ఆధునిక వైజ్ఞానిక దృష్టి కోణంలోంచి నూతన సాహిత్య సృష్టి చేయాల్సి ఉంది.

ఈ పునర్జన్మ సిద్ధాంతం ప్రకారం - భూమి మీద చనిపోయిన వాళ్లు మళ్లీ భూమి మీదనే పుట్టనక్కర లేదు. త్యాగాలు చేసి, తగు మోతాదులో పుణ్యాలు చేసుకుంటే భోగభాగ్యాలతో విలసిల్లే స్వర్గంలాంటి ఊర్ధ్వలోకాలకు చేరొచ్చు. అదే పుణ్యాలు చేసుకోకపోతే, కుక్కగానో, నక్కగానో మళ్లీ ఈ భూమి మీదే పుట్టాల్సి ఉంటుంది. చెట్టుగానో, చేమ గానో కూడా పుట్టాల్సి రావొచ్చు. ఇక్కడ మనం గ్రహించాల్సిందేమంటే- కర్మ సిద్ధాంతం నమ్మిన చోటే పునర్జన్మ ఉంటోంది. కర్మసిద్ధాంతాన్ని తిరస్కరిస్తే పునర్జన్మా ఉండదు, మానవాతీత శక్తులూ ఉండవు. బడి పిల్లలు కంఠస్థం వచ్చే వరకు పద్యాలు వల్లె వేసినట్టు - ఈ జీవికి మోక్షం లభించేంత వరకు మళ్లీ మళ్లీ పుడుతూనే ఉండాలన్నమాట! ఈ విషయాన్ని వైదిక మతం నొక్కివక్కాణించింది. సిక్కు మతం ఆ అభిప్రాయాన్నే బలపరిచింది. మోక్షం సిద్ధిస్తే, చివరకు పరమాత్ముడిలో లీనం కావడమేనని కూడా మతాలు విశ్వసించాయి. సాధారణ శకానికి ముందు ఐదవ శతాబ్దంలో ప్లేటో చెప్పినా, ఇటీవల కాలంలో హైందవ తత్వవేత్తలు చెప్పినా అందులోని సారాంశం ఒక్కటే! అందుకే పుట్టడానికి ముందూ-చావు తర్వాత కూడా జీవితం ఉంటుందన్న వాదం బలం పుంజుకుంది.కోర్కెల్ని జయించగలిగితే నిర్వాణ దశకు చేరుకోవచ్చని చెప్పింది బౌద్ధం.

ఆత్మ అనే దాన్ని అర్థం చేసుకోవడానికి జనం ఒక వైపు నానా హైరానా పడుతుంటే, ఇండోనేషియాకు చెందిన పోలో అల్బర్ అనే తత్వవేత్త ఆత్మ ఒక్కటి కాదని ఇనొసా, అనగా, టాన్ కానా అనే మూడు ఆత్మలుంటా యన్నాడు. ఇందులో దైవాంశ గల ఆత్మ రాత్రి నిద్ర పోతున్నప్పుడు నోటి నుండి గానీ, ముక్కు రంధ్రాల నుండి గానీ వెళ్లిపోతుందని - ఆ తర్వాత దానికి ఎగిరేప్రాణిగా పునర్జన్మ ప్రాప్తిస్తుందనీ - చెప్పాడు. దక్షిణాఫ్రికాకు చెందిన వెండా అనే మేధావి కథనం మరో రకంగా ఉంది. చనిపోయిన వారి ఆత్మ కొంతకాలం వరకు వారి సమాధి చుట్టే తిరుగుతుందని, అనువైన సమయం దొరకగానే మరో మనిషిగా కానీ, క్షీరదాలను చెందిన ఇతర ప్రాణిగా కానీ లేదా సరీసృపాలకు చెందిన మరేదైనా జంతువుగా జన్మనెత్తొచ్చని అన్నాడు. వీటన్నిటి అంతసూత్రం ఒక్కటే! ఆత్మ అన్నది నాశనం కాదని! భగవద్గీత చెప్పింది కూడా ఇదే-

పుట్టిన పాపాయి మెదడులో గత జన్మకు సంబంధించిన ఛాయలు ఉంటాయని భారతీయ తత్వవేత్తలలో సాంఖ్యావాదులు చెపుతున్నారు. ఈ వాదాన్ని ఆధారం చేసుకునే అక్కడక్కడ అప్పుడప్పుడు కొందరు కథలల్లు తున్నారు. బాలికకో, బాలుడికో పునర్జన్మ జ్ఞాపకాలున్నాయని నిరూపించడానికి ప్రయత్నిస్తూ వార్తలు సృష్టిస్తున్నారు. ఈ విషయం ఇతి వృత్తంగా సాహిత్యం, చిత్రలేఖనాలు, చలనచిత్రాలు వగైరాలన్నీ రూపు దిద్దుకుంటూ వస్తున్నాయి. ఈ అభిప్రాయం ఎంతగా నాటుకు పోయిందంటే -ఎవరైనా ఇదంతా ట్రాష్ అని అంటే చాలామందికి నచ్చదు. పైగా, మనో భావాలు దెబ్బ దీసుకుంటారు కూడా! దేవుడు, మానవాతీత శక్తులు, ఆత్మ పునర్జన్మ మొదలైన వన్నీ ఒకదాని మీద ఒకటి పెరిగినవి. పేక మేడల్లాగా- ఇందులో ఏ ఒక్కదాన్ని పడగొట్టినా మిగతావన్నీ సులభంగా కూలిపోతాయి!

కొంతమందిలో కొన్ని విషయాలలో అసాధారణ ప్రతిభ కనిపిస్తుంది కదా? అంటే అది నిజమే! అలాంటి వాటిని జీవశాస్త్రం ఒప్పుకుంటుంది. సహజ సిద్ధంగా కొందరికి కొన్ని విషయాలలో అసాధారణ ప్రతిభాపాటవాలు ఉండొచ్చు. అవన్నీ మహిమలు కావు. అతీంద్రియ శక్తులు కూడా కావు. వారసత్వ లక్షణాల నుండి వచ్చిన ప్రతిభ అది. దాన్ని కొందరు స్వయంకృషితో మరింతగా మెరుగు పరుచుకుంటారు. అంతే తప్ప పూర్వజన్మ లక్షణాలు కావు. ఇకపోతే, మరణం తర్వాత జీవితాన్నీ, మానవాతీత- శక్తులు ఉండడాన్నీ విజ్ఞాన శాస్త్రం ఒప్పుకోదు. గణిత శాస్త్ర సమస్యల్ని కంప్యూటర్ కంటే వేగంగా పరిష్కరిస్తున్న వాళ్లను నిజజీవితంలో చూస్తునే ఉన్నాం. మూడేళ్ల వయసులోనే చక్కని నాట్య ప్రదర్శన ఇస్తున్న పసికూనలు మన మధ్యలోనే ఉన్నారు. శతావధానాలు, గారడీ విద్యలు, ఇంద్రజాలాలు మన నిత్య జీవితంలో భాగమైపోయ్యాయి. సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తే విశేషాలు వీటిలో ఉన్నాయి. అంత మాత్రం చేత ఇవి మానవాతీత శక్తులుగా చలామణి కావడం లేదు. మానవాతీత శక్తులు ఉన్నాయా? అని ప్రశ్నించు కోవడంకంటే, అసలు అలాంటివి ఉండడానికి వీలుందా? - అని ఆలోచించడం ముఖ్యం.

విజ్ఞాన శాస్త్ర ప్రకారం పదార్థం, పదార్థ లక్షణాలూ మనకు తెలుసు. పదార్థాన్ని విభజిస్తూ పోతే, తుదకు విభజించడానికి వీలుకాని సూక్ష్మకణాలు మిగులుతాయి. వాటినే అణువులు అని అంటున్నాం. అణువులను వాటి మార్పులను బట్టి రసాయనిక జీవ ప్రక్రియలను అర్థం చేసుకుంటున్నాం. వ్యాఖ్యానిస్తున్నాం. పదార్థ స్వభావాన్ని పరిశీలించడం, వాటిని క్రమపద్ధతిలో

> పుట్టిన పాపాయి మెదడులో గత జన్మకు సంబంధించిన ఛాయలు ఉంటాయని భారతీయ తత్వవేత్తలలో సాంఖ్యావాదులు చెపుతున్నారు. ఈ వాదాన్ని ఆధారం చేసుకునే అక్కడక్కడ అప్పడప్పుడు కొందరు కథలల్లు తున్నారు. బాలికకో, బాలుడికో పునర్జన్మ జ్ఞాపకాలున్నాయని నిరూపించడానికి ప్రయత్నిస్తూ వార్తలు సృష్టిస్తున్నారు. ఈ విషయం ఇతి వృత్తంగా సాహిత్యం, చిత్రలేఖనాలు, చలనచిత్రాలు వగైరాలన్నీ రూపు దిద్దుకుంటూ వస్తున్నాయి. ఈ అభిప్రాయం ఎంతగా నాటుకు పోయిందంటే -ఎవరైనా ఇదంతా ట్రాష్ అని అంటే చాలామందికి నచ్చదు. పైగా, మనో భావాలు దెబ్బ దీసుకుంటారు కూడా! దేవుడు, మానవాతీత శక్తులు, ఆత్మ, పునర్జన్మ మొదలైన వన్నీ ఒకదాని మీద ఒకటి పెరిగినవి. పేక మేడల్లాగా- ఇందులో ఏ ఒక్కదాన్ని పడగొట్టినా మిగతావన్నీ సులభంగా కూలిపోతాయి!

పొందుపరచడం, వివిధ పరిశీలనల ఫలితాలు సమీక్షించు కోవడం సమన్వ యించుకోవడం ఒక పద్ధతి. ఈ పరిశీలనల ఆధారంగా కొన్ని ఉపయోగకరమైన - వివేకవంతమైన సిద్ధాంతాలు ఏర్పడ్డాయి. సిద్ధాంతం నిర్దేశించిన సూత్రాలను ప్రయోగం నిర్ధారిస్తుంది. పునర్జన్మ, మానవాతీత శక్తుల గురించి మతవిశ్వాసకులు చెప్పేది సిద్ధాంతాలే తప్ప, వారు చేసిన ప్రయోగాలు ఏమున్నాయనీ? చూపించిన దాఖలాలు ఏమున్నాయనీ? మరణించిన ప్రాణి మళ్లీ బతకగలదని - టెలిపతి, సైకోకైనసిస్, ప్రికాగ్నిషన్, క్లైరోయన్స్ వంటివి ఉంటాయని సహేతుకంగా చెప్పడానికి వీలులేదు. ఈ విశ్వాంతరాళంలో ఇంకా మనకు తెలియని పదార్థాలు, అణువులు ఉన్నాయని బయటపడితే, వాటి లక్షణాలు అర్థమైతే, అప్పుడు మళ్లీ ఈ విషయాలన్నీ విశ్లేషించుకోవచ్చు.

ఆత్మ పునర్జన్మకు సంబంధించి కొందరు వితండవాదాలు చేస్తుంటే, మరి కొందరు నిజాయితీగా ఉత్సుకతతో పరిశీలనలు ప్రయోగాలు చేస్తున్నారు. అమెరికాలో ఇఇయమ్, హాన్సెల్ అనే అతను ఈ విషయాల్లో విశేషంగా కృషి చేశాడు. నిజనిర్ధారణకు పూనుకున్నాడు. ఆయన ఇంటర్వ్యూ చేసిన వారిలో తొంభయి తొమ్మిది మంది తాము చేసినవి తప్పిదాలని, మహిమలు కావని ఒప్పుకున్నారు. ఉదాహరణకు మార్గరేట్ షాక్స్ సోదరీమణుల విషయం చెప్పుకోవచ్చు - మార్గరేట్, లియాఫిష్ ఇద్దరూ అక్కా చెల్లెళ్లు, వాళ్ల బాల్యంలో తమ తల్లిని భయపెట్టడానికి సరదాగా ఏవేవో కొంటె చేష్టలు చేస్తుండేవారు. లైట్లు ఆర్పేసి పడుకున్న తర్వాత, కాలి బొటన వేళ్లను టిక్‌టిక్‌మని విరవడం, రెండు బొటనవేళ్ల గోళ్లు వేగంగా రాసి, ఆ రాపిడితో వింత వింత ధ్వనులు సృష్టించడం అభ్యాసం చేశారు. అది ఇల్లు దాటి, ఊరు దాటి, పట్టణాలకు తెలిసేసరికి జనం తండోపతండాలుగా రావడం మొదలు పెట్టారు. అలాంటి పరిస్థితుల్లో వారు మరింత జాగ్రత్తగా ఉండాల్సి వచ్చింది. తాము సృష్టించుకున్న ఆధ్యాత్మిక చీకటి గదిలోంచి జవాబులివ్వడం మొదలు పెట్టారు. డబ్బు విపరీతంగా రావడం మొదలైంది. వారు పెరిగి, వివాహాలు చేసుకుని, కుటుంబ బాధ్యతలు మోయాల్సిన దశలో ఇక వీలుకాక ప్రదర్శనలు ఆపేశారు. ఇలాంటి పనులు అందరూ డబ్బుకోసమే చేయకపోవచ్చు. పేరుకోసం, ప్రత్యేక గుర్తింపు కోసం కూడా చెయ్యొచ్చు లేదూ కష్టపడకుండా గొప్పవాళ్లను తమ చుట్టూ తిప్పుకోవచ్చని కూడా చెయ్యొచ్చు.

ఇక్కడ మనం మరోక విషయం ఆలోచించాలి! ఆకలి, దాహం, బాధ సంతోషంలాగా - నిజంగా పునర్జన్మ గానీ, మానవాతీత శక్తులు గానీ ఉంటే, అవి మనుషులందరికీ అనుభవంలోకి రావాలి. కానీ, యోగులకు సన్యా సులకు, బాబాలకు మాత్రమే కొన్ని వింత అనుభవాలు ఎందుకొస్తున్నాయి? వస్తున్నాయని వారు ప్రకటించుకుని వాటితో వ్యాపారాలు చేసుకుంటున్నారన్నది మనం గ్రహించాలి. పోనీ అలా వస్తే వాటిని సమజ శ్రేయస్సుకు ఉపయో గించిన వారు ఎవరూ లేరు కదా? నిజనిర్ధారణకు నిలబడి రుజువు పరిచిన వారు లేరు కదా? ఉట్టి మాటలు, మేజిక్కులని అతీంద్రియ శక్తులని ఎలా నమ్ముదాం? ప్రతి జీవికి ఆత్మ ఉందనే అనుకుందాం. ఊరికే చర్చకోసం అను కుందాం- అయితే ఒక ఆత్మ విడిపోయి రెండు మూడు ప్రాణాలుగా జన్మ నెత్తుతుందన్న విషయం ఎవరూ చెప్పలేదు. ఒకప్పుడు మనం ముక్కోటి ఆంధ్రులం. జనాభా పెరిగి రెండింతలకు పైగా అయ్యాం. అంటే ఈ పెరుగుతున్న ఆత్మలు ఎక్కడివీ? జీవశాస్త్రం జవాబు చెప్ప గలదు, కానీ, వాటి గురించి ఎక్కువగా మాట్లాడే వారి దగ్గర సమాధానం లేదు. శాస్త్రీయ దృక్పథం కలిగి, పరిణామ సిద్ధాంతాన్ని గట్టిగా నమ్మే భౌతికవాదులకు జవాబు దొరుకు తుంది. పునర్జన్మ నిజం కాదనీ, కేవలం మత సంబంధమైన ఒక ప్రగాఢ విశ్వాసమేనని!

- సుప్రసిద్ధ సాహితీ వేత్త, విశ్రాంత బయాలజీ ప్రొఫెసర్ (మెల్బోర్న్‌నుంచి)

నకిలీ ఔషధం... నమ్మితే ప్రమాదం



సింగిడి అమృత్
9849973404

తెలంగాణ రాష్ట్రంలో నకిలీ ఔషధాలు తరచూ పట్టుబడుతున్నాయి. కొన్ని స్థానికంగానే తయారు చేస్తుండగా, మరికొన్ని ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ లాంటి రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్నాయి. ప్రముఖ కంపెనీల పేరుతో ఎవరికీ అనుమానం రాకుండా వీటిని మెడికల్ షాపులకు చేరవేస్తున్నారు. ఎక్కువ లాభాలు వస్తుండటంతో కొంతమంది వీటిని విక్రయిస్తూ రోగుల ప్రాణాల మీదకు తెస్తున్నారు. చాక్‌పీస్ పౌడర్, మొక్కజొన్న పిండితో కూడా నకిలీ మెడిసిన్స్ తయారు చేస్తున్నట్లు ఔషధ నియంత్రణ శాఖాధికారులు గతంలో గుర్తించారు. డాక్టర్ రెడ్డీస్, అబట్, సన్ ఫార్మా గ్లెన్ మార్క్, అరిస్టో, టోరెంట్ కంపెనీల బ్రాండ్లను అతికించి నకిలీ మందులను విక్రయిస్తున్నట్లు నిర్ధారించారు. అంతేకాకుండా మోతాదు కంటే అతి తక్కువ రసాయనాలతో



మెడిసిన్స్ తయారు చేస్తున్నట్లు, ఒక ఫార్ములాకు బదులు మరో ఫార్ములా వాడుతున్నట్లు అధికారుల దర్యాప్తులో తేలింది. మరోవైపు ప్రభుత్వ డిస్పెన్సరీలకు సైతం నకిలీ మందులు సరఫరా చేసిన ఘటనలు గతంలో వెలుగు చూశాయి. అయితే ఒకటికి రెండు సార్లు క్రాస్ చెక్ చేసుకొని మందులను కొనకపోతే.. ఉన్న రోగం పోవడమేమో కానీ.. కొత్త రోగాలు వచ్చే ప్రమాదమున్నది.

పరిణామాలిలా..

ఔషధాల్లో ఉండే 'యాక్టివ్ ఇన్‌గ్రేడియెంట్' మన శరీరంలోకి చేరిన తర్వాత వ్యాధిని నియంత్రిస్తుంది. అయితే.. నకిలీ మందుల్లో యాక్టివ్ ఇంగ్రేడియెంట్ ఉండదు. పిండి, మొక్కజొన్న పొడి, ఆలుగడ్డ పొడి వంటివి ఉంటాయి.కొన్ని సందర్భాల్లో తప్పుడు యాక్టివ్ ఇన్‌గ్రేడియెంట్ వాడుతున్నారు. ఉదాహరణకు 'అమాక్సిసిల్లిన్' ట్యాబ్లెట్లలో 'పారాసిటమాల్' నింపుతున్నారు. లేదా తగినంత పరిమాణంలో యాక్టివ్ ఇన్‌గ్రేడియెంట్ వేయడం లేదు. అంతేకాకుండా కేన్సర్, గుండె జబ్బు ట్రీట్‌మెంట్‌లో ఉపయోగించే మందులకు కూడా నకిలీలను తయారు చేసి అమ్ముతున్నట్టు గుర్తించారు. పేషెంట్లు ఏండ్ల తరబడి వీటిని వాడాల్సి ఉంటుంది. దీంతో కేటుగాళ్లు వీటికి నకిలీలను తయారు చేసి, తక్కువ ధర ఆశ చూపి పేషెంట్లకు అంటగడుతున్నారు. నకిలీ మందులు రోగి ఆరోగ్యాన్ని తీవ్ర ప్రమాదంలో పడేస్తాయి. ఇవి వ్యాధిని నయం చేయడంలో విఫలం కావడమే కాకుండా, కాలక్రమేణా రోగికి వినాశకరమైన పరిణామాలు సృష్టిస్తాయి. ఆర్థికంగానూ నష్టాన్ని చేకూరుస్తాయి. కొత్త అనారోగ్య సమస్యలు కూడా వచ్చే ప్రమాదం ఉంటుంది.

'పరిశీలన' ముఖ్యం

నకిలీ ఔషధాలు అసలు మందులను పోలి ఉంటాయి. దాదాపు ఒరిజినల్ ప్రొడక్ట్ తీరుగానే ప్యాకేజ్ చేస్తున్నారని, మెడిసిన్‌ను ల్యాబ్‌కు పంపించి టెస్ట్ చేస్తే తప్ప కొన్నిసార్లు నకిలీదని గుర్తించలేమని డీసీఏ అధికారులు చెబుతున్నారు. అయితే మందులు కొనేముందు ప్రతి ఒక్కరు ఒకటికి, రెండుసార్లు పరిశీలించాలి. దీర్ఘకాలిక రోగాలతో తరచూ మందులు వినియోగిస్తున్నట్లయితే గతంలో కొనుగోలు చేసిన మందులతో ప్యాకేజింగ్‌ను పోల్చుకోవాలి. పేర్లలో స్పెల్లింగ్స్‌ను కూడా జాగ్రత్తగా పరిశీలించాలి. తయారీ తేదీ, గడువు తేదీని తనిఖీ చేయాలి. పేరున్న కంపెనీల ఉత్పత్తులను మరీ చౌకగా అమ్ముతుంటే అది నకిలీ ఉత్పత్తి కావొచ్చని అనుమానించాలి. అంతే కాకుండా మెడికల్ షాపులో కొనుగోలు చేసిన మందుల బిల్లులను తప్పనిసరిగా తీసుకోవాలి. కేంద్రం ఔషధాలకు సంబంధించి 300 బ్రాండ్ మెడిసిన్‌ను నోటిఫై చేసి, వాటికి బార్, క్యూఆర్ కోడ్‌ను ఇచ్చింది. ఆ బ్రాండ్స్ జాబితాను రాష్ట్ర ఔషధ నియంత్రణ మండలి వెబ్‌సైట్‌లో ఉంచింది. అంతేకాకుండా ముందులతో అనారోగ్య సమస్యలు, అలర్జీ, ఇతర దుష్ప్రభావాలు కనిపిస్తే వాటిని అనుమానించాలి. కాగా.. భారత దేశంలో 25 శాతం మందులు నకిలీ లేదా తక్కువ నాణ్యత ఉన్నవేనని 2022లో అసోచామ్ అధ్యయనం తేల్చింది. ప్రపంచంలో అమ్ముడవుతున్న కల్తీ మందుల్లో 35 శాతం ఇండియా నుంచి ఎగుమతి అయినవేనని భారత వాణిజ్య పరిశ్రమల సమాఖ్య 2007లోనే కేంద్ర ప్రభుత్వానికి నివేదించింది.

'ఆన్‌లైన్'కు దూరమే మంచిది..

వెబ్‌సైట్‌లు లేదా ఇతర ఇంటర్నెట్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల నుంచి మందులు కొనుగోలు చేయకపోవడమే శ్రేయస్కరమని నిపుణులు సూచిస్తున్నారు. కొన్ని వెబ్ సైట్లు భారీ డిస్కౌంట్లతో ఫార్మా ప్రొడక్టులను అమ్ముతుండగా.. ఇటువంటి వాటి విషయంలో జాగ్రత్తగా ఉండాలని పేర్కొంటున్నారు. తగిన టెంపరేచర్‌లో నిల్వ చేయకపోవడం, రవాణా చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో మందుల సామర్థ్యం తగ్గవచ్చని చెబుతున్నారు. ఆర్ఎంపీలు, డ్రగ్ కంట్రోల్ అనుమతి లేని ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా పేషెంట్లకు నకిలీ మందులను చేరవేస్తున్నట్లు గుర్తించారు. ఇందుకోసం వాట్సాప్ గ్రూపులను సైతం వినియోగించుకుంటున్నట్లు తెలుస్తున్నది. అయితే నకిలీ ఔషధాల గురించి సమాచారం తెలిస్తే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1800 599 6969కు సమాచారం అందించాలి. గడువు తీరిన ఔషధాలు అమ్మినా దగ్గరలో ఉన్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు గానీ లేదా టోల్‌ఫ్రీ నెంబర్‌కైనా ఫోన్ చేసి విషయాన్ని చెప్పాలి.ఇలా ప్రజలు అప్రమత్తంగా ఉంటే నకిలీ మందులను కొంతమేరకైనా అరికట్టవచ్చు.

పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు- పెన్షన్ అంశం ప్రాధాన్యత



జి.కిషోర్‌కుమార్
9440905501

వివిధ ప్రభుత్వ డిపార్ట్‌మెంట్లు, ప్రభుత్వ రంగ సంస్థలలో నూతనంగా రిక్రూట్ అయిన 87 లక్షల మంది ఉద్యోగులు 2004 నుంచి ఓల్డ్ పెన్షన్ పథకం అమలు కోసం గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. వివిధ జాతీయ కార్మిక సంఘాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంస్థలు, సంఘాలు, అనేక స్వతంత్ర ఫెడరేషన్లు, 'జాయింట్ ఫోరం ఫర్ రెస్టోరేషన్ ఆఫ్ ఓల్డ్ పెన్షన్ స్కీమ్'గా ఏర్పడి పలు రూపాలలో పోరాట ఆందోళనా కార్యక్రమాలను, విస్తృత ప్రచారోద్యమాలను, సమ్మెలను, దేశవ్యాప్త ధర్నాలను నిర్వహిస్తున్నారు. ఈ మేరకు అనేక పర్యాయాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మెమోరాండమ్‌లు కూడా సమర్పించారు.ఇటీవల జరిగిన నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కూడా ఈ పెన్షన్ విధానం పెద్ద ఎత్తున చర్చనీయాంశంగా మారింది. అంతేగాక ఈ పెన్షన్ అంశం ఎన్నికల ఫలితాలలో నిర్ణయాత్మకమైన భూమికను పోషించింది. నేపథ్యంలో జులై 22 నుంచి ప్రారంభమవుతున్న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలలో పెన్షన్ విధాన నిర్ణయం కీలకం కానున్నది.

బాధ్యత నుంచి తప్పుకుంటున్న ప్రభుత్వం

పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్ మెంట్ అథారిటీకి సంబంధించిన ఆర్డినెన్స్‌ను ప్రభుత్వం 2004 డిసెంబర్ 30న జారీ చేసింది. అనంతరం అనేక అభ్యంతరాలు, పోరాటాల నడుమ 2013లో ఆర్డినెన్స్‌ను బిల్లుగా ఆమోదింపచేసుకుంది. ఫలితంగా భారతదేశ పెన్షన్ మార్కెట్ లోకి వివిధ పెన్షన్ ఫండ్ మేనేజర్లు, పెన్షన్ రంగం లోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రావడానికి మార్గం సుగమమైంది. జనవరి 1, 2004 నుంచి సర్వీసులో చేరిన ఉద్యోగులకి డిఫైన్డ్ బెనిఫిట్ పెన్షన్ పథకం కాకుండా డిఫైన్డ్ కంట్రిబ్యూషన్ పెన్షన్ పథకాన్ని అమలు చేస్తున్నారు. డిఫైన్డ్ బెనిఫిట్ పెన్షన్ పథకాన్ని మార్పు చేసి నూతన పెన్షన్ పథకాన్ని అమలు చేయడమంటే ప్రభుత్వం తన బాధ్యత నుండి పక్కకు తప్పుకోవడమే. ప్రభుత్వాలకు తద్వారా ప్రజలకు ఉపయోగపడే పెన్షన్ నిధులను ప్రవేటువారి చేతులలోకి చేర్చేందుకు ఈ పెన్షన్ సంస్కరణలు దారితీశాయి. పెన్షన్ నిధులలో కమ్యూటేషన్ విలువ మీద పన్నులు, పెన్షన్ నిధులలో పెట్టుబడులు పెట్టే అనారోగ్య పోటీ పద్ధతులు, పెన్షన్ నిధులలో పెట్టబడులపై రాయితీలు, పెన్షన్ ఫండ్ మేనేజర్ల విషయంలో నియంత్రణా సంస్థల బాధ్యతా రాహిత్యం, సంస్కరణలకు తగినట్టుగా అకౌంటింగ్ విధానాలు లేకపోవడం, వ్యక్తిగత పెన్షన్ ఖాతాదారుల రికార్డు కీపింగ్‌కు కావలసిన మౌలిక సదుపాయాల అభివృద్ధి లేమి, పెన్షన్ నిధులను ఇన్వెస్ట్‌మెంట్ చేసే విధివిధానాలపైన సమగ్రమైన అవగాహనా రాహిత్యం వంటి అనేక అంశాలతో కూడిన పెన్షన్ సంస్కరణలు ఉద్యోగ, కార్మిక వర్గ కష్టార్జితానికి ఉపయుక్తంగా లేవు.

ఖాతాదారులకు నష్టదాయకం

భారతదేశ ఈక్విటీ మార్కెట్‌లో ఉన్న లొసుగుల ఫలితంగా కలిగే నష్టానికి పెన్షన్ ఖాతాదారులు బాధ్యులను చేయడం, ఒక స్కీం నుండి మరొక స్కీంకు ఖాతాదారులు మారటం వలన జరిగే నష్టాన్ని నియంత్రించలేకపోవడం, పెట్టుబడి మార్కెట్‌కు చెందిన మౌలిక సదుపాయాలు, నియంత్రణా సంస్థల వైఫల్యాలు వంటి పెన్షన్ సంస్కరణల రూపాలు పెన్షన్ ఖాతాదారులను కష్టనష్టాలకు గురిచేస్తున్నాయి. పాత పెన్షన్ పథకంలో ఉన్న ఉద్యోగి మరణించినట్లయితే అతని కుటుంబానికి పూర్తి రక్షణ ఉంటుంది. పెన్షన్ కోసం ప్రయివేటు వారికి ఆశ్రయించటం వలన వృద్ధాప్యంలో ఆదాయ రక్షణ సమస్య మరింత జఠిలమౌతుందిగానీ పరిష్కారం కాదు. పెన్షన్ సంస్కరణల వలన, పెన్షన్ నిధుల ప్రయివేటీకరణ వలన లాభపడేది ఫండ్ మేనేజర్లు, బ్రోకర్లు తప్ప పెన్షన్‌దారులు కాదు.



> 'ఆర్గనైజేషన్ ఫర్ ఎకనమిక్ కోపరేషన్ అండ్ డెవలప్‌మెంట్'కు సంబంధించిన పెన్షన్ నిష్ణాతులు పెన్షన్ రంగంపై ఇచ్చిన రిపోర్ట్ యునైటెడ్ కింగ్‌డమ్‌లో పెన్షన్ సంస్కరణల పేరుతో జరిగిన సంస్కరణలు పెన్షనర్లను దారిద్ర్యంలోకి నెట్టాయని, ఎక్కువమంది ప్రజలు పెన్షన్ పెట్టుబడుల విషయంలో బాధితులయ్యారని, అనేకమంది బ్రోకర్ల బారినపడి నష్టపోయారని, తిరిగి పెన్షన్ అంశం ప్రభుత్వం తన ఎజెండాలో చేర్చుకునే పరిస్థితి ఏర్పడిందని పేర్కొంది. అనేక దేశాల పెన్షన్ నిధుల ప్రయివేటీకరణ విఫలమైన ప్రక్రియగా నిరూపించబడింది. స్టాక్ మార్కెట్ ఒడిదుడుకులపై రిటైరైన ఉద్యోగి పెన్షన్ ముడిపడి ఉండటం ఆమోదయోగ్యం కాదు.

విదేశీ అనుభవాల నుంచి నేర్చుకోరా!

పెన్షన్ రంగంలో సంస్కరణలకి సంబంధించి అంతర్జాతీయ అనుభవాలను విశ్లేషించినట్లయితే అమలులో ఇవి విఫలమయ్యాయనేది అవగతమవుతుంది. పెన్షన్ సంస్కరణల పేరుతో చిలీలో జరిగిన అనుభవాల నేపథ్యంలో "ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్" తన నివేదికలో ఇతర దేశాలు జాగ్రత్త వహించాలని హెచ్చరించింది. ప్రయివేట్ పెన్షన్ ఫండ్ మేనేజర్ల వలన, వారి స్కీముల వలన నష్టపోయిన ఉద్యోగుల రక్షణకై అమెరికన్ ప్రభుత్వం 'పెన్షన్ బెనిఫిట్ గ్యారెంటీ కార్పొరేషన్'ను నెలకొల్పవలసి వచ్చింది. బ్రిటన్‌లో ప్రయివేట్ పెన్షన్ ఫండ్ మేనేజర్ల వల్ల వచ్చే నష్టాల నుండి ప్రజలను కాపాడడానికి ప్రభుత్వం 'పెన్షన్ ప్రొటెక్షన్ ఫండ్'ను ఏర్పాటు చేయవలసి వచ్చింది.

'ఆర్గనైజేషన్ ఫర్ ఎకనమిక్ కోపరేషన్ అండ్ డెవలప్‌మెంట్'కు సంబంధించిన పెన్షన్ నిష్ణాతులు పెన్షన్ రంగంపై ఇచ్చిన రిపోర్ట్ యునైటెడ్ కింగ్‌డమ్‌లో పెన్షన్ సంస్కరణల పేరుతో జరిగిన సంస్కరణలు పెన్షనర్లను దారిద్ర్యంలోకి నెట్టాయని, ఎక్కువమంది ప్రజలు పెన్షన్ పెట్టుబడుల విషయంలో బాధితులయ్యారని, అనేకమంది బ్రోకర్ల బారినపడి నష్టపోయారని, తిరిగి పెన్షన్ అంశం ప్రభుత్వం తన ఎజెండాలో చేర్చుకునే పరిస్థితి ఏర్పడిందని పేర్కొంది. అనేక దేశాల పెన్షన్ నిధుల ప్రయివేటీకరణ విఫలమైన ప్రక్రియగా నిరూపించబడింది. స్టాక్ మార్కెట్ ఒడిదుడుకులపై రిటైరైన ఉద్యోగి పెన్షన్ ముడిపడి ఉండటం ఆమోదయోగ్యం కాదు.

కేంద్ర ప్రభుత్వం మార్చి 2023లో ఫైనాన్స్ సెక్రటరీ ఆధ్వర్యంలో ఓల్డ్ పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించడం కాకుండా నేషనల్ పెన్షన్ స్కీమ్‌లో మెరుగుదలకు సూచనలు చేయవలసినదిగా ఒక ప్యానెల్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిటీ మే నెలలోనే ప్రభుత్వానికి తన నివేదికను అందించిందని, అయితే ఏపీ లాంటి రాష్ట్రంలో గత ప్రభుత్వం పెన్షన్‌పై చేసిన సూచనల్లో ఆందోళనకరమైన అంశాలు ఉన్నట్టు తెలిసింది. అయితే ప్రభుత్వ వ్యవస్థలో కీలకమైన ఉద్యోగులు, వారి భద్రతను దృష్టిలో ఉంచుకుని, వారు కోరుతున్నట్టుగా ఓల్డ్ పెన్షన్ పథకాన్ని అమలు చేయాల్సిన అవసరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఎంతైనా ఉన్నది.

పన్ను ఎగవేతదారులపై కఠిన చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

సీఎం ఆయా శాఖలకు సంబంధించిన ఆదాయ, వ్యయాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం వచ్చే శాఖల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని ఈ సందర్భంగా ఆయన వారికి సూచించారు. ఎంచుకున్న వార్షిక లక్ష్యంతో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జూన్ వరకు వచ్చిన ఆదాయం అంత ఆశాజనకంగా లేదని సీఎం అభిప్రాయపడ్డారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్లో పొందుపరిచిన లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఏ నెలకానెలా టార్గెట్ నిర్దేశించుకుని రాబడి సాధించేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇకపై ప్రతి నెలా మొదటి వారంలో నిర్ణీత ఆదాయ లక్ష్యాలపై తానే సమీక్ష నిర్వహిస్తానని వారిని అప్రమత్తం చేశారు. నెలవారీ సమీక్షతో పాటు ప్రతి శుక్రవారం ఆర్థిక శాఖ మంత్రి సంబంధిత శాఖలతో లక్ష్య సాధన పురోగతిపై సమావేశమవుతారని చెప్పారు. రాష్ట్రానికి ఆదాయం తెచ్చిపెట్టే జీఎస్టీ ఆదాయం పెంచుకునే చర్యలు చేపట్టాలని సూచించారు. రాబడి పెంచేందుకు వాణిజ్య పన్నుల శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి, పక్కాగా ఆడిటింగ్ చేయాలని సీఎం ఆదేశించారు. పెట్రోలు, డీజిల్ పై వ్యాట్ ద్వారా వచ్చే ఆదాయం ఎందుకు తగ్గిందని ఆయన ప్రశ్నించారు? ప్రత్యామ్నాయంగా ఏవియేషన్ ఇంధనంపై ఉన్న పన్నును సవరించే అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఎన్నికలప్పుడు మద్యం అమ్మకాలు, విక్రయాలు ఎక్కువగా జరిగినప్పటికీ అంతమేరకు ఆదాయం పెరగకపోవటానికి కారణాలను ఆరా తీశారు. మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని సమావేశంలో నిర్ణయించారు. నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను అరికడితే ఆదాయం పెరిగే అవకాశముందని అధికారులు ఈ సందర్భంగా సీఎంకు వివరించారు. డిస్టిలరీస్ నుంచి మద్యం అడ్డదారి పట్టకుండా అవసరమైన అధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని ఆదేశించారు. రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అనుకూలమైన వాతావరణం ఏర్పడిందని రేవంత్ అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో భూములు, స్థిరాస్తుల రేట్లు భారీగా పెరిగాయనీ, అదే స్థాయిలో రిజిస్ట్రేషన్లు, స్టాంపుల ద్వారా వచ్చే ఆదాయం పెరిగేందుకు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. ఇసుక, ఖనిజ వనరుల ద్వారా వచ్చే ఆదాయం పెరగాలంటే అక్రమ రవాణాను, లీకేజీలను అరికట్టాలని సీఎం సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించేందుకు వీలుగా పరిమిత కాలం పన్ను సబ్సిడీ అమలైందనీ, తిరిగి పన్ను వసూలు చేయటం ద్వారా వాహనాల అమ్మకాలపై ఏ మేరకు ప్రభావం పడిందో అధ్యయనం చేయాలంటూ సీఎం అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.



'రైతుబంధు' పై ప్రభుత్వం సంచలన నిర్ణయం

వ్యవసాయేతర భూములకు చెల్లించిన సొమ్ము రికవరికి ఆదేశాలు

'రైతుబంధు' నిధుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. వ్యవసాయేతర భూములకిచ్చిన రైతుబంధు సొమ్మును వెనక్కి తీసుకోనున్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే అన్ని జిల్లాల కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయేతర భూములకు గతంలో చెల్లించిన సొమ్మును రికవరీ చేయనున్నారు. ఈ క్రమంలో మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం పోచారం రైతు యాదగిరిరెడ్డికి అధికారులు నోటీసులిచ్చారు. రైతుబంధుగా తీసుకున్న రూ.16 లక్షలు తిరిగి చెల్లించాలని నోటీసుల్లో పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా క్షేత్ర స్థాయిలో సర్వే చేసి వ్యవసాయేతర భూములను గుర్తించి, వాటికి చెల్లించిన రైతుబంధు సొమ్ము రికవరికి చర్యలు తీసుకోనున్నట్టు సమాచారం.

16న ఎస్వీకేలో సుద్దాల హనుమంతు ప్రజాపాట సభ

- సుద్దాల హనుమంతు సాహిత్యం-జీవితం సమగ్ర పుస్తకావిష్కరణ
- సాంస్కృతిక ఉత్సవాల నిర్వహణ
- ముఖ్య అతిథులుగా సురవరం సుధాకర్‌రెడ్డి, బీవీ రాఘవులు, తదితరులు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సుద్దాల హనుమంతు ప్రజాపాట సభను హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో గల సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 16న నిర్వహించనున్నట్టు నవతెలంగాణ బుక్‌హౌజ్ ఎడిటర్ కె.ఆనందాచారి, టీపీఎస్‌కే నాయకులు భూపతి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆ సభకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఎస్వీకేలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఆ సభలో 'ప్రజాపాటకు పరిపరి దండాలు' పేరుతో నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ ముద్రించిన ప్రజాకవి సుద్దాల హనుమంతు సాహిత్యం-జీవితం, సమగ్ర రచన పుస్తకావిష్కరణ ఉంటుందనీ, సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు.

ఆ సభకు ముఖ్య అతిథులుగా సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ప్రముఖ సినీనటులు ఉత్తేజ్, విమలక్క, ప్రముఖ కవి కోయి కోటేశ్వరరావు, సినీ పాటల రచయిత, కవి సుద్దాల అశోక్‌తేజ, ఎస్వీకే కార్యదర్శి ఎస్.వినయకుమార్ హాజరవుతారని తెలిపారు. అరసం, తెలంగాణ సాహితి, ప్రజానాట్యమండలి, తెలంగాణ ప్రజానాట్యమండలి, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం ఆధ్వర్యంలో కళారూపాలను ప్రదర్శిస్తారని చెప్పారు. ఆ సభను జయప్రదం చేయాలని కోరారు. పోస్టరావిష్కరణలో ఎస్వీకే కార్యదర్శి ఎస్.వినయకుమార్, తెలంగాణ బాలోత్సవం కమిటీ ప్రధాన కార్యదర్శి ఎన్.సోమయ్య, నవతెలంగాణ బుక్‌హౌజ్ జనరల్ మేనేజన్ ఆర్.వాసు, మేనేజర్ కృష్ణారెడ్డి, సలీమా, బుచ్చిరెడ్డి, మమత, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి అసెంబ్లీ !

(మొదటిపేజీ తరువాయి)

తీసుకోనున్నారు. కొత్త ఆర్వోఆర్ చట్టం, నూతన తెలంగాణ చిహ్నం, తెలంగాణ తల్లి విగ్రహం తదితరాంశాలు కూడా సభ ముందుకు రానున్నాయి. వీటితోపాటు పలు కీలక బిల్లులకు ప్రభుత్వం ఆమోదముద్ర వేయనుంది.

రాష్ట్రంలో పార్టీ ఫిరాయింపులు ఊపందుకోవటం, ఆరు గ్యారెంటీలను అమలు చేయాలంటూ ప్రతిపక్షాలు రేవంత్ సర్కార్‌పై ఒత్తిడి తేవటం, నిరుద్యోగుల ఆందోళనలు ముందుకు రావటం, శాంతి భద్రతల పరిస్థితి కొంత ఇబ్బందికరంగా మారటం తదితరాంశాలు అధికార పార్టీని సంకట స్థితిలో పడేసే అవకాశం లేకపోలేదు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రారంభం కానున్న శాసనసభ, మండలి సమావేశాలు హాట్‌హాట్‌గా కొనసాగనున్నాయి.

మరోవైపు రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నిర్వహణపై శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గురువారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. సీఎస్ శాంతి కుమారి, డీజీపీ జితేందర్‌తోపాటు ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. సమావేశాల నిర్వహణకు వీలుగా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని వారు ఈ సందర్భంగా ఆదేశించారు. అసెంబ్లీ, మండలి లెజిస్లేచర్ సెక్రటేరియట్ లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అందుకోసం సంబంధిత అధికారులకు వెంటనే ఆదేశాలివ్వాలని కోరారు. జిల్లాల్లో ప్రొటోకాల్ వివాదాలు తలెత్తకుండా చూడాలనీ, ఎమ్మెల్యే లు, ఎమ్మెల్సీలు గ్రామీణ, సుదూర ప్రాంతాల కు వెళ్లినప్పుడు తగిన భద్రత, బందోబస్తు కల్పించాలంటూ పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. వారు ఇతర రాష్ట్రాలు, దేశాలకు వెళ్లేటప్పుడు కూడా విమానాశ్రయాల్లో ప్రొటోకాల్ పాటించాలని సూచించారు.

సమావేశంలో శాసన మండలి డిప్యూటీ చైర్మెన్ బండ ప్రకాశ్, శాసనసభ కార్యదర్శి డాక్టర్ నర్సింహాచార్యులు, విప్ రామచంద్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



బదిలీల్లో పారదర్శకత పాటించాలి

తెలంగాణ ఆల్ నర్సెస్ ఫెడరేషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అన్ని రకాల నర్సింగ్ క్యాడర్ల బదిలీల్లో పారదర్శకత, సీనియార్టీ లిస్టుల్లో అవకతవకలకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఆల్ నర్సెస్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఫెడరేషన్ సలహాదారు భూపాల్, అధ్యక్షురాలు వి.భూలక్ష్మి, ప్రధాన కార్యదర్శి టి.సువర్ణలత, కోశాధికారి బి.స్వరూప వైద్యారోగ్యశాఖ కార్యదర్శికి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 80 మార్గదర్శకాల ప్రకారం ఒకే స్టేషన్ లో నాలుగేండ్లు సర్వీసు దాటిన ఉద్యోగుల జాబితా రూపొందించి జాబితా విడుదల చేస్తున్నారని తెలిపారు. దీంతో కొంత మందికి అన్యాయం జరుగుతుందనే ఆందోళన వ్యక్తమవుతున్నదని చెప్పారు. మొదటిసారి నియామకం జరిగినప్పటి నుంచి సర్వీస్ మొత్తంలో ఒక సంవత్సరం కూడా గ్రామీణ ప్రాంతాల్లో విధులు నిర్వర్తించని వారిని అక్కడికి పంపించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో పోస్టింగ్ ఉండి, డిప్యూటేషన్ మీద ఏండ్ల తరబడి నగరంలో పని చేసే వారి పేర్లను ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఒకే జిల్లాలో రెండు లేదా మూడు సార్లు బదిలీ అయిన వారికి టోటల్ స్టేషన్స్ సీనియార్టీ అని రాస్తున్నారనీ, దీనిపై ఆలోచించాలని కోరారు. 20 నుంచి 30 ఏండ్లుగా పదోన్నతులు లేకుండా పని చేస్తున్నవారున్నారని తెలిపారు.

రైతు 'భరోసా'కు కార్యాచరణ

- అభిప్రాయాల క్రోడీకరణ
- ప్రభుత్వమే నేరుగా రైతులతో మాట్లాడే ప్రయత్నం : ఉట్నూర్ సదస్సులో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

నవతెలంగాణ-ఉట్నూర్

రైతుభరోసా పథకాన్ని రైతుకు భరోసానిచ్చేలా రూపొందించాలనే బృహత్తర సంకల్పంతో విధి విధానాల కోసం ప్రభుత్వమే నేరుగా రైతులతో మాట్లాడే ప్రయత్నం చేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రైతు భరోసాకు ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా గురువారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని కేబీ కాంప్లెక్స్‌లో సదస్సు నిర్వహించారు. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషాతో పాటు నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల కలెక్టర్లు అభిలాష అభినవ్, వెంకటేష్ ధోత్రే, కుమార్ దీపక్, ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్తా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. సదస్సులో రైతులు, రైతు సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. తొలుత రైతులు, రైతు సంఘాల నేతలు తమ సలహాలను సబ్ కమిటీకి అందించారు. రైతు ఆత్మహత్యల్లో 90 శాతం కౌలుదారులేనని, వారిని ఆదుకునేలా 2011లో అప్పటి సీఎం వైఎస్ఆర్ అమలు చేసిన కౌలు రైతు చట్టాన్ని అమలు చేయాలని కోరారు. భూ పట్టాదారులకు అందించే ప్రతి పథకాన్నీ కౌలు రైతులకు వర్తింపజేయాలన్నారు. సాగులో లేని లే అవుట్లు, గుట్టలు, బీడు భూములకు పెట్టుబడి సాయాన్ని నిలిపివేసి ప్రజాధనాన్ని పరిరక్షించాలన్నారు. సాగు నీటి వసతి లేదని, వర్షాధారంగా వ్యవసాయం చేస్తామని పెట్టుబడి ఖర్చులు పోనూ ఏమీ మిగలడం లేదని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతు భరోసా సాయాన్ని పట్టాదారుకు, కౌలు రైతుకు చెరి సగం అందించాలని మరికొందరన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆదిలాబాద్, పెద్దపల్లి ఎంపీలు గొడం నగేష్, వంశీకృష్ణ, డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి, ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, పాయల్ శంకర్, అనిల్ జాదవ్, కోవ లక్ష్మి, ప్రేమసాగర్‌రావ్, గడ్డం వివేక్, హరీష్ బాబు, రామారావ్ పటేల్ తదితరులు సైతం ఈ పథకంపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.



ఓపెన్ మైండ్‌తో వచ్చాం

రైతుల అభిప్రాయాల వెల్లడి అనంతరం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రైతుభరోసా పథకంపై ప్రభుత్వానికి ఎలాంటి నిర్దిష్టమైన ఆలోచనా లేదని, ఓపెన్ మైండ్‌తోనే వచ్చామని తెలిపారు. గత ప్రభుత్వంలో రైతుబంధు పథకం అబాసుపాలైనందున విధి విధానాలు పకడ్బందీగా రూపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. గిరిజన, గిరిజనేతరుల రైతుల సమస్యలను తాను ప్రత్యక్షంగా చూసానన్నారు. రైతుల అభిప్రాయాలను క్రోడీకరించిన తర్వాత అసెంబ్లీలోనూ చర్చిస్తామన్నారు. రాష్ట్ర బడ్జెట్ కంటే ముందే మార్గదర్శకాలను సిద్ధం చేసి రైతు భరోసా పథకానికి బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తామన్నారు. ప్రతి అంశాన్నీ పరిశీలించి రైతుకు న్యాయం జరిగేలా ప్రభుత్వం ముందడుగు వేస్తుందని చెప్పారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావ్ మాట్లాడుతూ.. గతంలో రైతుబంధు పథకం ద్వారా నిధుల దుర్వినియోగం జరిగిన కారణంగా అలాంటి తప్పులు మళ్లీ ఉండకూడదన్న ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేరుగా రైతుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేశారన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద గతంలో నిలిచిపోయిన ప్రాజెక్టును తిరిగి ప్రారంభించి దక్షిణ ఆదిలాబాద్ జిల్లాకు శాశ్వత సాగునీటికి అందించేలా ప్రభుత్వం గట్టి ఆలోచన చేస్తోందన్నారు. ప్రతి అంశాన్నీ కూలంకుషంగా చర్చించి మేలు జరిగేలా నిర్ణయాలు తీసుకుంటామని వెల్లడించారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపాలి

- తెలంగాణలో బొగ్గు గనులు సింగరేణికి ఇవ్వాలి : ఏఐఏడబ్ల్యూయూ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో



వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపాలని ఏఐఏడబ్ల్యూయూ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ డిమాండ్ చేశారు. తెలంగాణలో బొగ్గు గనులు సింగరేణికి ఇవ్వాలని కోరారు. గురువారం నాడిక్కడ బి.వెంకట్ మీడియాతో మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విభజన చట్టంలోని అంశాలకు ప్రాధాన్యత కల్పించి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ జరగకుండా చూడాల్సిన బాధ్యత చంద్రబాబుదేనని, విశాఖ ఉక్కు తెలుగు ప్రజల హక్కు అని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కి గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మీడియాపై దాడులతో సమస్యలు పరిష్కారం కావని హితవు పలికారు. ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని, తెలంగాణలో వెంటనే పింఛన్లు పెంచాలని, ఇతర హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్ ఉత్పత్తి వర్గాలకు, సామాజిక తరగతులకు, ప్రజానుకులంగా, వెనుకబడిన ప్రాంతాలకు న్యాయం జరిగేలా ఉండాలని కోరారు. బీజేపీ మిత్రపక్షాలైన టీడీపీ, జేడీయూలపై మరింత బాధ్యత ఉందని తెలిపారు. బడ్జెట్ కేటాయింపుల గురించి బీజేపీపై మిత్రపక్షాలు ఒత్తిడి చేయాలని కోరారు. నూతన క్రిమినల్ చట్టాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టానికి కేంద్రం రెండున్నర లక్షల కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలని, పట్టణ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకురావాలని కోరారు. ఉపాధి హామీ కింద రోజుకు రూ.600 ఇవ్వాలని అన్నారు. జూలై 13 నుంచి 15 వరకు తమిళనాడులోని తిరుచునపల్లిలో ఏఐఏడబ్ల్యూయూ అఖిల భారత కౌన్సిల్ సమావేశాలు జరుగనున్నాయని, దేశవ్యాప్త ఆందోళనకు ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు.

ఉచిత చేప పిల్లల పథకాన్ని కొనసాగించాలి

టీఎంకేఎంకేఎస్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఉచిత చేపపిల్లల పథకాన్ని కొనసాగించాలనీ, మత్స్య సొసైటీల ఖాతాల్లో నగదు వేంటనే జమచేయాలని తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం (టీఎంకేఎంకేఎస్) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహ అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ మాట్లాడుతూ మత్స్య వృత్తిపై ఆధారపడి సుమారు పది లక్షల కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయని తెలిపారు. 5,500 ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల్లో 4. 90 లక్షల మంది మత్స్య సహకార సంఘాల సభ్యులుగా ఉన్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పదేండ్ల కాలంలో మత్స్యకారుల జీవితాల్లో ఎలాంటి మార్పులు రాలేదని తెలిపారు. మత్స్య పరిశ్రమ అభివృద్ధి మత్స్యకారుల సంక్షేమం పట్ల ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా నిర్దిష్టమైన ప్రణాళిక, ప్రతిపాదనలు లేవని తెలిపారు. భూముల రేట్లు పెరిగిపోవడం వల్ల భూ దందాలు, రియల్ ఎస్టేట్ మాఫియా చెరువులు, కుంటలు, జల వనరులు, నదీ పరివాహక ప్రాంతాలను కబ్జాలు చేస్తోందని విమర్శించారు. మరోవైపు పారిశ్రామిక అభివృద్ధి పేరుతో పట్టణాల నుండి వస్తున్న రసాయనిక డ్రైనేజీ నీరు చెరువులు, కుంటల్లో కలువడం వల్ల మత్స్య సంపద అంతరించిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కబ్జాలు, కాలుష్యం నుండి మత్స్య వృత్తిని కాపాడాలని డిమాండ్ చేశారు. వృత్తిదారుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. అన్ని జిల్లా మత్స్య సహకార సంఘాల సమాఖ్యలకు ఎన్నికలు జరపాలనీ, రాష్ట్ర మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల సమాఖ్య ఎన్నికలను ప్రజాస్వామ్యబద్ధంగా జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షురాలు కొప్పు పద్మ, ముఠా విజయ్, చనమోని శంకర్, సహాయ కార్యదర్శులు గొడుగు వెంకట్, బోడంకి చందు తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య పార్కును సందర్శించిన జీహెచ్‌ఎంసీ కమిషనర్

- సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశం
- బాగ్‌లింగంపల్లిలో వాకర్స్, స్థానికులతో మాటామంతీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్క్‌లో సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట ఆదేశించారు. గురువారం ఉదయం జోనల్ కమిషనర్ రవి కిరణ్‌తో కలిసి కమిషనర్ సుందరయ్య పార్క్, మదర్ డైరీ పార్క్, వీఎస్‌టీ నుంచి బాగ్ లింగంపల్లి వరకు ఫేస్ -2 ఫ్లైఓవర్ ప్రతిపాదిత నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సమస్యలపై స్థానికులను, వాకర్స్‌ను ఆమె అడిగి తెలుసుకున్నారు. సుందరయ్య పార్క్‌లో వర్షపు నీరు నిలవడం మూలంగా ఇబ్బందులు వస్తున్నాయని, టాయిలెట్ మరమ్మతులు చేపట్టాలని కమిషనర్‌ను వాకర్స్ కోరగా.. వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎస్.ఎన్.డీ.పీ నాలా పనులు కూడా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మదర్ డైరీ పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. వీఎస్‌టీ నుంచి బాగ్‌లింగంపల్లి వరకు రెండు దశల్లో ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలని గతంలో నిర్ణయించిన విషయాన్ని కమిషనర్ దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. మొదటి దశలో ఇందిరాపార్కు నుంచి వీఎస్‌టీ వరకు చేపట్టిన స్టీల్ బ్రిడ్జి అందుబాటులోకి వచ్చిందని వివరించారు.

తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు ఎప్పుడు..?

(మొదటిపేజీ తరువాయి)

నిధులు పెరిగాయి. 2024-25 ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో విద్యకు రూ.21,389 (7.75 శాతం) కోట్లు కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించింది. 2023-24 బడ్జెట్‌లో విద్యకు రూ.190,51.25 (6.56 శాతం) కోట్లు బీఆర్ఎస్ కేటాయించింది. అంటే గతేడాది కంటే ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో విద్యకు 1.19 శాతం నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం అధికంగా కేటాయించింది. కానీ విద్యారంగానికి బడ్జెట్‌లో 15 శాతం నిధులను కేటాయిస్తామంటూ ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అందుకనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు లేకపోవడం పట్ల విమర్శలు వచ్చాయి. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ కాబట్టి తక్కువ నిధులను కేటాయించినట్టుగా అధికారులు చెప్పారు. మరి పూర్తిస్థాయి బడ్జెట్‌లోనైనా విద్యారంగానికి తగిన ప్రాధాన్యత దక్కుతుందా?. కొఠారి కమిషన్ సిఫారసుల ప్రకారం విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులను కేటాయించాలి. ఆ స్థాయిలో ఏనాడూ బడ్జెట్ కేటాయింపుల్లేకపోవడం గమనార్హం. రాష్ట్రంలోని అన్ని వర్సిటీల్లో ఉన్నత విద్యను ప్రోత్సహించడానికి మౌలిక సదుపాయాల కల్పనకు రూ.500 కోట్లు ప్రతిపాదించింది. పూర్తిస్థాయి బడ్జెట్‌లో వర్సిటీల అభివృద్ధికి ఎన్ని కోట్లు కేటాయిస్తుందో చూడాలి.

పాఠశాల విద్యకు రూ.20 వేల కోట్లు కావాలి : ప్రభుత్వానికి ప్రతిపాదన

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి రూ.20 వేల కోట్లు కేటాయించాలని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్టు తెలిసింది. ఇందులో రూ.16 వేల కోట్లు ఉపాధ్యాయులు, విద్యాశాఖలో పనిచేసే ఉద్యోగుల జీతభత్యాలకే ఖర్చు చేయాలి. మిగిలిన రూ.నాలుగు వేల కోట్లలో సమగ్ర శిక్ష, మధ్యాహ్న భోజనం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పనులు, తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటు వంటి వాటికి కేటాయించాలి. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో పాఠశాల విద్యకు రూ.17,931.42 కోట్లు ప్రతిపాదించింది. పూర్తిస్థాయి బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని వేల కోట్ల నిధులను కేటాయిస్తుందో వేచిచూడాల్సిందే.

16 నుంచి గ్రూప్-4 అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రూప్-4 పోస్టులకు ఎంపికైన శారీరక వైకల్యం ఉన్న అభ్యర్థులకు ఈనెల 16 నుంచి 26 వరకు ధ్రువపత్రాల పరిశీలన హైదరాబాద్‌లోని అఫ్జల్‌గంజ్‌లో ఉన్న ఉస్మానియా ఆస్పత్రిలో జరగనుంది. ఈ మేరకు టీజీపీఎస్సీ కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉస్మానియా ఆస్పత్రి పాత భవనంలోని 507 రూమ్‌కు ప్రతిరోజూ ఉదయం తొమ్మిది గంటలకు అభ్యర్థులు రావాలని కోరారు. వైద్య ఖర్చులతోపాటు ఒరిజినల్ వికలాంగ పత్రంపై అటెస్టెడ్ సంతకంతో హాజరు కావాలని సూచించారు. మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను తెచ్చుకోవాలని తెలిపారు. రోజువారీ షెడ్యూల్‌ను టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని వివరించారు.

పదోన్నతుల సమస్యలను పరిష్కరించాలి

- టీయుఎంహెచ్ఇయూ




నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదోన్నతుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టీయుఎంహెచ్ఇయూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం యూనియన్ గౌరవాధ్యక్షులు భూపాల్ నేతత్వంలో నాయకులు హైదరాబాద్ కోఠిలోని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. బదిలీల్లో పారదర్శకత పాటించాలని కోరారు. షాద్‌నగర్ ఆస్పత్రిలోని ఉద్యోగులు, నర్సింగ్ ఆఫీసర్ల పట్ల వేధింపులకు పాల్పడుతున్న డాక్టర్ పై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జనగామలో తొలగించిన ఏఎన్ఎంను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

పేద విద్యార్థులకు అండగా నిలుద్దాం

- మైహోమ్స్ సంస్థ ఎండీ యువరాజ్ సహాయం




హైదరాబాద్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేదవిద్యార్థులకు మైహోమ్స్ సంస్థ అండగా నిలిచింది. నాంపల్లి మండలంలోని రిసాలా అబ్దుల్లా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న వంద మంది విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, స్టేషనరీ వస్తువులను మైహోమ్స్ సంస్థ ఎండీ యువరాజ్ అందజేశారు. ఈ పాఠశాలలో ఉన్న విద్యార్థుల్లో.. సగానికి పైగా అనాథ విద్యార్థులే ఉన్నారని అధ్యాపకులు తెలిపారు. చదువుకుని రాణించేలా.. పేద విద్యార్థులకు అవసరమైన సహాయాన్ని నిరంతరం అందిస్తామని యువరాజ్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం నాహీద్ ఫాతిమా, తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్ష పీఠమెక్కేదెవరు?

రేసులో ముందు వరుసలో ఈటల

- తమకివ్వాలంటూ పట్టుబడుతున్న రఘునందన్‌రావు, రామచందర్‌రావు
- తమనూ పరిగణనలోకి తీసుకోవాలంటున్న మరికొందరు నేతలు
- పదవి కోసం ఎవరి ప్రయత్నాల్లో వారు
- త్వరలో పలు రాష్ట్రాలకు నూతన అధ్యక్షులను నియమించే అవకాశం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రి అయ్యారు. రాష్ట్ర అధ్యక్షులుగా కూడా కొనసాగుతున్నారు. ఆయన కేంద్రంలో కీలక పాత్ర పోషించే అవకాశమున్న నేపథ్యంలో త్వరలో రాష్ట్ర అధ్యక్షున్ని మారుస్తారనే చర్చ మళ్లీ మొదలైంది. అధ్యక్ష పదవి రేసులో ఎంపీ ఈటల రాజేందర్ ముందు వరుసలో ఉన్నారు. తమకే ఇవ్వాలని మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు, రఘునందన్‌రావు పార్టీ అధిష్టానానికి బలమైన సంకేతాలు పంపుతున్నారు. తననూ పరిగణనలోకి తీసుకోవాలని ఎంపీ డీకే అరుణ కోరుతున్నారు. ఈ నేపథ్యంలో కొత్త అధ్యక్షులెవరు? ఆ పీఠమెక్కేదెవరు? అనే చర్చ హాట్ టాఫిక్‌గా మారింది. నెలాఖరులోగా కొత్త రాష్ట్ర అధ్యక్షున్ని నియమించే అవకాశాలున్నాయి.

తెలంగాణ బీజేపీలో కీలకనేతలు ఉన్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కుమార్ కేంద్ర మంత్రులయిపోయారు. మరో పెద్ద తలకాయ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ బీజేపీ పార్లమెంటరీ బోర్డు మెంబర్‌గా, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. ఈ ముగ్గురు రాష్ట్ర అధ్యక్ష బరిలో లేరనే విషయం స్పష్టమవుతున్నది. ఇక, మిగిలిన నేతల్లో ఎంపీ ఈటల రాజేందర్ ఉన్నారు. తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించడం, బీఆర్ఎస్ పార్టీని వీడే దాకా ఆ పార్టీలో నెంబర్ టూ స్థానంలో ఉండటం, తెలంగాణలో బలమైన ముదిరాజ్ సామాజిక తరగతికి చెందిన వ్యక్తి కావడం, ఆర్థికంగా బలంగా ఉండటం వంటి కారణాలతో ఈటల రాజేందర్ వైపే జాతీయ నాయకత్వం మొగ్గుచూపుతున్నది. టీపీసీసీ అధ్యక్షుడి పదవి బీసీకి ఇస్తారనే ప్రచారం జోరుగా సాగుతుండటంతో బీజేపీ కూడా కేంద్రీకరించింది.

జనంలో ఎక్కువ పలుకుబడి ఉన్న ఈటల వైపు మొగ్గు చూపాలనే యోచనలో జాతీయ నాయకత్వం ఉంది. అయితే, ఆయన వామపక్ష భావజాలం నుంచి వచ్చిన వ్యక్తి కాబట్టి ఆయనకు ఇవ్వొద్దనే చర్చను ఆ పార్టీలోని కొందరు నేతలు లేవనెత్తినట్టు తెలిసింది. అదే సమయంలో ఈటల రాజేందర్ అధ్యక్షుడైతే పార్టీ కమాడింగ్ మొత్తం ఆయన చేతుల్లోకి వెళ్లిపోతుందనే భయంతో ఎప్పటినుంచో పార్టీనే అట్టిపెట్టుకుని ఉన్న సీనియర్లు అడ్డుతగులుతున్నారనే ప్రచారం జరుగుతున్నది. అయినా, అధిష్టానం మాత్రం కొత్త వ్యక్తులు పార్టీలోకి రావాలన్నా, తెలంగాణలో సంస్థాగతంగా బలపడలాన్నా పార్టీ భావజాలంతో పాటు ఈటల లాంటి వ్యక్తి కావాలని భావిస్తున్నది. అయితే, తెలంగాణ ఉద్యమం నుంచే పుట్టుకొచ్చిన నాయకుడిగా, రాజకీయంగా అన్ని అంశాలపై పట్టున్న వ్యక్తిగా రఘునందన్‌రావుకు ఇవ్వాలనే డిమాండ్‌ను కొందరు తెరపైకి తెస్తున్నారు. మాజీ సీఎం కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డిలను కామారెడ్డిలో ఓడించిన హాట్‌టాఫిక్‌గా మారిన కె.వెంకటరమణారెడ్డి పేరు కూడా వినిపిస్తున్నది. మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు కూడా తన వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరు సీనియర్లు కూడా లోలోపల ఆయనకు మద్దతు ఇస్తున్నట్టు తెలిసింది. ఆయన మల్కాజిగిరి ఎంపీ టికెట్ ఆశించినప్పటికీ ఆ సీటును అధిష్టానం ఈటలకు కేటాయించిన విషయం విదితమే. మొదటి నుంచీ పార్టీ విధేయునిగా ఉంటున్న తనకు అధ్యక్ష పదవైనా ఇవ్వాలని అధిష్టానాన్ని ఆయన కోరుతున్నట్టు తెలిసింది. మల్కాజిగిరి సీటు తనకు కేటాయించకపోవడంతో అసంతృప్తికి లోనయిన మురళీధర్‌రావు పేరు కూడా తెరపైకి వస్తున్నది. తన పేరును కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఎంపీ.డీకే అరుణ కూడా ప్రయత్నాల్లో ఉన్నట్టు తెలిసింది. అర్వింద్‌కుమార్ కూడా తన వంతు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే రెడ్డి సామాజిక తరగతి నుంచి కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి, బీజేపీ ఎల్పీ నేతగా మహేశ్వర్‌రెడ్డి ఉండటంతో ఆ సామాజిక తరగతివారిని అధిష్టానం పరిగణనలోకి తీసుకోవట్లేదని తెలిసింది.

తెలంగాణ ఉద్యమ నేపథ్యం, సామాజిక, ఆర్థిక కోణాల్లో ఆలోచించి ఈటలకు పార్టీ అధ్యక్ష పదవిని అధిష్టానం కట్టబెడుతుందా? మొదటి నుంచీ ఆర్ఎస్ఎస్ భావజాలమున్న సీనియర్ నేతల్లో ఒకరిని ఎంచుకుంటుందా? అనేది తేలాలంటే మరికొంత కాలం వేచిచూడాల్సిందే. అయితే, త్వరలో పలు రాష్ట్రాలతోపాటు తెలంగాణకూ కొత్త అధ్యక్షున్ని జాతీయ నాయకత్వం నియమించబోతున్నదనే చర్చ అయితే నడుస్తున్నది.

సమాజ నిర్మాణంలో మీడియా పాత్ర ఎనలేనిది

రాష్ట్ర నీటిపారుదల-శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సమాజ నిర్మాణంలో మీడియా పాత్ర ఎనలేనిదని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. గురువారం మాదాపూర్‌లోని హైటెక్ నోవాటెల్‌లో జరిగిన హైబిజ్ టీవీ మీడియా అవార్డుల ప్రధానం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భారత స్వాతంత్రోద్యమం నుంచి నేటి వరకు మీడియా తన వంతు పాత్రను సమర్థవంతంగా పోషించిందని కొనియాడారు. ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య వారధిగా పని చేస్తూ దేశాభివృద్ధిలో కీలకంగా వ్యవహరిస్తున్నదని చెప్పారు. దేశంలో, రాష్ట్రంలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతోందంటే అదంతా మీడియా ఘనతేనని గుర్తు చేశారు. వృత్తిలో నిత్యం ఎన్నో ఒత్తిళ్లకు లోనయ్యే జర్నలిస్టులకు పురస్కారాలు అందించడం వల్ల వారు మరింతగా రాణిస్తారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం జర్నలిస్టులకు అన్ని రకాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అవార్డు గ్రహీతలకు ఈ సందర్భంగా మంత్రి మెమెంటోను అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ చైర్మెన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, హైబిజ్ టీవీ అవార్డుల నిర్వాహకులు రాజ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న నవతెలంగాణ ఫొటోగ్రాఫర్ కె.ఎన్.హరి



నవతెలంగాణ క్రీడాప్రతినిధి ఎం.శ్రీనివాస్ దాస్

నవతెలంగాణకు రెండు అవార్డులు

నవతెలంగాణకు చెందిన ఇద్దరు జర్నలిస్టులకు రెండు విభాగాల్లో హైబిజ్ టీవీ మీడియా అవార్డులు దక్కాయి. సీనియర్ ఫొటో గ్రాఫర్ కె.నరహరి, స్పోర్ట్స్ రిపోర్టర్ శ్రీనివాస్ ఉత్తమ జర్నలిస్ట్ కేటగిరిలో అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా నవతెలంగాణ యాజమాన్యం వారికి అభినందనలు తెలిపింది.

విద్యాసంస్థల్లో కనీస వసతులు కల్పించాలి



- గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డికి టీజీఎస్ వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గిరిజన విద్యాసంస్థల్లో కనీస వసతులు కల్పించాలని తెలంగాణ గిరిజన సంఘం(టీజీఎస్) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం ధర్మానాయక్, ఆర్ శ్రీరాంనాయక్ తదితరులు గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. గిరిజన గురుకుల, ఆశ్రమ పాఠశాలలు, కాలేజీలు, హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గురుకులాల్లో ప్రవేశపరీక్ష రాసినా, సీట్లు రాని వారికి, పరీక్ష రాయకుండా దరఖాస్తు చేసుకున్న వారందరికీ సీట్లు కేటాయించాలని కోరారు. 2020 నుండి ఆర్థిక శాఖలో పెండింగ్‌లో ఉన్న బెస్ట్ అవైలబుల్ స్కీం సీట్ల పెంపును ప్రస్తుత విద్యా సంత్సరంలో అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.పాఠశాలలు ప్రారంభమై నెలరోజులు గడుస్తున్నా గిరిజన గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లు, కాలేజీ హాస్టళ్లలో కనీస సదుపాయాలు కల్పించలేదని తెలిపారు.దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారని వివరించారు.సంఘం ఆధ్వర్యంలో 10 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు చేశామని గుర్తు చేశారు. ఆ సందర్భంగా అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు.

అనేక హాస్టళ్లలో మెనూను సక్రమంగా అమలు చేయటం లేదని తెలిపారు.నాసిరకం భోజనాలు పెడుతున్నారని వివరించారు. కొన్ని చోట్ల నీళ్లచారు, ఉడికీ ఉడకని అన్నం పెడుతున్నారనీ, మరికొన్ని చోట్ల అన్నంలో పురుగులు వస్తున్నాయనే విషయాన్ని డైరెక్టర్ దృష్టికి తీసుకుపోయారు.

జీసీసీ నుంచి సరఫరా చేస్తున్న సరుకులు ముక్కిపోయి, పురుగులుపట్టి వస్తున్నాయని తెలిపారు. దీంతో విద్యార్థులు అనారోగ్యాల పాలవుతున్నారని వివరించారు. తగినంత సంఖ్యలో ఉపాధ్యాయులు లేరని తెలిపారు. మంచినీటితో పాటు ఇతర మౌలిక సౌకర్యాలు లేవని తెలిపారు.

రూ.500 కోట్లతో మైక్రోలింక్ నెట్ వర్క్స్ పరిశ్రమలు

- ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అమెరికా టెలికమ్యూనికేషన్స్ దిగ్గజం మైక్రోలింక్ నెట్ వర్క్స్ సంస్థ తెలంగాణలో రూ.500 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. భారతీయ భాగస్వామి పీఎస్ఆర్ ఇండస్ట్రీస్ చైర్మెన్ శ్రీరంగారావుతో కలిసి సంస్థ ప్రతినిధులు గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే మూడేండ్లలో మైక్రోలింక్ సంస్థ ఎలక్ట్రానిక్, ఐటీ, నిర్మాణరంగ పరికరాలను ఉత్పత్తి చేస్తుందని వివరించారు. ఫలితంగా 700 మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. ఇటీవల అమెరికా పర్యటనలో సంస్థ యాజమాన్యంతో జరిపిన చర్చల నేపథ్యంలో మైక్రోలింక్ నెట్ వర్క్స్ తెలంగాణలో పెట్టుబడులకు అంగీకరించిందని తెలిపారు. డేటా ట్రాన్స్‌మిషన్, నెట్ వర్కింగ్ కేబుల్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, మల్టీ లెవెల్ పార్కింగ్ మిషన్ల ఉత్పత్తిలో గ్లోబల్ లీడర్‌గా ఉందని తెలిపారు. సమావేశంలో పీఎస్ఆర్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ నమ్రుత, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ధర్మరాజు చక్రవరం, మైక్రోటెక్ గ్లోబల్ ప్రతినిధులు డా. డెనిస్ మొటావా, సియాన్ ఫిలిప్స్, జో జోగ్ని తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు వెంటనే విడుదల చేయాలి

- తక్షణమే ముఖ్యమంత్రి స్పందించాలి : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు
- హైదరాబాద్ కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా
- పలు జిల్లాల్లోనూ ధర్నాలు
- అధికారులకు వినతులు



నవతెలంగాణ-సిటీబ్యూరో/విలేకరులు

ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెంటనే పెండింగ్ ఉపకార వేతనాలు విడుదల చేయాలని కోరుతూ గురువారం రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లా కలెక్టరేట్ల ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నాలు చేశారు. 'హలో విద్యార్థి.. చలో కలెక్టరేట్' పేరిట హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో నాగరాజు ప్రసంగించారు. ఆరేండ్ల నుంచి విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజులను ప్రభుత్వం చెల్లించడం లేదని తెలిపారు. రాష్ట్రంలో సంవత్సరానికి 14 లక్షల మంది విద్యార్థులు స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకుంటున్నారని, వీరికి ఏటా రూ.3 వేల కోట్లు అవసరం అవుతాయని అన్నారు.

2019 నుంచి ఇప్పటి వరకు బకాయిలు పేరుకుపోయాయని తెలిపారు. 2019-2020లో రూ.800కోట్లు, 2020-2021కు సంబంధించి రూ.2356 కోట్లు, 2021-2022 విద్యా సంవత్సరానికి సంబంధించి రూ.2100.43 కోట్లు, 2022-2023లో 2958.14 కోట్లు.. ఇలా మొత్తం రూ.8,214.57 కోట్లు ఫీజుల బకాయిలు ఉన్నాయని వివరించారు. వీటిపై విద్యార్థులు ఆందోళనలు చేసినప్పుడు ప్రభుత్వం టోకెన్లు జారీ చేయడం తప్ప.. ట్రెజరీల నుంచి ఒక్క రూపాయి విడుదల చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజులు రాలేదనే పేరుతో ప్రయివేట్ యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికేట్స్ ఇవ్వడం లేదని, దాంతో ఉన్నత చదువులకు వెళ్లాలనుకునే వారికి సర్టిఫికేట్స్ కోసం తల్లిదండ్రులు అప్పులు చేయాల్సి వస్తోందని అన్నారు. తక్షణమే పెండింగ్ ఉపకార వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే ముఖ్యమంత్రి స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ములుగు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో ఏవో రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ఎల్.రవి మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని ఎస్సీ ఎస్ఎంఎచ్ హాస్టల్ లేక పేద మధ్యతరగతి విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని, ఎన్నోసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని అన్నారు. అలాగే, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరారు.

ఆదిలాబాద్ కలెక్టరేట్‌ను ముట్టడించారు. అనంతరం అదనపు కలెక్టర్ దాసరి వేణుకు వినతిపత్రం అందజేశారు. నల్లగొండ కలెక్టరేట్ ఎదుట పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. వేలాదిగా విద్యార్థులు తరలివచ్చి కలెక్టరేట్ గేటు ఎదుట బైటాయించారు. ఫీజు బకాయిలపై నినదించారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి రాజ్యలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. సూర్యాపేట స్థానిక కోర్టు చౌరస్తాలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.

రాష్ట్రంలో నిలిచిన రిజిస్ట్రేషన్లు

(మొదటిపేజీ తరువాయి)

మాత్రమే జరిగినట్టు ఆ శాఖ వర్గాలు తెలిపాయి. సాంకేతిక సమస్య వల్ల ఆగిపోయిన రిజిస్ట్రేషన్లను శుక్రవారానికి రీ షెడ్యూల్ చేసినట్టు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ బుద్ధ ప్రకాష్ తెలిపారు. సమస్యను గురువారం అర్ధరాత్రిలోపు పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు, శుక్రవారం నుంచి యదావిధిగా అన్ని రకాల రిజిస్ట్రేషన్లు జరిగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పేరు మార్పునకు ఇబ్బందేమిటో చెప్పండి : హైకోర్టు

నవతెలంగాణ-హైదరాబాద్

విద్యార్థులు తమ పేర్లను మార్పు చేసుకుంటూ గెజిట్ ప్రచురించాక సర్టిఫికెట్లలో పేర్లు మార్పు చేయడానికి ఉన్న ఇబ్బందులేంటో చెప్పాలని టెన్త్, ఇంటర్ బోర్డులను హైకోర్టు ప్రశ్నించింది. విద్యార్థుల పేర్లను మార్చి సర్టిఫికెట్లు ఇవ్వడానికి ఉన్న సమస్యలేంటో వివరిస్తూ కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. గెజిట్ జారీ అయ్యాక కూడా తన సర్టిఫికెట్లలో పేరు మార్చడం లేదంటూ హయత్‌నగర్‌కు చెందిన మధుసూదన్‌రెడ్డి వేసిన పిటిషన్‌ను చీఫ్ జస్టిస్ అలోక్ అరాథే ఆధ్వర్యంలోని డివిజన బెంచ్ గురువారం విచారించింది. బోర్డులు, యూనివర్సిటీలు పేరు మార్చకపోడం అన్యాయమని 1961లో జారీ చేసిన జీవో 1263ను కొట్టేయాలనీ, ఆ జీవోలోని సెక్షన్లను రద్దు చేయాలని పిటిషనర్ వాదన. గెజిట్ వచ్చాక సర్టిఫికెట్లలో పేరు మార్పు చేయాల్సిన అవరం లేదని ప్రభుత్వం ఈ సందర్భంగా చెప్పింది. ఆన్‌లైన్‌లో అప్లికేషన్ పెట్టిన విద్యార్థి తన గెజిట్‌లోని పేరు రాసి పాత పేరుతో ఉన్న సర్టిఫికెట్‌ను అప్‌లోడ్ చేస్తే ఆ విద్యార్థి ఉద్యోగం పొందే అర్హత ఉండబోదని హైకోర్టు చెప్పింది. గెజిట్ వచ్చాక పేరును సర్టిఫికెట్‌లో కూడా మార్పు చేసేందుకు ఉన్న సమస్యలేంటో చెప్పాలని కోరుతూ విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

లైంగిక వేధింపుల కేసులో స్టే

ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఒక పీజీ విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడ్డారనే అభియోగాలపై ఇంటర్నల్ కంప్లయింట్స్ కమిటీ ఇచ్చిన రెండు రిపోర్టుల అమలును నిలిపివేస్తూ హైకోరు స్టే ఇచ్చింది. లైంగిక వేధింపుల కేసు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆరుగురు ఆ రిపోర్టును హైకోర్టులో సవాల్ చేశారు. మెడికల్ విద్యార్థులు, నర్సు, రిటైర్డు ప్రొఫెసర్లు వేసిన పిటిషన్లను జస్టిస్ విజయసేన్‌రెడ్డి విచారించారు. మాకు ఫిర్యాదు కాపీ ఇవ్వలేదు. ఫిర్యాదుదారుతోపాటు సాక్షుల వాంగ్మూలాలను ఆడియో రికార్డు చేసిన కాపీలు కూడా ఇవ్వలేదు. ఇలా చేయడం లైంగిక వేధింపుల నిరోధం, పరిష్కార చట్టం రూల్స్ 7, 7(4)లకు వ్యతిరేకం.. అని పిటిషనర్ల తరుపు లాయరు దించారు. అనంతరం హైకోర్టు స్టే ఇచ్చింది. విచారణను ఈ నెల 30కి వాయిదా వేసింది

న్యాయవాదుల నిరసన

సిద్దిపేటలో న్యాయవాది రవికుమార్‌పై పోలీసులు దాడి చేయడంపై హైకోర్టులో న్యాయవాదులు నిరసన తెలిపారు. హైకోర్టు బార్ అసోసియేషన్ కూడా నిరసన తెలిపింది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షుడు అయ్యాడపు రవీందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. బెయిల్ ఆర్డర్ ప్రతిని పోలీసులకు ఇచ్చేందుకు న్యాయవాది వెళితే అతని ఎదుటే పోలీసులు నిందితుడిపై దాడి చేశారనీ, ఇదేంటని ప్రశ్నిస్తే ఏఎస్ఐ కూడా దాడి చేశారన్నారు. పోలీసులపై కేసు నమోదు చేయాలనీ, న్యాయవాదిపై అన్యాయంగా బనాయించిన కేసును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

గిరిజన సంక్షేమ శాఖలో బదిలీలు, పదోన్నతులు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గిరిజన సంక్షేమ శాఖలో పని చేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల కోసం గిరిజన సంక్షేమ కార్యదర్శి డాక్టర్ ఏ శరత్ గురువారం ఉత్తర్వులు, షెడ్యూల్‌ను జారీ చేశారు. ఉపాధ్యాయులలో ఆయా కేడర్లకు సంబంధించిన బదిలీలు, పదోన్నతులకు రాష్ట్ర విద్యా శాఖలో చేపట్టిన మాదిరిగానే రోజువారీ షెడ్యూళ్లను గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డైరెక్టర్ సర్వేశ్వరెడ్డి జీవో విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1600 పైగా గిరిజన ప్రాథమిక, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న 3,700 మంది ఉపాధ్యాయులకు ఈ అవకాశం లభించింది. ఉపాధ్యాయుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం 2018 తరువాత పూర్తిస్థాయిలో బదిలీలు, పదోన్నతులు చేపడుతూ ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీలు, పదోన్నతులు ఒకదానితో ఒకటి ముడిపడుండడం వల్ల ఈ షెడ్యూల్ నెల రోజులపాటు కొనసాగనుంది. మల్టీ జోనల్ స్థాయి ఉపాధ్యాయులకు గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు, జిల్లా స్థాయి ఉపాధ్యాయులకు ఐటీడీఏలలో ప్రాజెక్టు అధికారులు, మైదాన ప్రాంతాల్లో కలెక్టర్లతో కూడిన కమిటీల ఆమోదం మేరకు జిల్లా గిరిజన సంక్షేమ అధికారులు బదిలీలు, పదోన్నతులను శుక్రవారం నుంచి షెడ్యూలు ప్రకారం చేపడుతారు. దీనికి మొదటిసారిగా పూర్తి స్థాయిలో ఆన్‌లైన్ అప్లికేషన్, వెబ్ కౌన్సిలింగ్ సదుపాయాన్ని గిరిజన సంక్షేమ శాఖ కల్పించిందని వారు ఒక ప్రకటనలో తెలిపారు.

పోలీసుల తీరు సరికాదు : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పోలీసులు వ్యవహరిస్తున్న తీరును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తప్పుపట్టారు. గురువారం ఎక్స్ వేదికగా డీజీపీకి పలు సూచనలు చేశారు. తెలంగాణ పోలీసులు తమ వృత్తి పట్ల వ్యవహరించే ప్రొఫెషనలిజం తీరుకు ఉన్న మంచి పేరును కాపాడుకోవాలని సూచించారు. అత్యుత్సాహం ప్రదర్శిస్తూ చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న కొంతమంది పోలీసులను అదుపు చేయాలని డీజీపీని కోరారు. ప్రభుత్వ పెద్దలను సంతృప్తి పరిచేందుకు కొంతమంది పోలీసులు వ్యవహరిస్తున్న తీరు వారి పేరును పూర్తిగా చెడగొడుతోందని తెలిపారు. చట్ట వ్యతిరేకంగా వ్యవహరించకుండా సమయమనం పాటించాలని కేటీఆర్ సూచించారు. సామాజిక మాధ్యమాల్లో ప్రభుత్వాన్ని విమర్శిస్తే కూడా పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తొర్రూరు నియోజకవర్గంలో మాలోతు సురేష్ బాబు అని గిరిజన యువకుడిని అదుపులోకి తీసుకొని క్రూరంగా హింసించారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక శాసన సభ్యురాలికి వ్యతిరేకంగా వాట్సాప్‌లో పోస్ట్ చేయడమే ఆయన చేసిన నేరమా? అని ప్రశ్నించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా బీఆర్ఎస్ శ్రేణులపై పోలీసులు కేసులు పెడుతున్నారని విమర్శించారు.

మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ నాగరాజుకు సన్మానం



నవతెలంగాణ-బడంగ్‌పేట్

మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో నూతన బాధ్యతలు చేపట్టిన కీసర నాగరాజును గురువారం మహేశ్వరం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బోయపల్లి రాఘవేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత పుష్పగుచ్ఛం అందజేసి.. పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్ రెడ్డి, హస్తినాపురం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దెంది శశిధర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ వంగ లక్ష్మీకాంతరెడ్డి, పులి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మల్‌రెడ్డి రామ్‌రెడ్డికి ఘన సన్మానం



నవతెలంగాణ-హైదరాబాద్ డెస్క్

తెలంగాణ రాష్ట్ర రోడ్డు భవనాల చైర్మెన్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డిని అఖిల భారత్ గౌడ సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు తొర్పునూరి ధనుంజయ గౌడ్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ధనుంజయ్ గౌడ్ మాట్లాడుతూ సంక్షేమ అభివృద్ధి ప్రధాత, పేదల ఆశాదీపం మల్ రెడ్డి రామ్ రెడ్డి అని కొనియాడారు. మల్ రెడ్డి రామ్ రెడ్డికి రోడ్లు భవనాల చైర్మెన్‌గా బాధ్యతలు అప్పజెప్పడంతో ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం వచ్చిందన్నారు. సన్మానించిన వారిలో మాజీ సర్పంచులు నోముల జగదీశ్వర్, అంతటి ఊశయ్య, నాయకులు ధనరాజ్ గౌడ్ తదితరులు ఉన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్
బకాయిలను వెంటనే విడుదల చేయాలి



నవతెలంగాణ- హయత్‌నగర్

అర్హులైన బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజులను ప్రభుత్వమే చెల్లించాలని, బీసీ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్ డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిసి, వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు దాదాపు రూ.5,000 కోట్లకు పైగా పేరుకుపోయి ఉన్నాయన్నారు. ఆ బకాయిలను గత ప్రభుత్వం సకాలంలో విద్యాసంస్థలకు అందజేయకపోవడం వల్ల అనేక విద్యాసంస్థలలో చదువుకునే బీసీ విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. వాటిని వెంటనే విడుదల చేసి విద్యార్థుల చదువులకు సహకరించాలని, అదేవిధంగా బీసీ విద్యార్థులు ఎంసెట్ ద్వారా అర్హత సాధించిన, అనేక పోటీ పరీక్షల ద్వారా వృత్తి విద్యా కోర్సుల్లో ఎంపికైన విద్యార్థులందరికీ అర్హులైన బీసీ విద్యార్థులందరికీ కూడా ప్రభుత్వమే పూర్తిస్థాయి ఫీజులు చెల్లించాలని కోరారు. బీసీ విద్యార్థులకు 10 వేల ర్యాంక్ క్యాప్ పద్ధతిని ఎత్తి వేయాలని విజ్ఞప్తి చేశారు. బీసీ విద్యార్థులు చదువుకోవడానికి అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోస్టర్ మేకింగ్, కవితల పోటీలు



నవతెలంగాణ- హయత్‌నగర్

తెలంగాణ నేషనల్ గ్రీన్ కోర్ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా భూమి పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువును తట్టుకోవడం అనే అంశంపై రంగారెడ్డి జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు జిల్లా స్థాయి పోస్టర్ మేకింగ్, కవితల పోటీలను గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హయత్ నగర్‌లో నిర్వహించినట్టు రంగారెడ్డి జిల్లా నేషనల్ గ్రీన్ కోర్ కో ఆర్డినేటర్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ రావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్టేట్ ఎన్‌జీసీ ప్రాజెక్ట్ అధికారి రాజశేఖర్, హయత్ నగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇందిరాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ నేటి రోజుల్లో నేల, పర్యావరణం కలుషితం కావడం వలనే నేల ఆరోగ్యం క్షీణిస్తుందని వివరించారు. అడవుల నిర్మూలన వలన ఎడారీకరణ జరుగుతుందన్నారు. వాతావరణంలో ఆకస్మికమైన మార్పులు సంభవించడం వల్ల కరువు కాటకాలు సంభవిస్తున్నాయని చెప్పారు. ప్రధానోపాధ్యాయురాలు ఇందిరా మాట్లాడుతూ మన పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతీ విద్యార్థి ఇంటిలో, పాఠశాలలో, బహిరంగ ప్రదేశాలలో మొక్కలను నాటి కాలుష్య రహిత సమాజానికి చేయూత అందించాలని కోరారు. కలుషితమైన నేలను పునరుద్ధరించాల్సిన బాధ్యత ప్రతీ వ్యక్తిపై ఉందన్నారు.

జిల్లా హరిత దల అధికారి వై.శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి పర్యావరణ స్పృహను కలిగి ఉండాలని ఆకాంక్షించారు. పోటీ పరీక్షలలో మాత్రమే పర్యావరణ నిబద్ధతను ప్రదర్శించకుండా దైనందిన జీవితంలో పాటించాలని పిలుపునిచ్చారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లాలోని 24 ఎన్జీసీ పాఠశాలల నుండి గైడ్ టీచర్లు, 115 మంది విద్యార్థులు, 24మంది గైడ్ టీచర్లు, జూరి మెంబర్ రూప, శ్రీనివాస్, దామోదర రెడ్డి, అనిల్, చంద్ర శేఖర్, రాజ మల్లయ్య, బిక్షపతి పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తా



- కిచ్చేన్నగారి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్ డెస్క్

సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే కిచ్చేన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం డివిజన్ పరిధిలోని పలు కాలనీలల్లో టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్ రెడ్డితో కలిసి గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా శ్రీరామ కృష్ణ పురం కాలనీ, హరిపురి కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఏ సమస్య ఉన్నా తం దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారం అయ్యే దిశగా ప్రయత్నిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, పున్న గణేష్ నేత, బండి మధుసూదన్ రావు, సురేంద్ర కుమార్, నానవాల జ్ఞానేశ్వర్ యాదవ్, పెద్దవూర సైదులు, బొడ్డుపల్లి మహేందర్, వంగాల శ్రీకాంత్ రెడ్డి, కాలనీల సంక్షేమ సంఘం, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివి మంచి పేరు తీసుకురావాలి

- టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస గుప్త

నవతెలంగాణ-నాగోల్

విద్యార్థులు కష్టపడి చదివి సమాజానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. విద్యానగర్‌లోని స్వామి వివేకానంద ఎడెడ్ హై స్కూల్‌లో సంధ్య ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి శ్రీనివాస్ గుప్త ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చిన్నప్పటి నుండే కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యా రంగానికి విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ రాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



శాస్త్ర సాంకేతిక రంగాల్లో విద్యార్థులు రాణించాలి

- ప్రొఫెసర్ కోదండరాం





నవతెలంగాణ-బడంగ్‌పేట్

నేటి సమాజంలో విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించి అభివృద్ధి, నిరుద్యోగం మధ్య అసమతుల్యతను అధిగమించటానికి యువతలో నైపుణ్యాలను పెంపొందించాలని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్‌గుల్‌లోని యంవీయస్సార్ ఇంజనీరింగ్ కళాశాలలో తెలంగాణ ఇంజనీర్స్ డే సందర్భంగా గురువారం జరిగిన సదస్సుకు తెలంగాణ జనసమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11వ తెలంగాణ ఇంజనీర్స్ డే సందర్భంగా అలీ నవాజ్ జంగ్ బహదూర్ ఒక గొప్ప దార్శనికత ఉన్న ఇంజనీరని కొనియాడారు. న్యూటన్స్ ఆవిష్కరణ సైన్స్ రంగంలో ఒక నమూన మార్పులాగా, కూన్స్ ఆవిష్కరణ తయారీలో ఒక మార్పులాగా, ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ విద్యారంగంలో ఒక మార్పు చేస్తుందన్నారు. సేవా రంగంలో 65% అభివృద్ధి జరిగిందని, దానికి తగినట్టుగా ఆ రంగంలో ఉద్యోగ అవకాశాలు లేవన్నారు. కాలం మారుతుందని, పాత్రలు మారుతున్నాయని, విద్య స్వభావం కూడా చాలా వేగంగా మారుతుందన్నారు. దానికి తగినట్లుగానే అధ్యాపకులు కొత్త టెక్నాలజీని ఉపయోగించి విద్యార్థులకు విద్యను బోధించాలన్నారు. విద్యార్థులలో నైపుణ్యాలను అభివృద్ధి చేయకుండా ఉపాధి అవకాశాలను సృష్టించడం సవాలుతో కూడుకున్నదని, అందుకే తెలంగాణ ప్రభుత్వం కూడా స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీని ప్రారంభించనుందన్నారు. యంవీయస్సార్ కళాశాల మంచి పేరు ప్రఖ్యాతులు ఉన్న ఇంజనీరింగ్ కళాశాలని, స్వయం ప్రతిపత్తి గల కళాశాల కావడం వలన అధ్యాపకులు ఒక అవకాశంగా కొత్తదనంతోపాటు డిమాండ్ ఉన్న విషయ పరిజ్ఞానాన్ని విద్యార్థులకు అందించడానికి అవకాశాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమ అధ్యక్షుడు మాతృశ్రీ ఎడ్యుకేషన్ చైర్మెన్ పీవీఆర్ కశ్యప్ మాట్లాడుతూ ప్రొఫెసర్ కోదండరాం తెలంగాణ రాష్ట్ర సాధనలో ఎలాగైతే గొప్ప పాత్ర పోషించారో కొత్త ప్రభుత్వం ద్వారా విద్యారంగంలో సమూల మార్పు దిశగా కృషి చేస్తారని ఆశిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కోశాధికారి జూపూడి సుధాకర్, జాయింట్ సెక్రటరీ వాసుదేవరావు, మెంబర్ ప్రభాకర్, కళాశాల ప్రిన్సిపాల్ డా. విజయ గుంటూరు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొ.యస్జీయస్ మూర్తి, డీన్‌లు ప్రొ. వర్ధిని, ప్రొ. ప్రసన్నకుమార్, ప్రొ.గజానన, ప్రొ. వేణుగోపాల్ రావు, హెచ్ఓడీలు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, మీడియా చీఫ్ కో ఆర్డినేటర్ బొడ్డుపల్లి జానయ్య తదితరులు పాల్గొన్నారు.

హస్తినాపురం అభివృద్ధే లక్ష్యం

- కార్పొరేటర్ సుజాతా నాయక్

నవతెలంగాణ - హస్తినాపురం

హస్తినాపురం డివిజన్‌ను అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే లక్ష్యం అని కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని హనుమాన్ నగర్ కాలనీలో నిధుల కొరత వలన నిలిచిపోయిన అభివృద్ధి పనులను తిరిగి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పలు కాలనీలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసినప్పటికీ, నిధుల కొరతతో పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో హనుమాన్ నగర్ కాలనీలో రూ.77 లక్షలా 30వేలతో రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించడం శుభపరిణామమని అన్నారు. డివిజన్ ను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో



నిలబెట్టడమే తన లక్ష్యమని అన్నారు. డివిజన్‌లో నెలకొన్న మౌలిక సమస్యల పరిష్కారం కోసం జీహెచ్ఎంసీ, హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులతో సమావేశాలు నిర్వహించి.. కార్యాచరణ రూపొందించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితో అసిస్టెంట్ ఇంజనీర్ హేము నాయక్, హనుమాన్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, గంధం శ్రీనివాస్, గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

'ఇంకుడు
గుంతలపై అవగాహన కల్పించాలి'

నవతెలంగాణ - హస్తినాపురం

ఇంకుడు గుంతల నిర్మాణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జలమండలి సేవ్ ఎర్త్ ఫౌండేషన్ నిర్వాహకులు అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని లక్ష్మీ నరసింహపురం కాలనీలో కిండిల్ కిడ్స్ ప్రీ స్కూల్ ఆవరణలోని ఇంకుడు గుంతలను పునరుద్ధరించే కార్యక్రమాన్ని జలమండలి సేవ్ ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. భవిష్యత్ తరాల బాగు కోసం భూగర్భ జలాలను సంరక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వర్షపు నీటిని ఒడిసి



పట్టుకునేందుకు ఇంకుడు గుంతలను తప్పక నిర్మించుకోవాలని కోరారు. వాటిని తరచుగా శుభ్రపరచుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఇంకుడు గుంతల నిర్మాణం, వాటి నిర్వహణ పద్ధతులపై అవగాహన కల్పించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మెన్ మేడ గోపాల్ రెడ్డి, ప్రిన్సిపల్ మేడ నందిత రెడ్డి, టీచర్స్ స్వాతి, అనూష, మాధవి, శిల్ప, పీఈటీ లక్ష్మణ్, విద్యార్థులు, జలమండలి మరియు సేవ్ ఎర్త్ ఫౌండేషన్ ప్రతినిధులు పర్యావరణ మిత్ర, సేవా రత్న, డాక్టర్ టి.సురేందర్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలను రద్దు చేయాలని నిరసన



నవతెలంగాణ-హైదరాబాద్ డెస్క్

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టాలను రద్దు చేయాలని కోరుతూ కొత్తపేటలోని ఆటో స్టాండ్ దగ్గర ఆటో డ్రైవర్స్ గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసనకు ముఖ్య అతిథులుగా ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా సీఐటీయూ అధ్యక్షులు కడారి రాములు, సరూర్ నగర్ సర్కిల్ సీఐటీయూ మల్లెపాక వీరయ్యలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం సెక్షన్ 106 బిఎన్ఎస్‌లోని సబ్ సెక్షన్ టు మినహా కొత్తగా అమల్లోకి వచ్చాయన్నారు. ఈ చట్టాలు జూలై ఒకటో తారీకు నుండి అమలవుతున్నాయని అన్నారు. ఈ చట్టాలను వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ఆటో డ్రైవర్లను ప్రమాదాలకు బాధ్యతగా చేయకూడదన్నారు. కారణాలను పరిశీలించిన తర్వాత కేసులు బుక్ చేయాలన్నారు. అలా కాకుండా కేవలం డ్రైవర్ తప్పు ఉన్నట్లుగా ఈ చట్టం ఆధారంగా డ్రైవర్లందరికీ ఏడు సంవత్సరాలు జైలు శిక్ష విధించే విధంగా చట్టం ఉందన్నారు. వెంటనే ఈ చట్టాన్ని వెనుకకు తీసుకోవాలని కోరారు. కొత్త చట్టాల వలన అమాయక ప్రజలు, కార్మికులు శిక్షకు గురయ్యే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్రీ బస్ స్కీం వలన నష్టపోయిన ఆటో డ్రైవర్లను వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అనుసరించి నెలకు రూ.12,000 అమలు చేయాలన్నారు. తెలంగాణలో ఆటో డ్రైవర్లందరికీ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి, ప్రతీ కార్మికునికి పది లక్షల రూపాయల ఇన్సూరెన్స్ ఇవ్వాలన్నారు. ఆటో కార్మికులకు జీవనోపాధి చూపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో ఆటో డ్రైవర్లు, కే రాములు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు
250 గజాల స్థలం కేటాయించాలి



- కాచం సత్యనారాయణ

నవతెలంగాణ-హైదరాబాద్ డెస్క్

శాసనసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలాన్ని వెంటనే కేటాయించాలని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం చైర్మెన్ కాచం సత్యనారాయణ గుప్తా డిమాండ్ చేశారు. బాబు జగ్జీవన్ రామ్ భవనంలో ఈ నెల 12వ తేదీన నిర్వహించే ఉద్యమకారుల ఆత్మీయ సమావేశ గోడ పత్రికను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాచం సత్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానం ప్రకారం ఉద్యమకారులకు 250 గజాల భూమిని, పెన్షన్ ఇచ్చే విధంగా త్వరిత గతిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యమకారుల సంక్షేమ బోర్డు, ఉద్యమకారుల బాధ్యత కోదండరాం సారు తీసుకోవాలని అన్నారు. హెల్త్ కార్డులు కూడా అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లే వినయ్ కుమార్, ఎల్బీనగర్ టీజేఎసీ చైర్మెన్ కే వి రంగారెడ్డి, టీజేఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ కొత్త రవి గుప్త, ఉప్పల శ్రవణ్, బిరెల్లి వెంకట్ రెడ్డి, రమేష్, కృష్ణా గుప్త, శ్రీధర్, ఏ.ఆంజనేయులు గుప్త, శ్యామ్ సుందర్, సువర్ణ చలమరెడ్డి, మాణిక్ రెడ్డి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 10 కేసులు నమోదు

- ట్రాఫిక్ ఎస్ఐ అమర్నాథ్ రెడ్డి



నవతెలంగాణ - సంతోష్‌నగర్

యాకుత్‌పురా నియోజకవర్గం మీర్ చౌక్ ట్రాఫిక్ పోలీసులు గురువారం సంతోష్ నగర్ భారత్ గార్డెన్ వద్ద డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ డీసీపీ వెంకటేశ్వర్లు ఆదేశం మేరకు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించినట్టు తెలిపారు. ఈ తనిఖీల్లో సుమారు 10 కేసులను నమోదు చేసినట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 8 మంది ద్విచక్ర వాదారులు, త్రీ వీలర్ ఒకరు, ఫోర్ వీలర్ ఒక్కరు ఉన్నట్లు చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రెంకెన్ డ్రైవ్‌పై ఎన్ని అవగాహన కార్యక్రమాలను నిర్వహించినా వాహనదారుల్లో మార్పు రావడం లేదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మూర్తి, పిసి మోహిన్, ఓమర్, శివ, రఘు, సాయి కృష్ణ, రహిమాన్, పోలీసుల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

8
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
శుక్రవారం జులై 12, 2024 www.navatelangana.com

డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

- జోనల్ కమిషనర్‌కు కార్పొరేటర్ బండారు శ్రీదేవి



నవతెలంగాణ-హైదరాబాద్ డెస్క్

రామంతాపూర్ డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ కార్పొరేటర్ బండారు శ్రీదేవి ఈస్ట్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..డివిజన్ పరిధిలోని ఇందిరా నగర్ నుంచి నేతాజీ నగర్ వెళ్లే డ్రైన్ పనులకు, ఇందిరానగర్ శేఖర్ బస్తీ నుంచి గంగమ్మ ఆలయం వరకు కొత్త రోడ్డు నిర్మాణం, శాంతి నగర్ నుంచి శ్రీనగర్ చౌరస్తా వరకు, శ్రీనగర్ కాలనీ, శ్రీనివాస పురంలో బాక్స్ డ్రైన్‌కు, రెండు హిందూ శ్మశాన వాటికల అభివృద్ధికి నిధులు కేటాంచాలని కోరారు.

జిల్లా ఉత్తమ ఆరోగ్య విస్తరణ అధికారిగా షౌకత్ అలీ



నవతెలంగాణ-జవహర్ నగర్

వైద్య రంగంలో జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఉత్తమ ఆరోగ్య విస్తరణ అధికారిగా జవహర్ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న షౌకత్ అలీ, రాష్ట్ర వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ రవీందర్ నాయక్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి రఘునాథ్ స్వామి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్థాయిలో రాధికా చౌరస్తాలోని స్వాగత్ గ్రాండ్ హోటల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వైద్యరంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వివిధ రంగాలకు చెందిన 70 మందికి ఉత్తమ అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా షౌకత్ అలీ మాట్లాడుతూ అవార్డును అందుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో జవహర్ నగర్ ఆరోగ్య కేంద్రం డాక్టర్ సుష్మా పారా మెడికల్ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఉన్నారు.

స్వాగత్ గ్రాండ్‌లో ప్రపంచ జనాభా దినోత్సవం



- హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-కాప్రా

ఏఎస్‌రావునగర్ డివిజన్ పరిధిలోని స్వాగత్ గ్రాండ్‌లో నిర్వహించిన ప్రపంచ జనాభా దినోత్సవ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఏడాది జులై 11న ప్రపంచ జనాభా సమస్యలపై అవగాహన పెంచడానికి 1989లో యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం పాలక మండలి ఏర్పడిందన్నారు. కుటుంబ నియంత్రణ ప్రాముఖ్యత, లింగ సమానత్వం, పేదరికం, తల్లి ఆరోగ్యం వంటి వివిధ జనాభా సమస్యలపై ప్రజలకు అవగాహన పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నదని పేర్కొన్నారు. ప్రపంచ జనాభా ఏడాదికి సుమారుగా 100 మిలియన్లు పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్, డీఎంఅండ్‌హెచ్‌వో రఘునాథ్ స్వామి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు బీఆర్ఎస్ నాయకులు సాయి జెన్ శేఖర్, ఆశావర్కర్స్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మర్రి దంపతుల ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-మల్కాజిగిరి

గౌతమ్ నగర్ సిద్ధి వినాయక ఆలయంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఆయన సతీమణి మమతారెడ్డితో కలిసి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మల్కాజిగిరిలోని నల్ల పోచమ్మ అమ్మ వారిని, నేరేడ్‌మెట్‌లోని కాళిబరిలో కాళీమాతను దర్శించుకున్నారు. ఆయన వెంట కార్పొరేటర్ సునీత యాదవ్, జవహర్ నగర్ కార్పొరేటర్ మురుగేష్, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, నాయకులు రాము యాదవ్, వెంకన్న, హనుమంత రావు, చిన్న యాదవ్, ఉపేందర్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన కార్పొరేటర్



నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్‌లోని నాయక్ నగర్, బంజారా కాలనీ, శ్రీశ్రీనగర్ కాలనీల్లో చేపట్టి భూగర్భ డ్రయినేజీకి మ్యాన్ హోల్, శ్రీశ్రీనగర్‌లో సీసీ రోడ్డుకు ప్యాచ్ వర్క్ పనులు కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి గురువారం పరిశీలించారు. బుధవారం చేపట్టిన పాదయాత్రలో స్థానిక ప్రజలు పలు సమస్యలను తన దృష్టికి తేవడంతో సత్వరమే పరిష్కారం చేస్తున్నామని కార్పొరేటర్ తెలిపారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానిక నాయకులు శ్రీవిఠల్ నాయక్, కాలనీవాసులు కార్పొరేటర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

నీటి సమస్యను పరిశీలించిన బొంతు శ్రీదేవి

నవతెలంగాణ-కాప్రా

కుషాయిగూడ గవర్నమెంట్ పాఠశాలలో నీటి సమస్య తీవ్రంగా ఉందని స్కూల్ ప్రిన్సిపాల్ బాపిరెడ్డి చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కార్పొరేటర్ సమస్యను పరిశీలించారు. పాఠశాల విద్యార్థుల కోసం వారం రోజుల క్రితం వాటర్ ట్యాంక్ పంపిన కార్పొరేటర్ సమస్య తీవ్రం కావడంతో స్కూల్‌ను సందర్శించారు. వాటర్ పైపులైన్ చెక్ చేసి నీటి సమస్య పునరావృతం కాకుండా చూడాలని ఏఈ సందీప్‌ను ఆదేశించారు. ఏఈ స్పందిస్తూ గోదావరి జలాల సప్లైలో అప్ అండ్ డౌన్స్ ఉన్నాయని దానివల్ల ఏదైనా సమస్య వస్తే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ బాపి రెడ్డి, వాటర్ వర్క్స్ ఏఈ సందీప్, అధికారులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా సీఐటీయూ



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతం ఫేజ్-2లో ఉన్న వీఈపీఎల్ కంపెనీలో పని చేస్తున్న కార్మికురాలు చంద్రకళను ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా పనిలో నుంచి తొలగించినందుకు చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి జి. శ్రీనివాసులు ఆధ్వర్యంలో కంపెనీ నిర్వాహకులు, డీసీఎల్‌తో చర్చించి కార్మికురాలికి రావాల్సిన గ్రాజివిటీ, రిట్రాచ్మెంట్, ఒక నెల నోటీసు పేమెంటు, బోనస్, 45 రోజుల ఎరెండ్ లీవ్స్ కలిపి మొత్తం రూ.1.40 లక్షల నష్టపరిహారం ఇప్పించారు. యజమానులు ఎలాంటి కారణాలు చూపకుండా కార్మికులను పనిలో నుంచి తొలగిస్తే పరిహారం ఇవ్వాలన్నారు. అలాంటి కార్మికులకు సీఐటీయూ అండగా ఉంటుందని చెప్పారు.

ఉత్తమ గాన కోకిల అవార్డుకు ఎంపికైన కానుగంటి వెంకటేశం



నవతెలంగాణ-జవహర్‌నగర్

ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూమెంట్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, జిల్లాలకు చెందిన సహజ కవులను గౌరవించుకోవాలన్న సదుద్దేశంతో ఉద్యమ గాన కోకిల అవార్డులను శుక్రవారం కరీంనగర్‌లో అందజేయనున్నారు. ఉమ్మడి 5 జిల్లాలకు చెందిన సహజ కవులలో ప్రతిభ చాటిన 40 మందిని ఎంపిక చేయగా అందులో అంబేద్కర్ నగర్‌కు చెందిన కానుగంటి వెంకటేశం కూడా ఉన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా జనగామ ప్రాంతానికి చెందిన వెంకటేశం, ఉమ్మ డి ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖలో అనేక కళారూపా ప్రదర్శనలు ఇచ్చి ప్రజల అభిమానాన్ని చూరగొని, ప్రజలలో తనకంటూ ఓ ప్రత్యేకత తెచ్చుకున్నాడు. అతని కళా ప్రదర్శనలు మెచ్చి, ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూమెంట్ వారు గాన కోకిల అవార్డుకు ఎంపిక చేయడం చాలా సంతోషంగా ఉందని, కుటుంబ సభ్యు లు, కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హాజరుపై నజర్..!



- కలెక్టరేట్‌లో బయోమెట్రిక్ విధానం
- త్వరలో అమలుకు సన్నాహాలు
- ఉద్యోగుల సమయపాలనపై ఫోకస్
- కలెక్టర్‌కు అటెండెన్స్ రిపోర్టు

నవతెలంగాణ-సిటీబ్యూరో

కలెక్టరేట్ పాలనను గాడిలో పెట్టేందుకు ఉన్నతాధికారులు కీలక నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. జిల్లాలో ప్రభుత్వ పాలనకు కేంద్ర బిందువుగా ఉన్న కలెక్టరేట్ కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులు సమయపాలన పాటించేలా బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ఉద్యోగుల సంఖ్యను బట్టి బయోమెట్రిక్ మిషన్లను ఏర్పాటు చేయనున్నారు. ఇకపై కలెక్టరేట్‌లోని వివిధ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులు, అధికారులు, సిబ్బంది నిత్యం ఉదయం 10.30 గంటలకు కార్యాలయానికి వచ్చి, సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

శామీర్‌పేట మండలం అంతాయిపల్లిలోని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్, గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు, రెండు అంతస్తుల్లో ఉంది. ఈ సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో మొత్తం 40కి పైగా శాఖల కార్యాలయాలు ఉన్నాయి. ఈ కార్యాలయాలన్నింటిలో కలెక్టర్, ఇద్దరు అదనపు కలెక్టర్లు, డీఆర్‌ఓ సహా, పర్మినెంట్, కాంట్రాక్టు, ఔటు సోర్సింగ్ ఉద్యోగులు సుమారు 300 మందికి పైగా పని చేస్తున్నారు. ఇకపై వీరి హాజరును నిర్వహించేందుకు త్వరలో బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయనున్నారు. కలెక్టరేట్‌లోని ఆయా శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగుల వివరాలను ఈ మిషన్లలో నమోదు చేయనున్నారు. దీంతో ఉద్యోగులు నిత్యం తమ వేలి ముద్రతో హాజరు వేయాల్సి ఉంటుంది. త్వరలో ఈ బయోమెట్రిక్ విధానాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ విధానం గతంలో అమలులో ఉన్నప్పటికీ ఏండ్లుగా ఆచరణకు నోచుకోలేదు. జిల్లా ఉద్యోగులు ఫీల్డ్ విజిట్ పేరుతో ప్రజావాణికి హాజరు కావడం లేదనీ, మరికొందరు ఉద్యోగులు సమయ పాలన పాటించడం లేదని ఇటీవల జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి వచ్చింది. దీంతో మళ్లీ బయోమెట్రిక్ విధానాన్ని తెరపైకి తీసుకురానున్నారు.

అప్ అండ్ డౌన్ పాలనకు చెక్..

కలెక్టరేట్‌లో పనిచేస్తున్న చాలా మంది అధికారులు, సిబ్బంది చుట్టు పక్కల జిల్లాల నుంచి అప్ అండ్ డౌన్ చేస్తుంటారు. జిల్లా సగం జీహెచ్ఎంసీ, సగం రూరల్‌గా ఉండటంతో సుమారు 20 శాతానికిపైగా ఉద్యోగులు స్థానికంగా నివాసం ఉండటం లేదు. హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, చౌటుప్పల్, ఇబ్రహీంపట్నం తదితర ప్రాంతాల్లో నివాసముంటూ విధులకు హాజరై వెళ ్తుంటారు. ఉదయం 10.30 గంటలకు కార్యాలయానికి రావాల్సి ఉండగా, చాలా మంది ఉదయం 11.30, 12 గంటలు దాటితే గానీ సీట్లలో ఆసీనులు కావడం లేదు. సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వర్తించాల్సి ఉండగా, చాలా మంది సాయంత్రం నాలుగైతే చాలు బ్యాగ్ చేపత పట్టుకుని ఇంటి బాట పడుతున్నారు. ఇక కొందరు సిబ్బంది మాత్రం సాయంత్రం 6.30 గంటలు దాటాక కూడా విధులు నిర్వర్తిస్తుంటారు. ఇలా వచ్చి అలా వెళ్లిపోయే ఉద్యోగులే ఎక్కువగా ఉండటంతో వారి దూకుడుకు కళ్లెం పడనుంది. కొందరి ఆలస్యాన్ని అందరి ఆలస్యంగా పరిగణించాల్సి వస్తున్నందున, బయో మెట్రిక్ విధానాన్ని అమలు చేయనున్నారు. దీంతో ఆలస్యంగా విధులకు హాజరయ్యే ఉద్యోగులకు చెక్ పడనుంది.

ఫీల్డ్ విజిట్ పేరుతో గైర్హాజరు..

ఉదయం ఫీల్డ్ విజిట్ చేసే ఆయా శాఖల జిల్లా ఉన్నతాధికారులు కొందరు మధ్యాహ్న భోజన విరామం తర్వాత కలెక్టరేట్‌కు వస్తున్నారు. ఫీల్డ్ విజిట్ పేరుతో ఉదయం అంతా విధులకు గైర్హాజరు కావడం వీరికి పరిపాటైపోయింది. కలెక్టర్ సమీక్ష సమావేశాలు ఉంటే తప్ప చాలా మంది జిల్లా ఉన్నతాధికారులు సమయ పాలన పాటించడం లేదు. కొందరైతే ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి సైతం ఎగనామం పెడుతున్నారు. కింది స్థాయి సిబ్బందిని ప్రజావాణికి పంపి.. వాళ్లు మాత్రం తీరుబాటుగా మధ్యాహ్నం తర్వాత కలెక్టరేట్‌కు వస్తున్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది ప్రజలు తమ సమస్యలపై వినతిపత్రాలు ఇచ్చేందుకు వచ్చే ప్రజావాణిని కూడా జిల్లా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదంటే పరిస్థితి ఏ విధంగా అర్థం చేసుకోవచ్చు. ఈ విషయాలన్నింటినీ పరిగనలోకి తీసుకున్న ఉన్నతాధికారులు బయోమెట్రిక్ విధానం మొగ్గు చూపారు. ఈ బయోమెట్రిక్ విధానం అమలు చేస్తే ఇలా సమయ పాలన పాటించని జిల్లా ఉన్నతాధికారులకు కూడా చెక్ పడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కలెక్టర్‌కు అటెండెన్స్ రిపోర్టు..

కలెక్టరేట్‌లోని ఉద్యోగుల అటెండెన్స్ రిపోర్టు కలెక్టర్‌కు వెళ్తుంది. ఏ కారణం లేకుండా జిల్లా ఉన్నతాధికారులు గానీ, ఇతర ఉద్యోగులు, సిబ్బంది సమయానికి రాకపోతే.. అందుకు గల కారణాలపై వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. తీరు మారని వారిపై క్రమశిక్షణా చర్యలు ఉండే అవకాశాలు లేకపోలేదు. ప్రస్తుతం ఆయా కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది ఏ టైంకు వచ్చినా అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం చేసి వేతనాలు పొందడం సర్వ సాధారణమైపోయింది. ఒక్కో రోజు విధులకు గైర్హాజరైనా.. మరునాడు వచ్చి సంతకాలు పెట్టుకునే ఉద్యోగులు కూడా లేకపోలేదు. ఈ బయోమెట్రిక్ విధానం పకడ్బందీగా అమలు చేస్తే ఇష్టారాజ్య పాలనకు చెక్‌పడటంతో పాటు, కలెక్టరేట్ పాలన గాడినపడే అవకాశాలున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఈ శాఖల పరిస్థితి ఏంటి..?

కలెక్టరేట్‌లో ఉన్న శాఖల్లో పని చేసే ఉద్యోగుల కోసం బయోమెట్రిక్ విధానం అమలు చేయడం మంచి పరిణామమే. కానీ కలెక్టరేట్ బయట ఉన్న జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కార్యాలయం, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం, జిల్లా అటవీశాఖ కార్యాలయం, జిల్లా రవాణాశాఖ కార్యాలయం, మేడ్చల్, మల్కాజిగిరి ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయాలు పరిస్థితి ఏంటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ కార్యాలయాల్లో పని చేసే సిబ్బంది సైతం కొందరు సమయ పాలన పాటించడం లేదని ఆరోపణలు లేకపోలేదు. ఇలాంటి తరుణంలో వీరి హాజరుపై సందిగ్ధం నెలకొంది. కలెక్టరేట్‌కు బయట కొనసాగే ఆయా జిల్లా శాఖల్లో కూడా ఈ బయోమెట్రిక్ విధానం అమలు చేస్తారా..? లేక రిజిస్టర్‌లో సంతకాలు చేసే విధానాన్నే కొనసాగిస్తారో వేచి చూడాలి.

వాంబే కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలి



నవతెలంగాణ-మల్కాజిగిరి

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ నేరేడుమెట్ డివిజన్ పరిధిలోని అమ్ముగూడ ప్రాంతం చంద్రబాబు నాయుడు కాలనీ, బాంబే గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేసినట్టు మల్కాజిరి మండల నాయకులు బంగారు బంగారు నర్సింగరావు తెలిపారు. వాంబే కాలనీలో 20 ఏండ్లుగా ప్రజా సమస్యలు తీష్ట వేశాయని, పరిష్కారం కోసం ఏ ఒక్కరూ పనిచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు సమస్యలు పరిష్కరించి ఇంటింటికీ కరెంటు మీటర్లు బిగించాలన్నారు. మీటర్ ఉన్న ఇండ్లకు 200 యూనిట్ల ఉచిత కరెంటు అందజేయాలని కోరారు. ప్రతి బ్లాకులో బోరు మోటార్లు బిగించి నీటి సరఫరా అందించాలన్నారు. మంజీరా పైప్ లైన్ పూర్తి చేసి ఇంటింటికీ నల్లా కలెక్షన్లు ఇవ్వాలని కోరారు. అదనంగా కరెంటు స్తంభాలు వేసి వీధి లైట్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజలతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎం) నాయకులు నాగరాజు, నాగమణి, కే.యాదగిరి, సుమిత్ర, సరోజ, సాయి, శోభ, రామేశ్వరమ్మతో పాటు బస్తీ వాసులు కుమారి, శంకర్, మల్లేష్, రాంబాబు, కలమ్మ అనిత, సుజాత, భాస్కర్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- ఉప కమిషనర్ ఆంజనేయులు
- విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ-హైదరాబాద్ డెస్క్

సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థులు, ఇంట్లో, చుట్టూ ప్రక్కల వారికీ అవగహన కల్పించిచాలని ఉప్పల్ ఉప కమిషనర్ ఆంజనేయులు అన్నారు. గురువారం ఉప్పల్ ప్రభుత్వ పాఠశాల లో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగహన కల్పించారు. దోమలు అభివృద్ధి చెందుటకు అనుకూల పరిస్థితులు వాటి అభివృద్ధి నిరోధించుటకు కావాల్సిన చర్యలు తెలిపారు. దోమల వలన వచ్చే వ్యాధులు, దోమకాటు భారీ నుంచి రక్షించుకోవడానికి తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉప కమిషనర్ ఆంజనేయులు మాట్లాడు తూ.. ఇంటి పరిసరాలలో వర్షపు నీరు, మురుగు నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. టైర్లు, పగిలిన కుండలు, బకెట్లు, కొబ్బరి చిప్పలు లాంటి వాటిలో వర్షపు నీరు నిలిచే ప్రమాదం ఉందని, రెండు రోజులకోసారి నీటిని తొలగించాలన్నా రు. ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలన్నారు. దోమల బారిన పడితే మలేరియా, డెంగ్యూ లాంటి జ్వరాల వస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ విభాగం చందన, ఎస్. డబ్ల్యుఎం ఎంటమాలజీ విభాగం నరేష్ రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్, ఎంటమాలజీ ఈఎఫ్‌ఏలు, శానిటరీ జవాన్లు, ఎస్ ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు అవసరం



నవతెలంగాణ-హైదరాబాద్ డెస్క్

విద్యార్థులు సీజనల్ వ్యాధులకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోచారం మున్సిపల్ చైర్మెన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. గురువారం అన్నోజిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైద్యాధికారులతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డెంగ్యూ, చికెన్ గునేరియా, డయేరియా, మలేరియా, టైఫాయిడ్, పలు విష జ్వరాలు ప్రబలకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ రెడ్యా నాయక్ కమిషనర్ వేమనరెడ్డి, హెచ్ఎం స్వరూప రాణి, కౌన్సిల్ సభ్యులు గొంగళ్ల మహేష్, సింగిరెడ్డి సాయి రెడ్డి, బెజ్జంకి హరి ప్రసాద్‌రావు, సుర్వి రవీందర్, కో ఆప్షన్ సభ్యులు అక్రమ్ అలీ, డాక్టర్ సౌమ్య, మున్సిపల్ మేనేజర్ కిరణ్, ఆర్ఐ సాయిరాజ్, మున్సిపల్ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన మేడ్చల్ బీఆర్ఎస్ నేతలు



నవతెలంగాణ-మేడ్చల్

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను గురువారం మేడ్చల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ భాస్కర్ యాదవ్, మండలాధ్యక్షుడు దయానంద్ యాదవ్‌లు మర్యాద పూర్వకంగా కలిశారు.

ఎమ్మెల్యే మల్లారెడ్డితో కలిసి నగరంలోని కేటీఆర్ నివాస ంలో కలిసినట్టు తెలిపారు. మేడ్చ ల్‌లో ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించినట్టు పేర్కొన్నారు.

మధుకర్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షల వెల్లువ

నవతెలంగాణ-హైదరాబాద్ డెస్క్

డీసీఎంఎస్ వైస్ చైర్మెన్, శామీర్ పేట సొసైటీ చైర్మెన్ డాక్టర్ రామిడి మధుకర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం ఆయనను శామీర్‌పేట సొసైటీ కార్యాలయంలో అలియబాద్ మాజీ సర్పంచ్ కంఠం కృష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మొగుళ్ల కృపాకర్‌రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దాడికి నిరసనగా విధుల బహిష్కరణ



నవతెలంగాణ-కాప్రా

విధి నిర్వహణలో ఉన్న న్యాయవాది రవి కుమార్‌పై సిద్దిపేట పోలీస్ స్టేషన్‌కు చెందిన ఏఎస్ఐ అకారణంగా దాడి చేయడాన్ని నిరసిస్తూ మేడ్చల్ బార్ అసోషియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ.. న్యాయవాదులకు రక్షణగా కేంద్రం ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : ఎంపీ

- మేడ్చల్, గౌడవెల్లిలో అండర్ గ్రౌండ్ బ్రిడ్జి, రైల్వే స్టేషన్‌లో పనులు పరిశీలన



నవతెలంగాణ- మేడ్చల్

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గురువారం మేడ్చల్ పట్టణం, గౌడవెల్లిలో జరుగుతున్న అండర్ గ్రౌండ్ బ్రిడ్జి, రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సంబంధిత శాఖ అధికారులను పనుల పురోగతి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈటల మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షులు విక్రమ్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు జగన్ గౌడ్, నాయకులు నందారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ మురళీధర్ గుప్తా, కౌన్సిలర్లు లావణ్య హన్మంత్ రెడ్డి, హంస రాణి కృష్ణ గౌడ్, మాజీ జడ్పీటీసీ శైలజ హరినాథ్, మున్సిపల్ అధ్యక్షులు ఆంజనేయులు, మండల అధ్యక్షులు నరేందర్ రెడ్డి, జిల్లా నాయకులు లక్ష్మారెడ్డి,కిషన్ రావు, సుధాకర్ రెడ్డి, బీజేవైఎం జిల్లా కార్యదర్శి రాఘవ రెడ్డి, తదితరులున్నారు.

రైల్వే అధికారులతో ఎంపీ ఈటల సమీక్ష



నవతెలంగాణ-ఆల్వాల్

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ రైల్వే అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. అనంతరం గుండ్ల పోచంపల్లి మొదలుకొని రైల్వే బొల్లారం స్టేషన్ జనప్రియ దగ్గరలోని బీహెచ్ఈఎల్ రైల్వేగేట్, వెంకటాపురం గేటు వరకు పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ బొల్లారం గేటు వద్ద ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుందని, గంటలకు కొద్ది నిరీక్షణ చేయాల్సి వస్తుందని తన దృష్టికి వచ్చినట్టు తెలిపారు. ఆర్ఓబీ, ఆర్‌యూబీలను త్వరగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. సమస్యపై ఇదివరకే రైల్వే మంత్రిని కలిసి వచ్చామని ఆయన సానుకూలంగా స్పందించారని ఈటల వివరించారు. ఆయన వెంట స్థానిక నాయకులు మాణిక్య రెడ్డి, దండగుల వెంకటేష్, శ్రీనివాస్, అజయ్ రెడ్డి, నిమ్మ కృష్ణారెడ్డి, కిరణ్, లక్ష్మణ్, వినయ్, శంకర్, కరుణశ్రీ, సుజాత పాల్గొన్నారు.

రాచకొండ సీపీగా సుధీర్ బాబు



నవతెలంగాణ-మల్కాజిగిరి

రాచకొండ పోలీస్ కమిషనర్‌గా సుధీర్ బాబు ఐపీఎస్ నియమితులయ్యారు. నేరేడ్‌మెట్‌లోని రాచకొండ సీసీ కార్యాలయంలో రాచకొండ సీపీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణ కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం



- హెచ్‌పీసీఎల్ డీజీఎం అనోజ్ శ్యాం బిహారీ లాల్

నవతెలంగాణ-కాప్రా

మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉంటామని హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ హసన్ చర్లపల్లి ఎల్పీజీ పైపులైన్ రిసివింగ్ స్టేషన్ డిప్యూటీ జనరల్ మ్యానేజర్ అనోజ్ శ్యాం బిహారిలాల్ బరోనియా అన్నారు. స్వచ్ఛత వారోత్సవాల్లో భాగంగా గురువారం హెచ్‌పీసీఎల్ హసన్ చర్లపల్లి ఎల్పీజీ పైపులైన్ రిసివింగ్ స్టేషన్ ఉద్యోగులు చర్లపల్లి గ్రామస్తులో కలిసి చెరువు వద్ద స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీఎం మాట్లాడుతూ స్వచ్ఛత వారోత్సవాల్లో భాగంగా హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో తడి, పొడి చెత్తను వేరు చేయడం, పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం, ప్రభుత్వ పాఠశాలల్లో ప్లాస్టిక్ నియంత్రణపై వ్యాసరచణ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఉద్యోగి ఇంటి పరిసరాల్లో రెండడు మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు విద్యాసాగర్ గుప్తా, శశిధర్ రెడ్డి, శశాంక్‌ఝు, కె. కృష్ణ, కాంట్రాక్టర్ వెంకట్, సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్రీకాంత్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపిన గువ్వ రవి ముదిరాజ్



నవతెలంగాణ-మేడ్చల్

రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్‌గా బాధ్యతలు చేపట్టిన నూతి శ్రీకాంత్ గౌడ్‌ను గురువారం జిల్లా ఓబీసీ సెల్ చైర్మెన్ గువ్వ రవి ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకె అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్, శామీర్ పేట్, కీసర, ఘట్కేసర్, ముడుచింతలపల్లి, బోడుప్పల్ మండలాల ఓబీసీ సెల్ అధ్యక్షులు, జిల్లా నాయకులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు, మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బీసీ చైర్మెన్‌కు అభినందనల వెల్లువ



నవతెలంగాణ-హైదరాబాద్ డెస్క్

తెలంగాణ కాంగ్రెస్ ఓబీసీ చైర్మెన్ నూతి శ్రీకాంత్ గౌడ్ బీసీ కార్పొరేషన్ చైర్మెన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా గురువారం మేడ్చల్ జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షుడు రవి ముదిరాజ్, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మెన్ రామచందర్ యాదవ్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు .

పార్క్‌ల అభివృద్ధి సుందరీకరణ పనులు పూర్తి చేయాలి



నవ తెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గం గాంధీనగర్ డివిజన్‌లోని పార్కుల అభివృద్ధి సుందరీకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ అన్నారు. డివిజన్‌లోని పీటీ కాలనీ పార్క్ (సురభి పార్క్) అభివృద్ధి సుందరీకరణ పనులకు ఎందుకు అంతరాయం కలగడంపై హార్టికల్చర్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పార్కుల సుందరీకరణకు నిధులు కొరత ఏర్పడితే ప్రత్యేక చర్యలు తీసుకొని మంజూరు చేయిస్తామన్నారు. త్వరలో పార్కుల అభివృద్ధి పూర్తి కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు వినయ్ కుమార్, హార్టికల్చర్ విభాగం సర్కిల్ మేనేజర్ భాస్కర్, సూపర్ వైజర్ వికాస్, వెంకటేష్ మేరకు బిజెపి నేతలు సాయి కుమార్,ఆనంద్ రావు,అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

బీబీ కా అలాంను సందర్శించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



నవతెలంగాణ-హైదరాబాద్ డెస్క్

మొహర్రం సందర్భంగా పాతబస్తీ డబీర్ పుర బీబీ కా అలాంను సందర్శించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫీరాసత్ అలీ బాక్రి ఆధ్వర్యంలో సందర్శించారు. ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఆయనకు ముస్లిం సోదరులు దట్టి కట్టారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త మనవడు హజ్రత్ ఇమామ్ హుస్సేన్ బలిదానానికి మొహర్రం ప్రతీకగా నిలిచిందన్నారు. ఈ పవిత్ర సంతాప దినాలు రాష్ట్రంలో మత సమరస్యాన్ని, సమైక్యతను ప్రతిబింబిస్తాయన్నారు. సమాజం సుఖసంతోషాల కోసం త్యాగం చేయడం అవసరమైతే ప్రాణాలివ్వడానికి కూడా వెనుకాడవద్దని మనకు గుర్తుచేసే సందర్భమిదన్నారు. హైదరాబాద్ లో మొహర్రం ను త్యాగానికి ప్రతీకగా భక్తి శ్రద్దలతో జరుపుకోవడం ఈ ప్రాంతాన్ని దర్శించుకోవడానికి అనవాయితీగా వస్తోందని గుర్తు చేశారు.

ఇటీవలే పదవి విరమణ చేసిన అధికారులకు ఘన సన్మానం..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

స్టేట్స్ సివిల్ సర్వీస్ రిటైర్డ్ ఆఫీసర్స్ అసోసియేషన్, తెలంగాణ స్టేట్ రిటైర్డ్ రెవెన్యూ ఆఫీసర్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌ల సంయుక్తాగా హనుమాన్ టెక్డి లోని బీసీ సాధికారత భవన్‌లో చైర్మెన్ ఎం.సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఇటీవల పదవి విరమణ చేసిన శ్రీశైలం ప్రాజెక్టు రిటైర్డ్ స్పెషల్ కలెక్టర్ ఏవీ రామప్రసాద్, నల్గొండ రిటైర్డ్ డీప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ శ్రీనివాస్ లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు ఆఫీసర్స్ వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ లు చంద్రారెడ్డి, డాక్టర్ రాజారాం, హౌసింగ్ బోర్డ్ సెక్రటరీ రాజేశం,గౌరవ చైర్మెన్ లక్ష్మయ్య, సెక్రటరీ జనరల్ టీ.మాణిక్యాలరావు, సలహాదారులు ఏ రవీందర్ రెడ్డి, రిటైర్డ్ స్పెషల్ గ్రేడ్ డీప్యూటీ కలెక్టర్లు, భాస్కర్, జి.ప్రభాకర్, జగన్మోహన్రావు, ఎలక్షన్ డీప్యూటీ సెక్రటరీ సత్యవాణి, రిటైర్డ్ లక్ష్మి, నాగ రాజారావు, నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే వెంకటస్వామి, గాయత్రి క్రియేషన్ జి ప్రభాకర్ , ఉద్యోగస్తులు, ఉద్యోగస్తుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తేజావత్ సుకన్య బాయికు ఘన స్వాగతం



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

అసైన్ పసిఫిక్ ఆఫ్రికన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్షిప్ దక్షిణాఫ్రికాలో బంగారు పతకం సాధించి శంషాబాద్ విమానం చేరుకున్న తేజావత్ సుకన్య బాయికి విమానాశ్రయంలో ఘన స్వాగతం పలుకుతున్న ఎసిఈ ఇంజనీరింగ్ కళాశాలల చైర్మెన్ వైవి గోపాలకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఎల్ రాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.మల్లేశం, ఫిజికల్ డైరెక్టర్ బి.రాజ శేఖర్ రెడ్డి, అసిస్టెంట్ పీడీ మీ నరేష్, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ ఎస్ వి.మణికంఠ, కళాశాల విద్యార్థులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు.

కమిషనర్‌ను కలిసిన దేవిక రొక్కం బృందం



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ఎంపీహెచ్ఏ బదిలీల విషయంపై గురువారం కోఠిలోని కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కర్ణన్‌ను కలిసి అర్జీ పెట్టుకున్న సమస్యలు వివరించామని మహిళా ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దేవిక రొక్కం తెలిపారు. గురువారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ.. ఎంపీహెచ్ఏ బదిలీలలో 40శాతం వేకెన్సీ చూపించుకుంటూ క్లియర్ వేకెన్సీస్ చూపిస్తామని చెప్పారని తెలిపారు. క్లియర్ వేకెన్సీ ప్లేస్ 40శాతం లాంగ్ స్టాండింగ్ మాత్రమే ట్రాన్స్‌ఫార్ పెట్టుకోవడానికి వేకెన్సీ ఉంటాయని తెలిపారన్నారు. నాలుగేండ్లు పూర్తయిన ప్రతి ఒక్కరూ ట్రాన్స్‌ఫర్ పెట్టుకోవడానికి అర్హత ఉంటుందన్నారు. 40శాతం దాటాక ఎవర్ని డిస్టర్బ్ చేయమన్నారు. బదిలీలలో కేవలం అప్లికేషన్లు మాత్రమే ఆన్‌లైన్ అని కౌన్సిలింగ్ నేరుగా నిర్వహిస్తామని తెలిపారని చెప్పారని తెలిపారు. 40 శాతం దాటినాక మిగతావాళ్ల అవసరమనుకున్న వాళ్ళే అప్లికేషన్ పెట్టుకోవచ్చు అన్నారు. 40శాతంలో మాత్రం కంపల్సరీ ఆన్‌లైన్ అప్లికేషన్ చేసుకోవాలని తెలిపారు. 317 జీవో సేమ్ జోన్‌లో ట్రాన్స్‌ఫర్ అప్లికేషన్ పెట్టుకోవచ్చునన్నారు. వీరి విషయంలో గవర్నమెంట్ నుంచి గైడ్‌లైన్స్ వచ్చాక నిర్ణయం తీసుకుంటామని కమిషనర్ చెప్పారని తెలిపారు. తమ సమస్యలను తమ అర్జీలను అర్థం చేసుకొని పరిష్కరించినందుకు సీఎఫ్‌డబ్ల్యూ కమిషనర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఫిమేల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు కిరణ్, వినోద, గీత ,సంతోష, లక్ష్మి అన్ని 33 జిల్లాల ఎంపీహెచ్ఏ మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రామలక్ష్మికి బెస్ట్ పీహెచ్ఎన్ అవార్డు అందజేత



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా సుల్తాన్ బజార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పీహెచ్ఎన్ రామలక్ష్మికి బెస్ట్ పీహెచ్ఎన్ అవార్డు, ప్రశంసా పత్రంను అందజేస్తున్న హైదరాబాద్ డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటి తదితరులు

నాయి బ్రాహ్మణ ఫెడరేషన్ ఎండీ పదవీ విరమణ



నవతెలంగాణ-మెహిదీపట్నం

నాయి బ్రాహ్మణ ఫెడరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ విమలాదేవి పదవీ విరమణ సందర్భంగా ఫెడరేషన్ ఉద్యోగులు, నాయి బ్రాహ్మణ కుల సంఘాల నాయకులు ఆమెకు ఘనంగా వీడ్కోలు పలికారు. మాసబ్ ట్యాంక్‌లోని దామోదరం సంజీవయ్య భవనంలోని ఫెడరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణ ఫెడరేషన్ ఎండీగా ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఫెడరేషన్ యొక్క ప్రస్తుత జాయింట్ డైరెక్టర్‌గా ఉన్న చంద్రశేఖర్ ఫెడరేషన్ యొక్క అడిషనల్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన సందర్భంగా అతనిని కూడా సంస్థ ఉద్యోగులు, నాయి బ్రాహ్మణ కుల సంఘాల నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రిటైర్డ్ సూపర్నెంట్ అబ్దుల్ బాసిత్, నాయి బ్రాహ్మణ సంఘ నాయకులు నాగరాజు, బాలకృష్ణ, రామకృష్ణ, కొండూరు సత్య నారాయణ, నర్సింలు ఫెడరేషన్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.అశోక్ రెడ్డి
- కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఫీజు రియంబర్స్‌మెంట్, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.అశోక్ రెడ్డి డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 'హలో విద్యార్థి.. చలో కలెక్టరేట్' పేరిట జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు స్కాలర్‌షిప్స్, ఫీజు రీయంబర్స్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు, వాటిని విడుదల చేసేందుకు ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను ప్రభుత్వమే అమలు చేయడం లేదన్నారు. అకడమిక్ ఇయర్ ప్రారంభంలోనే విద్యార్థుల నుంచి దరఖాస్తులు తీసుకొని సర్కారు పరిశీలన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పరిశీలనలో అర్హులని తెలితే ముందే 25శాతం చెల్లించాలని కోరారు. అకడమిక్ ఇయర్ మధ్యలో 50శాతం, మిగిలిన ఫీజులు సంవత్సరం చివరిలో చెల్లించాలన్నారు. అయితే ఈ నిబంధనలు రాష్ట్ర ప్రభుత్వాలు పాటించడం లేదన్నారు. విద్యార్థి కోర్సు ముగిసే వరకూ ఫీజులు విడుదల చేయకపోవడంతో వారు ఉన్నత చదువులు చదివే పరిస్థితి లేకుండా పోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అత్యధికంగా బీసీ విద్యార్థులకు ఎక్కువ ఫీజులు బకాయిలున్న పరిస్థితి ఉందని, డబ్బులు చెల్లించలేని విద్యార్థులు సర్టిఫికెట్స్ కళాశాలలో వదిలేసి చదువులకు స్వస్తి చెప్పి ప్రయివేట్ ఉద్యోగాల వైపు వెళుతున్నారన్నారు. తక్షణమే ముఖ్యమంత్రి ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు లెనిన్ గువేరా, జిల్లా నాయకులు సునీల్, చరణ్య, విఘ్నేష్, అజయ్, భరత్, తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్‌ను కలిసిన నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

నాయి బ్రాహ్మణులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గజ్జెల్లి వెంకన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ కొత్తపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కొలిపాక సతీష్, వర్కింగ్ ప్రెసిడెంట్ సింగిరాల వెంకటస్వామి, గౌరవ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి ఆధ్వర్యంలో గురువారం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి నాయీబ్రాహ్మణుల సమస్యలపైన వివరించామన్నారు. నాయి బ్రాహ్మణులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, గవర్నర్ కోటాలో ఎంఎల్‌సీ పదవి ఇవ్వాలని అలాగే రాష్ట్ర ప్రభుత్వంలో రెండు కార్పొరేషన్ చైర్మెన్ పదవులను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. 50 సంవత్సా రాలు దాటిన వారికి (నాయీబ్రాహ్మణులకు) పెన్షన్ ఇవ్వాలని కోరమన్నారు. ఈ కార్యక్రమంలో విజయగిరి సమ్మయ్య, గొల్లపల్లి రాజమల్లు, అశోక్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

సుద్దాల హనుమంతు ప్రజాపాట సభను జయప్రదం చేయండి

- ప్రజాకవి సుద్దాల హనుమంతు సాంస్కృతిక ఉత్సవాలలో వక్తలు



నవతెలంగాణ-ముషీరాబాద్

సుద్దాల హనుమంతు ప్రజాపాట సభను జయప్రదం చేయాలని పలువురు వక్తలు తెలిపారు. తెలంగాణ ప్రజా సాంస్కృతిక రంగానికి వైతాళికుడిగా గొప్ప కృషి చేసిన సుద్దాల హనుమంతు జీవితం చరిత్ర పుస్తకావిష్కరణ కార్యక్రమం ఈనెల 16న బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతుందని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎస్.వినయ్ కుమార్, టీపీఎస్‌కే రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు, బాలల సంఘం సోమయ్య, బుక్ హౌస్ ఎడిటర్ ఆనందాచారి, కృష్ణారెడ్డి తెలంగాణ సాహితీ, సలీమా, బుచ్చిరెడ్డి, మమత, సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా పాటకు పరిపరి దండాలు పేరుతో ప్రజాకవి సుద్దాల హనుమంతు సాహితీ జీవిత సంఘం రచన పుస్తకావిష్కరణ కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీఐ మాజీ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి, సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, ఎమ్మెల్యే సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ప్రముఖ సినీ నటులు ఉత్తేజ్, విమలక్క, కోయ కోటేశ్వరరావు, అశోక్ తేజ, ఎస్.వినయ్ కుమార్ పాల్గొంటారని తెలిపారు.

టీజీఐఐసీ కార్పొరేషన్ చైర్మెన్‌గా
తూర్పు నిర్మల జగ్గారెడ్డి బాధ్యతల స్వీకరణ

పాల్గొన్న మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ





నవతెలంగాణ-హిమాయత్‌నగర్

రాష్ట్ర టీజీఐఐసీ కార్పొరేషన్ చైర్మెన్‌గా తూర్పు నిర్మల జగ్గారెడ్డి పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు గురువారం బషీర్‌బాగ్, పరిశ్రమ భవన్‌లోని ఐఐసీ కార్యాలయంలో జరిగిన పదవి బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఉత్తమ్ కుమార్ రెడ్డి, మాజీ ఎంపీ మధుయష్కీ గౌడ్ తదితరులు పాల్గొని, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తూర్పు నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ తనకు కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర సీఎం ఎ.రేవంత్ రెడ్డి కల్పించిన ఈ బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని, తన శాఖ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. తనకు చైర్మెన్‌గా అవకాశం కల్పించిన సీఎం ఎ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అభివృద్ధి నిర్మాణ పనులను సత్వరమే పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే మహమ్మద్ ముబీన్ అలీ



నవతెలంగాణ-హైదరాబాద్ డెస్క్

పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి నిర్మాణ పనులను సత్వరమే పూర్తి చేయాలని బహదూర్ పురా నియోజకవర్గం ఎమ్మెల్యే మహమ్మద్ ముబీన్ అలీ అధికారులకు సూచించారు. బహదూర్‌పురా నియోజకవర్గానికి సంబంధించిన అభివృద్ధి నిర్మాణ పనుల నిర్వహణ, పురోగతిపై ఆయన జోనల్ కమిషనర్ టీ. వెంకన్నతో కలిసి గురువారం చాంద్రాయణగుట్ట నర్కిపూల్ బాగ్ లోని జోనల్ కమిషనర్ కార్యాలయంలో కార్పొరేటర్లు, పలు విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పలు ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి నిర్మాణ పనుల పురోగతి, నాలాల విస్తరణ, ఇంజనీరింగ్, ప్రాజెక్ట్స్, ఆరోగ్యం, పారిశుధ్యం, టౌన్ ప్లానింగ్, వీధి దీపాలు తదితర విభాగాలకు సంబంధించిన అంశాలపై అధికారులతో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని కిషన్ బాగ్, రామ్నస్‌పురా, దూద్ బౌలి, జహనుమా, ఫలక్ నుమా, నవాబ్ సాహెబ్ కుంట డివిజన్లలో కొనసాగుతున్న అభివృద్ధి నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. నాలాలు, డ్రయినేజీ పూడికతీత పనులను వెంటనే పూర్తి చేసి రానున్న భారీ వర్షాలకు వరద నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. రోడ్లు, విధి దీపాలు, పారిశుధ్య, చెట్ల కొమ్మలు, డ్రయినేజీ, టౌన్ ప్లానింగ్ సమస్యల ను ఎప్పటికపుడు పరిష్కరించాలన్నారు. నిర్మాణ పనులను వేగంగా చెప్పటి స్థానిక బస్తీల ప్రజలకు ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. గుంతలుగా మారిన రోడ్లకు మరమత్తులు నిర్వహించాలన్నారు. పారిశుద్ధ సమస్యలు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు మహమ్మద్ అబ్దుల్ ముక్తాదిర్, మహమ్మద్ ఖాదర్, కాజా ముబాశ్రుద్దిన్, ఫలక్ నుమా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఈఈ ప్రకాశం, టౌన్ ప్లానింగ్ డిప్యూటీ సీపి మహమ్మద్ అబ్దుల్ మాజీద్, డీఈలు, ఏఈలు పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మెన్‌గా
అయిత ప్రకాష్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

- హాజరైన మంత్రి శ్రీధర్ బాబు, ఎంపీ కడియం కావ్య, పలువురు ఎమ్మెల్యేలు



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మెన్‌గా అయిత ప్రకాష్ రెడ్డి గురువారం హైదరాబాద్, బషీర్ బాగ్ లోని శక్కర్ భవన్‌లో అట్టహాసంగా పదవి బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, ఎంపీ కడియం కావ్య, పలువురు ఎమ్మెల్యేలు ఆయనను కుర్చీలో కూర్చోబెట్టి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రకాష్ రెడ్డి మాట్లాడారు తనకు కాంగ్రెస్ పార్టీ 2002లో ఎంపీపీగా అవకాశం కల్పించిందని, అలాగే భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఉన్నానని గుర్తు చేశారు. తనకు ఇచ్చిన ఈ బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని ఆయన హామీ ఇచ్చారు.సీఎం ఎ.రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు ఇచ్చిన ఈ అవకాశాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకుని ప్రజలందరికీ న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.తమ శాఖ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా సీఎం ఎ.రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ సహకార యూనియన్ లిమిటెడ్ చైర్ పర్సన్‌గా
మానాల మోహన్ రెడ్డి బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి గురువారం హైదరాబాద్ లోని సహకార యూనియన్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, నిజామాబాద్ పార్లమెంట్ బాధ్యులు జీవన్ రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మినరల్ కార్పొరేషన్ చైర్మెన్ ఈరవత్రి అనిల్, మాజీ ఎంపీ మధు యాష్కీ గౌడ్, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ సిరిసిల్ల రాజయ్య, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, ఏఐసీసీ పరిశీలకులు రోహిత్ చౌదరి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మెన్ తహీర్ బిన్ హందాన్, ఆగ్రో ఇండస్ట్రీక్ చైర్మెన్ కాసుల బాలరాజు, మార్క్ ఫెడ్ చైర్మెన్ మరా గంగారెడ్డి, గడుగు గంగాధర్, నాగేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, నిజామాబాద్ నగర అధ్యక్షులు కేశ వేణు, వడ్డేపల్లి సుభాష్ రెడ్డి, మాజీ డీసీపీ అధ్యక్షులు కొమురయ్య, బాల్కొండ సునీల్ రెడ్డి, ఆర్మూర్ వినయ్ రెడ్డిలు పాల్గొని మానాల మోహన్ రెడ్డికి పూలమాలలు, శాలువాలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కష్టపడి పని చేసిన వారిని గుర్తిస్తుందని, అందుకు మోహన్ రెడ్డి నిదర్శనమన్నారు. అనంతరం చైర్మెన్ మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ తనను రాష్ట్ర చైర్మెన్‌గా నియమించినందుకు సీఎం ఎ.రేవంత్ రెడ్డికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా ఇందుకు సహకరించిన జిల్లా కాంగ్రెస్ పెద్దలు సుదర్శన్ రెడ్డి, షబ్బీర్ అలీ, జీవన్ రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.తనకు ఇచ్చిన ఈ బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని, తనపై నమ్మకంతో ఇచ్చిన సహకార రంగాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లాకు చెందిన వివిధ మండలాల అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్లమెంటులో బీసీ బిల్లుకు మద్దతు తెలపాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్.కృష్ణయ్య
- ఎంపీ అక్బరుద్దీన్ ఒవైసీకి వినతి



నవతెలంగాణ-ముషీరాబాద్

పార్లమెంటులో బీసీ బిల్లు కు మద్దతు తెలపాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్.కృష్ణయ్య ఎంపీ అక్బరుద్దీన్ ఒవైసీని కలిసి చర్చలు జరిపి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాటాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు గడిచిన బీసీలకు రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్య హక్కులు కల్పించలేదని ఇప్పటికీ బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాలలో జనాభా ప్రకారం వాటా దక్కడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం బీసీ వ్యతిరేకత అవలంభిస్తుందని బీసీలకు ఏ రంగంలో కూడా ప్రజాస్వామిక విద్యా, ఉద్యోగ, ఆర్థిక వాటా ఇవ్వడం లేదని రాజకీయ, పారిశ్రామిక జనాభా ప్రకారం వాటా ఇవ్వడం లేదు. 76 సంవత్సరాలుగా బీసీలకు అన్యాయం చేశారు. ఇప్పటికీ కూడా న్యాయం చేయాలని ఆలోచించడం లేదు. అణిచివేత, దోపిడీ, పీడన, వివక్ష, అన్యాయం, బానిసత్వకు వ్యతిరేకంగా మానవ జాతి తిరుగుబాట్లు జరుగుతున్న చరిత్రను మనం చూస్తున్నాం. భారతదేశంలో అనేక సెంటిమెంట్లతో ఇంకా బీసీలను తప్పుదారి పట్టించడం, మభ్యపెడుతున్నారన్నారు. ప్రజలను అన్ని రంగాలలో అభివృద్ధి పరచాలని ధృడ నిర్ణయం చేయడానికి అన్నీ పార్టీలు ముందుకు రావాలని ఆర్.కృష్ణయ్య కోరారు. రాజకీయ రంగంలో బీసీల ప్రాతినిధ్యం 14శాతం దాటలేదని కేంద్ర ప్రభుత్వం ఇటీవల సేకరించిన గణాంకాల ద్వార తెలిసింది. కేంద్రమంత్రి వర్గంలో, రాష్ట్ర మంత్రి వర్గంలో, లోక్ సభ, రాజ్య సభ, రాష్ట్ర అసెంబ్లీలు, కౌన్సిల్లలో 75 సంవత్సరాల బీసీల ప్రాతినిధ్యం సర్వే చేసి లెక్కించగా, 14 శాతం దాటలేదంటే బీసీలకు ఈ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎంత అన్యాయం జరిగిందో తెలుస్తుందన్నారు. మజ్లిస్ పార్టీ తరపున పార్లమెంటులో ప్రయివేటు బీసీ బిల్లు పెడతామని ఓవైసీ హామీ ఇచ్చారు. అందుకు ఇతర పార్టీలను కూడగట్టాలని కోరారు. మజ్లిస్ పార్టీ బీసీల 14 డిమాండ్లు న్యాయమైనవని సమర్థించారని తెలిపారు. ఈ చర్చలలో బీసీ నాయకులు గుజ్జ కృష్ణ, అనంతయ్య, రాజేందర్, కోలా జనార్దన్, శివ ముదిరాజు తదితరులు పాల్గొన్నారు.

'డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దు'

- తెలంగాణ యాంటీ నార్కోటిక్ ఎస్పీ సీతారాం



నవతెలంగాణ-హిమాయత్ నగర్

డ్రగ్స్, గంజాయి లాంటి మాదకద్రవ్యాలకు అలవాటు పడి బంగారం లాంటి మానవ జీవితాన్ని నాశనం చేసుకోవద్దని తెలంగాణ యాంటి నార్కోటిక్ ఎస్పీ సీతారాం యువతకు సూచించారు. తెలంగాణ నవనిర్మాణ్ విద్యార్థి సేన ఆధ్వర్యంలో గురువారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో 'డ్రగ్స్ ఫ్రీ తెలంగాణకై మేము సైతం' యంగ్ సైరన్ పేరుతో నిర్వహించిన సమావేశంలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏసీపీ కె.ఎస్.రావు, సుబ్బిరామిరెడ్డిలతో ఎస్పీ సీతారాం కలిసి మాట్లాడుతూ నేటి రోజుల్లో యువత సన్మార్గంలో నడిచి ఉన్నత ప్రయోజనాలు పొంది తల్లిదండ్రుల రుణం తీర్చుకోవాలని ఆయన సూచించారు. కొంత మంది యువత మాదకద్రవ్యాలకు, వ్యసనాలకు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్, గంజాయి, మాదక ద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులతో పాటు యువత ముందుకు రావాలని సూచించారు. అనంతరం తెలంగాణ నవనిర్మాణ్ విద్యార్థి సేన అధ్యక్షులు టి.కె.శివప్రసాద్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు, చెడు వ్యసనాలకు బానిసలవుతున్న యువతకు అవగాహన కల్పించడమే తమ సంస్థ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. వీటిపై వస్తున్న ప్రమాదాలపై రాష్ట్ర వ్యాప్తంగా యువత, విద్యార్థులలో చైతన్యం, అవగాహన తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది మురళీధర్ రావు, ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ సునీల్ కొరెడ్డి, పీసీసీ సభ్యులు చిట్టెం అభినయ్, బీజేపీ ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు భిశ్వ ఓం ప్రకాష్, సంస్థ నాయకులు చింతల పవన్, రిషబ్ జైన్, ఎస్.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్‌కు కాలనీ వాసుల వినతి



నవతెలంగాణ-ఓయూ

తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతె శోభన్ రెడ్డిని తార్నాక డివిజన్‌లోని ఆర్యనగర్ కాలనీవాసులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్యనగర్‌లోని రోడ్డు సమస్యలు, పారిశుధ్య, డ్రయినేజీ సమస్యలను పరిష్కరిం చాలని వినతి పత్రం అందజేశారు. త్వరితగతిన సంబంధిత మున్సిపల్ అధికారులు, సిబ్బందికి సమస్యలు పరిష్కారించాలని డిప్యూటీ మేయర్ ఆదేశించగా కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి

- బోరబండ కార్పొరేటర్ బాబా ఫసివుద్దీన్



నవతెలంగాణ-హైదరాబాద్ డెస్క్

వర్షకాలంలో అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు బోరబండ కార్పొరేటర్ బాబా ఫసివుద్దీన్ సూచించారు. బోరబండ డివిజన్‌లో దోమల బెడద ఎక్కువ అవ్వడంతో వాటిని నిర్మూలించడంకోసం, బోరబండ సమీపంలోని సున్నం చెరువును కూకట్పల్లి జోన్ అండ్ శేరిలింగంపల్లి జోన్ సీనియర్ ఎంటోమోలోజిస్ట్ ఎస్. సంధ్య తో కలిసి కార్పొరేటర్ సందర్శించారు. అనంతరం చెరువులో ఉన్న గుర్రపుడెక్క వెంటనే తొలగించాలని, కెమికల్ స్ప్రే చేయించాలని, ఆయిల్ బాల్ వేయాలని అదికారులకు సుచించారు. అదే విధంగా ప్రతిరోజూ సాయంత్రం పార్కులలో, వీధులలో నీరు నిల్వ ఉన్నచోట మలాతిన్ ఫోగ్గింగ్ చేయాలన్నారు. చెత్తను ప్రతిరోజు తొలగించాలని తెలిపారు. అన్ని చర్యలు తీసుకుంటామని అధికారులు కార్పొరేటర్‌కు చెప్పారు.

ఇన్‌స్పైర్ అవార్డులకు
విద్యార్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

- 2024-25కు ప్రారంభమైన నమోదు ప్రక్రియ : డీఈవో రోహిణి



డీఈఓ రోహిణి

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రస్తుత విద్యాసంవత్సరం 2024-25కుగాను ఇన్‌స్పైర్ అవార్డులకు జిల్లాలోని విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి రోహిణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులో వైజ్ఞానిక అంశాలపై ఆసక్తిని పెంచడం, విద్యార్థులో సృజనాత్మకతను, వినూత్న ఆలోచనలకు పెంపోందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుంది. వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థులు తమ సృజనాత్మకమైన ప్రాజెక్ట్‌లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడానికి గడువు సెప్టెంబర్ 15 తేదీ వరకు ఉందని డీఈవో తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు తమ వివరాలు, బ్యాంకు ఖాతా, ఆధార్ వారి ప్రాజెక్ట్ వివరాలను www.inspireawards-dst.gov.in వెబ్‌సైట్‌లో ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న తమ పాఠశాల లాగిన్ ద్వారా గడువు లోపు జిల్లాలోని ప్రతి పాఠశాల తప్పని సరిగా 5 ప్రాజెక్ట్‌లు నమోదు చేయాలని తెలిపారు. అవార్డుకు ఎంపికైన ప్రతి విద్యార్థికీ జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో తమ ప్రాజెక్టును ప్రదర్శించేందుకు వీలుగా పదివేల రూపాయల పారితోషికంతో పాటు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని తమ సత్తా చాటితే.. 20వేల రూపాయల వరకు తమ ప్రాజెక్ట్‌ను మెరుగుపరుచుకునేందుకు కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ అదనపు నిధులను కేటాయిస్తుందని చెప్పారు. ఆన్‌లైన్‌లో ఉచితంగా విద్యార్థుల పేర్లు నమోదు చేసుకునే అవకాశం కల్పించారని తెలిపారు.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు 'ఇన్‌స్పైర్' దోహదం

విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీసేందుకు ఇన్ స్పైర్ ఎంతగానో దోహదపడుతుందని జిల్లా సైన్స్ అధికారి సి.ధర్మేందర్ రావ్ అన్నారు. దేశవ్యాప్తంగా 5 లక్షల పాఠశాలలకు అవకాశం కల్పించారని, సెప్టెంబర్ 15 వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని ఆయన తెలిపారు. ఈ ఏడాది దరఖాస్తులు పెంచడమే లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామన్నారు. డీఈవో ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలల నుంచి అయిదుగురు విద్యార్థుల పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చెయ్యాలని, ప్రధానోపాధ్యాయులు, గైడ్ టీచర్స్ దరఖాస్తులు పెంచడమే లక్ష్యంగా ప్రణాళిక చేసుకోవాలని డీఎస్‌వో ఆదేశించారు.



డీఎస్ఓ సి.ధర్మేందర్

ప్రభుత్వ బడులను సుందరంగా తీర్చిదిద్దాలి

- అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులన్నీ 15 రోజుల్లో పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి





నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వ పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దడం మనందరి బాధ్యత అని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. గురువారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతిపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిదని, అందుకోసం అధికారులందరూ తపస్సులా పనిచేసి పనులను పూర్తి చేయాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా పాఠశాలల్లో చేపట్టిన మైనర్ రిపేర్, ఎలక్ట్రిఫికేషన్, డ్రింకింగ్ వాటర్, టాయిలెట్స్, రెన్నోవేషన్ 80 శాతం పూర్తయిన వాటిని వారం రోజుల్లోగా, మిగతా వాటిలో పనులను 15 రోజుల్లోగా అధికారులు సమన్వయంతో పూర్తిచేయాలని ఆదేశించారు. జిల్లాలోని 384 అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని, పూర్తయిన పనులకు వర్క్ కంప్లేషన్ సర్టిఫికెట్ సమర్పించాలని సూచించారు. గతంలో పాఠశాలల్లోని పరిస్థితులు.. ప్రస్తుతం అమ్మ ఆదర్శ పాఠశాల్లో భాగంగా పనులు చేపట్టిన తర్వాత వాటి పరిస్థితిపై డాక్యుమెంటేషన్ రూపొందించాలని సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్. రోహిణి, టీజీఈ డబ్ల్యూఐడీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ షఫీ మియా, టీజీఎమ్ఎస్ ఐడీసీ ఎగ్జిట్ ఇంజనీర్లు చలపతిరావు , డిప్యూటీ ఈవోలు, ఐవోఎస్‌లు, ఏఈలు పాల్గొన్నారు.

వినూత్న ఆవిష్కరణలకు వేదిక 'ఇంటింటా ఇన్నోవేటర్'

- వచ్చేనెల 3వరకు దరఖాస్తులకు అవకాశం: జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రత్యేక ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటా ఇన్నోవేటర్ సెల్ ఏర్పాటు చేసిందని, గృహిణి నుంచి పాఠశాలలు, కళాశాలల స్థాయి విద్యార్థులు, విద్యావేత్తలు, వ్యవసాయదారులు ఎవరైనా ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంలో పాల్గొనవచ్చని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. గురువారం కలెక్టర్ కార్యాలయ కాన్ఫరెన్స్ హల్‌లో ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక సమస్యలను పరిష్కరించే వినూత్న ఆవిష్కరణలు పంపించే అవకాశం ఇంటింటా ఇన్నోవేటర్ కల్పిస్తుందన్నారు. వినూత్న ఆవిష్కరణలకు దరఖాస్తుకు వచ్చేనెల 3వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరికి అవకాశం కల్పించాలని ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యేక ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఇంటింటా ఇన్నోవేటర్ సెల్ ఏర్పాటు చేసిందని తెలిపారు. వచ్చేనెల 3వ తేదీ లోపు ఆవిష్కరణ వివరాలను తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ వాట్సాప్ నంబర్ 9100678543కు పంపించాలని వివరించారు. ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఆవిష్కరణల ప్రదర్శన ఉంటుందన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా డీఈవో ఆర్.రోహిణి, జిల్లా సైన్స్ అధికారి సి.ధర్మేందర్ రావ్, జిల్లా ఉప విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఇన్నోవేషన్ మిత్ర వినీత్ సిధార్ తదితరులు పాల్గొన్నారు.

దేశానికి విద్యార్థులు పేరు తేవాలి : ఎమ్మెల్యే శ్రీ గణేష్



నవతెలంగాణ-హైదరాబాద్ డెస్క్

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరూ దేశానికి పేరు తెచ్చే మంచి పౌరుల్లా ఎదగాలని, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ కోరారు. గురు వారం బోయిన్‌పల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో తెలంగాణ ప్రగతి సేవా సమితి చారిటబుల్ ట్రస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు .అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కాంక్షించారు. విద్యార్థి దశ నుంచే దిశ దశను ఏర్పాటు చేసుకుంటే భవిష్యత్తులో మంచి పదవులు పొందవచ్చన్నారు. చదువుతోపాటు ఆటల్లోనూ రాణించాలని, దేశానికి పేరు తెచ్చే మంచి క్రీడాకారులు కూడా విద్యార్థుల నుంచి కావాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలన్నిటిని కార్పొరేట్ పాఠశాల స్థాయికి దీటుగా మారుస్తామని హామీ ఇచ్చారు. అంతకు ముందు పాఠశాల ఆవరణలో మొక్కలు ఆయన నాటారు. ఈ కార్యక్రమంలో జంపన్న ప్రతాప్, బలవంత రెడ్డి,నర్సింగ్ ముదిరాజ్,క్రాంతి ముదిరాజ్, సయ్యద్, రియాజ్ ఉద్దిన్, సదా, మారుతి గౌడ్, హరికష్ణ, ఓం ప్రకాష్, అమీర్ తదితరుల పాల్గొన్నారు,..

డ్రగ్స్ మత్తు పదార్థాలను నిర్మూలిద్దాం



- ఎన్‌బీటీనగర్ ప్రభుత్వ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బి. రవీందర్ రెడ్డి
- ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో అవగాహన

నవ తెలంగాణ - బంజారా హిల్స్...

విద్యార్థులు, యువత డ్రగ్స్ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని.. అలాగే డ్రగ్స్ పదార్థాలను నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని ఎన్‌బీటీ నగర్ ప్రభుత్వ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు బి రవీందర్ రెడ్డి అన్నారు. "డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం - సమాజాన్ని మేలుకొలుపుదాం" అనే అంశంపై గురువారం ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో బంజారాహిల్స్ రోడ్డు నెంబర్ 12 ఎన్‌బీటీనగర్ ప్రభుత్వ హైస్కూల్‌లో డ్రగ్స్ పై అవగాహన కల్పించడం కోసం ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ప్రధానోపాధ్యాయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒకప్పుడు దేశ అభివృద్ధిలో ప్రముఖ పాత్ర పోషించిన యువత ఇప్పుడు డ్రగ్స్ మత్తు పదార్థాల వ్యసనాల్లో, మత్తులో ఊగిసలాడుతూ జీవితాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసుకుంటున్నారన్నారు. ఆధునిక విద్యార్థులు, యువత డ్రగ్స్ మత్తు పదార్థాలకు బానిసై బంగారు లాంటి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, మంచి మార్గంలో నడవాలని సూచించారు. ఆరోగ్యాన్ని నాశనం చేసే ఈ డ్రగ్స్ భూతాన్ని అంతం చేయడం ప్రతి ఒక్కరీ బాధ్యత అని గుర్తు చేశారు.

అనంతరం అతిథిగా విచ్చేసిన పట్నం రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రసాద్ మాట్లాడుతూ..ప్రపంచాన్ని విడిస్తున్న భయంకరమైన డ్రగ్స్ భూతాన్ని మన దరిచేరకుండా తరిమికొట్టాలని అన్నారు. దేశ అభివృద్ధిలో ప్రముఖ పాత్ర పోషించవలసిన యువకులు, విద్యార్థులు డ్రగ్స్ బారినపడి జీవితాలను అంధకారంలోకి నెట్టి వేసుకుంటున్నారన్నారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల విచక్షణ కోల్పోతారని, అరవడం,కేకలు వేయడం డిప్రెషన్ లోకి వెళ్లిపోవడం జరుగుతుందని తెలిపారు. దొంగతనాలు చేయడం దోపిడీలు చేయడం,ఎలాంటి పనులకైనా సిద్ధపడే టట్టుగా డ్రగ్స్ మనిషిని తయారు చేస్తుందన్నారు. డ్రగ్స్ మాఫియా స్కూల్లో చదువుకునే చిన్న చిన్నపిల్లలకు కూడా వదలకుండా చాక్లెట్ల రూపంలో అంటిస్తూ వ్యాపారానికి కొందరు కొనసాగిస్తున్నారని.. ఇలాంటి వారిపై రాష్ట్ర ప్రభుత్వం జైల్లో పెట్టి కఠిన శిక్షలు విధించాలని విజ్ఞప్తి చేశారు.

కే శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఇంట్లో తల్లిదండ్రులు తన పిల్లలు స్కూలుకు గాని కాలేజీ గాని వెళ్ళినప్పుడు వాళ్ల ప్రవర్తన మీద దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. కుటుంబం ప్రేమానురాగాలు అందించడం మూలాన మత్తు పదార్థాలకు దూరంగా ఉండే అవకాశం ఉందన్నారు. సమాజంలో ఒక మంచి కొడుకును, దేశానికి మంచి పౌరుడుగా తీర్చిదిద్దవలసిన ముఖ్యమైన పాత్ర తల్లిదండ్రులు అలాగే ఉపాధ్యాయులు మీద ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి పి కళ్యాణ్, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి నాగటి మారన్న ,ప్రజానాట్యమండలి నగర కార్యదర్శి డి మహారాజ్, నగర ఉపాధ్యక్షులు బి ఆర్ నాయుడు, పి మల్లేష్ గౌరీ నాయుడు రవి నాయక్ టీచర్స్ ప్రైమరీ హై స్కూల్ హెచ్ఎం శ్రావణ్ కుమార్, అనిత తదితరులు పాల్గొన్నారు.

కేకేసి రాష్ట్ర కార్యదర్శిగా సత్యనారాయణ



నవతెలంగాణ-హైదరాబాద్ డెస్క్

ఆలిండియా అసంఘటిత కార్మికులు ఉద్యోగుల కాంగ్రెస్ (కేకేసీ) రాష్ట్ర బిల్డింగ్ ఇతర నిర్మాణాల సంయుక్త కార్యదర్శిగా కంటోన్మెంట్ రసూల్‌పురాకు చెందిన జి సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు సత్యనారాయణకు ఆ విభాగపు జాతీయ చైర్మెన్ డాక్టర్ ఉదిత్ రాజ్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ కంటోన్మెంట్‌లో పార్టీ అధిష్టానం తనపై నమ్మకంతో పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పదవికి న్యాయం చేస్తానని, విభాగపు అభివృద్ధి కోసం కృషి చేస్తానని చెప్పారు.

రవీంద్రనగర్ కాలనీలో కార్పోరేటర్ పర్యటన



నవతెలంగాణ-ఓయూ

హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ గురువారం రవీంద్రనగర్ కాలనీ వీరారాజిరెడ్డి పార్క్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అసంపూర్తిగా ఉన్న పార్కు అభివద్ధి, అండర్ గ్రౌండ్ డ్రయినేజీ పనులను పార్క్ కమిటీ సభ్యులు కార్పొరేటర్ దష్టికి తీసుకొచ్చారు. అనంతరం వీధి నెం 8లోని బందావన్ కాలనీలో కారొపరేటర్ పర్యటించారు. వర్షపు నీరు, నీరు నిలిచిపోవడం, కొత్త రోడ్లు, కమ్యూనిటీ హాల్, సీసీ కెమెరాలు, పార్క్ సమస్యలపై స్థానికులు కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం రజనీకాంత్, ఏఈ సాయికిరణ్,అన్నం రాఘవరెడ్డి, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.



ఓయూ బయోమెడికల్ విద్యార్థులకు ఉద్యోగాలు

నవతెలంగాణ-ఓయూ

డిపార్ట్మెంట్ ఆఫ్ ఇండస్ట్రియల్ పాలసీ అండ్ ప్రమోషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి పరీక్షల్లో ఓయూ ఇంజనీరింగ్ కళాశాల, బయోమెడికల్ ఇంజనీరింగ్ విభాగం (బీఎంఈ) విద్యార్థులు పదిమంది ఉద్యోగాలు పొందారు. ఇండియన్ పేటెంట్ ఆఫీసులో గ్రూప్ - ఎ క్యాడర్ లో పేటెంట్ ఎగ్జామినర్ అండ్ డిజైన్ పరీక్షలు జాతీయస్థాయిలో నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ పరీక్షల్లో 53 పోస్టులు ఉండగా కేవలం ఒకే విభాగం నుంచి 10 విద్యార్థులు ఉద్యోగాలు పొందటం విశేషం. ఈ సందర్భంగా విద్యార్థులను ఓయూ రిజిస్ట్రార్ ప్రో.పి. లక్ష్మీనారాయణ, ఉన్నత విద్యా మండలి సెక్రటరీ ప్రొ. శ్రీరామ్ వెంకటేష్ ,ఓయూ యూజీసీ డీన్ ప్రో.జి.మల్లేశం, కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పి . చంద్రశేఖర్ , విభాగం హెడ్ ప్రొఫెసర్ ఎం మాలిని, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మెన్ డాక్టర్ డి. సుమన్, విభాగం అధ్యపకులు డా.ఎం.శ్రీనివాస్, డా.జి.శ్రవణ్య , డా.కె.విద్యా సాగర్‌లు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందిస్తు శుభాకాంక్షలు తెలియజేశారు. ఉద్యోగాలు పొందిన వారిలో సాయి ఇషిత, షర్మిల చౌదరి , హర్షిని యుక్త, బి. రక్షిత రెడ్డి , వేదవ్యాస్ , ఎం. సాగర్ కుమార్, సిహెచ్. జయ గాయత్రి , ఎం. రాణి , డి. కేజియా పార్లు, రామేశ్వర్ రాథోడ్ ఉన్నారు. వారు మాట్లాడుతూ తమకు విభాగంలో అందించిన విద్యా, శిక్షణలు ఈ ఉద్యోగం పొందటానికి ఎంతగానో దోహదపడినట్టు పేర్కొన్నారు.



ముకుంద జ్యువెలర్స్ ప్రారంభం

- అందరికీ అందుబాటు ధరల్లో నాణ్యమైన నగలు అందించడమే లక్ష్యం : నికిత రెడ్డి

నవతెలంగాణ-బంజారాహిల్స్

వినియోగదారులకు నాణ్యమైన ఆభరణాలను సరసమైన ధరలకు అందించే లక్ష్యంతో ముకుంద జువెలరీస్ షోరూంను సోమాజిగూడలో ప్రారంభించినట్టు నిర్వాహకులు నిఖితారెడ్డి తెలిపారు. గురువారం సోమాజిగూడలో ముకుంద జ్యువెలర్స్ షో రూమ్‌ను సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీత అతిథిగా హాజరై నిఖితారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఇప్పటికే కొత్తపేట, కేపీహెచ్‌బీ, ఖమ్మంలలో షోరూంలు కొనసాగుతుండగా తాజాగా సోమాజిగూడలో 4వ శాఖను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ బ్రాంచ్ ఫ్యాక్టరీ అవుట్ లెట్‌గా సేవలు అందిస్తుందని చెప్పారు. ఆషాఢ మాసం సందర్భంగా 20 శాతం డిస్కౌంట్‌తో పాటు మేకింగ్ చార్జెస్ లేకుండా ఆభరణాలను విక్రయిస్తామని తెలిపారు. మేనేజింగ్ డైరెక్టర్ నరసింహారెడ్డి, నిర్వాహకులు, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



13న జగన్నాథ రథయాత్ర

నవతెలంగాణ-బంజారాహిల్స్

ఈ నెల 13న మియాపూర్ ఇస్కాన్ ఆలయం ఆధ్వర్యంలో జరిగే జగన్నాథ రథయాత్ర మధ్యాహ్నం రెండు గంటలకు మదినగూడ నుంచి ప్రారంభమై జేపీ నగర్ ఆల్విన్ కాలనీ మీదుగా మియాపూర్ ఆలయానికి సాయంత్రం 6 గంటలకు గంటలకు చేరుకొని ముగుస్తుందని మియాపూర్ ఇస్కాన్ ఆలయ అధ్యక్షులు శివరాందాస్ తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. అతి ప్రాచీనమైన ఉత్సవం 100 సంవత్సరాల పైబడి నిర్వహిస్తున్న జగన్నాథ రథయాత్రకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. రథయాత్ర ముగియగానే రాత్రి 10 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు మహాభారత, రామాయణ పారాయణాలు మహా యజ్ఞం కొనసాగుతుందని. ప్రతి ఒక్కరికి భోజన వసతి ఉంటుందని తెలిపారు. కుటుంబ సమేతంగా తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనికోరారు.ఈ కార్యక్రమంలో ఆనంద్,గోపీనాథ్, మధుషామ్,మనుమహారాజ్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

ఓయూలో ఔట్ సోర్సింగ్ విధానాన్ని ఎత్తివేయాలి



- ఓయూ కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షులు టి.మహేందర్

నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీలో ఔట్ సోర్సింగ్ విధానాన్ని ఎత్తివేసి ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ఓయూ కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షులు టి.మహేందర్ కోరారు. గురువారం ఓయు ఆర్ట్స్ కాలేజ్ ఎదుట ఓయూ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ యూనియన్ (సీఐటీయూ)ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓయూ ఉద్యోగులు దాదాపు 30 సంవత్సరాల నుంచి అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారని తెలిపారు. సంవత్సారాలు గడుస్తున్న వీరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఓయూలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు యూనివర్సిటీ ద్వారా వేతనాలు ఇవ్వకుండా ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టు అనే దళారి వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. దాంతో కార్మికులకు వేతనాలు సమయానికి రాక, మూడు సంవత్సరాలు గడిచినా వేతనాలు పెరగక వారు తీవ్ర అన్యాయానికి గురవుతున్నరన్నారు. ఔట్ సోర్సింగ్ విధానాన్ని ఎత్తివేసి యూనివర్సిటీ ద్వారా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల,ప్రజా ,కార్మిక వ్యతిరేక పరిపాలన సాగిస్తున్నదని విమర్శించారు. యూనివర్సిటీల గ్రాంట్స్ విడుదల చేయకుండా యూనివర్సిటీలను నిర్వీర్యం చేస్తున్నారని, పోస్టులను భర్తీ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్‌లతో సుమారు 40 కోట్ల మంది అసంఘటిత రంగ కార్మికులు బానిసత్వంలోకి నెట్టేటువంటి ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించి పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి సీతారాం, ఉపాధ్యక్షులు. శ్రీను, నాగరాజు, సహాయ కార్యదర్శులు శివ, మహేందర్ పాషా,చారి, పుష్పకుమార్. లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ నేతకు రాజ్యసభ అవకాశం కల్పించాలి

- ఎల్‌హెచ్‌పీఎస్ ఏక్ మాత్రో



నవతెలంగాణ - బంజారాహిల్స్

ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన నాయకుడికి రాజ్యసభలో అవకాశం కల్పించాలని కాంగ్రెస్ అధిష్టానానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎల్‌హెచ్‌పీఎస్ ఏక్ మాత్రో విజ్ఞప్తి చేసింది. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాత్రో అధ్యక్షుడు మంగీలాల్ నాయక్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటూ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు దోహదపడ్డ లంబాడి సామాజిక వర్గానికి తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ముఖ్యంగా ఎంతో కాలంగా పార్టీలో కొనసాగుతూ పార్టీ అభివృద్ధికి శ్రమించిన డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణ నాయక్‌కు తగిన గుర్తింపు ఇవ్వాలన్నారు. లక్ష్మీనారాయణకు రాజ్యసభ అవకాశం కల్పించాలని లేనిపక్షంలో ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చి మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. తమకు తగిన ప్రాధాన్యత కల్పిస్తే పార్టీకి మరింత మద్దతు పలుకుతూ ముందుకు సాగుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా మాట్లాడితే సహించం



- బీఆర్ఎస్వీ నాయకులు కడారి స్వామి, పడాల సతీష్

నవతెలంగాణ-ఓయూ

మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ గురించి ఇష్టానుసారంగా మాట్లాడితే సహించేది లేదని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కడారి స్వామి, పడాల సతీష్ అన్నారు. గురువారం ఓయూలా కళాశాల వద్ద ప్రెస్‌మీట్‌లో కడారి స్వామి మాట్లాడుతూ గాదరి కిషోర్‌ను దూషించే నైతిక హక్కు రాయ్ , వెంకటేష్ , కైలాష్‌లకు లేదన్నారు. గాదరి కిశోర్ కడిగిన ముత్యం అని, మానవతారాయ్ గాదరి కిశోర్ గురించి మాట్లాడితే దేహశుద్ధి చేస్తామన్నారు. పడాల సతీష్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ఓయూ విద్యార్థులు బీరు, బిర్యానీలకు ఆశ పడుతారు అన్నప్పుడు మానవతరాయ్ ఎక్కడ పడుకున్నాడని ప్రశ్నించారు. ఎన్నికల ముందు మూట కోసం బీఆర్ఎస్‌లో చేరి రేవంత్ రెడ్డిని నోటికొచ్చినట్టు మాట్లాడారని.. ఆయన ఇప్పుడు నీతులు చెబితే ఎవరూ నమ్మరన్నారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు జహీర్ఖాన్, జంగం అవినాష్, నూకల యుగంధర్ రెడ్డి, శ్రీకాంత్ గౌడ్, ఎన్ రాజు, జిల్లా నాగయ్య, మిథున్ ప్రసాద్, బాలు పాల్గొన్నారు.

వైన్ షాప్ వద్ద ఫిట్స్ వచ్చి వ్యక్తి మృతి



నవతెలంగాణ-హైదరాబాద్ డెస్క్

వైన్ షాప్‌లో మద్యం కొనుగోలు చేసి తీసుకెళ్తుండగా ఓ వ్యక్తికి ఫిట్స్ వచ్చి మృతి చెందిన ఘటన సనత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మోతీ నగర్ గెలాక్సీ వైన్స్ వద్ద బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో సుమారు 40 సంవత్సరాలు ఉన్న వ్యక్తి వచ్చి మద్యం కొనుగోలు చేసి తిరిగి వెళుతుండగా అతనికి ఫిట్స్ వచ్చి కింద పడిపోయాడు. గమనించిన తిరుపతి అనే వ్యక్తి వెంటనే 108కు కాల్ చేయగా అంబులెన్స్ అక్కడికి చేరుకోగా ఆ వ్యక్తిని పరీక్షించి అప్పటికే చనిపోయినట్టు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని పరిసర ప్రాంతాలలోని వారిని విచారించినప్పటికీ అతనిని ఎవరూ గుర్తించలేదు. చనిపోయిన వ్యక్తి డార్క్ బ్లూ కలర్ షర్టు, బ్లాక్ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నట్టు, తన కుడి చేతి పై- ఓం అనే టాటూ ఉన్నట్టు గుర్తించారు కేసు నమోదు చేసుకున్న సనత్ నగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. చనిపోయిన వ్యక్తి వివరాలు ఎవరికైనా తెలిసిన యెడల సనత్ నగర్ పోలీస్ స్టేషన్ సెల్‌నెంబర్‌లు 94906 17132 , 8712568233 తెలియపరచాలని ఇన్‌స్పెక్టర్ కోరారు. మృతదేహాన్ని గాంధీ హాస్పిటల్ కు తరలించామని తెలిపారు.

'వీఆర్వోలను రెవెన్యూ శాఖలోకి తీసుకోవాలి'

నవతెలంగాణ-బంజారా హిల్స్

వీఆర్వోలను రెవెన్యూ శాఖలోకి తీసుకోవాలని వీఆర్వో జేఏసీ చైర్మెన్ గోల్కొండ సతీష్,అదనపు ప్రధాన కార్యదర్శి పల్లెపాటి నరేష్‌లు కోరారు. బంజారాహిల్స్‌లో గురువారం జేఏసీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను ఆయన నివాసంలో కలిసి గ్రామ వార్డు స్థాయి అధికారి లేక ప్రజలు అనేక ఇబ్బందులు గురవుతున్నారని తెలియజేస్తూ వినతి పత్రాన్ని అందజేశారు. హైదరాబాద్‌లో ఖరీదైన ప్రభుత్వం భూముల పరిరక్షణ,రెవెన్యూ శాఖలో సరిపడా సిబ్బంది లేక ప్రజల అవసరాల కోసం వివిధ ధ్రువపత్రాల విషయంలో వేలకొద్దీ అప్లికేషన్లు పరిష్కారంలో జాప్యం జరగడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. సిబ్బందిని పెంచి ప్రజలకు మెరుగైన సేవలు అందించే విధంగా చూడాలని కోరారు. రద్దయిన వీఆర్వోలను మరల రెవెన్యూ శాఖలోకి తీసుకువచ్చి సరి సమానమైన హెూదాతో పాటు ప్రమోషన్లు కల్పించి హైదరాబాదు రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయాలని సీఎంకు రెవెన్యూ జేఏసీ ఉపాధ్యక్షులు చింతల మురళి, జేఏసీ నాయకులు రాము,హైదరాబాద్ నగర కార్యదర్శి శేఖర్,శ్రీహరి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సుచిత్ర శ్రీ చైతన్య పాఠశాలపై కేసు



నవతెలంగాణ కుత్బుల్లాపూర్

ఎటువంటి అనుమతులు లేకుండా నడిపిస్తున్న సుచిత్ర మూడుగుళ్ల సమీపంలోని శ్రీ చైతన్య పాఠశాలపై మండల విద్యాధికారిణి వసంతకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం పెట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. అనుమతులు లేకుండా నడిపిస్తున్న పాఠశాలపై గత నెలలో వివిధ పత్రికలలో వచ్చిన కథనాలను పరిశీలించిన ఎంఈఓ.. పాఠశాలను సీజ్ చేశారు. అయితే ఎంఈఓ వెళ్లగానే అదే పాఠశాల తాళాలు పగలగొట్టి అడ్మిషన్ల తంతు సాగించింది. ఇది కనిపెట్టిన కుత్బుల్లాపూర్ మండల ప్రయివేటు బడ్జెట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం పాఠశాల ముందు ధర్నా నిర్వహించారు, ఎన్నిసార్లు సీజ్ చేసినా వైఖరి మార్చుకొని పాఠశాలకు పలుమార్లు నోటీసులు కూడా జారీ చేశారు, అయినా అడ్మిషన్ల తంతు కొనసాగుతూనే ఉంది. ఎన్నిసార్లు చెప్పినా శ్రీ చైతన్య యాజమాన్యం వినకపోవడంతో విద్యాధికారుల ఆదేశాలతో ఎంఈఓ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చైతన్య పాఠశాలపై పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

న్యాక్‌కు వరల్డ్ ఎడ్యుకేషన్ కాంగ్రెస్ గ్లోబల్ అవార్డ్స్

- స్కిల్ డెవలప్‌మెంట్, లీడర్‌షిప్ అవార్డులు సొంతం
- అవార్డులను అందుకున్న న్యాక్ డైరెక్టర్లు శాంతిశ్రీ, ఎం. రాజి రెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో

వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ అకడమిక్ అండ్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ ముంబైలో గురువారం నిర్వహించిన వరల్డ్ ఎడ్యుకేషన్ కాంగ్రెస్ గ్లోబల్ అవార్డ్స్ 13వ ఎడిషన్ వేడుకలో(న్యాక్) 'నేషనల్ అకా డమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్' స్కిల్ డెవలప్‌మెంట్, లీడర్‌షిప్ అవార్డు'ను సొంతం చేసుకుంది. ప్రొ.ఇందిరా పారిఖ్ ఉమెన్ ఇన్ ఎడ్యుకేషన్ లీడర్ చేతుల మీదుగా న్యాక్ డైరెక్టర్లు శాంతి శ్రీ, ఎం. రాజి రెడ్డి అందుకున్నారు. ఈ కార్యక్రమంలో 10 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

న్యాక్‌లో నాణ్యత గల శిక్షణ...

న్యాక్‌లో 2023-24లో 31,320 మంది వ్యక్తులకు ఉచిత శిక్షణ, భోజనంతోపాటు వసతి కల్పిస్తారు. నిర్మాణ రంగ శిక్షణ కార్యక్రమాలతోపాటు సామర్థ్యం, ఉత్పాదకత, నాణ్యతను మెరుగుపరుస్తారు. నాణ్యత గల శిక్షణ, విద్య ద్వారా నిర్మాణ రంగ శిక్షణ కార్యక్రమాలపై చొరవ తీసుకుంటుంది. 2023-24లో న్యాక్‌లో సివిల్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్‌ల కోసం ఫినిషింగ్ స్కూల్ ప్రోగ్రామ్‌లో నాణ్యమైన శిక్షణ ఇచ్చి ఉపాధిని కల్పించారు.

ఎన్నో ఉపాధి అవకాశాలు

న్యాక్‌లో శిక్షణ తీసుకున్న విద్యార్థుల ఉపాధి కోసం ప్రధాన కాంట్రాక్టర్లు, 500లకుపైగా నిర్మాణ కంపెనీలతో ఎంప్యానెల్ చేసుకుంది. దాని ప్రకారం, 2 నుండి 3 సంవత్సరాల కాలంలో చాలామంది న్యాక్‌లో శిక్షణ పొందిన నిరుద్యోగ యువత ఎల్ అండ్ టీ, మై హెూమ్స్ కన్‌స్ట్రక్షన్స్, టాటా, ఆశోకా, ఆదిత్యా బిల్డర్స్‌తోపాటు ప్రముఖ నిర్మాణ రంగాల సంస్థ ఎంపికయ్యారు. ప్రముఖ కంనీల్లో యువతకు నెలకు రూ.18వేల నుంచి రూ. 30వేలు జీతాలు పొందుతున్నారు. మరికొందరు రూ.5లక్షల వరకు జీతం తీసుకున్న వారున్నారు.

ప్రతిష్టాత్మక అవార్డు న్యాక్‌కు దక్కడం సంతోషకరం: మంత్రి

ప్రతిష్టాత్మక అవార్డు న్యాక్‌కు దక్కడం గర్వించదగ్గ విషయమని, ఎంతో సంతోషంగా ఉందని తెలంగాణ ప్రభుత్వ రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రి మరియు న్యాక్ వైస్ చైర్మన్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. దేశవిదేశాలల్లో తెలంగాణ రాష్ట్రానికి మరింత పేరుప్రతిష్టలు తీసుకొచ్చారని కొనియాడారు. ఈ సందర్భంగా న్యాక్ డైరెక్టర్ జనరల్ పీ. మధుసూధన రెడ్డి, న్యాక్ డైరెక్టర్లను, ఉద్యోగులను అభినందించారు.



ఆవిష్కరణ ప్రోత్సాహానికి ఇంటింటా ఇన్నోవేటర్ సెల్

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రత్యేక ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటా ఇన్నోవేటర్ సెల్ ఏర్పాటు చేసిందనీ, గృహిణి, పాఠశాలలు, కళాశాలల స్థాయి విద్యార్థులు, విద్యావేత్తలు, వ్యవసాయదారులు ఎవరైనా ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం అదనపు కలెక్టర్ కార్యాలయ ఛాంబర్‌లో ఇంటింటా ఇన్నో వేటర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదన పు కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక సమస్యలను పరిష్కరించే వినూత్న ఆవిష్కరణలు పంపించే అవకాశం ఇంటింటా ఇన్నోవేటర్ కల్పిస్తుందని తెలిపారు. వినూత్న ఆవిష్కరణల కోసం దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ 3 అని తెలిపారు. ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆవిష్కరణలను ప్రోత్సహిం చేందుకు ఇంటింటా ఇన్నోవేటర్ సెల్ ఏర్పాటు చేసిందని తెలిపారు.

దరఖాస్తు చేసుకునే విధానం

1.పేరు, వయస్సు, ఫోటో, వృత్తి, చిరునామా, మండలం, జిల్లా
2.ఆవిష్కరణ పేరు
3.ఆవిష్కరణ వివరిస్తూ 100 పదాల్లో రాసి పంపాలి
4.ఆవిష్కరణ 4 ఫోటోలు
5.ఆవిష్కరణ వీడియో 2 నిమిషాలు

పైన చెప్పిన వివరాలన్నీ తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ వాట్సాప్ నెంబర్ 9100678543కు పంపించాలని పేర్కొన్నారు. ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఆవిష్కరణల ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివరావు, డీపీఓ వెంకయ్య, వ్యవసాయ అధికారి రేఖామేరీ, ఈ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ భాను ప్రకాష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



రాచకొండ సీపీగా బాధ్యతలు చేపట్టిన సుధీర్‌బాబు గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు.
నవతెలంగాణ-సిటీబ్యూరో



అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి

- కార్పొరేట్ కవిత రెడ్డి..

నవతెలంగాణ-బంజారా హిల్స్

బోనాలు అంగరంగ వైభవంగా నిర్వహించాలంటే రహదారులు ఆలయాల వద్ద కనీస సదుపాయాలు, సౌకర్యాలు కల్పించాలని వెంకటేశ్వర కాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నే కవిత రెడ్డి కోరారు. గురువారం ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతిని కార్పొరేటర్ కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ భక్తులు పాదరక్షకాలు లేకుండా వస్తారు కాబట్టి వారందరి సౌలభ్యం మేరకు ఆలయాల వద్ద వర్షపు నీరులో భక్తులకు ఆటంకాలు కలగకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. రహదారులు మరమ్మత్తులు చేపట్టడానికి సంవత్సరాల తరబడి నిధులు కేటాయించడం లేదని తక్షణం నిధులు విడుదల చేసి బోనాల పండుగలు సజావుగా సాగే విధంగా సహకరించాలని కోరారు.

చైన్ స్నాచింగ్ దొంగలు దొరికారు..

- నాగోల్‌లో ఇద్దరు అరెస్ట్

నవతెలంగాణ- నాగోల్

ఈనెల 8న నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫతుల్ల గూడ లక్ష్మీనరసింహస్వామి కాలనీకి చెందిన చుక్కమ్మ మెడలో బంగారు గొలుసు ను లాక్కెళ్ళిన నిందితులను గురువారం అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు నాగోలు పోలీస్ స్టేషన్ సీఐ సుధీర్ కృష్ణ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం చుక్కమ్మ సోమవారం శుభకార్యానికి వెళ్లి తిరిగి లక్ష్మీనరసింహస్వామి కాలనీలో ఉన్న తన నివాసానికి చేరుకుంటుండగా స్ప్లెండర్ బైక్ పై వచ్చిన గులాబీ సింగ్, గుజ్జర్, అనే యువకులు ముసుగులు ధరించి చుక్కమ్మ మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును లాక్కెళ్ళారు. దాంతో చుక్కమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపి గురువారం వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇద్దరు నిందితులు రాజస్థాన్ రాష్ట్రానికి చెందినవారు కాగా గ్రానైట్ పని చేస్తుంటారని సీఐ తెలిపారు.

నవతెలంగాణ
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్ - మల్కాజిగిరి
శుక్రవారం | జులై 12, 2024 | www.navatelangana.com

చెరుకుపల్లి చంద్రారెడ్డికి నివాళ్లు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ గ్రామంలోని జీడిమెట్ల డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో బీజేపీ సీనియర్ నాయకులు దివంగత చెరుకుపల్లి చంద్రారెడ్డి 33వ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి పార్టీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహా రెడ్డి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో డా.ఎస్ మల్లారెడ్డి, నర్సింహా రెడ్డి, రావుల శేషగిరి, శేకర్ యాదవ్,సుధా,సిద్ధి రెడ్డి, పరశురామ్, వెంకటేశ్వర రెడ్డి, వెంకట్ రెడ్డి,నరసింహ రెడ్,డి చక్రి, నార్లకంటి దుర్గయ్య, నార్లకంటి ప్రతాప్,నల్లనాగుల కష్ణ, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

నవతెలంగాణ-దుండిగల్



జన విజ్ఞాన వేదిక లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో పిక్సెల్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో గురువారంప్రగతి నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్థానికులకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక 23వ డివిజన్ కార్పొరేటర్ మాధవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులైన చెన్నయ్య అధ్యక్షతన నిర్వహించారు. ట్రస్ట్ చైర్మెన్ డాక్టర్ కె ప్రశాంత్ కుమార్ , జన విజ్ఞాన వేదిక నాయకుడు మల్లయ్య చారి ,అనంత కుమార్ , పిక్సెల్ ఐ హాస్పిటల్ మేనేజర్ శ్రీకాంత్, యోగా మాస్టర్ మల్లేష్, ఉపాధ్యా యులు, స్థానికులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సహకారం అందిస్తా

- ఎమ్మెల్యే అరెకెపూడి గాంధీ

నవతెలంగాణ - కూకట్ పల్లి..



మాదాపూర్ డివిజన్ పరిధిలోని కృష్ణ నగర్ కాలనీ, న్యూ సైబర్ వ్యాలీ కాలనీలలో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని అసోసియేషన్ సభ్యులు ఆయన నివాస కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీల వాసుల విజ్ఞప్తి మేరకు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు అంది స్తామని , కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి వచ్చిన పరిష్కరిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కార్య క్రమంలో బీఆర్ఎస్ మాదాపూర్ డివిజన్ అధ్యక్షులు ఎర్ర గుడ్ల శ్రీనివాస్ యాదవ్, కాలనీ వాసులు నర్సింగరావు, వెంకటేష్ గౌడ్,వెంకట్ రెడ్డి, వీరభద్ర ,సూర్యనారాయణ, అశోక్ పాత్రో, ఫణిరాజు,రాజా చెలమకురి, కృష్ణారావు, మంగేష్ మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

భరత్ నగర్ మార్కెట్‌లో
పడకేసిన పారిశుద్ధ్యం..!

ప్రభుత్వాలు మారుతున్నాయి.. పాలకులతో పాటు అధికారులు మారుతున్నారు... మహానగరంలోని విశ్వ నగరం దిశగా జంట నగరాలను 'హైటెక్ సిటీ'గా మారుస్తామంటూ గత ప్రభుత్వాలు ప్రగల్భాలు తప్ప ప్రభుత్వ ఆశయాన్ని కొందరు మున్సిపల్ అధికారులు, సిబ్బంది నీరు గారుస్తున్న తీరుకు ప్రజలు విస్మయం చెందుతున్నారు. పచ్చదనం -పరిశుభ్రత వంటి ప్రభుత్వ కార్యక్రమాలు ద్వారా ప్రజల చెంతన చేరుతుంటే పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యం భరత్ నగర్ మార్కెట్‌లో దర్శనమిస్తోంది. నగరజీవి తాజా కూరగాయల కోసం దర్జాగా మార్కెట్ కెళ్తే దుర్గంధంతో ఊపిరాడక గిలగిలా కొట్టుకుంటున్నాడు.



- అస్తవ్యస్తంగా చెత్తాచెదారం.. వ్యాధులకు ఆవాసం
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం
- పొంచి ఉన్న వ్యాధులతో ప్రజలు సావాసం
- నామామాత్రంగా ఫాగింగ్ నిర్వహణ

నవతెలంగాణ - బాలానగర్

1981 ప్రాంతంలో భరత్ నగర్ హౌసింగ్ బోర్డు కాలనీలోని గృహాలను లబ్దిదారులకు కేటాయించినప్పుడు వారి అవసరాల మేరకు కూరగాయల దుకా ణాలను ఏర్పాటు చేయడానికి ఓ స్థలంలో హౌసింగ్ బోర్డు అధికారులు అనుమతి ఇచ్చారు. కాలక్రమేణా జనాభాతో పాటు మార్కెట్ కూడా ఇంతింతై వటుడింతై అన్నచందంగా విస్తరించి పోయింది. ప్రస్తుతం మార్కెట్‌లో వందల సంఖ్యలో దుకాణాలు విస్తరించాయి. రైతులు, వ్యాపారస్తులు, మధ్యవర్తులు, ఫైనాన్సియర్లు, హమా లీలు కలిసి దాదాపు వేలాది కుటుంబాలు భరత్ నగర్ కూరగాయాల మార్కెట్ పై ఆధారపడి జీవిస్తున్నాయి. నగరంలోని ప్రధాన ప్రాంతాల నుండి శివారు ప్రాంతాలై న చందానగర్, బి.హెచ్.ఇ.ఎల్. మియాపూర్ వరకూ అనేక మంది ప్రతినిత్యం ఈ మార్కెట్‌కు రాకపోకలు సాగిస్తున్నారు. దుండిగల్, నర్సాపూర్, దౌల్తాబాద్ వంటి శివారు గ్రామాల నుండి అనేక మంది రైతులు తాము పండించిన కూరగాయలను మార్కెట్‌కు తరలిస్తుంటారు. రైలు రవాణా, రోడ్డు రవాణా సౌకర్యాలు మార్కెట్‌కు అతి సమీపంలో ఉండడంతో సంవత్సరాల తరబడి నుండి ఈ మార్కెట్ దినదిన ప్రవర్ధమానం చెందుతోంది. ఇంత పెద్ద మార్కెట్‌లో సిబ్బంది నిర్వహణ లోపం వల్ల, అధికారుల ఆజ మాయిషీ కొరవడటం వల్ల అపరిశుభ్రత రాజ్యమేలుతోందని విమర్శలు వస్తున్నాయి. మార్కెట్‌లో ఎక్కడ చూసినా కుళ్లిన కూరగా యలు, చెత్తా చెదారంతో పేరుకు పోయి దుర్గంధ పూరి త వాతా వరణం నెలకొంది. మార్కెట్‌లో దుకాణాలు ఓ క్రమ పద్ధతిలో లేక ఎవరి ఇష్టం వచ్చినట్టు వారు ఏర్పా టు చేసుకోవడం వల్ల కూడా మార్కెట్ స్వరూపం అస్తవ్యస్థంగా తయారయింది. రోజూ మార్కెట్‌లో కుళ్ళి మిగిలిన కూరగాయలు, వ్యర్థాలను ఓ నిర్ణీత ప్రదేశంలో పారవేయకుండా ఎక్కడ పడితే అక్కడ వేయడం వల్ల పా రిశుధ్య సమస్య తీవ్ర రూపం దాల్చుతోంది.

గత మున్సిపల్ ఎన్నికలలో అది చేస్తాం, ఇది చేస్తామంటూ అర చేతిలో వైకుంఠం చూపించి పదవులు చేపట్టి పబ్బం గడుపుకుంటున్న డివిజన్ కార్పొరేటర్లు, బస్తీ నాయకు లు కలసికట్టుగా మార్కెట్లు, పరిసర ప్రాంతాల పరిశు భ్రతకు ఆలోచించ కపోవడం విచారకమని ప్రజలు బాహాటంగా విమర్శిస్తున్నారు. దీనికి తోడు మార్కెట్‌కు ఆనుకుని మురుగునీటి నాలా ప్రవహిస్తుండడంతో పరిసారాలలో మరింత అపరిశుభ్రత వాతావరణం నెలకొంది. స్థానిక నాలా భరత్‌నగర్ నుంచి మార్కెట్ మీదుగా జింకలవాడ, బాలానగర్ వైపుకు వెళ తుంది. చిన్నపాటి వర్షం వచ్చినా మురుగునీరు మార్కెట్‌లోకి ప్రవహించి భరించలేని దుర్గంధం వ్యాపిస్తుండడంతో వినియోగదా రులు అల్లాడిపోతున్నారు. ముక్కుపుటాలు అదరగొట్టే దుస్థితిలో వినియోగదారులు కూర గాయల కొనుగోళ్లు చేస్తున్నారు. ఇప్పటికైనా కూర గాయల మార్కెట్ లో పరిశుభ్రత వాతావరణానికి అధికారులు తగుచర్యలు తీసుకుని పచ్చదనం, పరి శుభ్రత వాతావరణం కల్పించాలని పలువురు ప్రభ త్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



వినియోగదారులు దుర్గంధంలోనే క్రయవిక్రయాలు...



భరత్ నగర్ కాలనీలో గల కూరగాయల మార్కెట్‌లో పారిశుధ్యం నిర్వహణ అస్తవ్యస్తంగా తయారయింది. కూరగాయల కొనుగోలు కోసం వచ్చే వినియోగదారులకు మార్కెట్‌లో సమస్యల తీష్ట వేసింది. వ్యాపారస్తులు, కొనుగోలు దారులు కుళ్లిపోయిన కూరగాయలను ఎక్కడపడితే అక్కడ వేయడంతో పశు సంచారంతో మార్కెట్ సమీపంలో రాకపోక సాగించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వ్యర్థ పదార్థాలతో పరిసర ప్రాంతాలు దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. దీనివల్ల దోమలు వ్యాపించి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి

- లావణ్య రాజు, స్థానిక గృహిణి, పార్థివాద

భరత్ నగర్ మార్కెట్ లో అస్తవ్యస్తంగా పారిశుధ్యం



భరత్ నగర్ కాలనీ కూరగాయల మార్కెట్ లో చెత్త చెదారం, పాలిథిన్ కవర్లతో చెత్తకుప్పలతో ప్రధాన రహదారికి ఇరువైపులా వ్యర్థ పదార్థాలతో దుర్గంధం వ్యాపిస్తున్నది. ఫ్లై ఓవర్ కింద భరత్ నగర్ క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. ప్రతిరోజూ కుళ్లిన వ్యర్థాలతో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. దీనికి తోడు కూరగాయల సముదాయంలో ట్రాఫిక్ సమస్య పాదచారులతో పాటు వాహనదారులు ఇష్టానుసారంగా క్రమపద్ధతిలో పార్కింగ్ చేయకపోవడం వల్ల పార్కింగ్ సమస్య వినియోగదారులకు తలనొప్పిగా మారింది. అంతేకాకుండా దోమల వ్యాప్తి వల్ల పలు వ్యాధులు సంభవించే పరిస్థితి నెలకొంది. అదేవిధంగా ప్రజలు మలమూత్రాలు విసర్జించడం వల్ల సరైన సదుపాయాలు లేకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులు, సిబ్బంది పారిశుధ్యంపై చర్యలు తీసుకోవాలి.

- ఎ. నాగమ్మ, శ్రీశ్రీనగర్, బాలానగర్

నర్సింహా రెడ్డి
ఇంజినీరింగ్ కళాశాలకు ప్రాజెక్టు నిధుల మంజూరు



నవతెలంగాణ-దుండిగల్

మైసమ్మగూడ లోని నర్సింహా రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలకు సైన్స్ అండ్ టెక్నాలజీ పరిశోధన ప్రాజెక్టు నిధుల మంజూరు చేశారు. కళాశాలలో సి.ఎస్.ఈ. డిపార్మెంట్ లో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డా. పల్లెల దిలీప్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, భారత ప్రభుత్వానికి సమర్పించిన పరిశోధక ప్రాజెక్టు "అవేర్ నెస్ అండ్ ఎక్సప్లోరేషన్ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ టు ది రూరల్ స్కూల్స్" కు ప్రభుత్వం వారు రూ. 17,83,500/- లక్షలు మంజూరు చేశారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా గ్రామీణ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న తరగతి విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీ అంశం మీద అవగాహన కల్పిస్తూ వారిని పాఠశాల స్థాయిలో విద్యార్థులను నిష్ణాతులను చేయాలనేదే లక్ష్యం అని ప్రాజెక్ట్ పరిశోధకులు డా. దిలీప్ కుమార్ రెడ్డి తెలిపారు. కళాశాల చైర్మన్ జక్కుల నర్సింహా రెడ్డి ,డైరెక్టర్ డా.ఎ.మోహన్, ప్రిన్సిపాల్, దిలీప్ కుమార్ రెడ్డి ని అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ జక్కుల త్రిశూల్ రెడ్డి మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీ పైన గ్రామీణ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ నైపుణ్యాలను నేర్పించడం చాలా అవసరమన్నారు. ఈ ప్రాజెక్ట్ విజయవంతంగా పూర్తి చేయాలనీ కోరుకుంటునట్టు తెలిపారు. అనంతరం కళాశాల ట్రెజరర్ జక్కుల త్రిలోక్ రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న నేటి ప్రపంచంలో పాఠశాల స్థాయి నుండే విద్యార్థి ఎదగాలి అంటే ఉద్భవిస్తున్న సాంకేతికత గురించి అవహగాన ఉండాలన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా విద్యార్థులు సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాల గురించి విషయం పరిజ్ఞానం నేర్చుకోవడమే కాకుండా వాటి నుండి ఎలా బయట పడాలి, ఎలా మనల్ని మనం రక్షించుకోవాలి అనే అంశాల మీద పట్టు సాధించి భద్రత పరమైన విషయాల మీద వారి జ్ఞానాన్ని అమలు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. లోకనాథం, సిఎస్ఈ. ఎచ్ఓడి. డా. గండికోట రాము, పురుషోత్తం వివిధ డిపార్ట్మెంట్ డీన్స్, ఎచ్.ఓ.డి. లు, అధ్యాపకులు పాల్గొని డా. దిలీప్ కుమార్ రెడ్డి ని అభినందించారు.

ఉచిత వైద్య సేవలు సద్వినియోగించుకోవాలి

- స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ అధ్యక్షులు జల్దా లక్ష్మీనాథ్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



పేదలు, కార్మికులు ఉచిత వైద్య శిబిరాలు తప్పక సద్వినియోగం చేసుకోవాలని స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ అధ్యక్షులు జల్దా లక్ష్మీనాథ్ అన్నారు. గురువారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గాంధీనగర్‌లోని సామాజిక భవనంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు సమీపిస్తున్న తరుణంలో డివిజన్ పరిధిలోని ప్రతి ప్రాంతంలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. మురికివాడల,పేదల నివాసిత ప్రాంతాల్లో ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులను ఆయన అభినందించారు.సుమారు 150 మందికి వివిధ విభాగాల వైద్యనిపుణులు వైద్య పరీక్షలు చేశారు .అనంతరం వారికి మందులను పంపిణీ చేశారు. వైద్యురాలు జ్యోతి, ఏఎన్ఎం.లు జగదీశ్వరి, భారతమ్మ,ఆశ వర్కర్లు శోభన,విజయ,కిరణ్,బీబీ స్థానిక బస్తి సంఘం నాయకులు తిమ్మయ్య,వెంకటసాయి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డులో
మార్పులు చేర్పులకు దరఖాస్తుల స్వీకరణ

- పౌర సరఫరాల శాఖ సహాయ అధికారి శ్రీనివాస్



నవతెలంగాణ-బాలానగర్

నిత్యావసర వినియోదారులకు అత్యవసరమైన రేషన్ కార్డులో మార్పులు, చేర్పులకు దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని బాలానగర్ పౌరసరఫరాల శాఖ సహా య అధికారి శ్రీనివాస్ తెలిపారు. రేషన్ కార్డులో తప్పులు సరిచేసేందుకు, పెండ్లయిన యువతులు అత్తవారింటి రేషన్ కార్డులో పేరు యాడ్ చేసుకునేందుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు తెలిపారు. రేషన్ కార్డులో సవరణలు చేసేందుకు కుటుంబ యజమాని బ్యాంక్ పాస్ బుక్ లేదా ఓటర్ కార్డు, కుటుంబ సభ్యుల అందరి ఆధార్ కార్డులు, రేషన్ కార్డు జిరాక్స్ లు తీసుకుని అందుబాటులో ఉన్న మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాల్సిం దిగా శ్రీనివాస్ తెలియచేశారు. కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ సర్కిళ్ల పరిధిలోని రేషన్‌కార్డుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పర్చుకోవాల్సిందిగా సూచించారు.

పద్మశాలీలను అన్ని రంగాలలో ప్రోత్సహించాలి



- పద్మ బ్రాహ్మణ పురోహిత సంఘం రాష్ట్ర అధ్యక్షులు రుద్ర పాండురంగ శాస్త్రి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

పద్మశాలి కులస్తులను ప్రభుత్వం అన్ని రంగాలలో ప్రోత్సహించాలని పద్మ బ్రాహ్మణ పురోహిత సంఘం రాష్ట్ర అధ్యక్షులు రుద్ర పాండురంగ శాస్త్రి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి శ్రీవారి ఆలయ ప్రాంగణంలో గల మార్కండేయ స్వామి ఆలయంలో గ్రేటర్ హైదరాబాద్ పద్మ బ్రాహ్మణ పురోహిత సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ పద్మ బ్రాహ్మణ పురోహిత సంఘం అధ్యక్షులు వంశీ భట్టాచారి,ప్రధాన కార్యదర్శి గడ్డం మల్లికార్జున సరస్వతి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పద్మశాలీల సంఘం అధ్యక్షులు ఏర్వ శంకరయ్య,గ్రేటర్ హైదరాబాద్ కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశాలీలు చేనేత వృత్తితో పాటు, బ్రాహ్మణ వృత్తిలోను అన్ని రకాల పూజలు,హోమాలు,విగ్రహ ప్రతిష్టలు నియమ నిష్టలతో శాస్త్రనుసారంగా ఎన్నో సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నారని తెలిపారు. మన తెలుగు రాష్ట్రాలలో ఎక్కువ సంఖ్యలో పద్మ బ్రాహ్మణులు ఉన్నారని అతి త్వరలో పద్మ బ్రాహ్మణుల వివరాలతో కూడిన డైరీని ఆవిష్కరించి అన్ని పద్మశాలి సంఘాలకు అందజేస్తామని చెప్పారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గ అధ్యక్షులు ఏర్వశంకరయ్య మాట్లాడుతూ నియోజకవర్గం పద్మశాలీలలు రాష్ట్ర కార్యవర్గం ఏ పిలుపునిచ్చిన విజయవంతం చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వడిచెర్ల మారుతి, జగద్గిరిగుట్ట సంఘ అధ్యక్షులు భోగ రాజేష్,సంఘం సీనియర్ నాయకులు వల్లే దత్తాత్రేయ,తౌట రాములు,గూడూరి లక్ష్మీనరసింహ,శ్రీరామ్ నగర్ సంఘ అధ్యక్షులు నారా వెంకటేశం,ప్రధాన కార్యదర్శి దేవులపల్లి యాదగిరి,కుల బంధువులు పాల్గొన్నారు.

కులాంతర వివాహం చేసుకున్న జంటకు ప్రోత్సాహకం అందజేత

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్



కులాంతర వివాహం చేసుకొని జీవనం కొనసాగిస్తున్న జంటకు కులంతార వివాహ ప్రోత్సాహకం కింద మంజూరైన రూ.2 లక్షల50 వేల చెక్కును ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ గురువారం కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏ.ఎస్.డబ్ల్యూ.ఓ కె.శ్రీకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి ప్రారంభోత్సవంలో ఎంపీ ఈటల

నవతెలంగాణ - కూకట్ పల్లి



కూకట్ పల్లి సుమిత్ర నగర్ మెయిన్ రోడ్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన అంకుర ఉమెన్స్ అండ్ చిల్డన్స్ హాస్పిటల్ ప్రారంభోత్సవంలో అంకుర ఉమెన్ అండ్ చిల్డన్ హాస్పిటల్ ప్రారంభోత్సవంలో ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఈటలకు ఆస్పత్రి సిబ్బంది స్వాగతం పలికారు. ఆధునిక వైద్య పరికరాలతో, నాణ్యమైన వైద్యాన్ని తక్కువ ఖర్చుతో ప్రజలకు అందే విధంగా హాస్పిటల్ యాజమాన్యం సేవ చేస్తున్నందుకు హాస్పిటల్ యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కూకట్ పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్ రావు, మూసాపేట్ డివిజన్ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సురేందర్ రెడ్డి, కెపిహెచ్బి కంటెస్టెడ్ కార్పొరేటర్ ప్రీతం రెడ్డి, డివిజన్ అధ్యక్షులు వినోద్ గౌడ్, రమేష్ అనంత నాగరాజు, నర్సింగ్, తదితరులు పాల్గొన్నారు.

తూర్పు నిర్మల జగ్గారెడ్డికి పున్నారెడ్డి శుభాకాంక్షలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

రాష్ట్ర పారిశ్రామిక, మౌలిక సదుపాయాల సంస్థ చైర్ పర్సన్ గా తూర్పు నిర్మల జగ్గారెడ్డి(జయప్రకాశ్ రెడ్డి) నియమితులైన సందర్భంగా గురువారం టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకులు సొంటిరెడ్డి పున్నారెడ్డి ఆమెను వారి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

సుభాష్ నగర్ 130 డివిజన్ పరిధిలోని సూరారం కాలనీలో గల జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని , వంటశాలను, గురువారం మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి పరిశీలించారు. మెనూ ప్రకారం చేసిన వంటలు రుచి కరంగా ఉండడంతో మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులను అభినందించారు. స్వయంగా విద్యార్థులకు ఆయన వడ్డించి, విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం విద్యార్థులతో సరదాగా ముచ్చటించారు. నోట్ బుక్ లు, యూనిఫాంలు, పంపిణీ చేశారా అని, ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు అర్థం అవుతున్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భ ంగా సురేష్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందిం చాలని ఉపాధ్యాయులకు, సిబ్బందికి సూచించారు. పలు పాఠశాలల్లో ఫుడ్ పాయిజనింగ్ సంఘటనలు చోటుచేసుకున్నాయని గుర్తు చేశారు. పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. మూడు నెలల నుండి తమకు నిధులు రావడం లేదని సురేష్ రెడ్డి దృష్టికి నిర్వాహకులు తీసుకురావడంతో.. త్వరలోనే నిధులు వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. డివిజన్ ప్రధాన కార్యదర్శి శివాజీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జావీద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆస్పత్రులు నిర్మించడం శుభపరిణామం

- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

నవతెలంగాణ - కూకట్ పల్లి



రాష్ట్రంలో ప్రజలందరికీ నాణ్యమైన వైద్యం అందించే ఆస్పత్రులు అందుబాటులోకి రావడం శుభపరిణామమని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. కూకట్ పల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన అంకుర 120 పడకల ఆస్ప త్రిని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, చిన్నారుల ఆరోగ్యమే ధ్యేయంగా నిర్మించిన అంకుర ఆస్పత్రిని ప్రారంభించినందుకు సంతో షంగా ఉందన్నారు. అంకుర ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణ ప్రసాద్ వున్నం మాట్లాడుతూ, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, మహారాష్ట్ర,ఒరిస్సా రాష్ట్రాలలో మొత్తంగా 14ఇంటర్నేషనల్ ఆస్పత్రులు నెలకొల్పామని, 2011 లో మొదటగా హైదారాబాద్,కూకట్ పల్లి లో ప్రారంభం అయిన అంకుర ఆస్పత్రి మరో బ్రాంచిని ఇక్కడే ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. అన్ని వయస్సులు గల వారికి సేవలు అందించేందుకు అత్యంత సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన అధునాతన సామగ్రిని అందుబాటులో ఉంచామని చెప్పారు.

నాణ్యమైన రుచులతోనే రెస్టారెంట్లు మనుగడ



- ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

భోజనప్రియులకు(కస్టమర్లకు) నాణ్యమైన రుచులను అందించినప్పుడే రెస్టారెంట్లు మనుగడ సాధిస్తాయని ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. గురువారం చింతల్ ప్రధాన రహదారిలోని రిడ్జ్ టవర్స్ సమీపంలో నిర్వాహకుడు రోహిత్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన "వైట్ అండ్ రిలాక్స్" అరేబియన్ మండి రెస్టారెంట్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ వినూత్న వాతావరణంలో రుచికరమైన భోజనాన్ని వినియోగ దారులకు అందిస్తూ వ్యాపారం దినదినాభివద్ధి చెందల న్నారు. ఈ కార్యక్రమంలో బౌరంపేట్ సహకార బ్యాంక్ చైర్మెన్ మిద్దెల బాల్ రెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, ఈ. మురళీ, సంతోష్, సత్యనారా యణ యాదవ్,నల్లా వేణు, వెంకట్, అజయ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని పరిరక్షించండి : ఎమ్మెల్యే కృష్ణారావు

నవతెలంగాణ - బాలానగర్



మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలో శుక్రవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణా రావు, స్థానిక కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్, సంబంధిత అధికారులతో కలసి ఫతేనగర్ డివి జన్ లోని జింకలవాడ, ప్రభాకర్ రెడ్డి నగర్ బస్తీల సరిహద్దులో ఉన్న ప్రభుత్వ భూమిని పరి శీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ నియోజకవర్గం పరిధిలోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడు తూ అట్టి భూములను ప్రభుత్వ కార్యాలయాలు, లేదా పేదలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా డివిజన్ పరిధిలోని ప్రభాకర్ రెడ్డి నగర్, జింకలవాడ సరిహద్దులో ఉన్న ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతోందని, అట్టి భూమిని సర్వే చేయించి ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని, ఈ ప్రభుత్వ భూమి నందు కంచె ఏర్పాటుచేసి పరిరక్షించాలని ఎమ్మార్వో, రెవెన్యూ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత జీహెచ్ఎంసి అధికారులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

నవతెలంగాణ మానవి
శుక్రవారం 12 జులై 2024
హైదరాబాద్
www.navatelangana.com

'స్వీట్' సక్సెస్

రేఖ శర్మ... మధ్యతరగతి కుటుంబంలో జన్మించింది. సోషియాలజీ, ఐటీ, సాయిల్ అండ్ వాటర్ మేనేజ్‌మెంట్‌లో అడ్వాన్స్‌డ్ డిగ్రీలు పూర్తిచేసింది. జాబ్ ఆఫర్లు అనేకం వచ్చాయి. అయినా వాటన్నిటినీ కాదని భిన్న మార్గాన్ని ఎంచుకుంది. నలుగురికీ ఉపయోగపడాలని నిర్ణయించుకుంది. ఖాళీగా ఉన్న మహిళలను కూడగట్టింది. ఓ సెల్ఫ్ హెల్ప్ గ్రూపును స్థాపించింది. ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నా.. వెనుకడుగు వేయలేదు. ఇపుడు 400 మంది మహిళలకు జీవనోపాధిని కల్పిస్తూ విజయవంతంగా సాగుతున్న ఆమె ప్రయాణం నేటి మానవిలో...



పంజాబ్ హోషియార్‌పూర్ జిల్లా, రామ్‌గఢ్ సిక్రి గ్రామంలో పదో తరగతి చదువుతున్నప్పుడే మహిళలకు ఉపయోగపడేందుకు ఏదో ఒకటి చేయాలన్న ఆలోచన రేఖలో మొదలైంది. అందుకు కారణం లేకపోలేదు. పదో తరగతిలో ఉండగా ఓ రోజు... క్యారెక్టర్ సర్టిఫికేట్‌పై సంతకం కోసం గ్రామ సర్పంచ్ వద్దకు వెళ్లింది. అక్కడ ఓ సంఘటన ఆమెను కలచివేసింది. తన కుమార్తె పాఠశాల ఫీజు చెల్లించేందుకు రూ.50 సంపాదించడానికి మండే ఎండలో ఓ మహిళ పనిచేస్తూ కనిపించింది. రేఖకు ఆ మహిళ తెలుసు. ఆమె తన తోటి విద్యార్థిని తల్లి. ఈ సంఘటన రేఖను తీవ్రంగా కదిలించింది. సమాజంలో ఇలాంటి తీవ్రమైన కష్టాలను ఎదుర్కొంటున్న మహిళల కోసం తన జీవితాన్ని అంకితం చేయాలని నిర్ణయించుకుంది. అలాంటి వారికి భవిష్యత్‌లో అండగా నిలబడాలని అనుకుంది. ఆ ఆలోచనతోనే సోషియాలజీ, ఐటీ, సాయిల్ అండ్ వాటర్ మేనేజ్‌మెంట్‌లో అడ్వాన్స్‌డ్ డిగ్రీలు పూర్తిచేసింది. వచ్చిన అనేక ఉద్యోగ అవకాశాలను వద్దనుకుంది. ఉద్యోగం తన ఒక్క దానికే ఉపయోగం. దాని ద్వారా తన ఆశయం నెరవేరదని భావించింది.

స్వయం సహాయక బృందం ఏర్పాటు

రేఖ 'సదా శివ మోడ్రన్ సెల్ఫ్-హెల్ప్ గ్రూప్'ను 2003లో ఏర్పాటుచేసింది. ఇందుకు తొలుత 13 మంది నిరుపేద మహిళలను ఎంపికచేసుకుంది. వారితో కలిసి డిటర్జెంట్లు, ఫ్లోర్ క్లీనర్ల తయారీ నుంచి ఇతర పనుల వరకు వివిధ కార్యకలాపాలతో ప్రయోగాలు చేసింది. కానీ వనరులు, సరైన శిక్షణ లేకపోవడంతో ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది. ఇదిలావుండగా.. వ్యవసాయ, ఉద్యానవన శాఖ నుంచి ఓ బృందం పంట సర్వే నిమిత్తం గ్రామానికి వచ్చింది. రేఖ తన గ్రూపు సభ్యులతో కలిసి వారిని కలిసింది. 'సమీపంలోని అటవీ ప్రాంతంలో సహజంగా లభించే కాయలతో ఊరగాయలను తయారు చేయాలని వారు మా గ్రూపును ప్రోత్సహించారు' అని రేఖ గుర్తుచేసుకున్నారు. ఈ సూచన ఆ మహిళల్లో కొత్త ఆశలు నింపింది. దాన్ని ప్రయోగాత్మకంగా నిర్వహించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు.

ప్రయత్నాలు విఫలమైనా..

వారికి ఊరగాయల తయారీలో శిక్షణ లేకపోవడంతో ఈ వెంచర్ కూడా ఫలించలేదు. ఉప్పు, కారం, ఇతర మసాలాలు కచ్చితంగా కొలవడంలో ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఊరగాయలు సరిగా కుదరక అమ్ముడుపోలేదు. వీటి తయారీలో శిక్షణ పొందిన మహిళలను చేర్చుకోవాలనుకున్నారు. కానీ, వారు పెద్దమొత్తంలో నగదు డిమాండ్ చేశారు. ఇలా కొన్ని సమస్యలు ఎదురైనా.. రేఖ తన ప్రయత్నాలను విడిచిపెట్టలేదు. అంకితభావంతో కృషిచేసింది. వ్యవసాయ, ఉద్యానవన శాఖ బృందాన్నే శిక్షణ ఇవ్వాల్సిందిగా కోరింది. నిపుణుల పర్యవేక్షణలో ఊరగాయల తయారీలో నాణ్యత పెంచుకున్నారు.

ఢిల్లీ ఎగ్జిబిషన్‌లో...

2012లో న్యూఢిల్లీలో జరిగిన ఎగ్జిబిషన్‌కు ఈ స్వయం సహాయక బృందానికి ఆహ్వానం అందింది. వారికి అంతా కొత్త. మొదట్లో భయపడ్డారు. కానీ తండ్రి ప్రోత్సాహంతో.. రేఖ, ఆమె గ్రూపు ఎగ్జిబిషన్‌లో తమ ఉత్పత్తులను విక్రయించారు. ఒక్క రోజులో రూ.50,000 సంపాదించగలిగారు.

> **రోల్ మోడల్...**
>
> రేఖ తన ప్రాంతంలోని మహిళలకు ఓ ఆశాకిరణం, ప్రేరణ. కూరగాయలు, పండ్ల ప్రాసెసింగ్‌ను జీవనోపాధిగా మార్చుకోవటం ద్వారా ఆమె ప్రశంసనీయమైన ఖ్యాతిని సంపాదించారు. సహజ వనరులను సంరక్షించడంలో, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నది. దృఢ సంకల్పం, సవాళ్లను ఎదుర్కోవాలనే ధైర్యం ఉంటే ఎవరైనా అద్భుతమైన విజయాలను సాధించగలరని ఆమె ప్రయాణం నిరూపిస్తున్నది.

వారి ఉత్పత్తులకు గిరాకీ ఎక్కువగా ఉండడంతో గ్రామం నుంచి సరుకులు తీసుకురావాల్సి వచ్చింది. తక్కువ సమయంలోనే అన్నీ అమ్ముడుపోయేవి. ఎగ్జిబిషన్ నడుస్తున్నప్పుడే ఓ అసాధారణ సంఘటన వారి జీవితాన్ని మార్చివేసింది. ఓ వ్యక్తి అక్కడకు వచ్చి రోజూ వారి పచ్చళ్లను కొనుక్కుంటూ కనిపించాడు. 'ప్రతిరోజూ వచ్చి కొంటున్నారు. మా ఉత్పత్తులు మీకు బాగా నచ్చాయా...' అని ఒక రోజు నేను అతన్ని అడిగాను. 'చివరి రోజు చెబుతానన్నారు. చెప్పినట్టే... చివరి రోజు అసలు విషయం మాకు తెలిసింది. అతను మా ఉత్పత్తి నాణ్యతను పరిశోధిస్తున్న శాస్త్రవేత్త అని. మా ఉత్పత్తులు ఎలాంటి ప్రెజర్వేటివ్‌లు లేనివనీ, పూర్తిగా నాచురల్‌వని ఆయన గుర్తించారు' అని రేఖ గుర్తుచేసుకున్నారు.



జాతీయ గుర్తింపు

రేఖ గ్రూపుకు సైంటిస్టు పరిశోధన మంచి గుర్తింపు తెచ్చిపెట్టింది. ఢిల్లీ ఎగ్జిబిషన్‌లో వీరికి జాతీయ అవార్డు లభించింది. ఇది "శివ్ మోడ్రన్ సెల్ఫ్-హెల్ప్ గ్రూప్"కు టర్నింగ్ పాయింట్. పంజాబ్ ముఖ్యమంత్రి నుంచి ప్రశంసలు, భారీ మొత్తంలో నగదు బహుమతి లభించింది. తదనంతరం, 2013లోనూ ఈ గ్రూపును రాష్ట్ర అవార్డు కూడా వరించింది. వారు ఇప్పుడు అటవీ పండ్లపై దృష్టి సారించారు.

400 మందికి ఉపాధి

"శివ్ మోడ్రన్ సెల్ఫ్-హెల్ప్ గ్రూప్"కు నాయకత్వం వహిస్తున్న రేఖ... స్థానిక గ్రామీణ మహిళలకు స్థిరమైన జీవనోపాధిని అందిస్తున్నది. ప్రస్తుతం గ్రూప్‌లో 400 మంది సభ్యులున్నారు. రెండు ఎకరాల స్థలంలో ప్రాసెసింగ్ యూనిట్‌ను నిర్వహిస్తున్నారు. సహజ సిద్ధంగా లభించే పండ్లతో స్క్వాష్, నిమ్మరసం, లిచీ, మామిడి, క్రాన్‌బెర్రీ జ్యూస్‌లు క్యాండీలు, బర్ఫీ వంటి స్వీట్లు, ఊరగాయలతో సహా దాదాపు 570 ఉత్పత్తులను తయారుచేస్తున్నారు. ఈ ఉత్పత్తులను రైతు ఉత్సవాలు, సోషల్ మీడియా, ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా జాతీయ, అంతర్జాతీయ వినియోగదారులకు అందిస్తున్నారు.

- కె. లలిత



జీర్ణ సమస్యలతో బాధపడుతున్నారా?

మన వంటగదిలో ఉండే అనేక రకాల మసాలాలు మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలు అందిస్తాయి. అలాంటి వాటిలో వాము ఒకటి. దీనివల్ల మన శరీరానికి కలిగే లాభాలు ఏంటో తెలుసుకుందాం..

జీర్ణవ్యవస్థను మెరుగుపరిచేందుకు వాము ఉపయోగపడుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మలబద్ధకం, రక్తస్రావం, ఫైల్స్, డయేరియా వంటి సమస్యలతో బాధపడేవారికి ఇది చాలా ప్రభావవంతంగా పనిచేస్తుంది. అంతేకాదు శరీరంలో కొలెస్ట్రాల్‌ను కంట్రోల్‌లో



ఉంచటంలోనూ ఇది బాగా పనిచేస్తుంది.

పీరియడ్స్ సమయంలో తరచుగా కడుపునొప్పి వచ్చే వారికి కూడా ఇది మేలు చేస్తుందని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ఒక చిటికెడు వాము, చిటికెడు నల్ల నువ్వులు, అదే మొత్తంలో బెల్లం తీసుకుని వాటిని పాన్‌లో వేయించాలి. పిరియడ్స్ కాలానికి ముందు లేదా ఆ సమయంలో.దీన్ని గోరువెచ్చని నీటితో తీసుకోవాలి.

అజీర్ణం సమస్యతో బాధపడుతున్నవారు వామును వేడినీటిలో మరిగించి ఉప్పు కలిపి తాగితే మేలు జరుగుతుంది.

వాములో థైమోల్, నియాసిన్ వంటి అనేక విటమిన్లు ఉంటాయి. గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. దీని కోసం, ఒక చెంచా వామును ఒక కప్పు నీటిలో మరిగించి, ప్రతిరోజూ ఉదయం తాగడం వల్ల ప్రయోజనం ఉంటుంది.

మీకు సైనస్, జలుబు సమస్యలు ఉంటే.. వామును నీటిలో మరిగించి ఆ నీటిని తాగొచ్చు, ఆవిరిపట్టవచ్చు. చిన్న పిల్లలు జలుబుతో బాధపడుతుంటే వామును పొడిచేసి అందులో ఆవాల నూనె కలిపి ఛాతికి పట్టించాలి. ఇది పిల్లలకు ఉపశమనం కలిగిస్తుంది.

ఢిల్లీ వర్సిటీ బోధనాంశంగా మనుస్మృతి !
టీచర్స్ ఫ్రంట్ తీవ్ర నిరసన

న్యూఢిల్లీ : ఢిల్లీ యూనివర్సిటీ (డీయూ)లో ఎల్ఎల్‌బీ అండర్‌గ్రాడ్యుయేట్ కోర్సులో మనుస్మృతిని బోధనాంశంగా ప్రవేశపెట్టేందుకు ఢిల్లీ యూనివర్శిటీలో ని లా ఫ్యాకల్టీ సిద్ధమైంది. జ్యూరిస్‌ప్రుడెన్స్ (లీగల్ మెథడ్)గా పిలిచే కేటగిరీ కింద దీన్ని తీసుకురానున్నారు. సామాజిక, ఆర్థిక, లింగ అసమానతలను ఉద్బోదించే, మరింత బలోపేతం చేసే ఈ వివాదాస్పదమైన సబ్జెక్ట్‌ను వర్శిటీలోని ఫ్యాకల్టీకి చెందిన కొన్ని వర్గాలు తీవ్రంగా నిరసిస్తున్నాయి. సవరించిన సిలబస్ డాక్యుమెంట్‌లో ఈ మనుస్మృతిని ప్రవేశపెడతారు. దీన్ని అమలు చేసేందుకు అనుమతించే నిమిత్తం ఈ సిలబస్ ప్రతిని శుక్రవారం ఢిల్లీ వర్సిటీ అకడమిక్ కౌన్సిల్ ఫర్ అకడమిక్ మేటర్స్ ముందు వుంచుతారు. ఇది ఆమోదం పొందిన వెంటనే ఇక, ఎల్ఎల్‌బీ అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులో సెమిస్టర్ 1లో యూనిట్ 5-అనలిటికల్ పాజిటివిజమ్ కింద మనుస్మృతిని జి.ఎన్.ఝూ రాసిన మనుభాష్య మేథాతిథితో పాటు కలిపి ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులు చదువుతారు. భారతీయ దృక్కోణాలను, దృక్పథాలను బోధనా రంగంలో ప్రవేశపెట్టేందుకే నూతన విద్యా విధానం 2020కి అనుగుణంగా ఈ మనుస్మృతిని తీసుకువచ్చినట్లు ఫ్యాకల్టీ ఆఫ్ లా డీన్ ప్రొఫెసర్ అంజు వలీ టికూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కు తెలిపారు.

టీచర్స్ ఫ్రంట్ నిరసన

కాగా ఈ నిర్ణయాన్ని సోషల్ డెమోక్రటిక్ టీచర్స్ ఫ్రంట్ తీవ్రంగా నిరసించింది. ఈ మేరకు ఢిల్లీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ యోగేష్ సింగ్‌కు లేఖ రాసింది. సమాజంలో మహిళలు, అట్టడుగు వర్గాల ప్రగతికి, విద్యకు ఇది పూర్తి ప్రతికూలంగా వున్నందున ఈ చర్య పట్ల తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు ఆ లేఖలో తెలియచేసింది. "ఈ దేశంలో 85శాతం జనాభా అట్టడుగు వర్గాలకు చెందినవారే, 50శాతం జనాభా మహిళలే. వీరి పురోగతి ప్రగతిశీల విద్యా వ్యవస్థపై, బోధనా విధానంపై ఆధారపడి వుంటుంది. మనుస్మృతిలోని పలు సెక్షన్లు మహిళల విద్యకు, సమానహక్కులకు పూర్తి వ్యతిరేకంగా వుంటాయి. మనుస్మృతిలోని ఏ ఒక్క భాగాన్ని లేదా సెక్షన్‌ను ప్రవేశపెట్టడం మన రాజ్యాంగం మౌలిక స్వరూపానికి, రాజ్యాంగ విలువలకు పూర్తి విరుద్ధం." అని ఆ లేఖ పేర్కొంది.

18న పేపర్ లీకేజీపై విచారణ

న్యూఢిల్లీ : వివాదాల్లో చిక్కుకున్న నీట్-యూజీ కౌన్సెలింగ్ ప్రక్రియను నాలుగు దఫాలుగా జులై మూడవ వారం నుండి నిర్వహిస్తామని కేంద్రం గురువారం సుప్రీం కోర్టుకు తెలియచేసింది. ఈ పరీక్ష నిర్వహణలో జరిగిన అక్రమాల వల్ల ఎవరైనా విద్యార్థి లబ్ది పొందినట్లు తెలిసిన పక్షంలో కౌన్సెలింగ్ ప్రక్రియ ఏ దశలో వున్నా, లేదా ముగిసినా కూడా దానితో సంబంధం లేకుండా వెంటనే సదరు విద్యార్థి అభ్యర్థిత్వాన్ని రద్దు చేస్తామని కేంద్ర ఉన్నత విద్యా శాఖ కోర్టుకు తెలియచేసింది. ఈ మేరకు 44పేజీలతో అఫిడవిట్ అందచేసింది.

ప్రశ్నా పత్రాల లీకేజీ, ఒకరి బదులు మరొకరు పరీక్ష రాయడం, ఇతర అక్రమాలు జరిగినట్లు పలు ఆరోపణలు నీట్ పరీక్షపై వెల్లువెత్తాయి. మాస్ మాల్‌ప్రాక్టీస్‌పై ఐఐటీ మద్రాసు ఇచ్చిన డేటా విశ్లేషణ నివేదికపై ప్రభుత్వం ఆధారపడింది. ప్రశ్నా పత్రాల లీకేజీ వల్ల లబ్ది పొందిన వారిని గుర్తించేందుకు ఎన్‌టీఏ, కేంద్రం కసరత్తు చేయాల్సి వుంటే ముందుగా కౌన్సెలింగ్ ప్రక్రియపై ప్రభుత్వం విధానస్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి వుంటుందని ఈ నెల 8న సుప్రీం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. నీట్ పేపర్ లీకేజీపై దర్యాప్తు చేస్తున్న సిబిఐ ఇప్పటికే పలువురిని అరెస్టు చేసింది.

అఖిల భారత కోటాలో ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ రాష్ట్రవ్యాప్తంగా అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్‌సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తుంది. రాష్ట్ర కోటాలో సీట్లను ఆయా రాష్ట్రాల కౌన్సెలింగ్ అధికారులే నిర్వహిస్తారు.

అభ్యర్థులకు ఇచ్చిన అవకాశాలకు అనుగుణంగా మొదటి, రెండవ రౌండ్ కౌన్సెలింగ్‌లో సీట్లను మార్చుకోవడానికి అనుమతిస్తారు. అయితే అక్రమాల వల్ల అభ్యర్థి లబ్ది పొందారని తెలిసి సీట్ల కేటాయింపును రద్దు చేసినా దానివల్ల మొత్తంగా కౌన్సెలింగ్ ప్రక్రియపై ఎలాంటి ప్రభావం వుండదు. సెప్టెంబరు రెండవ వారంలో మూడవ రౌండ్ ఆరంభమవుతుందని భావిస్తున్నారు. ఒకవేళ ఆ తర్వాత గనక అభ్యర్థిత్వాన్ని రద్దు చేయాల్సి వస్తే ఆ ఖాళీ సీట్లను తర్వాత రౌండ్‌లో భర్తీ చేస్తారు. ముందు రౌండ్లలో సీట్ల కేటాయింపు జరిగిన అభ్యర్థులు తర్వాత రౌండ్‌లో పాల్గొనడానికి అవకాశం వుండదని ప్రభుత్వం ఆ అఫిడవిట్ వివరించింది. నాలుగు రౌండ్ల తర్వాత కూడా ఏ అభ్యర్థి సీటునైనా రద్దుచేయాల్సిన పక్షంలో ఆ ఖాళీ సీట్లను అదనపు కౌన్సెలింగ్ రౌండ్స్ నిర్వహించి భర్తీ చేస్తారని కేంద్రం తెలియచేసింది.

18న సుప్రీం విచారణ

నీట్ అక్రమాలపై ఎన్‌టీఏ, కేంద్ర ప్రభుత్వం గురువారం సుప్రీంకు అఫిడవిట్లు దాఖలు చేసిన నేపథ్యంలో నీట్ పేపర్ లీక్‌లపై విచారణను 18న చేపట్టాలని సుప్రీం నిర్ణయించింది. మే 4న టెలిగ్రామ్‌లో నీట్ పేపర్ లీక్ అయిందంటూ వచ్చిన వీడియో బూటకమని ఎన్‌టీఏ తన అఫిడవిట్‌లో పేర్కొంది. టైమ్‌స్టాంప్‌ను తప్పుగా చూపించారని పేర్కొంది. మే 5న సాయంత్రం 5.40గంటలకు వున్న టైమ్‌స్టాంప్‌ను ముందుగానే లీక్ అయిందని చూపేలా ఎడిట్ చేశారని పేర్కొంది. నీట్ పరీక్ష నిర్వహణపై వచ్చిన పలు ఆరోపణలను ఎన్‌టీఏ తన అఫిడవిట్‌లో తోసిపుచ్చింది.

గుజరాత్‌లోని గోద్రాలో ఓఎంఆర్ షీట్లను తారుమారుచేసేందుకు జరిగిన ప్రయత్నం భగ్నమైందని పేర్కొంది. ఇలాంటి అవకతవకలను మొగ్గలోనే తుంచేసి, పరీక్షల పవిత్రతను కాపాడామని తెలిపింది.

ఉన్మాది ఘాతుకం

(మొదటిపేజీ తరువాయి)

కొడవలితో దాడికి పాల్పడ్డాడు. తీవ్ర రక్తస్రావంతో దీపిక తల్లి అక్కడికక్కడే మృతి చెందగా తండ్రి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. నాగరాజు దాడి చేస్తుండగా అడ్డు వచ్చిన దీపిక, ఆమె తమ్ముడు మదన్‌లాల్‌పైనా దాడి చేయగా వారికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు హంతకుడిని వెంబడించగా వారిపై కూడా దాడికి యత్నించాడు. తీవ్ర రక్తస్రావంతో ఉన్న దీపిక, మదన్‌లాల్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం ప్రయివేటు అంబులెన్స్ ద్వారా వరంగల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. హత్య జరిగిన విషయం తెలుసుకున్న డీసీపీ రవీందర్, ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐ చంద్రమోహన్, నర్సంపేట ఎస్ఐ అరుణ్‌కుమార్, సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. నిందితునిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. కాగా, నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గురువారం మధ్యాహ్నం మృతదేహాలతో నర్సంపేట పోలీస్ స్టేషన్ ముందు మృతుల బంధువులు ఆందోళన చేపట్టారు. పోలీసులు వారితో చర్చించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఉద్రిక్తత సద్దుమణిగింది.

అదానీకిస్తే ఊరుకోం

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. మనకున్న డీపీఈ, విజిలెన్స్‌ను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు. అవసరాల ప్రాతిపదికపై ప్రతినెల స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన "విద్యుత్ సవరణ బిల్-2022"ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాలతో సహా దేశంలో సుమారు 25 లక్షల మంది విద్యుత్ ఉద్యోగులు, ఇంజనీర్లు పోరాటం చేస్తున్నారని తెలిపారు. ఆ పోరాటానికి ప్రజలు, రైతులు పెద్దఎత్తున మద్దతు ప్రకటిస్తున్నారని గుర్తు చేశారు. విద్యుత్ సంస్థలకున్న అప్పుల్లో రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాలు చెల్లించాల్సిన బకాయిలే ఎక్కువగా ఉన్నాయన్నారు. సబ్సిడీలు, రైతులకిస్తున్న ఉచిత విద్యుత్ సొమ్ము కూడా రాష్ట్ర ప్రభుత్వ డిస్కాంలకు రీయంబర్స్ చేస్తే అవి లాభాల్లో ఉంటాయని చెప్పారు.కార్యక్రమంలో కంపెనీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రారెడ్డి, సత్యంతోపాటు ప్రసాదరాజు, బస్వరాజు, మురళి, సుధాకర్, రాము, రాజేశ్వర్, ఎస్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పనే కీలకం

(మొదటిపేజీ తరువాయి)

సంబంధించిన పలు కీలక ప్రకటనలు ఉండొచ్చని పేర్కొంది. 2024-25 మధ్యంతర బడ్జెట్ తరహాలోనే జీడిపిలో ఆర్థిక లోటును 5.1 శాతానికి కట్టడి చేయాలని నిర్దేశించుకోవచ్చని పేర్కొంది. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి కావాల్సిన రోడ్ మ్యాప్‌పై దృష్టి పెట్టొచ్చని తెలిపింది.

పన్ను కోతలుండొచ్చు : బీఓఎఫ్ఏ సెక్యూరిటీస్

వచ్చే బడ్జెట్‌లో వ్యక్తిగత పన్ను చెల్లింపుల్లో కొంత ఉపశమనం ఉండొచ్చని బీఓఎఫ్ఏ ఎకనామిస్ట్ ఆస్తా గుడ్వాని పేర్కొన్నారు. ప్రజల వినిమయ శక్తిని పెంచడానికి ప్రయత్నించవచ్చన్నారు. ఆర్‌బిఐ సహా కేంద్ర ప్రభుత్వ సంస్థల నుంచి భారీగా డివిడెండ్‌ను అందుకున్న నేపథ్యంలో సర్కార్ వ్యయాలు పెరగొచ్చన్నారు. వైద్య రంగానికి అదనంగా రూ.1.35-1.5 లక్షల కోట్లు కేటాయించే అవకాశం ఉందన్నారు. రాష్ట్రాలకు ప్రత్యేక సహాయం ఉండొచ్చన్నారు. బడ్జెట్‌లో పన్ను శ్లాబులు, రేట్లలో మార్పు ప్రతిపాదనలు పెద్దగా ఉండక పోవచ్చునని మరో బ్రోకరేజీ సంస్థ మోతీలాల్ ఓస్వాల్ అంచనా వేసింది.

ఆగస్టు 9న 'కార్పొరేట్స్ క్విట్ ఇండియా డే'

(మొదటిపేజీ తరువాయి)

జరిగింది. రాజస్థాన్‌లోని సికార్ నుంచి రైతు నాయకులు అమ్రారామ్, బీహార్‌లోని కరకట్ నుంచి రాజారామ్‌సింగ్, బీహార్‌లోని అర్రా నుంచి సుదామప్రసాద్, తమిళనాడులోని దిండిగల్ నుంచి ఆర్.సచ్చితానందం ఎంపీగా గెలుపొందడం పట్ల జనరల్ బాడీ అభినందనలు తెలిపింది. ఈ జనరల్ బాడీ అధ్యక్షవర్గంగా అశోక్ ధావలే, దర్శన్ పాల్, యుధ్వీర్ సింగ్, బల్బీర్ సింగ్ రాజేవాల్, రావుల వెంకయ్య, మేధా పాట్కర్, సత్యవాన్, రుల్దు సింగ్ మాన్సా, సునీలం, అవిక్ సాహా, ఆశిష్ మిట్టల్, తాజిందర్ సింగ్ విర్క్, కన్వర్జిత్ సింగ్ వ్యవహరించారు. ఏఐకేఎస్ నేత హన్నన్ మొల్లా ప్రతినిధులకు స్వాగతం పలికారు. 17 రాష్ట్రాల నుంచి 143 మంది ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా భవిష్యత్తు కార్యాచరణను ఎస్కేఎం ప్రకటించింది.

గురువారం నాడిక్కడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్కేఎం నేతలు హన్నన్ మొల్లా, సునీలం, అవిక్ సాహా, రావుల వెంకయ్య, ప్రేమ్ సింగ్ గెహ్లావత్, పి. కృష్ణప్రసాద్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్కేఎం నిర్ణయాలను వెల్లడించారు. ఈనెల 16 నుంచి 18 వరకు మూడ్రోజుల పాటు తమ డిమాండ్లపై ఎస్కేఎం రాష్ట్ర నాయకత్వం లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలందరికీ వినతి పత్రాలను కలిసి ఇవ్వనుందని అన్నారు. తమ డిమాండ్లపై ఎన్‌డీఏ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని అభ్యర్థించనుందని తెలిపారు.

అలాగే ప్రధాని మోడీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అపాయింట్ మెంట్‌లను కూడా కోరుతున్నట్టు ఎస్కేఎం నేతలు తెలిపారు. వారు అపాయింట్‌మెంట్ ఇస్తే వారికి కూడా తమ డిమాండ్లతో కూడిన మెమోరాండం సమర్పిస్తారని అన్నారు.

" ఆగస్టు 9న దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శలను చేయాలని, క్విట్ ఇండియా డేని "కార్పొరేట్స్ క్విట్ ఇండియా డే" గా నిర్వహించాలని ఎస్కేఎం పిలుపునిచ్చింది. వ్యవసాయ ఉత్పత్తి, వాణిజ్యంలో డబ్ల్యూటీఓ నుంచి ఇండియా బయటకు రావాలని డిమాండ్ చేసింది. తీవ్ర నీటి సంక్షోభం, అప్పుల భారం, రోడ్డు కారిడార్లతో ఇండియా-పాకిస్తాన్ వాణిజ్యాన్ని తెరవడం వంటి పంజాబ్ డిమాండ్లకు సంబంధించి ఆగస్టు 17న పంజాబ్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రితో సహా మంత్రులందరి ఇండ్ల వద్ద మూడు గంటల పాటు ఆందోళన చేపట్టనుంది. అదే విధంగా రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్, జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర సమన్వయ కమిటీలు తమ సమావేశాలను ఏర్పాటు చేస్తాయి. బీజేపీని శిక్షించాలని, ఎస్కేఎం డిమాండ్ల ఆధారంగా రైతులలో స్వతంత్ర, భారీ ప్రచారాన్ని నిర్వహిస్తారు. కార్మికులను ఇతర సంఘాలను కలుపుకుని రైతులు వాహన జాతాలు, పాదయాత్రలు, మహాపంచాయత్‌లను నిర్వహిస్తారు. అలాగే తమ తమ రాష్ట్రాల్లో నెలకొన్న రైతుల సమస్యలను గుర్తించేందుకు, కేంద్ర కార్యాచరణ కార్యక్రమాలతో పాటు వారి ఆందోళన కార్యక్రమాలనూ రూపొందించేందుకు తక్షణమే అన్ని రాష్ట్రాల్లో ఎస్కేఎం రాష్ట్ర సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహించాలని పిలుపునిచ్చాయి."

జనరల్ బాడీ ఆమోదించిన డిమాండ్లు

- అన్ని పంటలకు గ్యారెంటీ సేకరణతో సీ2ం50 శాతంతో కూడిన ఎంఎస్‌పీ చట్టబద్ధంగా హామీ ఇవ్వాలి.
- రైతులు, వ్యవసాయ కార్మికులకు రుణభారం నుంచి విముక్తి కల్పించి రైతు ఆత్మహత్యలకు ముగింపు పలకడానికి సమగ్ర రుణమాఫీ చేయాలి.
- విద్యుత్ రంగం ప్రయివేటీకరణ ఆపాలి. ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు పెట్టొద్దు.
- ప్రభుత్వ రంగం కింద అన్ని పంటలకు, పశుపోషణకు సమగ్ర బీమా కవరేజీ ఇవ్వాలి. రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల పీఎంఎఫ్‌బీవై పథకాన్ని రద్దు చేయాలి.
- రైతులు, వ్యవసాయ కార్మికులందరికీ నెలకు రూ.10 వేలు పెన్షన్ ఇవ్వాలి.
- భూసేకరణ, పునరావాస చట్టం-2013ని అమలు చేయాలి. దేశమంతటా ప్రతి సంవత్సరం భూమి సర్కిల్ రేటును సవరించాలి. ప్రభుత్వ ప్రయివేట్ రంగం ప్రాజెక్టుల కోసం అక్రమంగా సేకరించడం వల్ల భూమిని కోల్పోయిన వారందరికీ తగిన పరిహారం అందించాలి. బుల్డోజర్ రాజ్‌కు ముగింపు పలకాలి. ముందస్తు పునరావాస ఏర్పాట్లు చేయకుండా మురికివాడ, నివాసాల కూల్చివేతను ఆపాలి.
- వ్యవసాయంలో కార్పొరేటీకరణ ఆపాలి. వ్యవసాయ ఉత్పత్తి, వాణిజ్యంలో బహుళజాతి కంపెనీలు వద్దు. వ్యవసాయంపై డబ్ల్యూటీఓ ఒప్పందం నుంచి ఇండియా బయటకు రావాలి.
- ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు, విద్యుత్, నీటిపారుదల, పెట్రోలియం ఉత్పత్తులు, యంత్రాలు, ట్రాక్టర్లు వంటి వ్యవసాయ ఇన్‌పుట్‌లపై జీఎస్టీ ఆపాలి.
- రాజ్యాంగంలోని సమాఖ్య సూత్రాల ప్రకారం పన్ను విధించే రాష్ట్ర ప్రభుత్వాల హక్కును నిర్ధారించడానికి జీఎస్టీ చట్టాన్ని సవరించాలి.
- జీడీపీలో తగిన వాటాతో వ్యవసాయం కోసం ప్రత్యేక కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలి.
- కేంద్ర ప్రభుత్వంలో సహకార మంత్రిత్వ శాఖను రద్దు చేయాలి. రాజ్యాంగంలో పొందుపరిచిన విధంగా సహకారాన్ని రాష్ట్ర అంశంగా ఉంచాలి. ఉత్పత్తి వర్గాలైన రైతులు, కార్మికుల ఖర్చుతో కార్పొరేట్ వర్గ ప్రయోజనాల కోసం అధికార కేంద్రీకరణను ప్రోత్సహించే బదులు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు మద్దతు ఇవ్వాలి.
- వన్యప్రాణుల ముప్పు కోసం శాశ్వత పరిష్కారాన్ని నిర్ధారించాలి. ప్రాణనష్టానికి పరిహారంగా రూ. కోటి, పంటలు, పశువుల నష్టానికి తగిన పరిహారం అందించాలి.
- లఖింపూర్ ఖేరీ అమరవీరులతో సహా చారిత్రాత్మక రైతుల పోరాట అమరవీరుల కుటుంబాలకు పరిహారం అందించాలి.
- రైతుల పోరాటానికి సంబంధించిన అన్ని కేసులను ఉపసంహరించుకోవాలి. 736 మంది రైతు అమరవీరుల స్మారకార్థం సింగు, టిక్రీ సరిహద్దులో అమరవీరుల స్మారక స్థూపాన్ని నిర్మించాలి.

సాగునీటిరంగ పితామహుడు నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్

(మొదటిపేజీ తరువాయి)

బహదూర్ అని అభిప్రాయపడ్డారు. మనం గొప్పగా మాట్లాడుకుంటున్న నిజాంసాగర్ ఆయన నిర్మించి దేనన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అభివృద్ధి, అస్తిత్వంలో జరిగినట్టే మహానుభావుల గుర్తింపులోనూ అన్యాయం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ జయంతి రోజున ఇంజినీర్స్ డేగా అధికారికంగా నిర్వహించడం గొప్ప విషయమని అభినందించారు. అలీ నవాజ్ జంగ్ మొట్టమొదటి స్వదేశీ చీఫ్ ఇంజినీర్‌గా రికార్డు సృష్టించారని చెప్పారు. ఆయనకు చీఫ్ ఇంజినీర్‌గా ప్రమోషన్ ఇచ్చిన సందర్భంగా బ్రిటీషు చీఫ్ ఇంజినీర్ ఎ.టి.మెకంజీ ఉన్నారన్నారు. నా బాధ్యతలను నాకంటే ప్రతిభావంతుడికి, నాకంటే గొప్ప పరిపాలనాదక్షుడికి అప్పజెబుతున్నానని చెప్పడం తెలంగాణకు గర్వకారణమని వివరించారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా ఇంజినీర్స్ భవన నిర్మాణానికి 2 వేల గజాల స్థలం అడిగారనీ, ప్రభుత్వంతో చర్చించి మీకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంటామని అన్నారు. మాది అకౌంట్స్ చూసే ప్రభుత్వం కాదనీ, అకౌంటబిలిటీ చూసే ప్రభుత్వమని వ్యాఖ్యానించారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఆర్ఆర్ఆర్ నిర్మాణంలో రిటైర్డ్ ఇంజినీర్ల సహకారం తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఇంజినీర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జేఎన్‌టీయూ వైస్ ఛాన్సలర్ ప్రొ డాక్టర్ డి.ఎన్.రెడ్డి, ఎన్ఐటీ వరంగల్ మాజీ డైరెక్టర్ పి.జీ శాస్త్రి డాక్టర్ జి. వెంకట సుబ్బయ్య, ఎంఏ కరీం, ఎస్. జస్వంత్ కుమార్ చంద్రమౌళి, ప్రొ. రమణా నాయక్, ఐ. గణపతి రెడ్డి, డాక్టర్ సీతారామ్ బాబు, శ్రీధర్‌రావు దేశపాండే తదితరులు పాల్గొన్నారు.

నవచిత్రం



దిగ్విజయంగా 50 వసంతాలు పూర్తి

30.8.1974న విడుదలైన 'తాతమ్మ కల'తో బాలకృష్ణ తన సినీ కెరీర్‌ను హీరోగా ప్రారంభించారు. హీరోగా తన కెరీర్‌లో 50 ఏళ్లు పూర్తయిన తర్వాత కూడా సినిమా ఇండస్ట్రీలో హీరోగా కొనసాగటం విశేషం. 50 ఏళ్లుగా తెలుగు చిత్ర పరిశ్రమలో వైవిధ్యమైన పాత్రల్లో హీరోగా కొనసాగుతున్న ప్రపంచంలోనే ఏకైక కళాకారుడు నందమూరి బాలకృష్ణ అని వేరే చెప్పక్కర్లేదు. ఆయన గోల్డెన్ జూబ్లీ సినీ హీరో.

అలాగే రాజకీయ రంగంలోనూ తనదైన సత్తా చాటుతున్నారు. వరుసగా మూడు పర్యాయాలు శాసనసభకు ఎన్నికై, హిందూపూర్ ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ సాధించారు. ఇప్పుడు సిల్వర్ జూబ్లీ జరుపుకుంటున్న హైదరాబాద్‌లోని బసవ తారకం ఇండో-బ్రిటీష్ క్యాన్సర్ హాస్పిటల్స్‌కి ఆయన చైర్మన్‌గా ఉన్నారు. ఈ ఆసుపత్రిని అభివృద్ధి చేసేందుకు ఆయన చేసిన అవిశ్రాంత కృషి మరువలేనిది. ఆయన ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్నారు. బాలకృష్ణ తన సినీ కెరీర్‌ను 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కె.ఎల్. దామోదర్ ప్రసాద్, తెలుగు చలనచిత్ర వాణిజ్య మండలి గౌరవ కార్యదర్శి, తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి అధ్యక్షుడు, సునీల్ నారంగ్, తెలంగాణ రాష్ట్ర ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు, టి. ప్రసన్న కుమార్, గౌరవ కార్యదర్శి, కోశాధికారి తెలుగు చలనచిత్ర వాణిజ్య మండలి, తెలుగు చలచిత్ర నిర్మాతల మండలి, , తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ 24 క్రాఫ్ట్స్ ప్రెసిడెంట్ వల్లభనేని అనిల్ ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

అలాగే సెప్టెంబరు 1వ తేదీన తెలుగు చలనచిత్ర పరిశ్రమ ఆయనకు సన్మానం చేయనుందని, అందుకు అంగీకరించాల్సిందిగా బాలకృష్ణని అభ్యర్థించగా, ఆయన అందుకు అంగీకరించారు.

అందరికీ నచ్చే హిలేరియస్ ఎంటర్‌టైనర్



అశ్విన్ రామ్

ప్రియదర్శి, నభా నటేష్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న యూనిక్ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'డార్లింగ్'. అశ్విన్ రామ్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై కె నిరంజన్ రెడ్డి, శ్రీమతి చైతన్య నిర్మించిన ఈ చిత్రం ఈనెల 19న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో డైరెక్టర్ అశ్విన్ రామ్ మీడియాతో మాట్లాడుతూ, "డార్లింగ్' సినిమాకి అపరిచితుడు మూవీ స్ఫూర్తి కాదు. స్ప్లిట్ పర్సనాలిటీ కామన్‌గా కనిపించవచ్చు కానీ కథ, కాన్ఫ్లిక్ట్ పరంగా ఈ రెండు డిఫరెంట్ మూవీస్. అపరిచితుడులో శంకర్ లార్జ్ స్కేల్‌లో సోషల్ ఇష్యూని డీల్ చేశారు. డార్లింగ్‌లో హోం ఇష్యూస్‌ని డీల్ చేస్తున్నాం (నవ్వుతూ). ప్రభాస్ 'డార్లింగ్' కల్ట్ హిట్ మూవీ. అయితే ఈ కథకు 'డార్లింగ్' అనే టైటిల్ యాప్ట్. వైఫ్ అండ్ హస్బెండ్ ప్రేమగా పిలుచుకునే పదం డార్లింగ్. మా సినిమాకి ఇది పర్ఫెక్ట్ టైటిల్. ఇప్పటివరకూ ప్రభాస్ ఫ్యాన్స్ నుంచి కూడా చాలా పాజిటివ్ రెస్పాన్స్ వచ్చింది. సినిమా చూసిన తర్వాత ఇది పర్ఫెక్ట్ టైటిల్ అని ప్రేక్షకులే చెబుతారు. దర్శి, నభా ఇద్దరూ బాగా నటించారు. వివేక్ సాగర్ పర్ఫెక్ట్ మ్యూజిక్ ఇచ్చారు. రీరికార్డింగ్ కూడా ఎక్స్‌ట్రార్డినరీ చేశారు. ఇందులో ఎటువంటి సందేశాలు ఉండవు. ఇది అందరికీ నచ్చే హిలేరియస్ ఎంటర్‌టైనర్. సినిమా చూసిన తర్వాత అందరూ ఇందులో ఉన్న కాన్సెప్ట్‌కి బాగా కనెక్ట్ అవుతారు' అని తెలిపారు.



ఆగస్ట్ 2న రిలీజ్



రాజ్ తరుణ్, మాల్వి మల్హోత్రా

రాజ్ తరుణ్ హీరోగా, ఎఎస్‌రవికుమార్ చౌదరి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'తిరగబడరసామీ'. మాల్వి మల్హోత్రా కథానాయికగా నటిస్తోంది. సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ మీడియా బ్యానర్ పై మల్కాపురం శివకుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. యూత్‌ని ఆకట్టుకునే రొమాన్స్‌తో పాటు ఫ్యామిలీని ఆకర్షించే సెంటిమెంట్, మాస్‌ని అలరించే హై వోల్టేజ్ యాక్షన్, ఎమోషనల్ ఎలిమెంట్స్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు.

తాజాగా ఈ సినిమా రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేశారు మేకర్స్. ఆగస్ట్ 2న ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, పాటలు మంచి బజ్ క్రియేట్ చేసి సినిమాపై క్యురియాసిటీని పెంచాయి. బాలీవుడ్ బ్యూటీ మన్నారా చోప్రా ఈ చిత్రంలో ఓ డిఫరెంట్ క్యారెక్టర్‌తో పాటు ఒక స్పెషల్ సాంగ్‌లో అలరించబోతుంది. మకరంద్ దేశ్‌పాండే, జాన్ విజయ్, రఘు బాబు, అంకిత ఠాకూర్, పృథ్వీ, ప్రగతి, రాజా రవీంద్ర, బిత్తిరి సత్తి ఇతర కీలక పాత్రలు పోషించారు.

సినిమా కాదు మన జీవితం



బొమ్మకు క్రియేషన్స్ బ్యానర్ పై బొమ్మకు హిమమాల సమర్పణలో డాక్టర్ బొమ్మకు మురళి దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా 'ఇండియా ఫైల్స్'. మన దేశంలోనే కల్చరల్ డిఏన్ఏ మీద తెరకెక్కుతున్న తొలి సినిమా ఇదే.

రాజకీయ నాయకుడు అద్దంకి దయాకర్ ముఖ్యపాత్రలో నటిస్తుండగా, ఇంద్రజ, సుమన్, శుభలేక సుధాకర్, సితార, మక్రంద్ దేశ్ పాండే, రవి ప్రకాష్, హిమజ, జీవన్ కుమార్, సహస్ర వంటి తదితరులు ఇతర పాత్రలను పోషిస్తున్నారు. కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమా ఆడియో వేడుక ప్రసాద్ ల్యాబ్స్‌లో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు తెలంగాణరాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, చిత్ర యూనిట్‌ని అభినందించారు. కీరవాణి మాట్లాడుతూ, "తిరిగి చూడు..' పాట చాలా గొప్పగా ఉంటుంది. గద్దర్ పాడి, ఆడి నటించిన పాటకి నేను మ్యూజిక్ అందించడం చాలా సంతోషంగా ఉంది' అని తెలిపారు.

'ఈ సినిమాలో ఉన్న పాటలు కోమటిరెడ్డికి బాగా నచ్చాయి. యాక్టింగ్ అంటే ఏంటో తెలియని నన్ను 40 రోజులు ప్రత్యేకంగా ట్రైనింగ్ ఇచ్చి, ఇంత మంచి కంటెంట్ ఉన్న సినిమాలో నటించే అవకాశం కల్పించారు' అని హీరో డాక్టర్ అద్దంకి దయాకర్ చెప్పారు. గద్దర్ కూతురు వెన్నెల మాట్లాడుతూ, 'ఇది సినిమా కాదు, ఇది మన జీవితం' అని తెలిపారు. దర్శక, నిర్మాత డాక్టర్ బొమ్మకు మురళి మాట్లాడుతూ,'ఈ సినిమాకు బీజం వేసింది గద్దర్. ఈ సినిమాలో ఆయన చాలా ఇంపార్టెంట్ రోల్ ప్లే చేశారు. మన కల్చరల్ డిఏన్ఏ మీద నిర్మించిన తొలి సినిమా ఇది' అని చెప్పారు.

హైబ్రిడ్ మోడల్‌కు ప్రతిపాదన

చాంపియన్స్ ట్రోఫీ వేదికలు మార్చాలంటూ ఐసిసికి బిసిసిఐ విజ్ఞప్తి

ముంబయి: వచ్చే ఏడాది పాకిస్తాన్ వేదికగా జరిగే ఛాంపియన్స్ ట్రోఫీకి బిసిసిఐ అభ్యంతరం తెలిపింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి-మార్చిలో ఛాంపియన్‌ట్రోఫీ షెడ్యూల్ ముసాయిదాను పాకిస్తాన్ క్రికెట్‌బోర్డు(పిసిబి) ఇప్పటికే ఐసిసికి సమర్పించింది. అయితే, ఈ షెడ్యూల్‌కు బిసిసిఐ ఆమోదం తెలపలేదు. గత ఆసియా కప్ టోర్నీ మాదిరిగానే ఛాంపియన్స్ ట్రోఫీని కూడా హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించాలనే ప్రతిపాదనలను ఐసీసీ ఎదుట బిసిసిఐ ఉంచినట్లు సమాచారం. భారత్ మ్యాచ్‌లను వేరే ప్రాంతానికి తరలించి.. మిగతా వాటిని పాక్ వేదికగానే నిర్వహించుకొనే అవకాశం లేకపోలేదు. ఇప్పటికే పాకిస్థాన్‌కు తమ జట్టును పంపించేది లేదని.. భారత్ ఆడే మ్యాచ్‌ల వేదికలను మార్చాల్సిందేనని బిసిసిఐ పట్టుబట్టినట్లు బిసిసిఐ అధికారి ఒకరు వెల్లడించాయి. ఇప్పటికే టోర్నీకి సంబంధించి ముసాయిదా షెడ్యూల్‌ను పాక్ సిద్ధం చేసింది. భారత్ ఆడే మ్యాచ్‌లకు ముసాయిదా షెడ్యూల్‌లో పాక్ లాహోర్ స్టేడియాన్ని కేటాయించింది. టీమిండియా ఆడే మ్యాచ్‌లన్నీ అక్కడే జరుగుతాయని పేర్కొంది. అయితే, భద్రతాపరమైన సమస్యల నేపథ్యంలో అసలు పాక్‌కే వెళ్లకూడదనే కృతనిశ్చయంతో బిసిసిఐ ఉంది. దీంతో భారత్ ఆడే వేదికలను శ్రీలంక లేదా దుబాయ్‌కు మార్చాలనే కండీషన్‌ను పెట్టింది. ఎనిమిది జట్లతో కూడిన ఈ టోర్నీ వన్డే ఫార్మాట్‌లో జరగనుంది. చివరిసారిగా ధోనీ నాయకత్వంలో భారత్ 2013లో ఛాంపియన్స్ ట్రోఫీని కైవసం చేసుకొంది. ఇప్పుడు మరోసారి రోహిత్ నాయకత్వంలో బరిలోకి దిగనుంది.



శ్రీలంక షెడ్యూల్ ఇదే..

జింబాబ్వే పర్యటన ముగిసిన వెంటనే టీమిండియా శ్రీలంక పర్యటనకు బయల్దేరనుంది. ఈ పర్యటనలో భాగంగా భారత జట్టు శ్రీలంకతో మూడేసి టి20లతో పాటు మరో మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. జింబాబ్వే పర్యటనలో ఉన్న భాగంగా భారత్ ఐదు టి20ల సిరీస్ ఆడుతోంది. జులై 14తో ఈ సిరీస్ ముగుస్తుంది. అనంతరం ఈ నెలాఖరులో భారత జట్టు శ్రీలంక పర్యటనకు వెళ్లనుంది. ఈ టూర్‌కు సంబంధించిన మ్యాచ్‌ల వివరాలను బిసిసిఐ ప్రకటించింది.

టి20 మ్యాచ్‌లన్నీ పల్లెకెలెలో, వన్డే మ్యాచ్‌లు కొలంబోలో జరగనున్నాయి. ఈ పర్యటనకు భారత కోచ్‌గా గౌతమ్ గంభీర్ వ్యవహరించనుండగా.. ఆ టోర్నీలో ఆడే భారతజట్టును బిసిసిఐ ప్రకటించాలి ఉంది.

షెడ్యూల్

టి20 సిరీస్...
- జులై 26 - తొలి టి20
- జులై 27 - రెండో టీ20
- జులై 29 - మూడో టీ20

వన్డే సిరీస్..
- ఆగస్టు 1 - మొదటి వన్డే
- ఆగస్టు 4 - రెండో వన్డే
- ఆగస్టు 7 - మూడో వన్డే

గోల్ఫర్ అతిథికి పతకం ఖాయం

దిగ్గజ క్రికెటర్ కపిల్ దేవ్ జోస్యం



న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో మహిళా గోల్ఫర్ అతిథి అశోక్ పతకం సాధించడం ఖాయమని దిగ్గజ క్రికెటర్ కపిల్ దేవ్ జోస్యం చెప్పాడు. భారత గోల్ఫ్ ఫెడరేషన్(పిజిటిఎ)కు అధ్యక్షునిగా ఉన్న కపిల్‌దేవ్ గురువారం మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. అలాగే ప్రభుత్వం మెరుగైన సౌకర్యాలు, ఖర్చులు, నిధులను సక్రమంగా విడుదల చేస్తే యువ గోల్ఫర్లు వెలుగులోకి రావడం ఖాయమని అన్నారు. టోక్యో ఒలింపిక్స్‌లో అతిథి అశోక్ పతకానికి చేరువై తృటిలో కాంస్య పతకానికి చేజార్చుకొని 4వ స్థానంతోనే సరిపుచ్చుకుందన్నారు. ఆ ఒలింపిక్స్‌లో 2స్ట్రోక్స్‌తో నెల్లి కొర్దా స్వర్ణ పతకం చేజిక్కించుకోగా. ఒక స్ట్రోక్స్ వ్యత్యాసంతో రజిత, కాంస్య పతకాలు అతిథికి చేజారాయని చెప్పుకొచ్చారు. ఇటీవలికాలంలో అద్భుత ప్రదర్శనతో అతిథి రాణిస్తోందని, దీంతో ఆమె వరుసగా రెండోసారి ఒలింపిక్స్‌కు అర్హత సాధించిందన్నారు. ఆ స్థాయి ప్రదర్శనను పారిస్ ఒలింపిక్స్‌లోనూ కనబరిస్తే పతకం సాధించడం ఖాయమని అన్నారు.

దాదా కొత్త ఇన్నింగ్స్



ఇండియన్ రేసింగ్ లీగ్‌లో ఫ్రాంచైజీ కొనుగోలు

ఢిల్లీ: భారత క్రికెట్ జట్టు మాజీ సారథి సౌరవ్ గంగూలీ మరో కొత్త ఇన్నింగ్స్ మొదలుపెట్టాడు. గత రెండు సీజన్లుగా దేశంలో మోటార్ స్పోర్ట్స్ ప్రేమికులను అలరిస్తున్న ఇండియన్ రేసింగ్ లీగ్ (ఐఆర్‌ఎల్)లో దాదా ఫ్రాంచైజీ కొనుగోలు చేశాడు. 'కోల్‌కతా రాయల్ టైగర్స్' పేరిట ఫ్రాంచైజీని కొన్న గంగూలీ రాబోయే సీజన్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్టు చెప్పాడు. ఈ లీగ్‌లో కోల్‌కతా పాల్గొంటుండటం ఇదే ప్రథమం కాగా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, గోవా, కొచ్చి, అహ్మదాబాద్ వంటి ఫ్రాంచైజీలు ఇదివరకే అభిమానులను అలరిస్తున్నాయి. ఈ లీగ్‌లో మూడో ఎడిషన్ వచ్చే ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో జరుగనుంది.

ఆటలు



కొలంబియా సంచలనం

సెమీస్‌లో ఉరుగ్వేకు ఝులక్

కోపా అమెరికా టైటిల్ పోరులో అర్జెంటీనాతో ఢీ

ఈస్ట్ రూథర్‌ఫర్డ్(అమెరికా): కోపా అమెరికా ఫుట్‌బాల్ టోర్నీ ఫైనల్లోకి కొలంబియా ప్రవేశించింది. గురువారం జరిగిన ఉత్కంఠభరిత రెండోసెమీస్‌లో కొలంబియా జట్టు 1-0తో పటిష్ట ఉరుగ్వేను చిత్తుచేసింది. కొలంబియా తరపున ఏకైక గోల్‌ను జెఫర్సన్(39వ ని.)లో చేశాడు. 46వ నిమిషంలో డార్విన్ నూనెజ్ రెండుసార్లు పసుపుకార్డుకు గురయ్యాడు. దీంతో అతడు మైదానాన్ని వీడాల్సి వచ్చింది. ఆ క్రమంలో కొలంబియా జట్టు రెండో అర్ధభాగమంతా 10మంది ఆటగాళ్లతోనే ఆడాల్సి వచ్చింది. అయినా కొలంబియా డిఫెన్స్ అద్భుతంగా ఉండడంతో ఉరుగ్వే గోల్ కొట్టలేకపోయింది. 2001 తర్వాత కొలంబియా జట్టు కోపా అమెరికా టైటిల్ పోరుకు చేరడం ఇదే ప్రథమం. ఉరుగ్వే జట్టు క్వార్టర్‌ఫైనల్లో బ్రెజిల్‌ను పెనాల్టీ షూటౌట్‌లో చిత్తుచేసి సెమీస్‌కు చేరిన సంగతి తెలిసిందే. ఆదివారం జరిగే టైటిల్ పోరులో కొలంబియా జట్టు డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనాతో తలపడనుంది.

ఫైనల్‌కు పోలిని

- సెమీస్‌లో వేకిక్‌పై సంచలన విజయం
- వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ

లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫైనల్లోకి 7వ సీడ్, ఇటలీకి చెందిన పోలిని ప్రవేశించింది. గురువారం జరిగిన తొలి సెమీఫైనల్లో పోలిని మూడుసెట్ల హోరాహోరీ పోరులో అన్‌సీడెడ్ వేకిక్(క్రొయేషియా)పై సంచలన విజయం సాధించింది. తొలి సెట్‌ను చేజార్చుకొని మూడోసెట్ టైబ్రేక్‌లోనూ ఓ దశలో వెనుకబడ్డ పోలిని విజేతగా నిలవడం విశేషం. ఉత్కంఠభరితంగా సాగిన సెమీస్‌లో పోలిని 2-6, 6-4, 7-6(10-8)తో వేకిక్‌ను చిత్తుచేసింది. మ్యాచ్ ప్రారంభంలో తలబడ్డ పోలిని.. తేరుకొనేలోపే తొలిసెట్‌ను చేజార్చుకుంది. ఇక రెండోసెట్‌లో ఒక బ్రేక్ పాయింట్ సాధించి ఆ సెట్‌ను 6-4తో చేజిక్కించుకొంది. దీంతో ఇరువురు ఒక్కో సెట్‌ను గెలుచుకొని 1-1తో సమంగా నిలిచారు. మూడో సెట్‌లో ఇరువురు క్రీడాకారిణులు ప్రతి పాయింట్‌ను చేజిక్కించుకోవడంతో ఆ సెట్ టైబ్రేక్‌కు దారితీసింది. టై బ్రేక్‌లోనూ పోలిని ఓ దశలో 4-3తో వెనుకబడ్డా.. ఆ తర్వాత అద్భుతంగా పుంజుకొని ఆ సెట్‌ను చేజిక్కించుకొంది. దీంతో కెరీర్‌లో తొలిసారి ఓగ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫైనల్లోకి పోలిని ప్రవేశించింది. క్రేజికోవా(చెక్) - రైబకినా(కజకిస్తాన్)ల మధ్య జరిగే రెండో సెమీస్ విజేతతో శనివారం జరిగే ఫైనల్లో పోలిని తలపడనుంది.




నేడు పురుషుల సింగిల్స్ సెమీఫైనల్..

పురుషుల సింగిల్స్ ఫైనల్ శుక్రవారం జరగనుంది. తొలి సెమీస్‌లో 5వ సీడ్ మెద్వదేవ్(రష్యా) 3వ సీడ్ అల్కరాజ్ (స్పెయిన్)తో తలపడనున్నాడు. మరో సెమీస్‌లో 25వ సీడ్ ముసెట్టి(ఇటలీ) 2వ సీడ్ నొవాక్ జకోవిచ్(సెర్బియా)తో అమీతుమీ తేల్చుకోనున్నాడు. టాప్‌సీడ్ జెన్నిక్ సిన్నర్(ఇటలీ) క్వార్టర్‌ఫైనల్లో మెద్వదెవ్ చేతిలో ఓటమిపాలైన సంగతి తెలిసిందే.

యూరో ఫైనల్‌కు ఇంగ్లండ్

సెమీస్‌లో నెదర్లాండ్స్‌పై 2-1గోల్స్‌తో గెలుపు



బెర్లిన్(జర్మనీ): యూరో-2024 ఫైనల్లోకి ఇంగ్లండ్ జట్టు దూసుకెళ్లింది. బుధవారం రాత్రి జరిగిన రెండో సెమీస్‌లో ఇంగ్లండ్ జట్టు 2-1గోల్స్ తేడాతో నెదర్లాండ్స్‌పై విజయం సాధించింది. ఇంగ్లండ్ తరఫున హారీ కేన్(18వ ని.లో) పెనాల్టీని గోల్‌గా మలచగా.. రెండో గోల్‌ను ఓలీ వాల్కటన్(90వ ని.)లో చేశాడు. ఇక నెదర్లాండ్స్ తరఫున ఏకైక గోల్‌ను సిమన్స్(7వ ని.)లో కొట్టాడు. మ్యాచ్ ప్రారంభమైన 7వ ని.లో నెదర్లాండ్స్ జట్టు ఒక గోల్ కొట్టి ఆధిక్యతలో నిలిచినా.. తొలి అర్ధభాగంలోనే ఇంగ్లండ్ జట్టు మరో గోల్ కొట్టి స్కోర్‌ను సమం చేసింది. ఇక రెండో అర్ధభాగం ముగింపులో ఇంగ్లండ్ మరో గోల్ కొట్టడం విజయం లభించింది. ఆదివారం రాత్రి జరిగే ఫైనల్లో ఇంగ్లండ్ జట్టు టైటిల్‌కై స్పెయిన్‌తో తలపడనుంది.

యుద్ధాన్ని కాదు బౌద్ధాన్ని ఇచ్చాం

వియన్నాలో భారతీయులను ఉద్దేశించి ప్రసంగించిన మోడీ

వియన్నా : ప్రపంచానికి మన భారతదేశం 'బౌద్ధాన్ని' ఇచ్చింది కానీ 'యుద్ధం'ను కాదని ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు. అంటే శాంతి, సంక్షేమాలే భారతదేశం ఎప్పుడూ ఇస్తూ వచ్చిందన్నారు. తద్వారా 21వ శతాబ్దంలో భారత్ తన పాత్రను మరింత బలోపేతం చేసుకుంటోందని చెప్పారు.

వియన్నాలో ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రధాని మోడీ ప్రసంగించారు. అత్యుత్తమమైన, ప్రకాశవంతమైన దేశంగా నిలిచేందుకు భారత్ కృషి చేస్తోందని, అతిపెద్దవైన మైలురాళ్లను దాటుతూ సమున్నతమైన లక్ష్యాలను సాధిస్తోందన్నారు.

"వేల సంవత్సరాలుగా, మనం మన విజ్ఞానాన్ని, అనుభవాలను ఇతరులకు పంచుతున్నాం. మనం యుద్ధాన్ని ఇవ్వలేదు, బౌద్ధ తత్వాన్ని ఇచ్చాం." అని మోడీ పేర్కొన్నారు. మాస్కోలో రెండు రోజుల పర్యటన ముగించుకుని వియన్నా వచ్చిన మోడీ ఇక్కడి భారతీయులను కలుసుకుని వారితో మాట్లాడారు. ఆస్ట్రియాలో తన మొదటి పర్యటన అర్థవంతంగా జరిగిందన్నారు. భారత్, ఆస్ట్రియాల మధ్య 75ఏళ్ల స్నేహ బంధానికి గుర్తుగా 41ఏండ్ల తర్వాత భారత ప్రధాని ఈ దేశాన్ని సందర్శించారని మోడీ వ్యాఖ్యానించారు. రెండు దేశాలు భౌగోళికంగా భిన్నమైనవి అయినప్పటికీ ప్రజాస్వామ్యం రెండింటినీ కలుపుతోందన్నారు. స్వేచ్ఛ, సమానత్వం, బహుళవాదం, చట్టబద్ధ పాలన పట్ల గౌరవం ఇవన్నీ మనం పంచుకునే విలువలని అన్నారు. మన సమాజాలు బహుళ సంస్కృతులతో సమ్మిళితమైనవని అన్నారు. వైవిధ్యత రెండు దేశాల్లో కనిపిస్తుందన్నారు. అంతకుముందు ఆస్ట్రియాలోని భారతీయులు మోడీకి సాదరంగా స్వాగతం పలికారు.

ఢిల్లీ చేరుకున్న మోడీ

రష్యా, ఆస్ట్రియాల్లో పర్యటన ముగించుకుని ప్రధాని మోడీ గురువారం ఢిల్లీ చేరుకున్నారు. ఈ పర్యటన చారిత్రకమైనదిగా, మంచి ఫలితాలను అందించినదిగా అభివర్ణించారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

గెలాక్సీ జడ్ ఫోల్డ్ 6 ఫోన్ల విడుదల

- ధర రూ.2 లక్షలు పైనే..



పారిస్ : దక్షిణ కొరియాకు చెందిన ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల దిగ్గజం సామ్‌సంగ్ గురువారం మార్కెట్లోకి కొత్త గెలాక్సీ జడ్ ఫోల్డ్ 6 పేరుతో కొత్త మడత ఫోన్‌లను విడుదల చేసింది. పారిస్‌లో జరిగిన సామ్‌సంగ్ గ్యాలక్సీ అన్‌ప్యాక్డ్ ఈవెంట్‌లో వీటిని ఆవిష్కరించింది. ఈ ఫోల్డెబుల్ ఫోన్‌లలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో కూడిన ఫీచర్లను అందిస్తున్నట్లు పేర్కొంది. భారత్‌లో గెలాక్సీ జడ్‌ఫ్లిప్6లో 12జీబీ రామ్, 256జీబీ స్టోరేజ్ వేరియంట్ ధరను రూ.1,09,999గా, 12జీబీ, 512 జీబీ ధరను రూ.1,21,999గా ప్రకటించింది.

జడ్ ఫోల్డ్6 వేరియంట్‌లో 12జీబీ, 256జీబీ ధరను రూ. 1,64,999గా, 12జీబీ, 512 స్టోరేజ్ వేరియంట్ ధరను రూ. 1,76,999గా, 12జీబీ, 1టీబీ స్టోరేజ్ ధరను ఏకంగా రూ.2,00,999గా నిర్ణయించింది. ఆండ్రాయిడ్ 14 ఆపరేటింగ్ సిస్టమ్‌తో పనిచేసే ఈ ఫోన్‌లలో ఏడేండ్ల పాటు అప్‌డేట్‌లను అందించనుంది. 50 ఎంపీ, 12 ఎంపీ, 10 ఎంపీతో కూడిన ట్రిపుల్ కెమెరా సెటప్ రెయిర్ కెమెరాలను అమర్చింది. 10 మెగాపిక్సెల్స్‌తో కూడిన ఫ్రంట్ కెమరాను.. అలాగే అండర్ డిస్‌ప్లేలో 4 ఎంపీ కెమెరాను కలిగి ఉంది.

నాలుగు నెలల కనిష్టానికి రూపాయి



న్యూఢిల్లీ : అంతర్జాతీయ మార్కెట్‌లో రూపాయి విలువ నాలుగు నెలల కనిష్ట స్థాయికి పడిపోయింది. గురువారం అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి 5 పైసలు పడిపోయి 83.56 వద్ద ముగిసింది. ఇది మార్చి రెండోవారం నాటి కనిష్ట స్థాయి కావడం గమనార్హం. గడిచిన ఒక్క నెలలోనే దాదాపు 1.7 శాతం వరకు క్షీణించింది. దేశీయ స్టాక్ మార్కెట్లలో విదేశీ సంస్థాగత మదుపర్ల అమ్మకాలు రూపాయిపై ఒత్తిడిని పెంచాయి. ఉదయం 83.49 వద్ద ప్రారంభమైన రూపాయి విలువ.. ఇంట్రాడేలో ఏకంగా 83.59 కనిష్ట స్థాయిని తాకింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ తగ్గడం ద్వారా దిగుమతుల ఉత్పత్తులు భారం కావడంతో పాటు విదేశీ అప్పులపై వ్యయాలు పెరగనున్నాయి.

కీర్తిలాల్స్‌కు జ్యువెలరీ ఎమినెన్స్ అవార్డు



హైదరాబాద్ : ప్రముఖ అభరణాల రిటైల్ చెయిన్ కీర్తిలాల్స్‌కు ప్రతిష్టాత్మక జ్యువెలరీ ఎమినెన్స్ అవార్డ్స్ (జేఏఈ) 2024 అవార్డు దక్కినట్లు తెలిపింది. జైపూర్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో జెమ్స్ ఫీల్డ్ కలర్ స్టోన్ బ్రైడల్ జ్యువెలరీ, డైమండ్ బేంగిల్, బ్రేస్లెట్ విభాగాల్లో ఈ గుర్తింపు పొందినట్లు కీర్తిలాల్ బిజినెస్ స్ట్రాటజీ డైరెక్టర్ సూరజ్ శాంతకుమార్ పేర్కొన్నారు. ఇది తమ ఆధునికతల మేలు కలయికతో విశిష్టమైన ఆభరణాలని రూపుదిద్దడంలో ప్రత్యేకతలకు నిదర్శనమన్నారు.

దేశంలోనే తొలి టూరిజం ఇండెక్స్ ఫండ్

- టాటా ఎంఎఫ్ ఆవిష్కరణ

ముంబయి : మ్యూచువల్ ఫండ్ సంస్థ టాటా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ దేశంలోనే తొలి సారి టూరిజం ఇండెక్స్ ఫండ్‌ను ఆవిష్కరించింది. నిఫ్టీ 500లోని కంపెనీలు ఇందులో భాగంగా ఉంటాయి. ఈ ఫండ్ జులై 19 వరకు తెరవబడి ఉంటుందని ఆ కంపెనీ తెలిపింది. ఆ తర్వాత తిరిగి కొనుగోళ్లకు జులై 29 నుంచి అందుబాటులో ఉంటుందని వెల్లడించింది. టాటా నిఫ్టీ ఇండియా టూరిజం ఇండెక్స్ ఫండ్‌లో 17 స్టాక్స్ ఉన్నాయి. ఈ ఎన్‌ఎఫ్‌ఓలో కనీస పెట్టుబడిని రూ.5,000గా నిర్ణయించింది.

బియ్యం ఎగుమతులపై నిషేధం ఎత్తివేత..!

- మంత్రి పియూష్ గోయల్ వెల్లడి

న్యూఢిల్లీ : బాస్మతీయేతర బియ్యంపై నిషేధాన్ని ఎత్తివేసే అంశంపై త్వరలోనే మంత్రుల బృందం సమావేశం కానుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. ఫిక్కీ నిర్వహించిన సమావేశంలో మంత్రి పియూష్ మాట్లాడుతూ.. డిమాండ్, సరఫరా, ధరల పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని చర్చలు జరుగుతాయన్నారు. భారత ఆహార ఉత్పత్తుల ఎగుమతుల విలువ రూ.4.6 లక్షల కోట్లుగా ఉందన్నారు. గతేడాది జులై నుంచి బాస్మతీయేతర బియ్యం ఎగుమతులపై నిషేధం ఉంది.

టీసీఎస్‌కు రూ.12,040 కోట్ల లాభాలు

ముంబయి : దేశంలోనే అతిపెద్ద ఐటీ సేవల కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 8.7 శాతం వృద్ధితో రూ.12,040 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.11,120 కోట్ల లాభాలు నమోదు చేసింది. గడిచిన క్యూ1లో టీసీఎస్ రెవెన్యూ 5.4 శాతం పెరిగి రూ.62,613 కోట్లకు చేరింది. రూపాయి ముఖ విలువ కలిగిన ఒక్కో ఈక్విటీ షేరుపై రూ.10 చొప్పున మధ్యంతర డివిడెండ్‌ను చెల్లించడానికి టీసీఎస్ బోర్డు ఆమోదం తెలిపింది. గడిచిన త్రైమాసికంలో కొత్తగా 5,452 మంది ఉద్యోగులను తీసుకోవడం ద్వారా మొత్తం సంఖ్య 6,06,998కి చేరినట్లు వెల్లడించింది.

లావా నుంచి బ్లేజ్ ఎక్స్

న్యూఢిల్లీ : దేశీయ స్మార్ట్‌ఫోన్ కంపెనీ లావా కొత్తగా బ్లేజ్ సీరిస్‌లో కొత్త బ్లేజ్ ఎక్స్‌ను విడుదల చేసింది. 4జీబీ ర్యామ్ ధరలను రూ.13,999గా, 6జీబీ ధరను రూ.14,999గా, 8జీబీ వేరియంట్ ధరను రూ.15,999గా నిర్ణయించింది. జులై 20 నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో లభ్యం అవుతుందని ఆ కంపెనీ తెలిపింది. 64ఎంపీ ప్రైమరీ కెమెరా, 2 ఎంపీ అల్ట్రావైడ్ కెమెరా సహా 16ఎంపీ సెల్ఫీ కెమెరాతో దీన్ని ఆవిష్కరించింది.

మణిపూర్ రెండుగా విడిపోయింది

- ప్రధాని మోడీ అక్కడ పర్యటించాలి :రాహుల్‌గాంధీ
- పర్యటన వీడియోను షేర్ చేసిన లోక్‌సభ ప్రతిపక్ష నేత



న్యూఢిల్లీ : మణిపూర్ రాష్ట్రం రెండుగా విడిపోయిందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. మణిపూర్‌లో తాను ఇటీవల పర్యటించిన ఐదు నిమిషాల వీడియోను ఆయన ఎక్స్‌లో గురువారం షేర్ చేశారు. మణిపూర్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటించాలని, అక్కడి ప్రజల సమస్యలు వినాలని రాహుల్ విజ్ఞప్తి చేశారు. మణిపూర్‌లో శాంతిని నెలకొల్పవలసిన అవసరం గురించి పార్లమెంట్‌లో కాంగ్రెస్, ఇండియా వేదిక పూర్తిస్థాయిలో డిమాండ్ చేస్తాయని తెలిపారు. 'మణిపూర్‌లో హింసాకాండ చెలరేగిన తరువాత నేను అక్కడ పర్యటించడం ఇది మూడోసారి. దురదృష్టవశాత్తు పరిస్థితిలో ఎటువంటి మార్పు లేదు. ఈ రోజుకు కూడా మణిపూర్ రెండు భాగాలుగా విడిపోయి ఉంది' అని రాహుల్ గాంధీ తెలిపారు.

వేలాది కుటుంబాలు సహాయక శిబిరాల్లోనే తలదాచుకుంటున్నాయని చెప్పారు. ఇళ్లు కాలిపోతున్నాయని, అమాయకుల ప్రాణాలు ప్రమాదంలో ఉన్నాయని తెలిపారు. ఈ నెల 8న మణిపూర్‌లో రాహుల్‌గాంధీ పర్యటించి, అక్కడ సహాయక శిబిరాల్లో ఉంటున్న బాధితులతో మాట్లాడారు. తమను కలవడానికి అందరూ వస్తారు కానీ, ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా రారని రాహుల్ వద్ద బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఇళ్లకు వెళ్లాలని ఉందని చెప్పారు.

ఆసియాలో గందరగోళాలు సృష్టించొద్దు

- ఉక్రెయిన్ యుద్ధంపై నాటో వ్యాఖ్యలను ఖండించిన చైనా

బీజింగ్ : ఇతరుల భద్రతను పణంగా పెట్టి నాటో తన భద్రతను కోరుకుంటోందని చైనా విమర్శించింది. ఆసియాలో కూడా ఇటువంటి గందరగోళాలు తీసుకురావద్దని నాటోకు స్పష్టం చేసింది. ఉక్రెయిన్‌పై రష్యా జరుపుతున్న యుద్ధంలో నిర్ణయాత్మక పాత్ర చైనాదే అని నాటో ఆరోపించడాన్ని చైనా తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన జారీ చేసింది. "ఉక్రెయిన్ విషయంలో చైనా బాధ్యతను నాటో హైప్ చేస్తోంది. ఇది ఏ మాత్రమూ సహేతుకం కాదు. పైగా ఇందులో నీచపుటెత్తుగడలు వున్నాయి." అని విదేశాంగ ప్రతినిధి లిన్ జియాన్ పేర్కొన్నారు. ఉక్రెయిన్ విషయంలో చైనా చాలా న్యాయమైన, నిష్పాక్షికమైన వైఖరి తీసుకుందన్నారు. 'ఉక్రెయిన్‌పై రష్యా దాడిని ఖండించడానికి చైనా వ్యతిరేకించింది. పైగా దాడి జరిగినప్పటి నుండి రష్యాతో చైనా వాణిజ్యం పెరిగింది. పశ్చిమ దేశాల ఆంక్షలను పాక్షికంగానైనా తగ్గించేందుకు ఇది దోహదపడింది. రష్యాతో 'అవధుల్లేని భాగస్వామ్యం' ద్వారా చైనా ఈ యుద్ధానికి అవకాశం కల్పించిందని' నాటో బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. రష్యాతో చైనా వాణిజ్యం చట్టబద్ధమైనది, సహేతుకమైనదని లిన్ సమర్థించారు. ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు అనుగుణంగానే జరిగిందన్నారు.

ప్రయివేట్ ఆపరేటర్లకు స్టేజ్ క్యారేజ్ పర్మిట్లా?

- వెంటనే రద్దు చేయండి : హర్యానా ప్రభుత్వానికి ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ డిమాండ్



న్యూఢిల్లీ :హర్యానాలో 362 మార్గాల్లో బస్సు సర్వీసులను నిర్వహించుకునేందుకు ప్రయివేట ఆపరేటర్లకు ఆ రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడాన్ని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్) తీవ్రంగా ఖండించింది. రాష్ట్రంలోని 362 మార్గాల్లో 3,658 స్టేజ్ క్యారేజ్ పర్మిట్లతో బస్సులను నిర్వహించుకోవడానికి అనుమతిస్తూ ఈ నెల 8న హర్యానా ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ అనుమతులను వెంటనే రద్దు చేయాలని ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మార్గాల్లో బస్సు సర్వీసులు నిర్వహించేలా హర్యానా రోడ్‌వేస్‌కు ఆదేశాలను ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి నయబ్ సింగ్ సైనికి ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మయ్య లేఖ రాశారు. ఇలాంటి అనుమతులతో రాష్ట్ర రోడ్‌వేస్ మరింత దిగజారిపోతాయని తెలిపారు. హర్యానా రోడ్‌వేస్ కార్మికులకు సంఘీభావం తెలపాలని, హర్యానా ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌కు వ్యతిరేకంగా ఆందోళనలు నిర్వహించాలని అన్ని రాష్ట్ర కమిటీలకు, ఫెడరేషన్లకు, యూనియన్లకు ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ విజ్ఞప్తి చేసింది. నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రికి వినతిపత్రాన్ని కూడా ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ పంపింది.



పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

- మొక్కలు నాటి జిల్లాను అగ్రగామిగా నిలబెట్టాలి : అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ

నవతెలంగాణ-వరంగల్

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, మొక్కలు నాటి జిల్లాను వనమహోత్సవంలో అగ్రగామిగా నిలబెట్టాలని అటవీ, పర్యావరణ, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గురువారం వరంగల్ మహానగరక పాలక సంస్థ, అటవీ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో వరంగల్ పట్టణంలోని లేబర్ కాలనీ, ఈఎస్‌ఐ ఆస్పత్రి ఆవరణలో వనమహోత్సవం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దీనికి నగర మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ సత్యశారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ డాక్టర్ అశ్విని‌తానాజీ వాకడే, జిల్లా అటవీ శాఖ అధికారి అనూజ్ అగర్వాల్‌తో కలిసి మంత్రి కొండా సురేఖ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఇంటింటికీ మొక్కలు నాటేందుకు మంత్రి మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. 74 ఏండ్ల క్రితం అప్పటి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి కేఎం మున్షీ వనమహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారని, అప్పటి నుంచి ప్రతేడాది జులై మొదటి వారంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అందులో భాగంగానే గత నెల 29 నుంచి సీఎం రేవంత్‌రెడ్డి వన మహోత్సవ లోగోను ఆవిష్కరించి మన జిల్లా నుంచే శ్రీకారం చుట్టినట్టు చెప్పారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణంతో పాటు మానవునికి కూడా ముప్పు వాటిల్లుతుందని, ప్రజలకు చైతన్యం కల్పించే విధంగా డాక్యుమెంటరీని రూపొందిస్తున్నట్టు తెలిపారు. ప్లాస్టిక్ నిర్మూలించడంలో మార్పు స్వయంగా మన నుంచే రావాలని, వివిధ వాణిజ్య దుకాణాల యజమానులతో సమావేశమై ప్లాస్టిక్ నియంత్రణ పట్ల వారిని జాగృతం చేసి అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. త్వరలో గ్రేటర్ వరంగల్ పరిధిలో యువకులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అంతకు ముందు మంత్రి, మేయర్, కలెక్టర్, డీఎఫ్‌ఓ, కమిషనర్ అందరితో కలిసి వన మహోత్సవ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఈఎస్‌ఐ హాస్పిటల్ పర్యవేక్షకులు డాక్టర్ సాగర్, ఏవో ఉమాకాంత్, కార్పొరేటర్లు వస్కుల బాబు, సురేష్‌జోషి, మరుపల్ల రవి, రామ తేజస్వి శిరీష్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన యువకునిపై ఖాకీల ప్రతాపం

- ఎస్‌ఐ, పాలకుర్తి ఎమ్మెల్యే పీఏపై.. అట్రాసిటీ కేసు పెట్టి కఠినంగా శిక్షించాలి : లంబాడీ హక్కుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షులు భీమా నాయక్



నవతెలంగాణ-వరంగల్

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డిని ప్రశ్నించినందుకు కులం పేరు పెట్టి దూషిస్తూ యువకుడిని విచక్షణా రహితంగా కొట్టిన తొర్రూరు ఎస్‌ఐ జగదీష్, ఎమ్మెల్యే పీఏ విజేందర్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని లంబాడీ హక్కుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుగులోతు భీమా నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై గురువారం లంబాడీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొర్రూరు మండలం వెలికట్టే గ్రామానికి చెందిన మాలోతు సురేష్‌బాబు నాయక్ విద్యార్థి ఉద్యమంలో పనిచేస్తూ, లంబాడీ హక్కుల పోరాట సంఘం జిల్లా అధ్యక్షులుగా పనిచేస్తున్నారన్నారు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం సోషల్ మీడియాలో సురేష్ బాబు.. ఎమ్మెల్యే పీఏను ప్రశ్నిస్తూ "పాలకుర్తి ఎమ్మెల్యేగా గెలిపించింది మీ పీఏనా.. లేకపోతే పాలకుర్తి ప్రజలా.." అంటూ పోస్టులు పెట్టారని తెలిపారు. ఈ విషయంపై ఎమ్మెల్యే పీఏ పోద్బలంతో తొర్రూర్ ఎస్‌ఐ సురేష్ బాబును పోలీస్ స్టేషన్‌కు రప్పించి ఎమ్మెల్యే పీఏనే ప్రశ్నిస్తావా అంటూ భయభ్రాంతులకు గురిచేసి కొట్టినట్టు తెలిపారు. ఎమ్మెల్యే పీఏకు పోలీస్ స్టేషన్‌లో ఏం పని అని, పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ ముందే లంబాడి యువకుని తిట్టడం, ఎస్‌ఐ యువకున్ని కొట్టడం న్యాయమేనా అని ప్రశ్నించారు. తానే కొట్టినట్టు జడ్జికి చెప్పినా, బయట చెప్పినా.. మిగలవంటూ సురేశ్‌ను ఎస్‌ఐ బెదిరించినట్టు తెలిపారు. ఎస్‌ఐపై, ఎమ్మెల్యే పీఏపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయకపోతే ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎల్‌హెచ్‌పీఎస్ పార్లమెంట్ ఇన్‌చార్జి రాందాస్ నాయక్, డోర్నకల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మంగిలాల్ నాయక్, జిల్లా నాయకులు శ్రీను నాయక్, సేవాలాల్ సేన పాలకుర్తి మండల అధ్యక్షులు ప్రవీణ్ నాయక్, ఎంసీపీఐ జిల్లా నాయకులు అరుణ్ నాయక్, ఎల్‌ఎస్‌ఓ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ గమనం

రష్యాతో సన్నిహిత సంబంధాలపై

చైనాను దూషించిన నాటో



ఉక్రెయిన్‌కు వ్యతిరేకంగా రష్యా చేస్తున్న యుద్ధంలో చైనా రష్యాను బలోపేతం చేస్తోంది అని నాటో ఆరోపించింది. అమెరికా నేతృత్వంలోని సైనిక కూటమి ప్రచ్ఛన్న యుద్ధ మనస్తత్వాన్ని, యుద్ధ కాంక్షను చైనా తీవ్రంగా ఖండించింది. చైనా, రష్యా తమ సంబంధాలను పరిధు లేని భాగస్వామ్యంగా

వర్గీకరించాయి. ఉక్రెయిన్ వివాదం చెలరేగిన తరువాత పశ్చిమ దేశాలు మాస్కోపై భారీ ఆంక్షలు విధించినప్పటి నుంచి ఇది బలోపేతం చేయబడింది. మేలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ బీజింగ్‌కు వెళ్లిన సందర్భంగా పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ తమ దేశాల వ్యూహాత్మక సంబంధాలలో కొత్త శకం ఆరంభమైందని ప్రకటించారు. బుధవారంనాడు అమెరికా రాజధాని వాషింగ్టన్ డిసిలో జరిగిన నాటో కూటమి 75వ వార్షికోత్సవ శిఖరాగ్ర సమావేశంలో నాటో సభ్యులు బీజింగ్, మాస్కో మధ్య సంబంధాలపై విరుచుకుపడ్డారు. చైనా బీమా ప్రయోజనాలను, భద్రత, విలువలను సవాలు చేస్తూనే ఉంది అని నాటో సమావేశం పేర్కొంది. రష్యా, చైనాల మధ్య లోతైన వ్యూహాత్మక భాగస్వామ్యం ఉంది. నిబంధనల ఆధారిత అంతర్జాతీయ క్రమాన్ని పడదోయడానికి, వారికి అనుకూలంగా పునర్నిర్మించడానికి ఈ దేశాలు చేసే ప్రయత్నాలు తీవ్ర ఆందోళనకు కారణం అని నాటో దేశాధినేతలు, ప్రభుత్వాధినేతలు తమ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు.ద్వంద్వ స్వభావం గల వినియోగ వస్తువులను, భాగాలను బదిలీ చేయడం ద్వారా, అలాగే హానికరమైన సైబర్, హైబ్రిడ్ కార్యకలాపాలలో నిమగ్నమై ఉండటం ద్వారా రష్యా రక్షణ పరిశ్రమను చైనా బలోపేతం చేస్తోందని అమెరికా నేతృత్వంలోని నాటో సైనిక కూటమి ఆరోపించింది. గురువారం నాడు యూరోపియన్ యూనియన్‌లోని చైనీస్ మిషన్ ప్రతినిధి ఈ ఆరోపణలపై స్పందిస్తూ అవి స్పష్టమైన అబద్ధాలు, బురదజల్లేవి, రెచ్చగొట్టేవిగా అభివర్ణించాడు. ఈ ఆరోపణలపై బీజింగ్ నాటో కూటమికి తన తీవ్రమైన అభ్యంతరాలను వ్యక్తం చేసింది అని చైనీస్ మిషన్ ప్రతినిధి చెప్పాడు. చైనా ఉక్రెయిన్ సంక్షోభానికి సృష్టికర్త కాదు అని చైనీస్ మిషన్ పునరుద్ఘాటించింది. బీజింగ్ శాంతి చర్చలను ప్రోత్సహిస్తోందని, రాజకీయ పరిష్కారాన్ని కోరుతోంది అని చైనీస్ మిషన్ ప్రతినిధి చెప్పాడు. సంఘర్షణలో ఏ పక్షానికి ప్రాణాంతక ఆయుధాలను చైనా ఎప్పుడూ అందించదు. ద్వంద్వ- వినియోగ వస్తువులపై కఠిన ఎగుమతి నియంత్రణను అమలు చేస్తుంది, నాటో ఉక్రెయిన్ సంఘర్షణ జ్వాలలను ఎగదోస్తూ ఇతరులను బలిపశువులను చేస్తోంది అని చైనా ప్రతినిధి అన్నాడు. నాటోను ఆసియా-పసిఫిక్ ప్రాంతంలోకి విస్తరించి, ఆ ప్రాంతంలో శాంతికి భంగం కలిగించరాదని చైనా నాటోను హెచ్చరించింది. ఒక నిర్దిష్ట శక్తి ప్రపంచంపై తన ఆధిపత్యాన్ని కొనసాగించడానికి ప్రయత్నిస్తోందని పరోక్షంగా అమెరికాను చైనా విమర్శించింది. చైనా నుంచి ముప్పు ఏర్పడుతుందనే బూటకపు ప్రచారాన్ని ఆపాలి. రెచ్చగొట్టటాన్ని, ఘర్షణ వాతావరణాన్ని సృష్టించటాన్ని నాటో కూటమి ఆపాలి అని చైనీస్ మిషన్ తన ప్రకటన ముగింపులో కోరింది.

నాటో లేదా ఉక్రెయిన్ ఏదో ఒకటే ఉండాలి : మెద్వెదేవ్



అమెరికా నేతృత్వంలోని మిలిటరీ కూటమిలో ఉక్రెయిన్‌కు అంతిమంగా సభ్యత్వం ఇవ్వటం జరుగుతుందనే నిర్ణయం తిరుగులేనిది అని నాటో ప్రకటించడం అంటే ఉక్రెయిన్ లేదా కూటమి - ప్రాధాన్యంగా రెండూ కనుమరుగవుతాయని రష్యా మాజీ అధ్యక్షుడు డిమిత్రి మెద్వెదేవ్ అన్నాడు. ఈ వారం వాషింగ్టన్ డీసీలో జరిగిన నాటో శిఖరాగ్ర సమావేశంలో నాటో దేశాల నాయకులు ఆమోదించిన ఒక ఉమ్మడి ప్రకటన ఉక్రెయిన్ తన స్వంత భద్రతా ఏర్పాట్లను ఎంచుకునే హక్కుకు మద్దతునిచ్చింది. నాటో సభ్యత్వంతో సహా అది పూర్తి యూరో- అట్లాంటిక్ ఏకీకరణకు తిరుగులేని మార్గంలో ఉందని ప్రకటించింది. నాటోలో ఉక్రెయిన్ చేరిక 39 రెడ్ లైన్ 39 దాటుతుందని రష్యా ఎన్నో ఏండ్లుగా చెబుతోంది. ఇది కీవ్‌తో ప్రస్తుత శతృత్వానికి ప్రధాన ట్రిగ్గర్‌లలో ఒకటిగా నాటో కూటమి విస్తరణను పేర్కొంది. విషయం స్పష్టంగా ఉంది. నాటో వైపు ఉక్రెయిన్ తిరుగులేని మార్గం ఉక్రెయిన్ అదశ్యం లేదా నాటో అదశ్యంతో ముగుస్తుందని నిర్ధారించుకోవడానికి మేము ప్రతిదీ చేయాలి. రెండూ బెటర్ అని మెద్వెదేవ్ గురువారంనాడు అన్నాడు. సంయుక్త ప్రకటనలోని పదాలు ఉక్రేనియన్ నాయకుడు వ్లాదిమిర్ జెలెన్స్కీని శాంతింపజేయడానికి ఉద్దేశించబడిందని మీడియా రాసింది. అతను రష్యా నుంచి పశ్చిమ దేశాలను రక్షించడానికి పోరాడుతున్నందుకు కతజ్ఞతగా తన దేశం నాటోలోకి వేగంగా చేరడానికి అర్హుడని నాటో దేశాల సంయుక్త ప్రకటన పేర్కొంది. అయితే వివాదం అపరిష్కతంగా ఉన్న సమయంలో ఉక్రెయిన్‌ను నాటోలో చేర్చుకోలేమని అమెరికాతో సహా సభ్య దేశాలు స్పష్టం చేశాయి. నాటో ఒప్పందం కింద అందించిన హామీలకు బదులుగా కీవ్ ఇటీవలి నెలల్లో పాశ్చాత్య దేశాలతో అనేక ద్వైపాక్షిక భద్రతా ఒప్పందాలపై సంతకం చేసింది. ఈ వారం లక్సెంబర్గ్‌తో ఇటీవలి ఒప్పందం ఖరారు చేయబడింది. అంతిమంగా రష్యా శత్రువులు ఎక్కడికీ వెళ్ళరు. మన దేశాన్ని నాశనం చేయడానికి సరికొత్త ప్రయత్నాలు చేస్తారు. అని ప్రస్తుతం రష్యా భద్రతా మండలి డిప్యూటీ చైర్మెన్‌గా పనిచేస్తున్న మెద్వెదేవ్ అంచనా వేశాడు.

ఎవరో ఓడించలేదు...

మన వాళ్లే ఓడించారు

- కురియన్ కమిటీ ఎదుట కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థుల ఆవేదన
- నాయకులపై ఫిర్యాదుల వెల్లువ
- ఓడిన అభ్యర్థులు,ఎమ్మెల్యేలతో ముఖాముఖి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికల్లో తమను ఎవరో బయటివాళ్లు ఓడించలేదనీ, తమ వాళ్లే తమను ఓడించారంటూ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులు ఏఐసీసీ నిజనిర్ధారణ కమిటీ చైర్మెన్ కురియన్ ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో పార్టీకి వ్యతిరేకంగా ఎవరెవరూ పని చేశారో, ఎన్నికల ప్రచారం చేయకుండా ఎవరెవరూ ముఖం చాటేశారో కురియన్‌కు ఫిర్యాదు చేశారు. ఓడిపోయిన అభ్యర్థుల్లో ఎక్కువ మంది ఇదే అంశంపై ఫోకస్ చేసినట్టు తెలిసింది. 'పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ లోక్‌సభ ఎన్నికల్లో ఎందుకు ఓడిపోయారు. మీ ఓటమికి కారణాలేంటి? పార్టీకి బలం, బలగమున్న చోట కూడా ఘోరపరాజయం ఎందుకొచ్చింది?' అంటూ కురియన్ వేసిన ప్రశ్నలకు అభ్యర్థులు పైవిధంగా సమాధానమిచ్చినట్టు తెలిసింది. అంతేకాకుండా పార్టీలో నేతల్లో సమన్వయ లోపం కూడా ఇందుకు జతైందని వివరించినట్టు సమాచారం. ఇటీవల బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన సీనియన్ నేతలు కూడా హస్తం గుర్తు కోసం ప్రచారం చేయలేదని వారు ఫిర్యాదు చేశారు. లోక్‌సభ నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, స్థానిక నేతలపై తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వచ్చిన ఓట్లు, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో, 2024 లోక్‌సభ ఎన్నికల్లో పార్టీకి వచ్చిన ఓట్ల ఆధారంగా కురియన్ కమిటీ వారిని ప్రశ్నించింది. 17 లోక్‌సభ నియోజకవర్గాలు ఉన్న రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎనిమిది సీట్లకు పరిమితమైంది. 14 సీట్ల లక్ష్యాన్ని ఆ పార్టీ అధినేత రేవంత్‌రెడ్డి నిర్దేశించారు. కానీ వచ్చింది మాత్రం ఎనిమిది సీట్లే. దీంతో ఆ పార్టీలో అంతర్మథనం మొదలైంది. ఈ నేపథ్యంలో ఏఐసీసీ నిజనిర్ధారణ కమిటీని నియమించింది. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఏఐసీసీ నేత కురియన్ నేతృత్వంలోని కమిటీ వారితో ముఖాముఖిగా మాట్లాడింది.



కమిటీ సభ్యులు ఎంపీ రాఖిబుల్ హుస్సేన్, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్‌చౌదరీ, ప్రోటోకాల్ చైర్మెన్ హర్కర వేణుగోపాల్, కార్పొరేషన్ చైర్మెన్ ఫహీం ఉన్నారు. ఓడిపోయిన అభ్యర్థులు ఆత్రం సుగుణ, జీవన్‌రెడ్డి, దానం నాగేందర్, రాజేందర్, నీలం మధు, చల్ల వంశీచంద్‌రెడ్డి, సునీతా మహేందర్‌రెడ్డి, గడ్డం రంజిత్‌రెడ్డి, అమీర్ వలీ ఉల్లా ఖాన్ తదితరులు తమ అభిప్రాయాలు చెప్పినట్టు తెలిసింది. వారితోపాటు ఎంపీలు మల్లు రవి, బలంరామ్‌నాయక్, సురేష్ షెట్కార్, కడియం కావ్య, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రామసహాయం రఘురామ్‌రెడ్డి, కె. రఘువీర్‌రెడ్డి హాజరయ్యారు. లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ హవా కొనసాగినప్పటికీ, బీఆర్‌ఎస్ పోటీలో నిలబడకుండా బీజేపీకి ఓట్లు వేయించిందనే విషయాన్ని ఎక్కువ మంది కురియన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో బీజేపీ ఎనిమిది సీట్లను గెలుకుందని వివరించారు. సరిహద్దు రాష్ట్రాల్లో బీజేపీ హవా కొనసాగిందనీ, దాని ప్రభావం కూడా తెలంగాణ రాష్ట్రంపై పడిందని వివరించారు. అందు వల్ల కాంగ్రెస్ తక్కువ మోజార్టీతో సీట్లను కోల్పోయిందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ అభ్యర్థి ఆత్రం సుగుణ మాట్లాడుతూ పార్టీ నేతల మధ్య సమన్వయ లోపం బాగా ఉందన్నారు. ముఖ్యంగా పార్టీలో చేరిన ఇంద్రకరణ్‌రెడ్డి, కోనేరు కొనప్ప, విఠల్‌రెడ్డి, వేణుగోపాలా చారి వంటి సీనియర్ నేతలు సహకరించలేదని ఫిర్యాదు చేశారు. అయితే ఆదిలాబాద్ ఎన్నికల ఇన్‌చార్జి సీతక్క ఒక కార్యకర్తలా కష్టపడ్డారని చెప్పారు. చేవేళ్ల అభ్యర్థి రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ తన ఓటింగ్‌ను ఉద్దేశపూర్వకంగా బీజేపీకి మళ్లించిందని చెప్పారు.

కార్పొరేషన్లకు చైర్మెన్ల నియామకం దండగ

- ఫిరాయింపు దారులే సలహాదారులు : నేడు శంషాబాద్‌లో బీజేపీ రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశం : ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో కార్పొరేషన్లకు చైర్మెన్ల నియామకం దండగ అని మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ విమర్శించారు. వాటి భర్తీ వల్ల నిధుల దుర్వినియోగం తప్ప పైసా ఆదాయం ఉండదని నొక్కిచెప్పారు. శుక్రవారం శంషాబాద్‌లో బీజేపీ రాష్ట్ర స్థాయి విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆ సమావేశంలో కేంద్ర మంత్రులు ధరేంద్ర ప్రధాన్, జి.కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జులు సునీల్ బన్సల్, తరుణ్‌చుగ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, గత ఎన్నికల్లో పోటీచేసి ఎంపీ, అసెంబ్లీ స్థానాల అభ్యర్థులు, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో బీఆర్ఎస్‌కు భవిష్యత్ లేదని చెప్పారు. రాష్ట్రంలో సంస్థాగతం విస్తరించేందుకు తమ పార్టీ వ్యూహాత్మకంగా ముందుకెళు న్నదన్నారు. రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పుడు ప్రజాభిప్రాయ సేకరణ ఏంటి? అని రేవంత్‌రెడ్డి సర్కార్‌ను ప్రశ్నించారు. ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లోకి కేసీఆర్‌నే పంపుతున్నారని ఆరోపించారు. కార్పొరేషన్ల పదవులు, సలహాదారుల పదవులు రాజకీయ పునరావాస పదవులుగా మారాయని విమర్శించారు. ఫిరాయింపు దారులు, పైరవీకారులు సీఎంకు సలహాదారులుగా నియమితులవుతున్నారని ఆరోపించారు.

అరాచకంగా కాంగ్రెస్ పాలన

- మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ పాలనలో అరాచకత్వం రాజమేలుతున్నదని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి విమర్శించారు. గురువారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ద్వారా కేసీఆర్ నాటకం ఆడుతున్నారని విమర్శించారు. కాళేశ్వరంపై విచారణ ఎందుకు చేయడం లేదు? నిర్మాణ సంస్థపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డికి ఢిల్లీ చుట్టూ తిరగడానికే సమయం సరిపోవడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుకు ఆచరణ కాని హామీలిచ్చి ప్రజలను మోసం చేస్తున్నదని విమర్శించారు. రాష్ట్రంలో మీడియా ప్రతినిధులకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడాన్ని తప్పుబట్టారు.

ఎవరు సన్నాసి?

రేవంత్ రెడ్డినా? రాహుల్ గాంధీనా? : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అధికారం కోసం విద్యార్థులను వాడుకున్న రాహుల్ గాంధీ సన్నాసా? లేక రేవంత్ రెడ్డి సన్నాసా? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. గురవారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్వీ విద్యార్థి నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులను, నిరుద్యోగులను అవమానపరిచేలా మాట్లాడిన రేవంత్ వారికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మెగా డీయస్సీ అని చెప్పి కేవలం 6 వేల అదనపు పోస్టులతో విద్యార్థులకు, నిరుద్యోగులను దగా చేశారని విమర్శించారు. ఈ మోసాన్ని ప్రశ్నిస్తున్న విద్యార్థులపై దాడులు చేస్తున్న పోలీసుల పేర్లు తమ డైరీలో నమోదవుతున్నాయనీ, అధికారంలోకి వచ్చాక వారిని వదిలిపెట్టబోమని హెచ్చరించారు. ప్రజలపై దాడులు చేయడమే ప్రజాపాలనా? అని ప్రశ్నించారు.

సోషల్ మీడియాలో పోస్టులు పెడితే కూడా భరించలేని నిరంకుశ మనస్తత్వం సీఎం రేవంత్ రెడ్డిదని కేటీఆర్ ఈ సందర్భంగా విమర్శించారు. విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులపై పోలీసులతో దాడులు చేయిస్తూ దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలనే హామీలిచ్చి నిరుద్యోగులను మోసం చేశారని తెలిపారు. అదే విద్యార్థులు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ నాయకులను కలిశారనీ, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్, ఇతర పార్టీల నాయకులను కలుస్తున్నారని తెలిపారు. అప్పుడు విద్యార్థులను కలిసిన రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ సన్నాసులా? అంటూ ఎద్దేవా చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడే వారి తలలు పగలగొట్టడమే ప్రజాపాలనా? అని ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రయివేటు విశ్వవిద్యాలయాలు వద్దన్న కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఏడు కొత్త యూనివర్సిటీలకు అనుమతులిచ్చిందని చెప్పారు.

ఆర్డీవో కార్యాలయంలో షార్ట్ సర్క్యూట్

- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఘటన



నవతెలంగాణ-భూపాలపల్లి

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో బుధవారం అర్ధరాత్రి షార్ట్‌సర్క్యూట్ జరిగింది. ఈ ప్రమాదంలో బీరువాలో భద్రపరిచిన విలువైన సుమారు (15ఫైల్స్) భూసేకరణ పత్రాలు దగ్ధమయ్యాయి. అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనపై గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది ఫిర్యాదు చేశారు. దగ్ధమైన పత్రాల్లో కాళేశ్వరం మేడిగడ్డ, సింగరేణి, కేటీపీపీలో భూములకు చెల్లించే విలువైన ఫైల్స్ ఉన్నాయి. అధికారులు మాత్రం సాఫ్ట్ కాపీలు సిస్టమ్, ఆన్‌లైన్‌లో భద్రంగా ఉన్నట్టు తెలిపారు. అయితే ఈ ప్రమాదం ప్రమాదవశాత్తు జరిగిందా..? లేదా ఎవరైనా కావాలని చేశారా అనే కోణంలో అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.

ఐదేండ్లు టూరిజం మంత్రిగా రాష్ట్రానికి ఏం తెచ్చావు?

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి పొన్నం ప్రశ్న

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఐదేండ్లుగా కేంద్ర టూరిజం శాఖ మంత్రిగా ఉండి రాష్ట్రానికి ఏం తెచ్చారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కిషన్‌రెడ్డిని ప్రశ్నించారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మెన్ మధుయాష్కీగౌడ్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. హైదరాబాద్ ఈమేజ్‌ని కిషన్‌రెడ్డి డ్యామేజ్ చేసేలా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగరాన్ని బీజేపీ, బీఆర్ఎస్ నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. తెలంగాణకు నిధులు ఇవ్వాలని కేంద్రాన్ని కోరామని గుర్తు చేశారు. కిషన్‌రెడ్డి కేంద్రమంత్రి కాగానే హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రిగా కలిశానని తెలిపారు. మాజీ మంత్రి కేటీఆర్ కేంద్రంపై ఒత్తిడి తేలేకపోయారని ఎద్దేవా చేశారు. ఆయన పెద్ద అసమర్థుడని విమర్శించారు. హైదరాబాద్ అస్తవ్యస్తం కావడానికి కేటీఆరే కారణమని ఆరోపించారు. ఉద్యోగ క్యాలెండర్ తప్పకుండా ఇస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగ నియామకాలు జాప్యమవుతున్నాయని ప్రశ్నించిన వారే ఇప్పుడు పరీక్షలు వాయిదా వేయాలని అనడంలో అంతర్యమేంటని ప్రశ్నించారు. రాజకీయ నాయకుల ఉచ్చులో విద్యార్థులు పడొద్దని విజ్ఞప్తి చేశారు. మాజీ సీఎం కేసీఆర్, మంత్రులు వినియోగించిన భాషను తాము వాడబోమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల్లో చదువుకున్న వాళ్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు, డాక్టర్లు ఉన్నారనీ, తాము విజ్ఞతతో ఉంటున్నామని పేర్కొన్నారు. మధుయాష్కీ మాట్లాడుతూ పదేండ్లుగా సొంత పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలను అవమానించిన చరిత్ర కేసీఆర్‌కు ఉందన్నారు. టీడీపీ, కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకుని మంత్రి పదవులు ఇచ్చినప్పుడు రాజ్యాంగం గుర్తు రాలేదా? అని ప్రశ్నించారు. నిరుద్యోగుల రెచ్చగొడుతున్న బీఆర్ఎస్...తెలంగాణలోని ఏ యూనివర్సిటీలోనైనా అడుగుపెట్టే దమ్ముందా? అని సవాల్ విసిరారు.

అవినీతి అధికారులను వెంటనే బర్తరఫ్ చేయాలి

- డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ కార్యాలయం వద్ద ఉద్యోగుల ధర్నా



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బదిలీలకు సంబంధించి సీనియార్టీ జాబితా రూపకల్పనలో అవకతవకలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ విషయంలో స్పష్టత లేకపోవడంతో గురువారం హైదరాబాద్‌లోని కోఠిలో రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకుల కార్యాలయానికి వివిధ క్యాడర్ల ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అక్కడ వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉన్నతాధికారులు అవకతవకలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఏఎన్ఎంల నుంచి మెడికల్ ఆఫీసర్ల వరకూ బదిలీలు, సీనియార్టీల విషయంలో అవకతవకలు జరిగాయని ఆక్షేపించారు. ఫైనల్ లిస్టును ఆన్‌లైన్‌లో పెట్టకుండా ఎలా బదిలీ చేస్తారని ప్రశ్నించారు. 317 జీవోతో పాటు ఉద్యోగులకు ఉన్న సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

టీయుఎంహెచ్ఇయూ మద్దతు

ఉద్యోగుల ఆందోళనకు తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టీయూఎంహెచ్ఇయూ) మద్దతు తెలిపింది. యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు భూపాల్, అధ్యక్షులు ఫసియొద్దీన్, ప్రధాన కార్యదర్శి యాద నాయక్, నాయకులు బలరాం, హరిశంకర్ తదితరులు వారి పక్షాన నిలిచారు. తప్పులను సరిదిద్దుకుని ఉద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

40 శాతానికే కటాఫ్ చేయాలి -నెహ్రూ నాయక్

బదిలీల్లో 40 శాతం కటాఫ్ చేసి, సీనియార్టీ లిస్ట్ పెట్టి కౌన్సిలింగ్ ద్వారా బదిలీలు చేయాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బానోత్ నెహ్రూ నాయక్ డిమాండ్ చేశారు. బదిలీలను పారదర్శకంగా జరపాలనీ, సీనియార్టీ లిస్టును తప్పులు లేకుండా సరి చేయాలని కోరారు.

సూపరింటెండెంట్ల ద్వారా వినతిపత్రాలు

జాబితాలో తప్పులను సవరించుకునేందుకు ఆస్పత్రుల సూపరింటెండెంట్ల ద్వారా వినతిపత్రాలు సమర్పిస్తే సీనియార్టీ లిస్టులో తప్పులను సరిదిద్దుతారని తెలంగాణ ప్రభుత్వ ఫార్మసిస్టుల సంఘం అధ్యక్షులు శంకర్ తెలిపారు. ఈ మేరకు డీహెచ్ హామీ ఇచ్చినట్టు తెలిపారు. దాదాపు 100 మంది ఫార్మసిస్టులు హైదరాబాద్‌కు వచ్చి ఆందోళన నిర్వహించినట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఫార్మసిస్టులు గ్రీవెన్స్ సెల్‌కు రావడం సాధ్యం కాదని డీహెచ్ విన్నవించినట్టు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఆకుల సురేశ్, రాష్ట్ర నాయకులు పాండు ప్రభాకర్ రెడ్డి, వీరేష్ బాబు పాల్గొన్నారు.

ఆయా జిల్లాల్లో సమర్పించవచ్చు

అనంతరం పలు సంఘాల నాయకుల నుంచి డీహెచ్ డాక్టర్ రవీందర్ నాయక్ వినతిపత్రాలను స్వీకరించారు. హైదరాబాద్‌లో ఒకే చోట గ్రీవెన్స్ సెల్ ఏర్పాటుతో ఇబ్బంది పడుతున్నట్టు ఉద్యోగులు చెప్పారు. రాష్ట్ర కార్యాలయంలో జరిగిన తప్పులకు తమకెందుకు శిక్ష వేస్తున్నారని నిలదీశారు. దీంతో ఏ జిల్లా ఫిర్యాదులను ఆయా జిల్లాలో డీఎంహెచ్‌ఓలకు ఇవ్వొచ్చుని హామీ ఇచ్చినట్టు నాయకులు తెలిపారు.

యూపీని వణికిస్తున్న వరదలు





- వేర్వేరు ప్రాంతాల్లో పిడుగుపాటుకు గురై 38 మంది మృతి

లక్నో : ఉత్తర ప్రదేశ్‌లోని ఆరు జిల్లాలను వరదలు ముంచెత్తుతున్నాయి. బుధవారం ఒక్కరోజే పలు జిల్లాల్లో పిడుగుపాటుకు గురై 38 మంది ప్రాణాలు కోల్పోయారు. అత్యధికంగా ప్రతాప్‌గఢ్ జిల్లాలో 11 మంది మరణించారని అధికారులు తెలిపారు. సుల్తాన్‌పూర్‌లో ఏడుగురు, చందౌలీలో ఆరుగురు, మెయిన్‌పురిలో ఐదుగురు, ప్రయాగరాజ్‌లో నలుగురు మరణించారు. వారణాసి, హత్రాస్, ఔరియా, డియోరియా జిల్లాల్లో ఒక్కొక్కరు మరణించారని, వివిధ ప్రాంతాల్లో చాలామంది గాయాల పాలయ్యారని అధికారులు పేర్కొన్నారు. మృతుల్లో ఎక్కువమంది 15 ఏళ్లలోపు వారేనని తెలిపారు. బుధవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరు గంటల మధ్య ఉరుములతో కూడిన భారీ వర్షం పడింది. ఆ ఎఉత్తర ప్రదేశ్‌లోని బలరాంపూర్, శ్రావస్తి, బస్తీ, గోరఖ్‌పూర్, బల్లియా జిల్లాలను వరదలు ముంచెత్తుతున్నాయి.

నేపాల్ నుంచి ప్రవహిస్తున్న రప్తీ నది వరద ప్రమాదకర స్థితికి చేరడంతో బలరాంపూర్ జిల్లాల్లో 60కిపైగా గ్రామాలు వరద ముంపునకు గురయ్యాయి. వరద నీటిలో మునిగి ఇప్పటివరకూ ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఉత్తరాఖండ్ డ్యామ్‌ల నుంచి నీటిని విడిచిపెట్టడంతో పలు జిల్లాల్లో ఒకటి నుంచి మూడడుగుల వరకూ నీరు చేరింది. 32 ఫ్లడ్ పోస్టులను ఎస్‌డిఆర్ఎఫ్ ఏర్పాటు చేసిందని, సహాయక చర్యలు చేపడుతున్నామని సంబంధిత అధికారులు తెలిపారు.

శ్రావస్తిలో సిఎం ఆదిత్యనాథ్ ఏరియల్ సర్వేవరదలకు గురైన శ్రావస్తి జిల్లాలో యుపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఏరియల్ సర్వే నిర్వహించారు. సహాయ సామగ్రి పంపిణీలో పాల్గొన్నారు.

చీకటి జీవోలతో రేవంత్‌రెడ్డి పాలన

- సీఎం సొంత జిల్లాలో మేఘా సంస్థకు రూ.1100 కోట్ల కాంట్రాక్టులు
- సీఎం బామ్మర్ది సంస్థకు రూ.400 కోట్ల పనులు :నిధుల దుర్వినియోగం ఈడీ, సీబీఐ విచారణ కోరుతాం : బీజేపీ ఎల్పీ నేత ఎ.మహేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చీకటి జీవోలతో తన పాలన కొనసాగిస్తున్నారనీ, ఆరోపణలు ఎదుర్కొంటున్న సంస్థలకు పెద్ద ఎత్తున కాంట్రాక్టులు ఇస్తూ నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారని బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. గురువారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం సొంత జిల్లాలోనే మేఘా కృష్ణారెడ్డికి అమృత్ స్కీమ్‌లో భాగంగా రూ.1100 కోట్ల కాంట్రాక్టులు కట్టబెట్టారని ఆరోపించారు. మేఘా సంస్థతో తెలంగాణ సొమ్మును కక్కిస్తానన్న రేవంత్‌రెడ్డి అదే సంస్థకు కాంట్రాక్టు ఇవ్వడం వెనుక మతలబు ఏంటని ప్రశ్నించారు. ఆయనతో మీకున్న సంబంధమేంటని నిలదీశారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. చీకటి ఒప్పందాలు, జీవోలతో బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఎక్సైజ్ కుంభకోణంలో ఉన్న తన బామ్మర్ది సృజన్ అనే వ్యక్తికి చెందిన శోధ కంపెనీకి రూ.400 కోట్ల కాంట్రాక్టు ఇచ్చారని ఆరోపించారు. రూ. 600 కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్ట్‌కు వెయ్యి కోట్ల రూపాయలకుపైగా ఎలా ఇస్తారని నిలదీశారు. 30 నుంచి 35 శాతం తక్కువకు పనులు చేసేందుకు తెలంగాణలోని కొందరు కాంట్రాక్టర్లు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఈ కాంట్రాక్టుల కేటాయింపు వెనుక రూ.1200 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. మేఘా సంస్థ కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు మీద విచారణ జరుగుతున్నది కదా? జ్యూడీషియల్ విచారణ జరుగుతున్న కంపెనీని బ్లాక్ చేయకుండా కాంట్రాక్టు ఎలా ఇచ్చారు? అని ప్రశ్నించారు. కరీంనగర్‌లో సీఎం తమ్ముడు పార్ట్‌నర్ అంటున్నారని చెప్పారు. రాబోయే కొడంగల్ టెండర్లలో కూడా మేఘాకు పెద్ద పీట వెయ్యబోతున్నారనీ, ప్రయివేటు ఇంజినీర్లతో అంచనాలు రూపొందిస్తున్నారని ఆరోపించారు. ఈ నిధుల కేటాయింపు, అవినీతిపై ఈడీ, సీబీఐ విచారణ కోరుతామని చెప్పారు.

కేంద్ర బడ్జెట్‌పై సలహాలు, సూచనలకు

ఆర్థికవేత్తలతో మోడీ భేటీ



న్యూఢిల్లీ : ఈ నెలలో ప్రవేశపెట్టబోయే కేంద్ర బడ్జెట్‌కు సంబంధించి అభిప్రాయాలు, సూచనలు తెలుసుకునేందుకు ప్రధాని మోడీ గురువారం ప్రముఖ ఆర్థికవేత్తలతో భేటీ అయ్యారు. జులై 23న లోక్‌సభలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా ఫిబ్రవరిలో తాత్కాలిక బడ్జెట్‌ను సమర్పించారు. ఆర్థికవేత్తలు, రంగాలవారీ నిపుణులతోపాటు నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బెరీ, ఇతర సభ్యులు కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశంలో మంత్రి నిర్మలా సీతారామన్, ప్రణాళికా శాఖ మంత్రి ఇందర్‌జిత్ సింగ్, ముఖ్య ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్, ఆర్థికవేత్తలు సూర్జిత్ భల్లా, అశోక్ గులాటి, ప్రముఖ బ్యాంకర్ కెవి కామత్ ప్రభృతులు పాల్గొన్నారు. 2047కల్లా అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను తయారుచేయడానికి అనుసరించే ప్రణాళికకు ఈ బడ్జెట్‌లో రూపకల్పన చేస్తారని భావిస్తున్నారు. సంస్కరణల వేగాన్ని మరింత పెంపొందించేందుకు ఈ ప్రభుత్వం చారిత్రక చర్యలతో వస్తుందని గత నెలలో పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చెప్పారు. ఇప్పటికే పారిశ్రామిక, వాణిజ్య వర్గాలతో, ఆర్థికవేత్తలతో మంత్రి నిర్మలా సీతారామన్ చర్చలు జరిపారు. సామాన్యుడికి ఆదాయపు పన్ను ఉపశమనం కలిగించాలని పలువురు నిపుణులు ఇప్పటికే ప్రభుత్వాన్ని కోరారు. 2023-24లో భారత ఆర్థిక వ్యవస్థ 8.2శాతం వృద్ధిరేటును నమోదు చేసింది.

మిగిలిన ఖాళీలకూ పదోన్నతులివ్వండి

- విద్యాశాఖ సంచాలకులకు టీఆర్టీఎఫ్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మిగిలిపోయిన ఖాళీలకూ అర్హులైన ఉపాధ్యాయులకు పదోన్నతులను కల్పించాలని టీఆర్టీఎఫ్ కోరింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డిని గురువారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కటకం రమేష్, ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి, సీనియర్ నాయకులు అశోక్‌కుమార్, ప్రణీద్‌కుమార్ కలిసి వినతిపత్రం సమర్పించారు. డీఎస్సీ నియామకాల వరకు విద్యావాలంటీర్లను నియమించాలని కోరారు. బదిలీ పొందిన ఉపాధ్యాయులందరినీ రిలీవ్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

బదిలీ అయిన టీచర్లను రిలీవ్ చేయాలి

- విద్యాశాఖ సంచాలకులకు ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదోన్నతుల తర్వాత మిగిలిన ఖాళీలను గుర్తించి ఆ పోస్టులకు వెంటనే పదోన్నతులను కల్పించాలని ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డిని ఎమ్మెల్సీతోపాటు తపస్ రాష్ట్ర అధ్యక్షులు హన్మంతరావు గురువారం హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు. బదిలీ అయినప్పటికీ చాలా మంది ఉపాధ్యాయులు రిలీవ్ కాలేదని తెలిపారు. వారిని వెంటనే రిలీవ్ చేయాలని కోరారు. ఒకవేళ ఆ పాఠశాలలకు ఉపాధ్యాయుల అవసరముంటే విద్యావాలంటీర్లను నియమించాలని సూచించారు. వెబ్‌కౌన్సెలింగ్‌లో ఒకే పేరుతో ఊర్ల పేర్లున్నందున తప్పులు దొర్లాయనీ, వాటికి సంబంధించిన అప్పీళ్లను త్వరగా పరిష్కరించాలని తెలిపారు. పరస్పర బదిలీల ద్వారా వచ్చిన వారిని మిగిలిన ఖాళీల్లో బదిలీ చేయాలని పేర్కొన్నారు. మల్టీజోన్-1,2లో జీహెచ్ఎం పోస్టులకు మిగిలిన వాటితోపాటు ఉద్యోగ విరమణ పొంది ఖాళీ అయిన వాటిని కలిపి పదోన్నతులు నిర్వహించాలని సూచించారు. వారంరోజుల్లో ఆ సమస్యలు పరిష్కారమయ్యేలా చూస్తామంటూ సంచాలకులు హామీ ఇచ్చారని తెలిపారు.

దరఖాస్తులను శాఖాధికారులకు పంపాలి

జీఏడీ అధికారులకు క్యాబినెట్ సబ్ కమిటీ ఆదేశం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శాఖల వారీగా సబ్ కమిటీకి వచ్చిన దరఖాస్తులను ఆయా శాఖాధిపతులకు పంపించాలని జీవో 317పై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం జీఏడీ అధికారులను ఆదేశించింది. వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధ్యక్షతన గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో కమిటీ సమావేశమైంది. స్పౌజ్, మెడికల్, మ్యూచువల్, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల భార్య లేదా భర్త చేసుకున్న దరఖాస్తులపై కమిటీ సానుకూలంగా నిర్ణయం తీసుకుంది. మిగిలిన దరఖాస్తులను వివిధ శాఖలకు పంపించి వాటి పరిశీలన అనంతరం తిరిగి క్యాబినెట్ సబ్ కమిటీ దష్టికి తీసుకురావాలని సూచించింది. ఈ సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి రఘునందన్ రావు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శివశంకర్, జీఏడీ అధికారులు పాల్గొన్నారు.

ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపునకు నేడే ఆఖరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరానికిగాను 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ప్రక్రియలో ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపునకు శుక్రవారమే చివరి రోజు. ఈ మేరకు ఎప్‌సెట్ ప్రవేశాల కమిటీ కన్వీనర్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకు 98,250 మంది అభ్యర్థులు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించారని వివరించారు. 46,525 మంది అభ్యర్థులు 24,29,703 వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారని తెలిపారు. ఈనెల 13 వరకు ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందనీ, 15 వరకు వెబ్‌ఆప్షన్లను నమోదు చేసేందుకు అవకాశముందని పేర్కొన్నారు. ఈనెల 19న తొలివిడత సీట్ల కేటాయింపు ఉంటుందని వివరించారు. అభ్యర్థులు ఇతర వివరాల కోసం www.://tgeapcet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వాస్పత్రులకు సహకరించండి

- కార్పొరేట్ ఆస్పత్రుల యాజమాన్యాలతో మంత్రి దామోదర రాజనర్సింహ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)లో భాగంగా ప్రభుత్వాస్పత్రులకు తమ వంతు సహకారం అందించాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆయా ఆస్పత్రుల యాజమాన్యాలను కోరారు. క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్ట్ అమలుపై గురువారం హైదరాబాద్‌లో ఆయన వారితో సమావేశమై చర్చించారు. ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రుల నాణ్యతా ప్రమాణాలను పెంచేందుకు వేర్వేరు కమిటీలను వేయనున్నట్టు వెల్లడించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్ట్‌ను సమర్థవంతంగా అమలు చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని వారికి సూచించారు. ఈ సందర్భంగా ఆరోగ్యశ్రీ బకాయిలను త్వరగా విడుదల చేయాలని కార్పొరేట్ ఆస్పత్రుల యాజమానులు, ప్రతినిధులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. 14 ఏండ్ల తర్వాత ఆరోగ్యశ్రీ కింద అందిస్తున్న చికిత్సలకు రివిజన్ ఆఫ్ రేట్స్ సవరిస్తున్నామని మంత్రి ఈ సందర్భంగా గుర్తుచేశారు.

బీసీ కార్పొరేషన్ చైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీకాంత్‌గౌడ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీసీ కార్పొరేషన్ చైర్మెన్‌గా నూతి శ్రీకాంత్‌గౌడ్ గురువారం హైదరాబాద్‌లోని సంక్షేమ భవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కార్పొరేషన్ ద్వారా బలహీన వర్గాలకు సేవ చేయాలని సూచించారు. గతంలో ఎన్నికలప్పుడే బీసీ కార్పొరేషన్ హడావుడి ఉండేదనీ, అందుకు భిన్నంగా నిరంతరం అది పనిచేయాలన్నారు. శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించటం ద్వారా బలహీన వర్గాల అభివృద్ధి కోసం కృషి చేయాలని సూచించారు.